
వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక పత్రిక

జూలై 2007 72 రు. 10

* ఫోకస్ : నీటిపారుదల పథకాలు - వివాదాలు
  ఐదు వ్యాసాలు
* రాజ్యాంగం - నాగరికత - కౌసర్ బీ ఎన్‌కౌంటర్
* వధ్యశిలపై రాష్ట్ర విద్యారంగం
* కేంద్ర రాష్ట్ర సంబంధాలు - పూంఛీ కమిషన్
* కమ్యూనిస్టు ఉద్యమం - నందిగ్రామ్
* గ్రామాలకు ఏం అవుతోంది?

యాభై ఏళ్ల
ఆంధ్రప్రదేశ్ పై
ఏకైక విశిష్ట
సమాచార, విశ్లేషణా గ్రంథం



సిడిఆర్‌సి ప్రచురణ
ఇంగ్లీషులో, 568 పేజీలు

హార్డ్ బౌండ్ (గ్రంథాలయ, మేలు ప్రతి) రు. 895

విద్యార్థుల కొరకు ప్రత్యేక ముద్రణ రు. 225

FIFTY YEARS OF ANDHRA PRADESH
1956 - 2006

ప్రస్తుతం మార్కెట్లో ఉంది

యాభై సంవత్సరాల ఆంధ్రప్రదేశ్ జయాపజయాలపై,
అభివృద్ధి పథంలో ఒడిదుడుకులపై
నలభై విశ్లేషణాత్మక, సమాచార భరిత వ్యాసాలు, పట్టికలు
చరిత్ర, వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక సౌకర్యాలు, ఆర్థిక వ్యవహారాలు,
సామాజిక పరిణామాలు, విద్యా వైద్య రంగాలు
ఆంధ్రప్రదేశ్ పురోగతి గురించి తెలుసుకోదలచిన వారందరూ
తప్పనిసరిగా అధ్యయనం చేయవలసిన గ్రంథం
ప్రతి గ్రంథాలయంలోనూ ఉండవలసిన గ్రంథం

ప్రతులకు, వివరాలకు

సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసెర్చ్ అండ్ కమ్యూనికేషన్

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.

ఫాక్స్, ఫోన్ : 040 - 66843495 ఇమెయిల్ : reachcdrc@yahoo.com

CDRC

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాస పత్రిక

జూలై 2007
సంచిక : 72

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

సంపాదకీయం

భూపోరాటం - జవాబు చెప్పవలసిన ప్రశ్నలు

గత కొన్ని వారాలుగా రాష్ట్రవ్యాప్తంగా పేదప్రజలు నివేశనస్థలాలకోసమూ, వ్యవసాయ భూమి కోసమూ పెద్ద ఎత్తున పోరాడుతున్నారు. ప్రతిరోజూ ప్రచారసాధనాలన్నీ ఈ భూపోరాట విస్తృతిని తెలియజెపుతూనే ఉన్నాయి. భూమిని ఆక్రమించుకుని గుడిసెలు వేసుకున్న పేదలపై, వారి నాయకులపై లాఠీచార్జిలతో, దౌర్జన్యంతో ప్రతిరోజూ ప్రతిచోటా ప్రభుత్వ బలగాలు అతి దుర్మార్గమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాయి. ఆశ్రయం కోసమైనా, జీవనోపాధి కోసమైనా భూమి ఎంత ముఖ్యమైన అవసరంగా ఉందో, అది పేదప్రజలకు ఎట్లా దక్కడం లేదో, మరొకవైపు సంపన్నులకు, పాలకవర్గాలకు వందలకొద్దీ వేలకొద్దీ ఎకరాల భూమి ఎట్లా అతిసులభంగా అప్పనంగా అందుతున్నదో ప్రతిరోజూ కథలు బయటపడుతూనే ఉన్నాయి. వేలాది ఎకరాల ప్రభుత్వ భూముల కుంభకోణాలు వెలికివస్తున్నాయి. ఈ స్థితిలో భూమికోసం పోరాడుతున్న ప్రజలకు సంపూర్ణంగా సంఘీభావం ప్రకటించవలసి ఉంది. ఆ పోరాటానికి మధ్యతరగతి బుద్ధిజీవులు తమ సహాయ సహకారాలు పూర్తిగా అందించవలసి ఉంది. అయితే ఎంతన్యాయమైన పోరాటంలోనైనా, ఎంత విస్తృతమైన ప్రజామద్దతుగల పోరాటంలోనైనా ఆలోచించవలసిన ప్రశ్నలు ఉంటాయి. ఆ ప్రజావెల్లువను సమర్థిస్తూనే, అటువంటి ప్రశ్నలు వేసుకోవడం, జవాబు చెప్పడం, హేతుబద్ధమైన విశ్లేషణ జరపడం ప్రజానుకూల మేధావుల, ఆలోచనాపరుల బాధ్యత. ఇవాళ్టి భూపోరాటం గురించి కూడ అటువంటి ప్రశ్నలెన్నో తలెత్తుతున్నాయి. లక్షలాది ఎకరాలు గ్రామీణ భూములమీద ప్రాధాన్యత ఎందుకులేదనీ, పట్టణభూములలో పెద్దల దురాక్రమణలో ఉన్న భూములపై కాక ప్రభుత్వ భూములమీదనే ఎందుకు ప్రధాన దృష్టి పెడుతున్నారనీ, భూపోరాటంలో పాల్గొంటున్నవారంతా నిజమైన, భూమి అవసరమైన ప్రజలేనా అనీ, నాయకత్వపు నిజాయితీ ఎంత అనీ, నాయకత్వానికి గతంలో ఎన్నడూ గుర్తుకురాని సమస్య ఇప్పుడే ఎందుకు ఇంత తీవ్రమైందనీ, ఈ భూపోరాటం రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రెండు ప్రధాన పార్టీలతో బేరసారాలాడడానికి ఒక సాధనంగా మారిపోనున్నదా అనీ, స్వయంగా భూపోరాటానికి నాయకత్వం వహిస్తున్న రాజకీయపక్షాల నాయకులలో భూఆక్రమణదారులు లేరా అనీ, ఈ పోరాటం చాలచోట్ల మీడియా కోసమే జరుగుతున్నట్టు కనబడడం వాస్తవం కాదా అనీ, ఈ భూపోరాట లక్ష్యం నెరవేరి ప్రజలకు ఇళ్లస్థలాలు, వ్యవసాయభూములు అందే అవకాశం ఉందా అనీ అనేక ప్రశ్నలు వెలువడుతున్నాయి. ఆ ప్రశ్నలలో కొన్నిటిని పాలకపక్షం, దాని సమర్థకులు దురుద్దేశ్యాలతోనే లేవనెత్తుతుండవచ్చుగాక, మరికొన్ని ప్రశ్నలు అమాయకంగానే వెలువడుతుండవచ్చు గాక, కనీసం కొన్ని ప్రశ్నలైనా సంబద్ధమైనవీ అవసరమైనవీ అయి ఉంటాయి. ఒక ప్రజాఉద్యమపు బలం దానిమీద వచ్చే ప్రశ్నలన్నిటినీ సహనంతో స్వీకరించి, జవాబు చెప్పడంలోనే ఉంటుంది. ఆ జవాబులు చెప్పిన తర్వాత, ప్రశ్నలు అడిగినవారి దురుద్దేశ్యాలను కూడ విప్పి చెప్పవచ్చు. దురుద్దేశ్యాల గురించి చెప్పినంత మాత్రాన ప్రశ్నలకు జవాబులు చెప్పినట్టుకాదు. సామాజిక గమనంలో ఎటువంటి ప్రశ్నలయినా దాటవేయడం, వక్రీకరించడం, ఒక ప్రశ్న అడుగుతుంటే మరొక జవాబు చెప్పడం తక్షణమే అవతలివారి నోరుమూయించడానికి పనికిరావచ్చుగాని, దీర్ఘకాలికంగా చాల ప్రమాదకరమైన ఫలితాలకు దారితీస్తుంది. ఉద్యమపు నిజాయితీ ప్రశ్నార్థకమవుతుంది. నాయకత్వపు సాధికారత గందరగోళంలో పడుతుంది. ఉద్యమంలో పాల్గొన్న ప్రజలు అప్పటికప్పుడు ఏవయినా విజయాలు సాధించగలిగినా, ఇటువంటి వైఖరివల్ల మొత్తంగా ఉద్యమం నష్టపోతుంది. ఒక నిజమైన సమస్యపైన వేలాదిగా ప్రజలు కదులుతున్న ప్రస్తుత భూపోరాటం అటువంటి అనుచిత పరిణామానికి దారితీయగూడదని ఆశిద్దాం. ◆

వీక్షణం చందా వివరాలు

సంవత్సర చందా	రు.	120
3 సంవత్సరాల చందా	రు.	350
5 సంవత్సరాల చందా	రు.	550
10 సంవత్సరాల చందా	రు.	1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
ఇమెయిల్ : reachcdrc@yahoo.com

ప్రింటర్స్
చరితా ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్

లోపలి పేజీల్లో...



నీటి పారుదల పథకాలు - వివాదాలు

మన రాష్ట్రంలో నీటికేటాయింపు, పంపిణీ విషయంలో ప్రాంతీయ వివాదాలు తలెత్తుతున్నాయి. పులిచింతల ప్రాజెక్ట్ కేవలం కృష్ణా డెల్టాకే ఉపయోగకరమనే వాదనతో తెలంగాణ, రాయలసీమ నాయకులు గతంలో దానిని ప్రతిఘటించారు. పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారా రాయలసీమకు కృష్ణా జలాల తరలింపును కోస్తా, తెలంగాణ నాయకులు ప్రతిఘటిస్తున్నారు. తెలంగాణ ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం అత్యధిక నిధులు కేటాయిస్తోందని, కోస్తా, రాయలసీమ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలా ప్రాంతీయ విభేదాలకు, రాజకీయాలు కూడా తోడుగావటం వల్ల సమస్యలు మరింత జటిలమవుతున్నాయి.

ఫోకస్ : నీటి పారుదల పథకాలు - వివాదాలు

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడా అలానే భావిస్తోంది. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

– సంపాదకులు

చందాదారులకు విజ్ఞప్తి!

ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారంలోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.

మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.

– సర్క్యులేషన్ మేనేజర్
9949391028

పాఠకుల వీక్షణం

పరిశోధనా ప్రతిపాదనలు పరిచయం చేస్తూ సిడిఆర్‌సి – వీక్షణం ప్రచురించిన వ్యాసం వీక్షణం – జూన్ సంచికలో చదివాను. ఇదొక చక్కని, ఉపయోగకరమైన అంశమని చెప్పదల్చుకున్నాను. ఒక దశలో సమాజం నుంచి బైటకు వచ్చే అనేక ఫలితాలు, నేడు పూర్తి వ్యతిరేక ఫలితాలుగా దర్శనమిస్తుండటం గమనిస్తూనే ఉన్నాం. ఈ దశలో వీక్షణం వారు నిజాయితీగా ఇలాంటి బృహత్తర కార్యక్రమం నిర్వహించ బూనటం నాలాంటివారికి సంతోషం కల్గించే విషయం. మీ ఈ యజ్ఞంలో నేనూ సమిధనవ్వాలనే కోర్కె గలవాన్ని. మీ పరిశోధనలో ఉడుతాభక్తి సాయం చేయడంలో ఆసక్తి గలవాన్ని. నేనొక ప్రభుత్వోద్యోగిని (ఉపాధ్యాయుడను). నా రంగంలో గానీ, బాహ్యరంగంలో గానీ మీ సూచనల కనుగుణంగా కృషిచేసి నిష్పాక్షిక ఫలితాలు మీముందుంచగలను.

– లోకే రాజ్‌పవన్
మంథని

కార్యకర్తలను, విద్యావేత్తలను, సంబంధిత పరిశోధనలకు, రచనకు పురిగొల్పడమనేది చాలా మంచి ఆలోచన. అది చాలా అవసరమైనది కూడా.

నేను చూసినంత వరకు, ఇవాళ్టి పరిశోధనలో ఉన్న లోపాలు 1. జరుగుతున్న పరిణామాలని సరిగ్గా డాక్యుమెంట్ చెయ్యడం, వాటిని స్థూలంగా విశ్లేషించడం అనేవి సరిగ్గా జరగడం లేదు. 2. సంస్కరణల ప్రభావాన్ని అంచనా కట్టేందుకు ప్రత్యేక అధ్యయనాలు లేకపోవడం. పరిశోధనలలో పూర్తిగా విస్మరణకు గురైన అంశాలలో జీవనోపాధి, ఆదివాసుల పరిస్థితుల్లాంటివి కొన్ని. ఆదివాసుల పరిస్థితైతే కేవలం లీగల్ విషయాలకే పరిమితమై పోయింది.

నాణ్యతతో కూడిన విశ్లేషణకు పరిశోధన లో ఎక్కువ ప్రాముఖ్యాన్ని ఇవ్వవలసి ఉంది. అలాగే డాక్యుమెంటేషన్‌లో ప్రత్యేక అధ్యయనాలు, ప్రజల సాక్ష్యాలు చేర్చాలి. నేను ఈ మధ్య చదువుతున్న తెలుగు సాహిత్యంలో తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో కులవృత్తుల మీద ఆధారపడి జీవిస్తున్నవారి జీవన వివరాలు, చెంచుల జీవన స్థితిగతులు వగైరా ఉన్నాయి. ఇవన్నీ చాలా కదిలించి వేసేవిగా ఉన్నాయి. వీటన్నిటినీ మరింత వివరంగా డాక్యుమెంట్ చెయ్యాల్సిన అవసరం కార్యకర్తలకూ, విద్యావేత్తలకూ ఉంది. విజన్ 2020లో భాగంగా వచ్చిన అనేక విధానాలు, ప్రజల జీవితం మీద వాటి ప్రభావం కూడా అధ్యయనం చెయ్యవలసిన అంశాలలో ఒకటి. పదహారేళ్ల సంస్కరణల ప్రభావం గురించి పూర్తిగా అధ్యయనం జరగవలసే ఉంది. ఇప్పటికి మీకు వచ్చిన ప్రతిపాదనల్లో ఇలాంటి అంశాలు ఉన్నాయనే ఆశిస్తున్నాను. అభివృద్ధి రంగంలో పనిచేస్తున్న నా పరిచయస్తులకి మీ ప్రకటనని పంపిస్తాను.

– ఎన్. మధు
హైదరాబాద్

వి. హనుమంతరావు గారు వీక్షణం ఏప్రిల్ 2007 సంచికలో రాసిన 'పత్రికా రంగం – పతనమవుతున్న విలువలు' అనే వ్యాసంలో చాలా విషయాలు రాసారు. చాలామంది చాలా రకాలుగా రియాక్ట్ అయ్యేవిధంగా లేదా కావలసిన విధంగా సాగింది ఆయన వ్యాసం. అన్ని అంశాల మీదా అందరి తరఫునా నేను రియాక్ట్ కాదల్చుకోలేదు.

ఒకే ఒక్క విషయం మీద నా స్పందన.

ఆయన వ్యాసం దాదాపు చివర్లో "కొంతమంది జూనియర్, సీనియర్ విలేఖరుల ప్రవర్తన, రాతల గురించి ఎంత తక్కువ రాస్తే అంత మంచిది. మందుపోస్తే రాసేవాళ్లు, పార్టీ, ప్రభుత్వం నుంచి ప్లాట్లు, ఫ్లాట్లు, స్కూటర్, కారు పుచ్చుకుని ఏమి ఎలా రాయమంటే అలా రాసేవారికి కొదవలేదు. పాత్రికేయుల యూనియన్‌లు అలాంటి సీనియర్ల (సీనియారిటీ దేంట్లో?) చేతుల్లో బందీలైపోయాయి" అని రాసిన భాగం వరకే నా స్పందనను పరిమితం చేస్తాను.

అందులో కూడా ముఖ్యంగా పాత్రికేయుల యూనియన్‌ల మీద ఆయన చేసిన వ్యాఖ్యకే పరిమితం అవుతాను. ఎక్కువ రాసి వీక్షణం పాఠకులను విసిగించడం నా అభిమతం కాదు.

హనుమంతరావు గారి వ్యాఖ్యలపై ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ సెక్రటరీ జనరల్ కె.శ్రీనివాస్‌రెడ్డి గారి స్పందనను వీక్షణం మే సంచికలో లేఖల శీర్షికన ప్రచురించారు. శ్రీనివాస్‌రెడ్డి గారు ఎందుకో చాలా మొహమాటపడుతూ రాసినట్టు నాకు అనిపించింది.

హనుమంతరావు గారు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ జీవిత సభ్యులు. ఆయన సీనియారిటీ దృష్ట్యా యూనియన్ ఇటీవలే ఆయనకు ఆ సభ్యత్వాన్నిచ్చి గౌరవించింది. యాదృచ్ఛికమే కావచ్చు, నేను అధ్యక్షుడిగా ఉన్నప్పుడే ఆయనకు ఆ గౌరవం లభించింది. ఇది జరిగి నాలుగైదు సంవత్సరాలు మాత్రమే గడిచి ఉంటాయి. ఈ గౌరవాన్ని అంగీకరించడానికి ముందే యూనియన్ ఆయన పేర్కొన్నటువంటి సీనియర్‌ల చేతుల్లో బందీ అయి ఉంటే దానిని తిరస్కరించి ఉండాల్సింది. అట్లా చేయలేదంటే ఈ నాలుగైదేళ్ల కాలంలో ఆ దుస్థితి ఏర్పడిందంటారా? దానికి కూడా నేటివరకూ ఆయన రియాక్ట్ కాలేదే. యూనియన్ ఇచ్చిన ఆ గౌరవాన్ని తిరస్కరించవలసి ఉండిందికదా ఈ వ్యాసం రాసేసమయంలోనైనా!

ఈరోజున కూడా ఆయన మాయూనియన్ గౌరవ జీవిత కాలపు సభ్యుడి గా కొనసాగుతూనే ఉన్నారు. ఆయన తన వ్యాసంలో పాత్రికేయుల యూనియన్‌లు అన్నారు కాబట్టి తాను జీవిత కాలపు సభ్యుడిగా ఉన్న ఎపియుడబ్ల్యూజెను గురించి కాక మరే ఇతర సంఘం నాయకుల గురించి అయినా వ్యాఖ్యానించి ఉంటారని సర్దిచెప్పుకునేందుకు నేను సిద్ధంగా లేను. ఎందుకంటే ఈ రాష్ట్రంలో అత్యధిక సంఖ్యాకులైన జర్నలిస్ట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నది ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఎపియుడబ్ల్యూజె) ఒక్కటే. స్వర్ణోత్సవ సంవత్సరంలోనికి అడుగుపెట్టిన ఈ యూనియన్ ఛత్రఛాయలో పలుసంస్థలు పనిచేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. దిక్కూ దివాణం లేని, అడ్రస్ దొరకని కాగితపు సంఘాలు అక్కడక్కడ, అప్పుడప్పుడు కాగితాల మీదనే కనిపించినా ఈనాటికీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఉద్యమానికి వన్నెతెస్తున్న సంస్థ ఇది ఒక్కటే.

ఎపియుడబ్ల్యూజెను 1957 ఆగస్టులో భారతదేశ వర్కింగ్ జర్నలిస్ట్ ఉద్యమ పితామహుడు మానికొండ చలపతిరావు గారు స్థాపించిన నాటినుంచి 1970 వరకూ సభ్యుడిగానూ, నాయకుడి గానూ ఉండిన హనుమంతరావు గారు ఆ తరువాత ఏం చేసారు అన్నది చర్చించవలసిన విషయమే.

ఇందుకు చాలా కారణాలు ఉన్నాయి. ఆ కాలంలో అంటే 1957–1970 మధ్యకాలంలో దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న పత్రికారంగం పరిస్థితి వేరు. 1970 దశకం ఆరంభంలో ఆ పరిస్థితులు మారి పత్రికాస్వేచ్ఛ అన్నది వర్కింగ్ జర్నలిస్ట్‌లూ, సంపాదకులది కాకుండాపోయి అది యజమానుల స్వేచ్ఛగా పరిణామం చెందిన క్రమంలో హనుమంతరావు గారి పాత్ర మరువలేనిది. ఆయన ఈ మార్పును ప్రతిఘటించ లేదుకదా పైనుంచి ఇందుకు కారణమైన ఒక దినపత్రిక ప్రారంభం కావడానికి కారకులలో ముఖ్యుడయ్యారు. అదీ 'వీక్షణం' లోని అదే వ్యాసంలో ఆయన మాటల్లోనే "ఆయన (అంటే ఈనాడు యజమాని చెరుకూరి రామోజీరావు గారు) తలకాయలో ఓ దినపత్రిక విశాఖలో పెట్టాలనే ఆలోచనను ప్రవేశపెట్టి ప్రారంభించడానికి సకల చర్యల్లో తోడ్పడి, ఒక ఎడిటర్‌ను సూచించి, వెనకాలపడి, ప్రారంభోత్సవం చేయించింది ఈ వ్యాసకర్తే" అని రాసారు. దీనికి రామోజీరావు గారు ఏమంటారో తెలియదు కానీ, నేను హనుమంతరావు గారి మాటలనే విశ్వసించి ముందుకు సాగుతాను.

ఈ రాష్ట్రంలో ఈనాడు దినపత్రిక ఆవిర్భావం 1974లో జరిగింది. పేరుతోబాటు వార్తల్లోనూ వైవిధ్యంతో, కొత్తదనంతో మొదలై తెలుగు పత్రికా రంగంలోనే ఒక సంచలనంగా మొదలైన పత్రిక అది. పేరులో వార్తల ప్రజెంటేషన్‌లో, ఒరవడిలో మాత్రమే భిన్నత్వం ప్రదర్శించి ఊరుకోలేదు ఆ పత్రిక. వర్కింగ్ జర్నలిస్ట్‌లను అడ్డమీద కూలీలుగా మార్చిన ఘనత, ఇతర పత్రికలకు ఆ విషయంలో మార్గదర్శిగా నిలిచిన ఘనత కూడా ఆ పత్రిక

(మిగతా 51వ పేజీలో...)



గుజ్జర్ల ఆందోళన

మే 29న రాజస్థాన్‌లోని గుజ్జర్ కులస్తులు ఓబిసిలుగా ఉన్న తమని షెడ్యుల్డ్ తెగల్లోకి చేర్చాలని కోరుతూ పెద్ద ఎత్తున చక్కా జామ్ (రాస్తా రోకో) ఆందోళనకు దిగారు. ముఖ్యంగా దౌసా, కరోలి, బూందీ జిల్లాల్లో జైపూర్‌ను ఆగ్రా, ఢిల్లీ, కోటా, సవాయ్, మాధోపూర్‌లతో కలిపే రహదారులను దిగ్బంధించారు. అడ్డుకోవడానికి వచ్చిన పోలీసులపై రాళ్లు రువ్వారు. పోలీసు స్టేషన్లు, అవుట్ పోస్ట్‌లపై దాడికి దిగారు. పరిస్థితిని అదుపు చేయడానికి రాజస్థాన్ ప్రభుత్వం సైన్యాన్ని దింపింది. అప్పుడు జరిగిన కాల్పుల్లో మొదటి రోజు 13 మంది చనిపోగా, వందమందికి పైగా గాయపడ్డారు. 2003 నాటి ఎన్నికల్లో అధికారంలోకి వస్తే గుజ్జర్లను ఎస్.టీ.ల జాబితాలోకి చేర్చుతామని బిజెపి హామీ ఇచ్చింది. వసుంధరారాజే స్వయంగా ప్రచార సభలలో ఈ హామీని పునరుద్ఘాటించారు. అధికారంలోకి వచ్చాక యథావిధిగా హామీని తుంగలోతొక్కారు. ఈ విషయం పై ఏర్పరచిన మంత్రివర్గ ఉపసంఘం నామమాత్రంగా ఒకే ఒక్కసారి కలవడం గమనార్హం. గుజ్జర్ కార్యాచరణ సంఘం అధ్యక్షుడు కిరోరీ సింగ్ బైసేలా రాస్తారోకో ఆందోళన చేపట్టబోతున్నట్లు నెల రోజుల క్రితమే ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. గుజ్జర్లను ఎస్.టి. జాబితాలో చేర్చడాన్ని మీనా కులస్తులు వ్యతిరేకిస్తున్నారు. కొంతమంది మీనా కులానికి చెందిన మంత్రులు, ఎం.ఎల్.ఏ.లు బాహాటంగానే ప్రభుత్వాన్ని ఈ విషయమై హెచ్చరించారు. ఇదే క్రమంలో గుజ్జర్లకు మీనాలకు మధ్య కూడా ఘర్షణలు జరిగాయి. మొత్తంగా పోలీసు కాల్పులు, అల్లర్లలో 26 మంది చనిపోయారు. వారంరోజుల పాటు జరిగిన ఈ ఆందోళనను జూన్ 4న ముఖ్యమంత్రి వసుంధరారాజే హామీతో విరమించారు. గుజ్జర్ల డిమాండ్‌ను పరిశీలించడానికి రాజస్థాన్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో త్రిసభ్య సంఘం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తాత్కాలికంగా సద్దుమణిగినట్టు కనిపించినా ఈ ఆందోళన ఇతర రాష్ట్రాలకు కూడా వ్యాపించింది. సమస్యలను శాస్త్రీయ దృష్టితో పరిష్కరించకుండా ప్రజలలో వైషమ్యాలను పెంచే చర్యల ఫలితమే ఈ ఆందోళన. ◆

కాబోయే రాష్ట్రపతి ఎవరు?





నూతన రాష్ట్రపతి ఎన్నిక జూలై 19న జరుగుతుందని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దేశ 13వ రాష్ట్రపతిగా ఎవరు కాబోతున్నారో అని రకరకాల ఊహాగానాలు సాగాయి. యుపిఎ అభ్యర్థినిగా ప్రతిభాపాటిల్‌ను ప్రకటించారు. ప్రతిపక్ష ఎన్.డి.ఎ కూటమి ఉపరాష్ట్రపతి భైరాన్‌సింగ్ షెకావత్‌ను తమ అభ్యర్థిగా ప్రకటించారు. యుఎన్‌పిఎ కూటమి రాష్ట్రపతి కలాంను సంప్రదించకుండానే ఆయన పేరును ప్రస్తావించారు. తొలుత కలాం కూడా తాను గెలిచే అవకాశం ఉంటే మళ్లీ పోటీ చేయడానికి ఆసక్తి కనబర్చినా, చివరి నిమిషంలో వెనక్కి తగ్గారు. ఒక వ్యక్తి ఒకేసారి రాష్ట్రపతి పదవిని చేపట్టాలనే సంప్రదాయాన్ని కొనసాగించడంలో భాగంగా తాను పోటీచేయననీ, కొంతమంది యుపిఎ ప్రభుత్వంలోని మంత్రుల మాటలకు కూడా తాను మనస్తాపం చెందానని అన్నారు. మొత్తం పోటీలో 13 మంది ఉన్నప్పటికీ ప్రధానంగా ఇద్దరి మధ్యనే పోటీ నెలకొనిఉంది. రాష్ట్రపతి ఎన్నికలో ఎం.పి.లు, ఎం.ఎల్.ఏలు పాల్గొంటారు. వీరి ఓట్ల సముదాయాన్ని ఎలక్టోరల్ కాలేజ్ అని అంటారు. ప్రస్తుతం ఎలక్టోరల్ కాలేజ్ మొత్తం విలువ 10,98,882. ఇందులో లోక్‌సభ, రాజ్యసభ 776 మంది సభ్యుల ఓట్ల విలువ 5,49,408. దేశవ్యాప్తంగా ఉన్న 4,120 మంది ఎం.ఎల్.ఏ.ల ఓట్ల విలువ 5,49,474. రాష్ట్రపతి ఎన్నికకు 5,49,442 ఓట్లు కావాలి. యు.పి.ఎ.కు బి.ఎస్.పి. మద్దతు వల్ల ప్రతిభాపాటిల్‌కే దేశ ప్రథమపౌరురాలిగా ఎన్నిక అయ్యే అవకాశం ఉంది. ◆

గోవా ఎన్నికలు

గోవా అసెంబ్లీకి జూన్ 2న ఎన్నికలు జరిగాయి. ఫలితాలు జూన్ 5న ప్రకటించారు. 40 అసెంబ్లీ స్థానాలున్న గోవా 2007 ఎన్నికల్లో కాంగ్రెస్ తన మిత్రపక్షమైన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీతో కలిసి 19 సీట్లు సాధించుకుంది. ఇండిపెండంట్లలో, గత ప్రభుత్వ భాగస్వామి ఎం.జి.పి (2 స్థానాలు) తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పార్టీల వారీగా కాంగ్రెస్ – 16 సీట్లు, బి.జి.పి – 14 సీట్లు, ఎన్.సి.పి. – 3, ఎం.జి.పి – 2, ఎస్.జి.ఎఫ్. – 2, యు.జి.డి.పి – 1, ఇతరులు – 2 సీట్లు వచ్చాయి. విశేషమేమిటంటే 1963లో పోర్చుగీస్ వలస పాలన నుండి విముక్తి పొందిన నాటి నుంచి గోవాను ఇప్పటి వరకూ ఇరవైమంది ముఖ్యమంత్రులు పాలించారు. 1990–2000 మధ్యకాలంలోనే 13 మంది ముఖ్యమంత్రులు మారారు. ◆

610 జిఓ

తెలంగాణ ప్రాంతంలో స్థానికులకే 80 శాతం ఉద్యోగాలు కేటాయించే లక్ష్యంతో ఇరవై రెండేళ్ల క్రితం 1985 డిసెంబర్ 30న వచ్చిన 610 జిఓ ఇప్పటికీ అమలుకు నోచుకోక వివాదాస్పదంగా మిగిలిపోయింది. 1986 మార్చ్ 31లోపు అమలుకావాల్సి ఉంది. మూడు నెలల లోపు అమలు చేయడం అలా ఉంచి అసలు అటువంటి జిఓ ఒకటుందని కూడా ప్రభుత్వం మరచిపోయింది. అంచనాల ప్రకారం రెండు లక్షలకు పైగా స్థానికేతరులు తెలంగాణ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితి ఒకవైపు ఉండగా రాష్ట్ర ప్రభుత్వం 399 అని, 415 అని జిఓల మీద జిఓలు జారీ చేస్తూ జిఓ 610 అమలును నీరుగారుస్తోంది. జిఓ అమలుకై ఉద్దేశించిన శాసనసభా సంఘం నుంచి తెలంగాణేతర కాంగ్రెస్ ఎం.ఎల్.ఏలు రాజీనామాలతో తమ తెలంగాణ వ్యతిరేకతను చాటుకున్నారు. 610 జిఓ అమలు చేయకపోతే 'క్విట్ తెలంగాణ' ఉద్యమం చేపడతామని టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ◆

విత్తనాల కొరత

రాష్ట్రంలో రుతుపవనాలతో పాటు రైతుల కష్టాలూ మొదలయ్యాయి. గత ఏడాది కొంత పంట దెబ్బతినడంతో విత్తనాలు నిలువచేసుకునే పరిస్థితి కూడా లేదు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 80 లక్షల హెక్టార్లలో పంటలసాగుకై వ్యవసాయశాఖ ప్రణాళికలు వేస్తున్నా, విత్తన కొరతతో రైతులు అల్లాడుతున్నారు. వివిధ రకాల పంటలకై 40 లక్షల క్వింటాళ్ల విత్తనం అవసరం ఉండగా, 27 లక్షల క్వింటాళ్ల విత్తనం మాత్రమే లభిస్తోంది. ఇక నాసిరకం విత్తనాలకు, రకరకాల మోసాలకు మళ్లీ ఎప్పటిలాగే రైతులు యాతన పడాల్సిందే. ◆

పాఠ్య పుస్తకాలు - ప్రై'వేటు'

ఎపి టెక్ట్స్ బుక్ ప్రెస్ అధ్వర్యంలో ప్రతి ఏడాది ఉచిత పుస్తకాలు, సేల్ పుస్తకాలు ముద్రిస్తారు. వీటిలో ఏడు కోట్ల పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేస్తారు. కోటీ యాభై లక్షల పుస్తకాలు అమ్మకం కోసం అచ్చువేస్తారు. ఈ పనిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఎపి టెక్ట్స్ బుక్ ప్రెస్ చేసేది. గత రెండేళ్లుగా అమ్మకానికి ఉద్దేశించిన పుస్తకాలను ప్రైవేట్ పబ్లిషర్స్ అచ్చువేసి, అమ్ముకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. సంక్షేమ లక్ష్యంతో పని చేయాల్సిన ప్రభుత్వం సబ్సిడీలు ఉపసంహరించుకోవడంతో ప్రభుత్వప్రెస్ నష్టాలబాట పట్టింది. ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా 40 శాతం హెచ్చుధరకు అమ్ముకోవడానికి అనుమతిస్తూ ప్రైవేట్ పబ్లిషర్స్‌కు ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచింది. అటు ప్రభుత్వం, ఇటు పబ్లిషర్స్ తమపబ్బం గడుపుకుంటుంటే, విద్యార్థులపై తలకుమించిన భారం పడుతోంది. పబ్లిషర్స్‌కు ఇచ్చే టెండర్ ఒక సంవత్సరానికి మాత్రమే వర్తించడం వల్ల లక్ష్యానికి మించి పుస్తకాలు అచ్చువేసి రాబోయే ఏడాది కూడా పుస్తకాలు అమ్ముకుంటున్నారు. వీరిమీద ఎటువంటి నియంత్రణ, నిఘాలేవు. ఇదే పనిని ప్రభుత్వ ప్రెస్ చేపట్టి 40 శాతం ధర పెంపుదలను వర్తింపజేస్తే ఆరు కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు ఆదాయం చేకూరుతుంది. అందుకు భిన్నంగా ప్రైవేట్ పబ్లిషర్స్‌కు లాభాలు చేకూర్చడానికి ప్రభుత్వం పథక రచనలు చేస్తోంది. విద్య సంక్షేమం కోసం అనే దృష్టిపోయి లాభనష్టాల వ్యవహారంగా మార్చేసింది. అంతేకాదు, ఏడు కోట్ల ఉచిత పుస్తకాల అచ్చు బాధ్యతను కూడా ప్రైవేట్ వారికి అప్పగించే దిశగా అడుగులేస్తోంది. ఇక సామాన్యుల చదువు కంచికీ, అంతా ప్రైవేట్ పబ్లిషర్స్ మంచికీ అన్నమాట. ◆




జిందాల్ కంపెనీ వద్దే వద్దు


జిందాల్ అల్యూమినా కంపెనీ ఏర్పాటు పై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో పెద్ద ఎత్తున రైతులు, స్థానికులు పాల్గొన్నారు. జూన్ 4న విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలంలోని కిల్తంపాలెంలో జవహర్‌నవోదయ విద్యాలయ ఆవరణలో పర్యావరణ కోణంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. "మమ్మల్ని బాంబులతో చంపేయండి. మా సమాధులపై ఫ్యాక్టరీ పునాదులు వేయండి. లేకుంటే నిర్మాణాన్ని ఆపేయండి." "దమ్ముంటే భూముల దగ్గరకు రండి. కారంపొడితోనే సమాధానం చెబుతాం. మా భూములు లాక్కొని అన్యాయం చేస్తారా" "దయచేసి గిరిజనుల పొట్టకొట్టకండి. ఇప్పటికే వారి బతుకులు అన్యాయం అయిపోయాయి. తాటిపూడి రిజర్వాయర్ నిర్మాణ సమయంలో ఒక పర్యాయం నిర్వాసితులు అయ్యారు. ఇప్పుడు మళ్లీనా" "కన్నతల్లి లాంటి పంటపొలాలను వదిలి ఎక్కడికి వెళ్లే"దనీ ముక్తకంఠంతో ప్రజలందరు ప్రశ్నించారు. జాయింట్ కలెక్టర్ జగన్మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల అభిప్రాయాలివి. తొలుత జిందాల్ కంపెనీ అధికారి వాచస్పతి కంపెనీ వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజెప్పారు. మొత్తం 35 మంది వాదనలు వినిపించగా ముగ్గురు మాత్రమే అనుకూలంగా మాట్లాడారు. నీటి వనరులు అడుగంటుతాయనీ, కాలుష్యం పెరుగుతుందనీ, పర్యావరణానికి జరిగే ముప్పును ఎవ్వరూ పట్టించుకోవడం లేదనీ ఆవేదన వ్యక్తం చేశారు.


ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్నవారిలో 95 శాతం మంది కర్మాగారం వద్దంటున్నారని జాయింట్ కలెక్టర్ వేదిక మీదే ప్రకటించారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇంత వ్యతిరేకత ఉన్నప్పటికీ ఇవేవీ పట్టించుకోకుండా జిందాల్ కంపెనీకి 1048 ఎకరాలు, నెల్లూరు జిల్లా తడ లెదర్ పార్క్‌కు 300 ఎకరాలు, యురేనియం తవ్వకాల కోసం కడప జిల్లా వేల్పుల, మీదిపెంట్ల గ్రామాలలో 1094 ఎకరాలు కేటాయించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ◆


కొత్తపుస్తకాలు











❖ **తెలంగాణ జైత్రయాత్ర** – తెలంగాణ రాష్ట్రం – నడుస్తున్న చరిత్ర – నాలుగో పుస్తకం – బి.ఎస్. రాములు, తెలంగాణ కళాకారుల, రచయితల, మేధావుల ఐక్యవేదిక ప్రచురణ, 96 పేజీలు, 1/8 డెమీ, రు. 30.

❖ **అదిగదిగో తెలంగాణ – ఎంతో దూరంలో లేదు** – తెలంగాణ రాష్ట్రం – నడుస్తున్న చరిత్ర – ఐదవ పుస్తకం – బి.ఎస్. రాములు, తెలంగాణ కళాకారుల, రచయితల, మేధావుల ఐక్యవేదిక ప్రచురణ, 128 పేజీలు, 1/8 డెమీ, రు. 30.

పై రెండు పుస్తకాల ప్రతులకు : తెలంగాణ కళాకారుల, రచయితల, మేధావుల ఐక్యవేదిక, 404, ఉషాకిరణ్ ఆర్కేడ్, ఓ.యు. రోడ్, విద్యానగర్, హైదరాబాద్ – 500 044. ఫోన్ నెం. 9391036987

❖ **దళిత్ ఆవాజ్** – బత్తుల కాంతయ్య – బహుజన బుక్ సిండికేట్ ప్రచురణ, 92 పేజీలు, 1/8 డెమీ, రు. 40, ప్రతులకు – బత్తుల వెన్నెల, గ్రామం: మొర్రిగూడ, పోస్ట్ : మురిమడుగు, మండలం : జన్నారం, జిల్లా ఆదిలాబాద్ – 504 206.

❖ **ముస్లింవాద తాత్వికత – సిద్ధాంతం – సాహిత్యం** – ఖాజా – హేలీ ప్రింట్ మీడియా ప్రచురణలు, 128 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : హేలీ ప్రింట్ మీడియా, 202, 'ఎ' బ్లాక్, భగీరథి అపార్ట్‌మెంట్స్, విద్యానగర్, హైదరాబాద్ – 500 044. ఫోన్ : 9440456087

❖ **నిప్పు** – ఇస్లాంవాద కవిత్వం – సయ్యద్ సాబిర్ హుసేన్ – ముస్లిం రచయితల సంఘం ప్రచురణ,70 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు : సయ్యద్ సాబిర్ హుసేన్, అమ్మ ప్రజా వైద్యశాల, వినుకొండ – 522 647. ఫోన్ : 9440029672

❖ **నిరాశావాది నిఘంటువు** – పెన్నా శివరామకృష్ణ – స్పృహ సాహితీ సంస్థ ప్రచురణ, 61 పేజీలు, 1/8 డెమీ, రు.25.


❖ **ఇంటిభాష** – చుక్కా రామయ్య – స్పృహ సాహితీ సంస్థ ప్రచురణ, 222 పేజీలు, 1/8 డెమీ, రు. 100.


పై రెండు పుస్తకాల ప్రతులకు : జూలూరు గౌరిశంకర్, జర్నలిస్టు, సంపాదకుడు, 1–8–702/33/20ఎ, పద్మాకాలనీ, నల్లకుంట, హైదరాబాద్. అన్ని పుస్తకాల షాపుల్లో లభించును.


❖ **తేనె చినుకులు** – నానీలు – పొన్నూరు హైమవతీ శాస్త్రి – సూర్యప్రకాశ్ ప్రచురణలు, 27 పేజీలు – 1/8 డెమీ. రు. 30, ప్రతులకు : శ్రీమతి పొన్నూరు హైమవతీ శాస్త్రి, గాయత్రి చేతన కేంద్రం, అశ్విని హౌస్ దగ్గర, ఎచ్.పి. రోడ్, మూసాపేట్, హైదరాబాద్ – 500 018. ఫోన్ నెం. 98482 49380


❖ **గుచ్చుకునే గులాబీలు** – నానీలు – బొబ్బిలి జోసెఫ్ – 40 పేజీలు – 1/8 డెమీ. రు. 30, ప్రతులకు : బి. చిన్నారి, 17–6/3, శ్రీనివాస టాకీస్ రోడ్, సత్తుపల్లి, ఖమ్మం జిల్లా – 507 303. ఫోన్ : 9989261991


❖ **దళిత మేధావి దారి తప్పినాడా?** – రంగనాయకమ్మ కుత్సితరచనకు ఛాలెంజ్ విమర్శ – సవ్వప్ప గారి ఈరన్న – దళితుల ఆస్తుల హక్కుల పరిరక్షణ సమితి ప్రచురణ, 102 పేజీలు, 1/8 డెమీ, రు. 35, ప్రతులకు – సవ్వప్ప గారి ఈరన్న, 15–58–సి, ఎస్.ఆర్. పేట, పత్తికొండ, కర్నూల్ జిల్లా – 518 380. ఫోన్ : 9490402149











పోలీసులే నేరం చేసి ఆ నేరాన్ని కప్పిపెట్టడానికి ప్రయత్నిస్తుంటే సహకరించిన ఐఏఎస్‌లు, రాజకీయ నేతలు కూడా నేరస్తులే అవుతారని అంటున్నారు మాడభూషి శ్రీధర్

రాజ్యాంగానికీ నాగరికతకూ నిజమైన ఎన్‌కౌంటర్ - కౌసర్‌బీ

గీతా జోహ్రీ, కౌసర్ బీల సాహసాలు లేకపోతే మనదేశంలో రూల్ ఆఫ్ లా కు సంబంధించిన చర్చ జరిగి ఉండేది కాదు. దాదాపు ప్రతి పోలీస్ ఎన్‌కౌంటర్ నకిలీదనే అనుమానం ఉన్నా, ప్రతిసారీ హైకోర్టు తలుపులు తడుతున్నా, ఒక ఎన్‌కౌంటర్ నిజస్వరూపాన్ని బయటికి తీసిన సంఘటన కౌసర్‌బీ హత్య కావడం విశేషం. సుప్రీంకోర్టు దృష్టికి వచ్చిన ఒక నకిలీ ఎన్‌కౌంటర్ రూల్ ఆఫ్ లా విషయంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎన్‌కౌంటర్ మరణం అంటే దారుణమైన హత్య అనే అర్థాన్ని న్యాయస్థానం ముందు పరీక్షించే అవకాశం వచ్చింది.

పోలీసులు చెప్పినట్లు సొహ్రాబుద్దీన్ టెర్రరిస్ట్ కావచ్చు. చాలామంది పైనా, గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడీ హత్యకూ పథకాలు పన్నారన్న ఆరోపణ ఉంది. పోలీసులు ఆరోపించినట్లు సొహ్రాబుద్దీన్ నిజంగానే ఆ కుట్రలు రచించి ఉండవచ్చు. ఇప్పుడా సాక్ష్యాలన్నీ పోలీసులు గీతా జోహ్రీ పరిశోధన ద్వారా, సరయిన న్యాయస్థానం ముందుకు తెచ్చి సొహ్రాబుద్దీన్ నేరాన్ని రుజువు చేసి మరణదండన కూడా విధించే అవకాశాలు మన న్యాయశాస్త్రాల్లో, మన న్యాయస్థానాల్లో ఉన్నాయి. ఆ పని ఎందుకు చేయలేదు? అప్పుడు పంజాబ్ పోలీస్ ఉన్నతాధికారులయిన వంజారాను, పాండ్యన్‌ను విమర్శించే వారే ఉండరు. వారిని నిజంగానే హీరోలని జనం నీరాజనాలు పట్టేవారు. ఈ ఆరోపణలన్నీ రుజువు చేయగలిగామనుకున్న దశలో కూడా కేవలం సొహ్రాబుద్దీన్‌ను మాత్రమే ఉరితీయగలిగేవారు. కాని కౌసర్ బీ పైన ఉన్న ఆరోపణలేమిటి? ఏ ఆరోపణలతో ఏ కథలతో దాన్ని ఎన్‌కౌంటర్ అనగలుగుతారు? ఇది కూడా ఎన్‌కౌంటరేనా? నిజంగా పోలీసులకు ఈ విధంగా చంపే అధికారం రాజ్యాంగం కానీ, ఇండియన్ పీనల్ కోడ్ కానీ, క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ కానీ ఇచ్చిందా? ఒకవేళ ఆ అధికారమే పోలీసులకు దఖలు పడి ఉంటే భవిష్యత్తులో ఎవరయినా పోలీస్ బుల్లెట్‌కు బలి కావలసిందేనా? ఇవి రూల్ ఆఫ్ లా కు సంబంధించి సామాన్యుని ప్రశ్నలు.

మఫ్టీ పోలీసుల నెంబర్ మార్చిన జీపులోకి తన భర్తతో పాటు వెళ్లడానికి కౌసర్‌బీ చేసిన సాహసం ఆమెను తన భర్త హత్యకు సాక్ష్యంగా మార్చింది. ఆ సాక్షిని మాయం చేయడం కోసం ఆమెను చంపడం పోలీసుల నేరానికి మరో సాక్ష్యంగా మారింది. ఆమె ఎక్కడుందో చెప్పలేకపోవడం నుంచి ఆమె కూడా చనిపోయిందని చెప్పక తప్పని పరిస్థితి తలెత్తింది. గుజరాత్ పోలీసులు ఆ విషయం ఒప్పుకున్న తరువాత సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ నకిలీదనే అనుమానం ధృవపడడమే గాక, కౌసర్‌బీ హత్య అనే నేరం కొత్తగా వీధికెక్కింది. రెండూ లేదా ఏదో ఒకటయినా నకిలీ ఎన్‌కౌంటర్ అనే అనుమానం జాతీయస్థాయి సంచలనంగా రూపొందింది. కౌసర్‌బీని చంపి అయిదొందల కిలోల కట్టెలతో కాల్చి బూడిద చేసి పొలాల మీద చల్లినా నేరాన్ని కప్పిపుచ్చడం సాధ్యం కాదు. నేరాలను కనిపెట్టాల్సిన పోలీసులే నేరం చేసి ఆ నేరాన్ని కప్పిపెట్టడానికి ప్రయత్నిస్తుంటే సహకరించిన ఐఎఎస్‌లు, రాజకీయ నేతలు కూడా నేరస్తులే అవుతారు.

సొహ్రాబుద్దీన్ హత్యకు గురయ్యారనడానికి సాక్ష్యం లేదు. ఎన్‌కౌంటర్ అని అంగీకరించిన తరువాత ఆ ప్రకటన నిజమా కాదా అంశం విచారణకు దారితీయవలసిన వివాదంగా మారింది. నిజమయిన ఎన్‌కౌంటరే అయితే ఆ విషయం రుజువు చేయడం పోలీసులకు పెద్ద కష్టమేం కాదు. అది నకిలీ ఎన్‌కౌంటర్ అనే విషయం అనుమానం స్థాయిలోనే ఉంది. అది నకిలీ అని రుజువు చేయడం ప్రజలకు సాధ్యం కాదు. సొహ్రాబుద్దీన్ కనిపించకుండా పోయిన కేసు విచారణ న్యాయంగా జరిగినా, ఎన్‌కౌంటర్ అని ఆత్మరక్షణ కోసం కాల్చామని పోలీసులు చేసే ప్రకటనను ఎదురు ప్రశ్నలతో పరీక్షించినా నిజం నిగ్గుతేలుతుంది. దానికి కనీసం కేసు పెట్టాలి. ఆ పనికూడా చేయలేదు. పోలీసులలో పలువురు పలుస్థాయిలో అధికారులు తమ అధికారాలను దుర్వినియోగం చేసి ఒక వ్యక్తిని చంపడానికి వెనుకాడలేదని గీతా జోహ్రీ ఇచ్చిన నివేదికను పరిశీలించే అవసరం, ఆసక్తి, బాధ్యత, చొరవ గుజరాత్ ప్రభుత్వంలో ఎవరికీ లేకుండా పోయింది. అక్కడ జనం గానీ, పౌరసంఘాలు గానీ ఎవరూ ఏమీ చేయలేని స్థితి వచ్చింది. ఎవరో ఒకరు కేసు పెడితే తప్ప ఏమీ చేయలేనీ నిస్సహాయ స్థితిలో కోర్టులు కొట్టుమిట్టాడుతున్నాయి. సొహ్రాబుద్దీన్ తమ్ముడు రుబాబుద్దీన్ కేసు పెట్టడం ద్వారా కోర్టులకు ఈ తీవ్ర అంశం ఆలోచించడానికి అవకాశం ఏర్పడింది. హైకోర్టులు గానీ, కిందికోర్టులు గానీ, ఇటువంటి అంశాలను పరిశీలించి చర్యలు

తీసుకవోడానికి మన చట్టాల్లో విస్తృతమయిన అధికారాలూ, నియమాలూ, అవకాశాలూ ఉన్నాయి. ప్రతి రాష్ట్రంలోనూ ఉన్నాయి. పోలీసులే నేరం చేస్తే వారు తమ కేసుల్లో తమంత తామే దర్యాప్తు జరిపించబోరు కనుక పోలీసుల్లోనే మరొక విభాగంతో విచారణకు ఆదేశించాలని కోర్టును కోరవచ్చు. లేదా సిబిఐ తో విచారణ జరిపించాలని కోరవచ్చు. కనీసం మానవ హక్కుల కమిషన్ ద్వారా విచారణ జరిపించాలని కోరవచ్చు. కొన్ని కోర్టులు ఆ పిటిషన్‌ను మన్నిస్తాయి, మరికొన్ని మన్నించవు. ఎందుకు ఇటువంటి నేరాలను దర్యాప్తు చేసి ప్రాసిక్యూట్ చేయడానికి స్వతంత్ర ఏజన్సీ ఒకటి ఏర్పాటు చేయాలని లేదా మానవహక్కుల సంఘానికి ఒక దర్యాప్తు విభాగం ఏర్పాటు చేయాలని ఎవరూ ఆలోచించడం లేదు.

ప్రాణహక్కు అంటే ఇదేనా?

హత్య ఎవరు చేసినా హత్యే. ఒక్క తలారి తప్ప, ఉరి తీర్పు ఇచ్చిన న్యాయమూర్తి తప్ప ఎవరు చంపినా హంతకుడే. ఈ మాట చెప్పడానికి సోలీ సోరాబ్జీలూ, ఫాలీ నారిమన్‌లూ అక్కర్లేదు. మనిషి జీవితాన్ని జీవించే స్వేచ్ఛ సహజంగా కలిగి ఉంటాడు. శాసనం ద్వారా వ్యవస్థాపితమయిన విధానాన్ని అనుసరించి మాత్రమే అతని జీవించే స్వేచ్ఛను తొలగించవచ్చు అని ఆర్టికల్ 21 స్పష్టంగా చెప్తున్నది. నేరం చేసిన వ్యక్తి పైన ఆ నేరం రుజువుచేసి జైలు పాలు చేయడం ఆర్టికల్ 21 ప్రకారం వ్యక్తి స్వేచ్ఛను చట్టబద్ధంగా హరించడం అవుతుంది. సాక్ష్యాల ఆధారంగా సెషన్స్ కోర్టు ఉరి వేస్తే, హైకోర్టు ధృవీకరిస్తే, తీర్పు మార్చాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తీర్మానిస్తే, రాష్ట్రపతి క్షమాభిక్ష ప్రసాదించకపోతే, ఉరి తీసే తలారి హంతకుడు కాదు. న్యాయమూర్తులు, రాష్ట్రపతి హంతకులు కారు. ఆ విధంగా ఉరికి గురయిన వ్యక్తి ప్రాణ హక్కు ఆర్టికల్ 21 ప్రకారం పోయింది. ప్రాణాలు తీయడానికి చట్టం మరొక విధానం నిర్ణయించింది. అది ఆత్మరక్షణ. సెక్షన్ 100 ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం ఎవరయినా సరే (పోలీసు కూడా) తనపైన జరుగుతున్న దారుణ ప్రాణాంతక దాడి నుంచి తనను తాను రక్షించుకోవడానికి ఆ దాడిచేస్తున్న వ్యక్తిని చంపేయవచ్చు. ఆత్మరక్షణ స్వేచ్ఛ ప్రతి వ్యక్తికీ ఉంది. కానీ ఆ వ్యక్తి నిజంగా ఆత్మరక్షణ కోసమే హత్య చేసాడా లేదా అనేది కోర్టులో విచారణ ద్వారా రుజువు కావలసిన అంశం కనుక ఆ వ్యక్తి కోర్టు ముందు నిందితుడుగా నిలబడక తప్పదు. అది ఆత్మరక్షణ కాదని రుజువు చేయడంలో విఫలమయితే అతను శిక్షకు గురి కావచ్చు. అంటే ఆత్మరక్షణ కోసం చంపానని వాదించే వారు పోలీసులైనా నిందితులై కోర్టు విచారణను ఎదుర్కొనవలసిందే. ఇది అందరికీ సమానంగా అమలు కావలసిన క్రిమినల్ న్యాయసూత్రం. చట్టం ముందు సమానత అనే రాజ్యాంగ సమానతా సూత్రం.

హంతకులా? మరణకారకులా? నిర్దోషులా?

చంపాలనే ఉద్దేశంతో, చంపగలిగే గాయాన్ని చేసే ఉద్దేశంతో గానీ, తన చర్య ద్వారా ఒక వ్యక్తి మరొక వ్యక్తి మరణానికి కారణమవు తాడని తెలిసి, ఆ వ్యక్తి మరణానికి కారకుడయితే ఆ వ్యక్తి చంపినట్టే అని సెక్షన్ 299 ఇండియన్ పీనల్ కోడ్ చంపడాన్ని నిర్వచించింది. జబ్బుతో బాధపడుతున్న వాడని తెలిసి, అతన్ని గాయపరిచి త్వరగా చనిపోవడానికి కారణం కావడం కూడా చంపడమే అని, ఒక్కో సందర్భంలో సరయిన చికిత్స దొరికితే అతను బతికే అవకాశాలున్నా, ఆ చికిత్స దొరకక అతను చనిపోతే అదీ చంపడమేనని, దానికి కారణం నేను కాదని నిందితుడు అనడానికి వీల్లేదని, తల్లి గర్భం నుంచి కొంత భాగం బయటికి వచ్చిన తరువాత ఆ శిశువును చంపితే అది చంపడమేనని ఈ సెక్షన్ కింద మూడు వివరణలు చెప్తున్నాయి.

ఇది కాక సెక్షన్ 300 హత్యను నిర్వచిస్తున్నది. ఇది 299 కన్నా తీవ్రమయిన నేరం. 299 లో మరణానికి కారకుడు కావడం నేరమయితే, 300 దురుద్దేశంతో హత్య చేయడం అనే నేరాన్ని వివరిస్తున్నది.

1. చంపాలనే ఉద్దేశంతో ఏ చర్య చేసినా, 2, ఎవరికయితే ఉద్దేశపూర్వకంగా గాయం చేసాడో, ఆ గాయం అతనికి ప్రాణాంతకం అవుతుందని తెలిసి గాయపరిచినా, 3. చంపాలనే ఉద్దేశంతో తాను చేసిన గాయం సాధారణ పరిస్థితుల్లో ఎవరినయినా చంపడానికి సరిపోయినా, 4. తాను చేసే పని ఎంత ఘోరం అంటే అది ఏ పరిస్థితి లోనూ ప్రాణం తీయడమో లేక ప్రాణాంతకమయిన గాయం చేయడమో చేయగలుగుతుందని తెలిసినా ఆ పనిచేసి ఉంటే అది హత్య అవుతుందని సెక్షన్ 300 వివరించింది.

ఎ) తీవ్రంగా, హఠాత్తుగా రెచ్చగొట్టబడిన స్థితిలో ఎవరయినా రెచ్చిపోయి తనపై అదుపు కోల్పోయి రెచ్చగొట్టిన వ్యక్తిని చంపినా, బి) ఆత్మరక్షణ కోసం చేసిన దాడి ఆత్మరక్షణ మితిమీరి, అనవసర దాడిగా పరిణమించి చావడానికి దారితీసినప్పుడూ, సి) హత్య నిందితుడు ప్రభుత్వోద్యోగి అయినపుడు, అతను చట్టం ప్రకారం తను చర్య తీసుకోవచ్చుననే అధికారం ఉందనే సదుద్దేశపూరిత నమ్మకంతో మరణానికి కారకుడైనా, డి) ముందే కుట్ర చేయకుండా, హఠాత్తుగా చెలరేగిన కొట్లాటలో మరొకరు మరణిస్తే, ఇ) హతుడు 18 ఏళ్ల పైబడిన వాడై ఉండి, ప్రాణాంతకమయిన ప్రమాదానికి స్వయంగా సిద్ధమయిన పుడు, అతని మరణానికి సహకరించిన వ్యక్తి చేసిన పని, హత్య కాకుండా 'చంపడం' అనే (అంతకన్న తక్కువ) నేరం మాత్రమే అవుతుందని సెక్షన్ 300 మినహాయింపులు చెప్తున్నాయి.

సెక్షన్ 302 ప్రకారం హత్యచేసిన నేరస్తుడికి మరణశిక్ష లేదా జీవిత ఖైదు, జరిమానాతోపాటు విధించవచ్చు. హత్య నేరం కాకపోయినా చంపడానికి కారణమయినందుకు జీవిత ఖైదు, పదేళ్ల జైలు జరిమానాతో సహా విధించవచ్చునని సెక్షన్ 304 చెప్తున్నది. ఈ నేరారోపణలకు ఆత్మరక్షణ ఒక పెద్ద మినహాయింపు.

ఎప్పుడు ఆత్మరక్షణ?

ఆరు సందర్భాలలో ఒక వ్యక్తి మరొకరిని ఆత్మరక్షణకోసం చంప వచ్చునని సెక్షన్ 100 (ఇండియన్ పీనల్ కోడ్) వివరిస్తున్నది. ఆ సందర్భాలు ఇవి : 1) తాను చంపకపోతే, తనపై జరిగే దాడివల్ల తానే చనిపోయే స్థితి వచ్చినప్పుడు, 2) తాను చంపకపోతే, తనపై జరిగే దాడి తనను తీవ్రంగా గాయపరిచే స్థితి ఉన్నపుడు, 3) తాను చంపకపోతే, తనమానభంగం జరిగే పరిస్థితి ఉన్నపుడు, 4) తాను చంపకపోతే, తనపై అసహజమైన కామాన్ని తీర్చుకునే పరిస్థితి ఏర్పడినప్పుడు,

5) తాను చంపకపోతే తనను అపహరించి తీసుకుపోయే అవకాశం ఉన్నప్పుడు, 6) తాను చంపకపోతే తనను అక్రమంగా నిర్బంధించి, ప్రభుత్వవ్యవస్థల సాయంతీసుకోవడానికి అవకాశం దొరకకపోయినపుడు.

వ్యక్తిగా ఆత్మరక్షణ కోసం పోలీసు అధికారి ఎవరయినా మరొకరిని చంపినా, ప్రభుత్వోద్యోగి (లేదా ఎదురుకాల్పుల్లో పోలీసులు) తనకు చట్టబద్ధంగా అధికారాలున్నాయని సదుద్దేశంతో నమ్మి, ప్రత్యర్థిని చంపినా ఈ సెక్షన్ 100 కింద మినహాయింపు లాభం తీసుకునే అవకాశం ఉంది. అది కూడా కోర్టులో నిందితుడిగా నిలబడి రుజువు చేస్తేనే మినహాయింపు వర్తిస్తుంది.

మన రాష్ట్రంలో అనేకానేక ఎన్‌కౌంటర్లు జరిగాయి. దాదాపు అన్ని సందర్భాలలో ఒకే రకం ప్రకటన - తీవ్రవాదులు జరుపుతున్న సమావేశం మీద పోలీసులు దాడిచేయడం, వారు తుపాకులతో దాడి చేయడం, తమ రక్షణ కోసం పోలీసులు ఎదురు కాల్పులు జరపడం, అందులో ఇద్దరో తొమ్మిది మందో తీవ్రవాదులు చనిపోవడం జరుగుతూ వచ్చింది. ఘర్షణకు, ఎదురెదురు కాల్పులకు ఆధారమయిన పరిస్థితులేవి లేవని తీవ్రవాదుల పక్షాన పౌరహక్కుల వారు వాదించడం చూస్తూనే ఉన్నాం. హత్య జరగడం అనేది నిజం. హంతకులెవరనేది తేలవలసిన నిజం. ఆ నిజానిజాలు నిగ్గు తేల్చేందుకే కోర్టులు, చట్టాలు. మరి ఎన్‌కౌంటర్‌లో పోలీసులు చనిపోయినా గాయపడినా లేదా దాడికి గురయినా, హత్య కేసు లేదా హత్యాప్రయత్నం కేసులు ఎందుకు పెట్టడం లేదు, అదే విధంగా నక్సలైట్లు లేదా తీవ్రవాదులు చనిపోయినా గాయపడినా లేదా దాడికి గురయినా, ఆ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులపైన హత్యకేసులు లేదా హత్యా ప్రయత్నం కేసు, కుట్ర కేసు ఎందుకు పెట్టరు. పోలీసులు చెప్పినట్టు ఆత్మరక్షణ కోసం అని రుజువయితే హాయిగా వదిలేయవచ్చు. కాకపోతే పట్టుకోవచ్చు. తీవ్రవాదుల బృందంలో అందరూ నేరారోపణలకు గురయినా వారు, ఏమీ ఎరుగని వారు కూడా ఉన్నారా, వారు కూడా ఆత్మరక్షణ కోసమే పోలీసులను చంపారా లేక హత్య చేసారా అని ప్రాసిక్యూట్ ఎందుకు చేయడం లేదు?

ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 302 లేదా సెక్షన్ 304 కింది ఎందుకు నేరారోపణ చేసి ప్రాసిక్యూట్ చేయరు? ఆత్మరక్షణ అవునో కాదో ఎందుకు సాక్ష్యాల ద్వారా రుజువు చేయడం లేదు? అనేది ఒక ప్రశ్న అయితే ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన వారే తమను చంపబోయారని కేసుపెట్టి వారు చనిపోయారు కనుక ఆ కేసు మూసేయడం మరొక తెలివి. వారు నిజంగా చంపబోయినా అందుకు ప్రతిగా వారిని చంపిన వారిపైన హత్య కేసు పెట్టాల్సిందే. నిజంగా చంపబోవడం వల్లనే చంపారని రుజువయితే వారు నిర్దోషులుగా విడుదల కావచ్చు. అటువంటి కేసులలో పోలీసులకు ప్రత్యేకంగా మినహాయింపు ఎక్కడా లేదు. హత్యలో అనుమానితులు పోలీసులు అయినపుడు వారిపైన కూడా సెక్షన్ 302, 304 కేసులు పెట్టాలని జాతీయ మానవ హక్కుల సంఘం సిఫార్సు చేసింది. రక్షించవలసిన పోలీసులే చంపడానికి దిగినపుడు మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్టే. పోలీసుల చేజిక్కిన తరువాత కొందరు మనుషులు ఉన్నట్టుండి అదృశ్యం కావడం, పోలీసు లాకప్‌లో మరణించడం, ఎన్‌కౌంటర్లు కచ్చితంగా కేసులు పెట్టవలసిన సందర్భాలు. ఎవరూ ఫిర్యాదు చేయనవసరం లేకుండా పోలీసులే నేరాన్ని గుర్తించి పరిశోధన ప్రారంభించవలసిన నేరాలు ఇవి. కాని పోలీసులే ఇందులో అనుమానితులు లేదా సంఘటనలో భాగస్వాములు అయినపుడు, రాష్ట్ర ప్రభుత్వానికి అతీతమయిన సిబిఐ దర్యాప్తు జరిపి ప్రాసిక్యూట్ చేసే అవకాశం ఉండాలి.

జరిగిన నేరం పైన పోలీసులు స్వయంగా ఫిర్యాదు స్వీకరించక పోతే, ఎస్ పి కి ఫిర్యాదు చేయాలని, ఎస్ పి కూడా వినకపోతే కోర్టుకు వెళ్లివచ్చునని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ చెప్తున్నది. సిబిఐ కూడా వినకపోతే, కోర్టు కూడా దర్యాప్తును ఆదేశించకపోతే ఏం చేయాలనే అనుమానం పీడిస్తున్నది. చట్టం చెప్పిన రీతిలో కాకుండా ఈ విధంగా మనుషుల ప్రాణాలు తీయడానికి వీలుందా? లేదా? క్రైం సినిమాల్లో విలన్‌లతో కలిసున్న పోలీసు, హీరోను ఎన్‌కౌంటర్ చేసేస్తా అనడం మామూలు డైలాగ్‌గా మారిపోయింది.

ఎవరూ ఫిర్యాదు చేయని స్థితి కల్పించి, చావు చూసిన వారిని కూడా చంపి ఎన్‌కౌంటర్ అంటూ ఉంటే శాసనపరమయిన ఏ పరిణామాలు లేకపోయిన తరువాత ఈ 56 ఏళ్ల రాజ్యాంగాన్నీ, 147 సంవత్సరాల శిక్షాస్మృతినీ గంగలో కలపాల్సిందే. ఎవర్నయినా చంపే అధికారం తుపాకీ చేతిలో ఉన్న వారికి ఉంటే ఇక ఈ దేశానికి ప్రధానులు, ముఖ్యమంత్రులు ఎందుకు? చంపదలచుకున్న వారంతా పోలీసుల్లో చేరండి అని సందేశం ఇచ్చే ఈ నకిలీ ఎన్‌కౌంటర్లు ఉన్న తరువాత అయిదేళ్లకోసారి ఎన్నికలు ఎందుకు? చిన్న దొంగతనాలకు శిక్షలు వేసే కోర్టులు, జైళ్లు ఎందుకు? మరణ శిక్ష విధించే పోలీసులే, లాకప్‌లనే జైళ్లుగా మారిస్తే కోర్టులను కూడా మూసేసుకోవచ్చు.

సొహ్రాబుద్దీన్ భార్య కౌసర్‌బీ ఏమయిందో చెప్పాలని అతని తమ్ముడు సుప్రీంకోర్టులో ఆర్టికల్ 32 కింద వేసిన హెబియస్ కార్పస్ రిట్ పిటిషన్ ఈ తీగ లాగింది. సుప్రీంకోర్టు డొంక కదిలించింది. నిజాన్ని నిర్భయంగా చెప్పిన గీతా జోహ్రీ మళ్లీ పరిశోధన పగ్గాలు చేబట్టడం వల్ల అసలు సంగతులు బయటపడుతున్నాయి. ముగ్గురు పోలీసు అధికారుల మీద మొదటిసారి ఈ దేశంలో సెక్షన్ 302 కింద కేసులు పెట్టారు. వారిని సస్పెండ్ చేసారు. రక్షణాధికారులు నిందితులుగా నిలబడ్డారు. ఈ కేసు విచారించాలని సుప్రీంకోర్టు బహుశా తీర్పు చెబుతుంది. ఇల్లలకగానే పండుగ కాదన్నట్టు కేసు పెట్టగానే గెలిచినట్టు కాదు. అసలు కేసు కింది కోర్టులో ఏమవుతుందో చెప్పలేం. వీరిని దోషులుగా రుజువు చేయగలిగి పైకోర్టులో కూడా శిక్షను సమర్థించగలిగే రోజున ఈ దేశంలో రూల్ ఆఫ్ లా ఉందని నమ్మడానికి వీలుంటుంది. ఇటువంటి సందర్భాలలో ప్రతిసారీ కేసు పెట్టే పరిస్థితి వస్తే సమానత ఉందనుకోవచ్చు. ఇష్టారాజ్యాలు పోలీసు కార్యాలయాల్లో, సచివాలయాల్లో కాదు కోర్టుల్లో కూడా లేవని రుజువవుతుంది. పోలీసు చేతిలో తుపాకీ ఉంది కదా అని కోర్టు ఉత్తర్వులు లేకుండానే తలారులుగా మారే అధికారం పోలీసులకు లేదనీ, చేతిలో లాఠీ రూల్ ఆఫ్ లా ను నీరు గార్చడానికి కాదనీ పోలీసు ఉన్నతాధికారి ఇంట్లో కుట్రలకు, హత్యలకు కౌసర్ బీ వలె గురయితే అనుసరించవలసిన సూత్రాలు స్థిరం కావాల్సి ఉంది. భారత రాజ్యాంగం బతుక్కి బతికే హక్కు ఉందా లేదా అని ఈ అరవై ఏళ్ల స్వతంత్ర దేశపు పొలాల మీద రాలిన కౌసర్ బీ బూడిద రేణువులు అడుగుతున్నాయి. ఇది టెర్రరిస్టుల సమస్య కాదు. మన నాగరికతకు సంబంధించిన సవాల్. ◆

గత మూడు సంవత్సరాలలో రాష్ట్రంలో విద్యారంగంపై వేలాడుతున్న సంస్కరణల కత్తి ఎంత ప్రమాదకరంగా మారిందో వివరిస్తున్నారు **ఎస్. గోవిందరాజులు**

విద్యారంగాన్ని వధ్యశిలపై నిలిపిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం

వెయ్యికి పైగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మూసివేయడం, వచ్చే ఏడాది మరో 6,500 పాఠశాలల మూసివేతకు నిర్ణయం, 2010 నాటికి ఎయిడెడ్ పాఠశాలలకు ప్రభుత్వ గ్రాంట్స్ రద్దు, ఎయిడెడ్ పాఠశాలలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై నిషేధాన్ని విధిస్తూ జి.ఓ. 96, ప్రైవేట్ భాగస్వామ్యంలో 3000 కాన్సెప్ట్ స్కూళ్ల ఏర్పాటు, 90 శాతం పాఠ్యపుస్తకాల ముద్రణ ప్రైవేట్‌పరం చేయడం, 72 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సెక్షన్లు రద్దు చేయడం, ఎయిడెడ్ కళాశాలల్లో అధ్యాపక నియామ కాలను నిషేధిస్తూ జి.ఓ 35, చిన్న చిన్న కళాశాలలను కార్పొరేట్ కళాశాలలు టేకోవర్ చేసుకోవడానికి వీలుగా జి.ఓ. 25, దేశ, విదేశీ ప్రైవేట్ యూనివర్శిటీలను అనుమతిస్తూ ఒక బిల్లు – ఇవీ, ఈ మధ్యకాలంలో వై.ఎస్. రాజశేఖర రెడ్డి నాయకత్వం లోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు. ఈ ప్రభుత్వ మూడేళ్ల పరిపాలనా కాలంలో వెల్లడైన అవినీతి కుంభకోణాలు, అక్రమాలు ఒక్క ఎత్తయితే, విద్యారంగంలో అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలు మరొక ఎత్తు. నేడు ఈ ప్రభుత్వం అవినీతికి, ఆశ్రిత పక్షపాతానికి మారుపేరుగా, ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు, ప్రజాకంటక పాలనకు మరోరూపంగా తయారైంది. అత్యంత వినాశకర ప్రపంచీకరణ విధానాలను అవలంబిస్తూ గత తెలుగుదేశం ప్రభుత్వం నడచిన అడుగుజాడల్లోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పయనిస్తోంది. ఈ ప్రపంచీకరణ విధానాల ప్రతికూల ప్రభావం ఒక్క ఉన్నతవిద్యకు మాత్రమే పరిమితంకాక, పాఠశాల విద్యపై కూడా తీవ్రంగా పడి విద్యావ్యవస్థ స్వరూప స్వభావాలు, తీరుతెన్నులు సమూలంగా మారిపోనున్నాయి.

కనుమరుగు కానున్న ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ

గత కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వ పాఠశాలలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ పాఠశాలల్లో కనీస వసతులు కరువయ్యాయి. ఖాళీగా ఉన్న వేలాది ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కాలేదు. వీటికి తోడు పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా బోధనేతర పనులను అప్పగించడం, పాఠశాలల పనితీరుపై విద్యాధికారుల పర్యవేక్షణ కొరవడడం తదితర కారణాల వల్ల ఈ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పడిపోయాయి. అందువల్లే ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచాలనీ, అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ప్రత్యేక గదిని, ఒక ఉపాధ్యాయుణ్ని ఏర్పాటు చేయాలనీ, 1:30 నిష్పత్తిలో ఉపాధ్యాయ – విద్యార్థుల సంఖ్య ఉండాలనీ, ఉపాధ్యాయులు వృత్తి నిబద్ధతతో పనిచేయడానికి అనుకూల వాతావరణాన్ని కల్పించాలనీ ఎన్నో ఏళ్ల నుండి విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, మేధావులు, విద్యాభిమానుల నుండి ఆయా ప్రభుత్వాలకు పదేపదే విజ్ఞప్తులు అందాయి. అయితే గత ప్రభుత్వాల్లాగే వై.ఎస్. ప్రభుత్వం కూడా అదే తరహా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యలవైపు కనీసం దృష్టిని కూడా సారించలేదు సరికదా, ఏకంగా పాఠశాలలను మూసివేయడానికి పూనుకుంది. ఇంతకుమునుపు రేషనలైజేషన్ పేరు మీద ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు బదిలీచేస్తూ, ఖాళీ అయిన పోస్టులను రద్దు చేయడం, పాఠశాలల సంఖ్యను కుదించడం చేసింది. ఇప్పుడు 10 మంది విద్యార్థుల కంటే తక్కువ ఉన్న పాఠశాలలు అని చెప్పి 2006-07 విద్యా సంవత్సరంలో 1020 పాఠశాలలను మూసివేసింది. ఇందులో 881 జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలు, 139 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇలా మూసివేసిన వాటిలో ఒక్క రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోనే 47 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇక మీదట 20 మంది విద్యార్థుల కంటే తక్కువ ఉన్న పాఠశాలలను మూసివేయాలని నిర్ణయించింది. ఫలితంగా వచ్చే 2007-08 విద్యా సంవత్సరానికి దాదాపు 6,500 పాఠశాలలు మూతపడబోతున్నాయి. ఈ పరిణామం ఇలాగే కొనసాగితే రాబోయే కొన్ని సంవత్సరాల్లో ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ యావత్తూ కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే హైదరాబాద్ లాంటి పెద్ద నగరాల్లోనూ, ఇతర కొన్ని ప్రముఖ పట్టణాల్లోనూ ప్రభుత్వ పాఠశాలలు కేవలం నామమాత్రంగా మిగిలిపోయి కొడిగట్టిన దీపాల్లాగా మిణుకు మిణుకుమంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు తప్ప మరో గత్యంతరం లేని అభాగ్య కుటుంబాల పిల్లల భవిష్యత్తు ఈ పాఠశాలలతోపాటే అంతరించనుంది.

అంతర్ధానం కానున్న ఎయిడెడ్ పాఠశాలలు

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలకు పట్టిన గతే ఎయిడెడ్ పాఠశాలలకు కూడా ఎదురవుతోంది. విద్యా ప్రైవేటీకరణ విధానం ఊపందుకున్న తర్వాత ప్రభుత్వాలేవీ కొత్తగా ఏ విద్యా సంస్థకు గ్రాంట్-ఇన్-ఎయిడ్ మంజూరు చేయలేదు. తద్భిన్నంగా ఇప్పటికే ఎయిడ్ ఇస్తున్న విద్యాసంస్థలను వదిలించుకోవడానికి అనేక రకాలుగా ప్రయత్నిస్తోంది. చంద్రబాబు పరిపాలనా కాలంలోనే ఎయిడెడ్ విద్యా సంస్థల్లో పని చేస్తున్న సిబ్బందికి సక్రమంగా జీతాలు చెల్లించక పోవడమే కాకుండా క్రమంగా వీటిని ప్రైవేట్ విద్యాసంస్థలుగా మార్చే ప్రక్రియ ప్రారంభమైంది. ప్రస్తుతం వై.ఎస్. ఏలుబడిలో ఎయిడెడ్ విద్యా సంస్థల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. 2010 నాటికి ఎయిడెడ్ విద్యా సంస్థలకు మంజూరు చేసే గ్రాంట్స్‌ను నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఎయిడెడ్ విద్యాసంస్థలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయరాదని ఈ మధ్యనే జీ.ఓ. 96ను విడుదల చేసింది. రాష్ట్రంలోని ఎయిడెడ్ విద్యా సంస్థలలో మొత్తం 28,000 ఎయిడెడ్ ఉపాధ్యాయ పోస్టులుండగా ఇప్పటికీ 6,000 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సమీప భవిష్యత్తులో మిగతా 22,000 పోస్టులు కూడా ఖాళీ అవుతాయి. ఈ పోస్టుల భర్తీపై విధించిన నిషేధం వల్ల ఎయిడెడ్ పాఠశాలలు మొత్తంగా మూతపడడమో లేక సంబంధిత యాజమాన్యాలు వీటిని ప్రైవేట్ పాఠశాలలుగా మార్చడమో తప్ప మరో గత్యంతరం లేదు. హైదరాబాద్‌లోనే 30 ఎయిడెడ్ పాఠశాలలు మూతపడిపోతున్నాయి.

ఎయిడెడ్ పాఠశాలల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న అత్యంత ప్రజా వ్యతిరేక వైఖరికి హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న ఖైరతాబాద్ లోని నిఃశుల్క్ ప్రభాత్ హిందీ - తెలుగు ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ఒక ఉదాహరణ. స్వాతంత్ర్యానికి పూర్వం 1941లో ప్రారంభమైన ఈ పాఠశాల దశాబ్దాలుగా వేలాది మంది విద్యార్థులకు విద్యనందించింది. ఎంతో చరిత్ర కల్గిన ఈ పాఠశాలను ఉన్నఫళాన ఖాళీ చేయాలని రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ ఈ మధ్యనే ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల ఉన్న స్థలం హౌసింగ్ బోర్డుకు చెందినదని కాబట్టి అక్కడున్న పాఠశాలను వెంటనే తొలగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వాస్తవానికి పాఠశాల స్థలాన్ని కబ్జా చేయడానికి వేసిన పథకం వల్ల పాఠశాలలో చదువుతున్న వందలాది మంది పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో మెజారిటీ, పేద, బడుగు, బలహీన తరగతులకు చెందినవారున్నారు. కనీసం ఈ పాఠశాలలు ఉండడంవల్ల ఈతరగతులకు చెందిన విద్యార్థులు అంతో ఇంతో చదువును పొందగలుగుతున్నారు. ఈ పాఠశాలలు మూతపడితే పాఠశాల విద్యకు దూరమై వారు నిరక్షరాస్యులుగా, బాలకార్మికులుగా మిగిలిపోతారు. ఒకవైపు ఈ పాఠశాలలను మూసివేస్తూ మరోవైపు అందరికీ విద్య, సర్వశిక్ష అభియాన్, విద్యా హక్కుబిల్లు అంటూ ప్రభుత్వాల ప్రచార ఆర్భాటమంతా వట్టి బూటకమే తప్ప మరేమి కాదు.

కాన్సెప్ట్ స్కూళ్లు - ఖరీదైన సరుకుగా పాఠశాల విద్య

ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు మూసివేయడానికి చర్యలు చేపట్టిన ఇదే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పాఠశాల విద్యలో కాన్సెప్ట్ స్కూళ్ల పేరుతో ఒక సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని వాపోతూ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని బాకా ఊదుతూ ప్రభుత్వ - ప్రైవేట్ భాగస్వామ్యంతో 3,000 కాన్సెప్ట్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. పాఠశాల విద్యను ప్రైవేటీకరించడానికి ప్రభుత్వం ఈ కాన్సెప్ట్ స్కూళ్లను ప్రతిపాదిస్తోందని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నుంచి నిరసన వ్యక్తం కావడంతో, వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ వీటి పేరును రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూళ్లుగా మార్చి, కొన్ని పైపై మెరుగులు దిద్ది వచ్చే (2007-08) విద్యా సంవత్సరం నుండి ప్రారంభించడానికి పూనుకుంది. ఆర్థిక పరిపుష్టి ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, దేవాలయాలు, ఇతర ప్రైవేట్ సంస్థలు ఈ స్కూళ్లను ఏర్పాటు చేయడానికి ముందుకువస్తే ప్రభుత్వం 10 నుండి 15 ఎకరాల భూమిని, భవనాల నిర్మాణానికి ఒక కోటి రూపాయల గ్రాంట్‌ను, ఇతర రాయితీలను ఇస్తుంది. ఈ స్కూళ్లలో 25 శాతం సీట్లు సంబంధిత యాజమాన్య కోటాగా ఉంటాయి. ఉపాధ్యాయుల నియామకం, స్కూళ్ల నిర్వహణ తదితర వ్యవహారాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛ కల్పిస్తోంది. సి.బి.ఎస్.ఇ. సిలబస్‌తో ఇంగ్లిష్ మీడియంలో 6 నుండి 12 తరగతుల వరకు ఈ స్కూళ్లు ఏర్పాటవుతాయి. వీటిని మొదట్లో అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోనూ, ఆ తర్వాత మండల కేంద్రాల్లోనూ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

ఈ కాన్సెప్ట్ స్కూళ్ల ఏర్పాటు విధానాన్ని ఒకసారి పరిశీలిస్తే, ఈ ప్రయోగమంతా నాణ్యమైన విద్య అనే పేరుతో పాఠశాల విద్యారంగాన్ని మొత్తంగా ప్రైవేటీకరించి, ప్రభుత్వ బాధ్యతను పూర్తిగా విడనాడే పథకమేనని తేలుతుంది. ప్రత్యేక ఆర్థిక మండలుల పేరుతో ఎలా అయితే కార్పొరేట్ కంపెనీలకు వేలాది ఎకరాల భూమిని సేకరించి ఇవ్వడం, అనేక రాయితీలు కల్పించడం జరుగుతోందో, అదే తరహాలో విద్యా రంగాన్ని కూడా ప్రైవేట్ సంస్థలకు అన్ని సౌకర్యాలు, హంగులతో సమకూర్చి ఇవ్వడం జరుగుతోంది. ప్రభుత్వరంగ సంస్థలు, దేవాలయాలు ఈ స్కూళ్లను స్థాపించడానికి ముందుకు వచ్చే మాట అటుంచితే, ప్రైవేట్ వ్యాపార సంస్థలకు మాత్రం ఇవి ప్రత్యేక చదువుల మండలులు కాబోతున్నాయి. ప్రైవేట్ పాఠశాలల తరహాలోనే ఈ కాన్సెప్ట్ స్కూళ్లలో కూడా అధిక ఫీజులు, డొనేషన్లు, రకరకాల పేర్లతో తల్లిదండ్రులను దోపిడీ చేయడానికి అన్ని అవకాశాలు ఉంటాయి. చట్టబద్ధంగా 25 శాతం సీట్లను, చట్టాన్ని తుంగలో తొక్కి వీలైనన్ని సీట్లను యాజమాన్యాలు అమ్ముకుంటాయి. ఈ వాస్తవాన్ని మురుగునపరచడానికి ఈ స్కూళ్లలో ఎస్.సి., ఎస్.టి. విద్యార్థులకు పూర్తిగాను, బి.సి. విద్యార్థులకు కొంతమేరకు ఫీజులను చెల్లించే ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎస్.సి., ఎస్.టి., బి.సి విద్యార్థుల పట్ల ఎంతో ప్రేమను ఒలకబోస్తున్నట్లు నటిస్తున్న ఇదే ప్రభుత్వం సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని దుర్భర పరిస్థితులను తొలగించడానికి ఏ మాత్రం శ్రద్ధ వహించడం లేదు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థుల స్కాలర్‌షిప్పులను, రీఎంబర్స్‌మెంట్ ఫీజులను చెల్లించడానికి నిధులు విడుదల చేయడం లేదు. స్కాలర్‌షిప్పుల కోసం, మెస్ ఛార్జీల కోసం ఆందోళన చేసిన విద్యార్థులపై లాఠీఛార్జీ చేయించిన ఈ ప్రభుత్వం,

కాన్సెప్ట్ స్కూళ్లలో ఫీజులు చెల్లిస్తామని చెప్పడం విడ్డూరం కాదా? ఒకవేళ ప్రభుత్వం ఈ ఫీజులను చెల్లించినప్పటికీ అది ప్రజాధనాన్ని ప్రైవేట్ యాజమాన్యాలు దోచుకోవడానికి అవకాశం కల్పించడం కాదా? ఇప్పటికే పెద్ద నగరాలలో, పట్టణాలలో ఈ తరహా పబ్లిక్ స్కూళ్లు, కాన్సెప్ట్ స్కూళ్లు, ఇంటర్నేషనల్ స్కూళ్లు వెలసి వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ పాఠశాల విద్యను భారీస్థాయి వ్యాపారంగా మార్చివేశాయి. భవిష్యత్తులో ఈ వ్యాపారం అసెంబ్లీ నియోజక వర్గం, మండల కేంద్రం వరకు విస్తరింపజేయడానికి ప్రభుత్వం ఒక ఫెసిలిటేటర్‌గా వ్యవహరించ బోతోంది. దీనికి రంగం సిద్ధం చేయడానికి, కాన్సెప్ట్ స్కూళ్ల వ్యాపారానికి విస్తృత మార్కెట్ కల్పించడానికి ఉనికిలోనున్న ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు సమాధి కడుతోంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల మూసివేత, అదే సమయంలో కాన్సెప్ట్ స్కూళ్ల ఏర్పాటు అనేవి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానం నుండి ఉత్పన్నమవుతున్న రెండు దుష్ఫలితాలు.

అందరికీ నాణ్యమైన, మెరుగైన విద్యనందించాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి నిజంగా ఉంటే ప్రైవేట్ విద్యా వ్యాపారులకు భూమినీ, కోట్ల రూపాయల నిధులనూ, ఎస్.సి., ఎస్.టి., బి.సిల పేరు చెప్పి ప్రజాధనాన్నీ దోచి ఇవ్వడానికి బదులు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రభుత్వ భావనకు అనుగుణంగానే మొదట అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో, అనంతరం మండల కేంద్రాలలో స్థాపించవచ్చు. కుల, మత భేదాలతో నిమిత్తం లేకుండా అన్ని తరగతుల పేద విద్యార్థులందరికీ ఈ పాఠశాలల్లో ప్రవేశం కల్పించవచ్చు. అవసరమైనంత మంది శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించి పటిష్టమైన పర్యవేక్షణలో ఈ పాఠశాలలను నిర్వహిస్తే నాణ్యమైన విద్య తప్పక లభిస్తుంది. డిపెప్, సర్వశిక్ష అభియాన్, సంపూర్ణ అక్షరాస్యత లాంటి నిరుపయోగ పథకాల పేరు మీద జరుగుతున్న కోట్ల రూపాయల అవినీతిని, నిధుల దుర్వినియోగాన్ని అరికడితే ఈ రెసిడెన్షియల్ పాఠశాల లకు కావలసిన నిధులను సమకూర్చడం పెద్ద కష్టం కాదు. ఈ విషయాన్ని అర్థం చేసుకోవడానికి, ఈ విధమైన పథకాన్ని రూపొందించడానికి ప్రభుత్వ యంత్రాంగాంలోని తలపండిన మేధావులకు అసాధ్యమైనది కూడా కాదు. కానీ ప్రభుత్వ ఉద్దేశ్యం ఇది కాదు. విద్యారంగం నుంచి వీలైనంత తొందరగా చేతులు దులుపుకుని, పాఠశాల విద్యా వ్యాపార మార్కెట్‌ను ప్రైవేట్‌వారికి అప్పగించడానికి కాన్సెప్ట్ స్కూళ్లు అనే విధానానికి రూపకల్పన చేసిందే తప్ప మరొకటి కాదు. పేద పిల్లలకు నాణ్యమైన విద్య అని ప్రభుత్వం చేస్తున్న ప్రచారం ఒక క్రూర పరిహాసం మాత్రమే.

కార్పొరేట్ పరిశ్రమగా రూపొందుతున్న ఉన్నత విద్య

ఉన్నత విద్యారంగానికి, యూనివర్శిటీలకు అవసరమైన నిధులను కేటాయించాలని కోరిన ప్రతి సందర్భంలోనూ ఒక మోసపూరిత వాదనను ప్రభుత్వ వర్గాలు లేవనెత్తేవి. ఇన్నాళ్లుగా ఉన్నతవిద్యకు ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యతనివ్వడం వల్లనే పాఠశాల విద్య నిర్లక్ష్యానికి గురైందని, ఇక నుండి తలకిందులుగా ఉన్న పిరమిడ్‌ను సరిచేయడానికి పాఠశాల విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని, డిపెప్, సర్వశిక్ష అభియాన్ పథకాల కింద ప్రపంచబ్యాంకు నిధులు వరదలా పారతాయని, పాఠశాల విద్యను పొందడం పౌరుల ప్రాథమిక హక్కు అవుతుందని ప్రచారం బాగా సాగేది. ఇక నుండి ప్రభుత్వాలు ఉన్నత విద్య పట్ల బాధ్యత వహించకుండా ఉన్నత విద్యలో ప్రైవేట్ చొరవను ప్రోత్సహిస్తామనే అంశం కూడా ఈ ప్రచారంలో భాగంగా ఉండేది. ఇందులోని మోసాన్ని గమనించలేక గందరగోళానికి గురైన కొద్దిమంది మేధావులు, సాధారణ ప్రజలు ప్రభుత్వం చేస్తున్నది మంచిదేనని, న్యాయసమ్మతమేనని భావించేవారు. అయితే నేడు ప్రభుత్వాలు పాఠశాల విద్యను కూడా ప్రైవేటీకరించడానికి పూనుకుంటున్న నేపథ్యంలో వాస్తవాలను గుర్తించగలుగుతున్నారు. కానీ రెండు దశాబ్దాల క్రితం ముఖ్యంగా 1986లో జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత ఈ తప్పుడు ప్రచారాన్ని ఆసరాగా తీసుకుని కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నత విద్యను ప్రైవేటీకరణ, వ్యాపారీకరణ చేసే ప్రక్రియను ప్రారంభించాయి. ఆనాడు నాటిన విద్యా ప్రైవేటీకరణ విత్తనం నేడు మహావృక్షమై విద్యా కార్పొరేటీకరణకు దారితీసింది. మన రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ విద్యారంగాన్ని ఒకసారి అవలోకిస్తే విద్యలో ఎంతటి విషమ పరిణామాలు చోటుచేసుకున్నాయో తెలుస్తుంది. ఇంటర్ విద్యలో ఏకఛత్రాధిపత్యం వహించే సంస్థలు పుట్టుకొచ్చాయి. యావత్ ఇంటర్ విద్యారంగాన్ని కేవలం మూడు లేక నాలుగు కార్పొరేట్ సంస్థలు శాసిస్తున్నాయి. ఈ కార్పొరేట్ కళాశాలలపై ప్రభుత్వ నియంత్రణ శూన్యం. బహుశా ఈ కార్పొరేట్ కళాశాలలే ఇంటర్మీడియట్ బోర్డును, ఉన్నత విద్య మంత్రిత్వ శాఖను తమ అదుపు, ఆజ్ఞలలో ఉంచుకుంటు న్నాయని అనడం అతిశయోక్తి కాదేమో. ఇంటర్ విద్యలో కార్పొరేటీకరణ, ఏకఛత్రాధిపత్యం ఏర్పడడం తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే ప్రారంభమై నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత మరింత తీవ్రమైంది. కార్పొరేట్ కళాశాలలు ఇతర చిన్నా చితకా కళాశాలలను టేకోవర్ (విలీనం) చేయడానికి అనుమతినిస్తూ వై.ఎస్. ప్రభుత్వం ఈ మధ్యనే జి.ఓ. 25ను విడుదల చేసింది. ఈ జి.ఓ రాక మునుపే పత్రికల్లో వచ్చిన సమాచారం మేరకు ఒక విద్యా సంవత్సరం కాలవ్యవధిలో కార్పొరేట్ కళాశాలల ధాటికి తట్టుకోలేక, పోటీలో నిలబడలేక 30 నుండి 40 చిన్న కళాశాలలు వాటికి దాసోహమై, వాటిలో విలీనం అవుతున్నాయి. బిజినెస్‌లో చిన్న చేపలను పెద్ద చేపలు మింగే నియమం, విద్యా వ్యవస్థలో కూడా చోటు చేసుకుంటోదన్నమాట. గత మూడేళ్ల కాలంలో కార్పొరేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య 2.50 లక్షల నుంచి 3.20 లక్షలకు పెరిగింది. అలాగే కార్పొరేట్ కళాశాలలు ప్రతి ఏటా వెయ్యి కోట్లకు పైగా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాయి. మన రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కేటాయించే 1250 కోట్ల రూపాయల బడ్జెట్‌కు సమాన స్థాయిలో కార్పొరేట్ కళాశాలల వార్షిక టర్నోవర్ ఉందంటే ఆశ్చర్యం కలగక మానదు.

ఇంటర్మీడియట్ విద్య కార్పొరేటీకరణ, ఏకఛత్రాధిపత్యం ఏర్పడడం అనే ప్రక్రియ ఇంతటితో ఆగిపోలేదు. కార్పొరేట్ కళాశాలల పూర్తిస్థాయి గుత్తాధిపత్యానికి దారితీయాలంటే ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలు ఒక మేరకు అడ్డంకిగా నిలిచి ఉన్నాయి. ప్రస్తుతం ఈ అడ్డంకిని కూడా తొలగించడానికి ప్రభుత్వం పూనుకుంది. ఇటీవలి అధ్యాపకుల మిగులు అనే విచిత్ర వాదన ముందుకొచ్చింది. ఒక దశాబ్దానికి పైగా జూనియర్ కళాశాలల్లో అధ్యాపక ఖాళీలు భర్తీ చేయకపోడవం వల్ల వీటి పతనం ప్రారంభమైంది. ఈ ఖాళీలను భర్తీ చేయాలని అందరూ ముక్తకంఠంతో

ఘోషిస్తుంటే అధికారులు ఎయిడెడ్ జూనియర్ కాలేజీల్లో ఎయిడెడ్ పోస్టుల్లో పనిచేస్తున్న అధ్యాపకులను ఆయా కాలేజిల నుండి బదిలీ చేసి ప్రభుత్వ కాలేజీలలో నియమించారు. ఆ తర్వాత విద్యార్థుల సంఖ్య తక్కువ అనే మరొక నెపంతో ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో గ్రూపులను, సెక్షన్లను రద్దు చేయడం ప్రారంభించారు. ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ఒక ఉత్తర్వు ప్రకారం నేడు రాష్ట్రంలో 72 జూనియర్ కళాశాలల్లో అనేక సెక్షన్లు, గ్రూపులు రద్దవుతున్నాయి. ఆ 72 కాలేజీల జాబితాలో హైదరాబాద్‌లోని 17 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి.

వాస్తవానికి రాష్ట్రంలోనున్న 711 జూనియర్ కళాశాలల్లో 9000 అధ్యాపక పోస్టులుండగా, వీటిలో 5000 లకు పైగా ఖాళీలున్నాయి. ఈ ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయకుండా కాంట్రాక్టు అధ్యాపకులతో కాలం వెళ్లబుచ్చుతోంది. ఈ కాంట్రాక్టు అధ్యాపకులను కూడా విద్యా సంవత్సరం ప్రారంభమైన దాదాపు మూడు నెలల తర్వాత నియమించడం వల్ల ప్రభుత్వ కళాశాలల్లో చేరిన విద్యార్థులకు మొదటి మూడు నెలలపాటు తరగతులు జరగడం లేదు. దీనివల్ల చాలామంది ప్రైవేట్ కాలేజీల వైపు తరలి పోతున్నారు. అంతేగాకుండా కాంట్రాక్ట్ అధ్యాపకులకు నామ మాత్రంగా ఇచ్చే వేతనాలను కూడా సక్రమంగా చెల్లించడం లేదు. ఇక ఈ మధ్యనే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న కళాశాలల్లో కాంట్రాక్టు అధ్యాపకులకు పీరియడ్‌కు కేవలం రు. 50 మాత్రమే చెల్లంచాలని నిర్ణయించింది. దీని పర్యవసానంగా కనీసం కాంట్రాక్ట్ అధ్యాపకులు కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేయడానికి ముందుకు రాని పరిస్థితి ఏర్పడుతోంది. అధ్యాపకులు లేక, కనీస సౌకర్యాలు లేక, నియంత్రణ, పర్యవేక్షణ లేక క్రమంగా జూనియర్ కళాశాలల్లో చేరడానికి విద్యార్థులు ఎవరూ ముందుకు రాని పరిస్థితులు సృష్టించాలనేది ప్రభుత్వ పన్నాగం. ఇప్పటికే ఆర్థికంగా అంతో ఇంతో బాగా ఉన్నవారు, మధ్య తరగతి ప్రజల్లో పైనున్నవారు ఎవరూ తమ పిల్లలను ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేర్పించడం లేదు. ఇక మిగలి ఉన్న పేద, కింది స్థాయి మధ్యతరగతి, బలహీనవర్గాల వారిని కూడా ఈ కళాశాలల్లో చేరకుండా చేస్తే విద్యార్థుల సంఖ్య పడిపోయిందని చెప్పవచ్చు. అప్పుడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు వాటికవే సహజసిద్ధమైన మరణానికి దగ్గరవు తాయి. ఈ విధంగా రాష్ట్రంలోని జూనియర్ కళాశాలలన్నీ రాబోవు అయిదారు సంవత్సరాల కాలవ్యవధిలో కాటికి చేరువవుతాయి. కార్పొరేట్ కళాశాలల వ్యాపారం వంద బ్రాంచీలు, వేల కోట్ల రూపాయలుగా వర్ధిల్లుతుంది.

ఇక దేశ, రాష్ట్ర ప్రగతి రథ చక్రాలకు దిశా నిర్దేశం చేయవలసిన విశ్వవిద్యాలయాల పరిస్థితి కూడా అత్యంత దయనీయంగా తయారైంది. మన రాష్ట్రంలోనున్న 10 విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు తమ పూర్వ పేరు ప్రతిష్ఠలను కోల్పోయి గతకాలపు వైభవానికి చిహ్నాలుగా మాత్రమే మిగిలిపోయాయి. విద్యా వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ, ప్రభుత్వ నిధులలో కోత, మార్కెట్ అవసరాలకు విద్యను అనుసంధానించడం తదితర పరిణామాలు ఉన్నత విద్యారంగాన్ని కోలుకోలేనంత తీవ్రంగా దెబ్బతీశాయి. విశ్వవిద్యాలయాలను ఒక పథకం ప్రకారం నిరుపయోగ్యంగా చేయడం రెండు దశాబ్దాల క్రితమే అంటే ఎన్.టి. రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే ప్రారంభమైంది. మరీ ముఖ్యంగా చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం విశ్వవిద్యాలయాలు, అనుబంధ ప్రభుత్వ డిగ్రీ కాలేజీల పునాదులనే పెకిలించేవేసే చర్యలు చేపట్టింది. విశ్వవిద్యాలయాల్లోనూ, ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలలోనూ దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయడం పూర్తిగా మానేసింది. నేటికీ ఆ ఖాళీలు అలాగే ఉన్నాయి. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఉస్మానియా యూనివర్శిటీని ఉదారహణంగా తీసుకుని పరిశీలిస్తే 1350 మంది ఉన్న అధ్యాపకుల సంఖ్య 500లకు పడిపోయింది. అనేక విభాగాలు పార్ట్‌టైమ్ అధ్యాపకులతో నడుస్తున్నాయి. ఆశ్చర్యకరమైన విషయమేమంటే కొన్ని విభాగాల్లో ఒక్క పర్మనెంట్ అధ్యాపకుడు కూడా లేని పరిస్థితి ఉంది. సమీప భవిష్యత్తులో శాశ్వత అధ్యాపకులు చాలామంది పదవీ విరమణ చేస్తే విశ్వవిద్యాలయాల భవిష్యత్తు ఏమిటనేది ఒక ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇదే పరిస్థితి ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోనూ, ఎయిడెడ్ కాలేజీల్లోనూ నెలకొని ఉంది. రాష్ట్రంలోని 179 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 1300 పోస్టులకు పైగా ఖాళీలున్నాయి. కేవలం 230 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది. అవి కూడా ఇంతవరకు భర్తీ కాలేదు. రాష్ట్రంలో ఉన్న ఎయిడెడ్ కాలేజీలలో 7,491 అధ్యాపక పోస్టులకుగానూ 2,445 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులను, భవిష్యత్తులో ఖాళీ అయ్యే పోస్టులను భర్తీ చేయకూడదన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.35 సారాంశం. అలాగే తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ప్రారంభమైన విశ్వవిద్యాలయాల బ్లాక్‌గ్రాంట్స్ కోత, డిగ్రీ కాలేజీల కంటింజెన్స్ నిధుల నిలుపుదల లాంటి ప్రజావ్యతిరేక నిర్ణయాల అమలు నేడు కాంగ్రెస్ ఏలుబడిలో కూడా అలాగే కొనసాగుతున్నాయి. వైఎస్ ప్రభుత్వం కొత్తగా నాలుగు విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసినట్లు ప్రగల్భాలు పలుకు తోంది. కానీ ఈ విశ్వవిద్యాలయాలకు విడుదల చేయాల్సిన నిధుల గురించి మౌనం వహిస్తోంది. ఒకవైపు విశ్వవిద్యాలయాలను వాటి కాళ్లమీద వాటినే నిలబడమని ఉత్తర్వులు జారీ చేస్తూ, మరోవైపు కొత్త విశ్వవిద్యాలయాలను ఏర్పాటూ చేస్తూ అసెంబ్లీలో బిల్లులు ప్రవేశపెట్టడం మోసపూరితం కాదా? ఇప్పటికే ఉనికిలోనున్న విశ్వవిద్యాలయాలు, అనుబంధ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు వనరుల సమీకరణ వేట మొదలుపెట్టి విద్యార్థులపై దాడి చేయడం ప్రారంభించాయి. కోర్సుల రిస్ట్రక్చరింగ్, సెల్ఫ్ ఫండింగ్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు అనే పేర్లతో విద్యా వ్యాపారానికి పూనుకున్నాయి. నేడు విశ్వవిద్యాయాల్లోనూ, ప్రభుత్వడిగ్రీ కళాశాలల్లోనూ కొత్త కోర్సు దేనిని ప్రారంభించినా అది సెల్ఫ్ ఫండింగ్ కోర్సుగా మాత్రమే ఏర్పాటవుతోంది. దీనికి తోడు ఇంతవరకు కనీవినీ ఎరుగని పేర్ల మీద ఫీజులు వసూలు చేయడం. ట్యూషన్, పరీక్ష ఫీజులనూ భారీగా పెంచడం జరుగుతోంది. ఏ చిన్న మెమో పొందాలన్నా ఫీజు చెల్లించక తప్పదు. అత్యంత వెనుకబడిన కరువు పీడిత జిల్లాగా పేరొందిన అనంతపురం జిల్లాలోని శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలో 15 నుండి 20 రకాల పేర్లతో ఫీజులను గుంజుతూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేయడం జరుగుతోంది. ఇదే పరిస్థితి అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ కనిపిస్తోంది. ఈ విశ్వవిద్యాలయాల్లోని పాలక ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్ల సమావేశాల ఎజెండాలో వనరుల సమీకరణ పేరుతో విద్యార్థుల నుండి ఎలా అధిక ఫీజులు రాబట్టాలనే అంశం ప్రధానంగా ఉంటోంది. విజ్ఞాన

వికాసానికీ, పరిశోధనకూ, నూతన భావాల అభివృద్ధికీ కేంద్రాలుగా భాసిల్లవలసిన విశ్వవిద్యాలయాలు ఈ ప్రభుత్వాల పాలనలో పబ్లిక్ విద్యా వ్యాపారలిమిటెడ్ కంపెనీలుగా మారడం దేశ, రాష్ట్ర అధోగతికి నిదర్శనం.

ఇంతటితో ఆగక ఉన్నత విద్యారంగంపైకి తాజాగా మరొక పెద్ద దాడి ప్రైవేట్ విశ్వవిద్యాలయాల రూపంలో ముంచుకువస్తోంది. ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతినివ్వడానికి 1995లోనే ఆనాటి కేంద్ర ప్రభుత్వం ఒక బిల్లును రూపొందించింది. అయితే సమాజంలోని వివిధ తరగుతుల నుండి తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో ఆ బిల్లు అటకెక్కింది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరీ ముఖ్యంగా మన రాష్ట్రంలోని ప్రభుత్వాలు అప్పటి నుంచి ఎలాంటి విద్యా ప్రమాణాలు పాటించకుండానే ప్రైవేట్ డిగ్రీ కాలేజీలలో పి.జి. కోర్సులకు అనుమతినివ్వడం, సంబంధిత విశ్వ విద్యాలయాలు ఆమోదముద్ర వేయడం జరిగింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కూడా సెల్ఫ్ ఫండింగ్ పి.జి. కోర్సులను ప్రభుత్వం ప్రారంభించింది. అయితే అవసరమైన అధ్యాపకులను మాత్రం నియమించలేదు. అలాగే ఛత్తీస్‌గడ్ రాష్ట్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి తనే సొంతంగా ఒక ప్రైవేట్ విశ్వవిద్యాలయాల చట్టాన్ని తెచ్చి రాష్ట్రవ్యాప్తంగా వందలాది ప్రైవేట్ విశ్వవిద్యాలయాల స్థాపనకు అనుమతివ్వగా సుప్రీంకోర్టు స్పందించి ఆ చట్టాన్ని కొట్టివేసి, ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా అభిశంసించింది. దీంతో మరే రాష్ట్ర ప్రభుత్వం ఇంకొక ప్రయత్నానికి పూనుకోకుండా అవకాశం కోసం ఎదురు చూడసాగాయి. నేడు ఆ అవకాశం ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రధాన ఒప్పందాల్లో ఒకటైన సేవల రంగ వాణిజ్యంపై సాధారణ ఒప్పందం (గాట్స్) రూపంలో రానే వచ్చింది. ఈ ఒప్పందంలోని 161 సేవలలో విద్య కూడా వ్యాపారం చేయదగిన గ్లోబల్ వాణిజ్య వస్తువుగా గుర్తించారు. మనదేశంలోని కార్పొరేట్ కంపెనీల అభీష్టం మేరకూ, విదేశీ బహుళజాతి సంస్థల ఆదేశం మేరకూ కేంద్ర యూపీఏ ప్రభుత్వం గాట్స్ ఒప్పందానికి సమ్మతించి ఇతర అన్ని ప్రజా సేవలతోపాటు విద్యను ముఖ్యంగా ఉన్నత విద్యను గ్లోబల్ వాణిజ్యానికి అనుమతివ్వడానికి సిద్ధమైంది. దీనికి అనుగుణంగా శ్యామ్ పెత్రోడా ఆధ్వర్యంలోని జాతీయ విజ్ఞాన మండలి (ఎన్.కె.సి) దేశంలో 500 విశ్వవిద్యాలయాలను ప్రైవేట్ భాగస్వామ్యంలో స్థాపించవలసిన అవసరం ఉందని ప్రకటించింది. ఈ ప్రకటన వెలువడిన మరునాడే మన రాష్ట్ర ప్రభుత్వం, అడుగులకు మడుగులొత్తే రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రైవేట్ విశ్వవిద్యాలయాలపై ఒక బిల్లును తయారు చేసి అసెంబ్లీ ఆమోదం కోసం ఉరుకులు పరుగులు తీశాయి. అయితే పరిస్థితులు అంతగా అనుకూలించక భంగపడిన తర్వాత కొంత ఇంగిత జ్ఞానం తెచ్చుకుని అందరితో చర్చించిన తర్వాత బిల్లును ఆమోదానికి పెడతామని అన్నారు. అధికారానికి అమ్ముడుపోయిన మేధావుల మాటలు ఎలా ఉన్నప్పటికీ, దేశంలోనూ, రాష్ట్రంలోనూ సమీప భవిష్యత్తులో దేశ, విదేశీ ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, వీటి బ్రాంచీల చదువుల అంగళ్లు రాబోతున్నాయి. విద్యను వివిధ బ్రాండ్‌నేమ్‌లతో అమ్మబోతున్నాయి.

గాట్స్ ఒప్పందం కింద దేశ, విదేశ విశ్వవిద్యాలయాల స్థాపన జరిగితే మన దేశ విద్యారంగం పై ప్రతికూల ప్రభావం పడుతుంది. విద్య యావత్తూ దాని రూపంలోనూ, సారంలోనూ చాలా మార్పులకు గురవుతోంది. గాట్స్ ఒప్పందంలో ప్రభుత్వ సబ్సిడీలు అనుమతించరు కనుక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వవిద్యాలయాలకు ఇచ్చే గ్రాంట్స్‌ను పూర్తిగా ఆపివేస్తాయి. అప్పుడు ఈ విశ్వవిద్యాలయాలు క్రమంగా మూత పడడమో లేదా దేశ, విదేశీ ప్రైవేట్ విశ్వవిద్యాలయాలతో టై-అప్ కావడమో లేదా వాటికి తమ వద్దనున్న మౌలిక వసతులను అరువుగా ఇచ్చి బ్రాంచీలుగా మారిపోవడమో జరుగుతుంది. ఇదే సంభవిస్తే ఈనాడు ఏ విశ్వవిద్యాలయాల్లోనైతే పేద, మధ్యతరగతి, బలహీన వర్గాలకు కొంత మేరకైనా అవకాశాలున్నాయో అవి పూర్తిగా కోల్పోతారు. ఇక విద్యలక్ష్యం వక్రీకరించబడి, దేశం-సమాజం-ప్రజలు అనే దేనితోనూ పట్టింపు లేకుండా కేవలం గ్లోబల్ మార్కెట్‌కు అవసరమైన మానవ వనరులను తయారు చేయడంగా మారిపోతుంది. ప్రైవేట్ విశ్వవిద్యాలయాలలో విద్యార్థి వినియోగదారునిగా, ఉపాధ్యాయుడు సేవకునిగా, విద్యాసంస్థ విద్యాసేవలను అందజేసే కేంద్రంగా దిగజారిపోతాయి.

గాట్స్ ఒప్పందంలో విద్యను చేరిస్తే వచ్చే 'అద్భుత' ప్రయోజనాల గురించి ప్రపంచీకరణ అనుకూలురు ఎన్ని గొప్ప మాటలు చెప్పినప్పటికీ కేవలం 10 నుండి 15 శాతం మంది విద్యను కొనుక్కోగలిగిన వారు, తద్వారా కొన్ని ప్రత్యేక రంగాలలో, వృత్తినైపుణ్యం గల అతికొన్ని ఉద్యోగాలు పొందగలిగేవారు, గ్లోబల్ వాణిజ్యంలో భాగంగా విద్యా సేవలను అందించడానికి విదేశాలకు వలస వెళ్లేవారు లబ్ధిపొందవచ్చు. బహుశా మనరాష్ట్రంలోని ఏకఛత్రాధిపత్య కార్పొరేట్ విద్యా సంస్థలు విశ్వవిద్యాలయాలను స్థాపించి గ్లోబల్ వాణిజ్యంలో చేతులైన కాల్చుకోవచ్చు లేదా చేతులనిండా డాలర్లనైనా గడించవచ్చు. అయితే మిగతా 85 శాతం మంది ప్రజలు ఇందుకు మూల్యం చెల్లించవలసి ఉంటుంది.

క్రియాశీల సంఘటిత ఉద్యమం - నేటి అవసరం

గత మూడేళ్లుగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు బహుముఖంగా దాడులు చేస్తూ విద్యారంగాన్ని నేడు వధ్యశిలపై నిలిపింది. విద్యతో విడదీయరాని విధంగా ముడిపడి ఉన్న సంస్కృతినీ, నాగరికతనూ ప్రమాదంలో పడవేసింది. రేపు మరింత మరణాంతక దాడికి సిద్ధమవుతోంది. ఈ లక్ష్యానికి పునరంకితమైంది కూడా. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం పోయి మరే ఇతర రంగు జెండా ప్రభుత్వమొచ్చినా విద్యారంగంపై వేలాడుతున్న కత్తి మాత్రం తొలగిపోదు. అయితే పాలకులు, వాటి విశ్వసనీయ పార్టీలు, ప్రభుత్వాలదే చరిత్ర పురోగమనంలో చివరి మాట కాబోదు. ప్రజలు చైతన్యవంతులై, సంఘటితమై సరైన నాయకత్వం కింద ఉద్యమించి నప్పుడు ప్రపంచీకరణ విధానాలను తిప్పికొట్టవచ్చు. ముఖ్యంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులు, విజ్ఞత కల్గిన ప్రజలు సంఘటితంగా విద్యనూ, సంస్కృతినీ, నాగరికతనూ పరిరక్షించడానికి పూనుకోవాలి. క్రియారహిత ప్రేక్షక పాత్రనూ, నిర్లిప్తతను విడనాడి క్రియాశీల ఉద్యమ నిర్మాణానికి కృషి చేయాలి. సంఘటిత ఉద్యమం ముందు ఎంతటి కర్కశ, కంటక రాజ్యమైనా మోకరిల్లక తప్పదనే సత్యాన్ని నందిగ్రామ్ రైతుల విరోచిత ప్రతిఘటన మరోసారి రుజువు చేసింది. ◆

కేంద్ర-రాష్ట్రాల మధ్య అధికార విభజనలో రాజ్యాంగం చాలామటుకు కేంద్రానికే ఆధిక్యతనిచ్చిందని, కేంద్రంలోనే సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడడంతో పరిస్థితి మారిందని అంటున్నారు సి.ఎచ్. దినేష్‌కుమార్, వంగరి భూమయ్య

పూంచీ కమీషన్ : కేంద్ర, రాష్ట్ర సంబంధాలు

దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కేంద్ర రాష్ట్ర సంబంధాల పునఃపరిశీలన చర్చకు వచ్చింది. 1983లో నాడు వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రతిపక్ష పార్టీల ఒత్తిడివల్ల కేంద్ర ప్రభుత్వం సర్కారియా కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ 1988 జనవరి 30న నివేదిక సమర్పించింది. మళ్లీ కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై కదలిక వచ్చింది. ఈ అంశాన్ని పునర్నిర్వచించడానికి కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మదన్‌మోహన్ పూంచీ ఆధ్వర్యంలో కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్‌లో జస్టిస్ పూంచీతో బాటు కేంద్ర హోంశాఖ కార్యదర్శులు వి.కె. దుగ్గల్, ధీరేంద్రసింగ్, నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ ఎన్. ఆర్. మాధవ మీనన్ సభ్యులుగా వ్యవహరిస్తారు. జస్టిస్ సర్కారియా కమిషన్ నివేదిక సమర్పించిన ఇరవై ఏళ్ల తర్వాత దేశపాలన, ఆర్థిక వ్యవహారాల్లో భారీ మార్పులు వచ్చిన నేపథ్యంలో కొత్త కమిషన్‌ను నియమిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశంలో సంకీర్ణ ప్రభుత్వాలు కొనసాగుతున్న పరిస్థితుల్లో ఈ కమిషన్ ఏర్పాటు కావడం విశేషం. రెండేళ్ల పాటు కేంద్ర-రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేసి ఈ కమిషన్ తన సిఫారసులతో కూడిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది.

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటి నుండి కేంద్ర-రాష్ట్ర సంబంధాల్లో వినూత్నమైన మార్పులు చోటు చేసుకున్నాయి. కేంద్ర-రాష్ట్ర సంబంధాలు ఏర్పాటు విషయంలో భారత రాజ్యాంగ నిర్మాతలు కెనడా రాజ్యాంగంచే ప్రభావితులయ్యారు. ఆధునిక రాజ్యాంగబద్ధ ప్రభుత్వాలు సమాఖ్యగా ఏర్పడే సమయంలో అందులో చేరే రాజ్యాలు సర్వసత్తాక రాజ్యాలుగా వ్యవహరిస్తాయి. ఆ రాజ్యాల ఆశయాలు, ఆదర్శాలు, ఉద్దేశ్యాల్లో భావసారూప్యత ఉండడం వల్ల అవి ఒక సమ్మేళన రాజ్యంగా లేదా సమాఖ్య రాజ్యంగా ఏర్పడి ఉమ్మడిగా రాజకీయ, సామాజిక, ఆర్థిక ప్రగతి సాధించుకోవడానికి ప్రయత్నిస్తాయి. ఆ విధంగా కొన్ని స్వతంత్ర్య రాజ్యాలు ఏకమై ఒక ఒప్పందం ద్వారా నూతన రాజ్యంగా ఏర్పడతాయి. దీన్నే సమాఖ్య రాజ్యమంటారు. దేశాధికారాలు, విధులు రాజ్యాంగ బద్ధంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభజించుతారు. అమెరికా, ఆస్ట్రేలియాలు ఈ పద్ధతిన ఏర్పడినవే. అయితే ఇందుకు భిన్నంగా మన రాజ్యాంగ నిర్మాతలు నాటి రాజకీయ పరిస్థితుల దృష్ట్యా 'సమాఖ్య' అనే పదాన్ని విడిచిపెట్టి 'ఇండియన్ యూనియన్' అనే మాటను ఉపయోగించారు. అదే క్రమంలో సమాఖ్య ప్రభుత్వానికి ఆధారమైన మూల సూత్రాల ప్రాతిపదికన కేంద్రానికి ప్రత్యేకాధికారాలు కల్పించి రాష్ట్రాలపై కేంద్ర అధిపత్యాన్ని సమర్థించారు.

పరిపాలనా సౌలభ్యం కోసం బ్రిటిష్ ఇండియా ప్రాంతాలను రాష్ట్రాల వారిగా విభజించారు. కానీ వాటికి సార్వభౌమత్వం కల్పించలేదు. కాబట్టి అధికార విభజనలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆక్షేపణ తలెత్తలేదు. 1946లో రాజ్యాంగ పరిషత్తుకు జరిగిన పరోక్ష ఎన్నికల్లో గెలుపొందిన వారిలో ఎక్కువ మంది కాంగ్రెస్ అభ్యర్థులే అయినందున కాంగ్రెస్ నాయకత్వం ప్రతిపాదించిన రాజ్యాంగ నిబంధనలను, ప్రకరణలను వ్యతిరేకించకుండా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కేంద్ర-రాష్ట్రాల మధ్య అధికార విభజనలో రాజ్యాంగం చాలామటుకు కేంద్రానికే ఆధిక్యతనిచ్చింది. కేంద్ర జాబితా, ఉమ్మడి జాబితాతోపాటు పలు ప్రత్యేక సందర్భాలలో రాష్ట్ర జాబితాపై కూడా చట్టాలు చేసే అధికారాన్ని కేంద్ర పార్లమెంట్‌కు కట్టబెట్టడం జరిగింది. అవశిష్టాధికారాలు సరేసరి.

కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల్లో ఒకే రాజకీయ పక్షం (కాంగ్రెస్) అధికారంలో ఉండడం వల్లనైతేనేమి, జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వం వల్లనైతేనేమి 1964 వరకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఎటువంటి ఘర్షణ వాతావరణం ఏర్పడలేదు. ఒకవేళ ఏదైనా చిన్నా చితకా సమస్య తలెత్తినప్పుడు నెహ్రూ దాన్ని పార్టీ స్థాయిలోనే పరిష్కరించేవారు. రాజ్యాంగ కోణంలో అవి ఎప్పుడు చర్చకు వచ్చేవి కావు. ఈ కాలంలో భారతదేశం ఏక కేంద్ర రాజ్యాంగానే చలామణి అయ్యింది. 1966లో అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో ఇందిరాగాంధీ కూడా ఇదే సంప్రదాయాన్ని కొనసాగించే ప్రయత్నం చేసారు. కాని 1967లో నాల్గవ సాధారణ ఎన్నికల తర్వాత పలు ఉత్తర భారత రాష్ట్రాల్లో ప్రతిపక్ష సంకీర్ణ ప్రభుత్వాలేర్పడ్డాయి. దక్షిణాదిన తమిళనాడులో డి.ఎం.కె., పంజాబ్‌లో అకాలీదళ్, పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడడం వల్ల కేంద్ర-రాష్ట్ర సంబంధాల పై తర్జనభర్జనలు ప్రారంభమయ్యాయి. రాజ్యాంగరీత్యా గానీ, పాలనారీత్యా గానీ కేంద్ర-రాష్ట్ర సంబంధాలు ఫెడరల్ స్ఫూర్తికీ, దేశాభివృద్ధికీ దోహద కారిగా లేవని అందువల్ల కేంద్ర-రాష్ట్ర సంబంధాల్లో మార్పులు చేయాలని,

రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలు కల్పించాలనీ, ఆర్థిక వనరుల పంపిణీలో రాష్ట్రాలకు ఎక్కువ వాటా కల్పించాలనీ అనేక రాష్ట్రప్రభుత్వాలు డిమాండ్‌ను లేవనెత్తాయి.

1977లో కేంద్రంలో మొదటి సంకీర్ణ జనతా ప్రభుత్వం అధికారంలోకొచ్చాక కేంద్ర-రాష్ట్ర సంబంధాలను పునఃసమీక్షించాలని పలువురు ముఖ్యమంత్రులు వాదించారు. మరీ ముఖ్యంగా 1980 దశకంలో కేంద్ర-రాష్ట్ర సంబంధాలు వివాదాస్పదమయ్యాయి. ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, జమ్ము-కాశ్మీర్, అస్సాం, తమిళనాడు, కేరళ, పంజాబ్ రాష్ట్రాలలో అధికారంలో ఉన్న కాంగ్రెసేతర ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించారు. వీరు బెంగుళూర్, శ్రీనగర్ వంటి పట్టణాల్లో సమావేశమై 356 నిబంధన ప్రకారం రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం రద్దు చేయడాన్ని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చడానికి గవర్నర్‌ను కేంద్రం పాచికగా వాడుతున్నదనీ, రాష్ట్రాల వ్యవహారాలలో కేంద్రం అనవసరంగా జోక్యం చేసుకుంటున్నదనీ, రాష్ట్రాల్లో కేంద్రం తన బలగాలను మోహరించి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు.

కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజ్యాంగ బద్ధంగా నిర్ణయించబడిన సంబంధాలను పునఃసమీక్ష చేయడానికి ఏర్పర్చిన కొన్ని సంఘాలు తమతమ నివేదికలను సమర్పించాయి. 1966లో కేంద్ర ప్రభుత్వం ఎం.సి. సెతల్వాడ్ అధ్యక్షతన కేంద్ర-రాష్ట్ర సంబంధాలను సమీక్షించేందుకై పరిపాలనా సంస్కరణల సంఘాన్ని నియమించింది. 1970లో తమిళనాడు ప్రభుత్వం జస్టిస్ రాజమన్నార్ కమిషన్‌ను నియమించింది. 1973లో పంజాబ్‌లోని ఆనందపూర్ సాహిబ్‌వద్ద అకాలీదళ్ సమావేశమై కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై ఒక తీర్మానాన్ని రూపొందించింది. 1983లో ఇందిరాగాంధీ కేంద్ర-రాష్ట్ర సంబంధాలను పునఃపరిశీలించవలసిందిగా జస్టిస్ సర్కారియా కమిషన్‌ను నియమించింది. జాతీయ పార్టీల ఆధిపత్యం తగ్గి ప్రాంతీయ పార్టీలు కేంద్ర స్థాయిలో, ప్రభుత్వాల నిర్మాణంలో కీలకపాత్ర వహిస్తున్న నేటి కాలంలో కేంద్ర-రాష్ట్ర సంబంధాలను సమీక్షించడానికై ఇటీవల జస్టిస్ మదన్‌మోహన్‌పూంచీ కమిషన్‌ను కేంద్రం నియమించింది.

పూంచీ కమీషన్ సిఫారసులు

ఈ కమీషన్ స్థూలంగా ఈ కింది అంశాలను పరిశీలిస్తుంది.

- ప్రస్తుతం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజ్యాంగ బద్ధంగా కొనసాగుతున్న సంబంధాల పనితీరుపై సమీక్ష. ఆర్థిక సంబంధాలు, అత్యవసర పరిస్థితి నిబంధనలు, గవర్నర్ పాత్ర, పంచాయతీ రాజ్ సంస్థలు, అంతర్రాష్ట్ర నదీజలాల మండలులు వంటి అంశాల అధికారాలు - విధుల పనితీరుపై పరిశీలన.
- 15-20 ఏళ్ల మధ్య కాలంలో పూర్తయ్యే నదుల అనుసంధానం, మెగా ప్రాజెక్టుల ప్రణాళిక - అమలు విషయంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర వాటి విధులు, అధికారాల పరిధిపై సమీక్ష.
- 6వ షెడ్యూల్‌లో పేర్కొన్న పంచాయతీరాజ్ సంస్థలు, స్థానిక సంస్థల వంటి వాటికి నిర్ణీత కాల పరిమితిలో అధికారాల బదలాయింపు, స్వతంత్ర ప్రతిపత్తి కల్పించడంలో, జిల్లాస్థాయిలో స్వతంత్ర ప్రణాళిక, బడ్జెటింగ్ విధానం అమలు, రూపకల్పనను ప్రోత్సహించడంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర.
- రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్లోని 12వ భాగంలో పేర్కొన్న కేంద్ర-రాష్ట్ర ఆర్థిక సంబంధాలపై సమీక్ష, ప్రధానంగా కేంద్ర నిధులపై రాష్ట్రాలు ఎక్కువగా ఆధారపడటం పై 8 నుండి 12వ ఆర్థిక సంఘాల సిఫారసులను సమీక్షించడం.
- వివిధ కేంద్ర సహాయ నిధులకు రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుతో ముడిపెట్టడం, సానుకూల వివక్ష ప్రాతిపదకన వెనుకబడిన రాష్ట్రాల ప్రయోజనం కోసం విధానాలను అమలు చేయడం.
- సుదీర్ఘ కాలంగా తీవ్ర స్థాయిలో మతకలహాలు, కులసంఘర్షణలు, ఇతర హింసాత్మకమైన సమాజిక సంక్షోభం ఏర్పడిన సందర్భంలో కేంద్ర-రాష్ట్రాల పాత్ర, బాధ్యత, అధికార పరిధిని పరిశీలించడం.
- వ్యాట్‌ను అమలు పరుస్తున్న నేపథ్యంలో వస్తువుల ఉత్పత్తి, అమ్మకం, సేవలవంటి వాటిపై వేరువేరుగా పన్నులను విధించాల్సిన అవసరం, ప్రాధాన్యత, దేశవ్యాప్తంగా అంతర్గతంగా ఉమ్మడి మార్కెట్‌ను సృష్టించడానికి అంతర్రాష్ట్ర స్వేచ్ఛా వ్యాపారాన్ని అమలు చేయాల్సిన అవసరంపై సమీక్షించడం.
- జాతీయ భద్రతపై ప్రభావం చూపే అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ అంశాలతో సంబంధం ఉన్న నేరాలపై తనకు తానుగా (సుమోటో) దర్యాప్తు చేపట్టడానికి 'సెంట్రల్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ'ని ఏర్పాటు చేయాల్సిన అవసరం. అనివార్యమైన పరిస్థితులు తలెత్తినప్పుడు కేంద్రం సుమోటోగా రాష్ట్రాలలో భద్రతా బలగాలను మోహరించడానికి వీలుగా 355వ అధికరణ కింద చట్టాలు చేసే అవకాశాలపై సమీక్షించడం.
- పై అంశాలను అధ్యయనం చేసి తగిన సిఫారసులు సూచించేటప్పుడు కమిషన్ గత రెండు దశాబ్దాల కాలంలో దేశంలో సామాజిక, ఆర్థిక రంగాల్లో వచ్చిన మార్పులను, పురోగతిని దృష్టిలో ఉంచుకోవాలి.

కేంద్ర-రాష్ట్ర సంబంధాలను పరిశీలించి, సిఫారసులను చేసిన గత కమిషన్‌లకు భిన్నంగా నేటి మదన్‌మోహన్ పూంచీ కమిషన్ రాజకీయేతర అంశాలపై దృష్టి సారించనుంది. గత ఇరవై సంవత్సరాల కాలంలో భారత సమాఖ్య వ్యవస్థ అనూహ్యమైన రాజకీయ పరిణామాలను ఎదుర్కొన్న నేపథ్యంలో ఈ కమిషన్ ఏర్పాటు కావడం విశిష్టతను సంతరించుకుంది. కేంద్ర ప్రభుత్వ ప్రాబల్యం కొనసాగిన కాలంలో తరచుగా 356వ రాజ్యాంగ అధికరణ దుర్వినియోగం అయిన విషయం మనకు తెలిసిందే. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కేంద్రం రాష్ట్రపతి పాలన ప్రవేశపెట్టి రాజ్యాంగ సంక్షోభానికి ఒడికట్టిన సందర్భాలు భారత రాజ్యాంగ చరిత్రలో కోకోల్లలు. అయితే నాటి పరిస్థితులకు భిన్నంగా జాతీయ స్థాయిలో నేడు సంకీర్ణ ప్రభుత్వాలు కొనసాగుతుండడం వల్ల, ప్రాంతీయ పార్టీల కనుసన్నలపై కేంద్రం ఆధారపడుతుండడం వల్ల 356వ అధికరణ, గవర్నర్ పాత్ర వివాదాస్పదం కాలేకపోతున్నాయి. మారిన ఈ రాజకీయ సమీకరణల నేపథ్యంలో పూంచీ కమిషన్ రాజకీయేతర అంశాలైన అంతర్రాష్ట్ర స్వేచ్ఛా వ్యాపారం, వ్యాట్ అమలు, ఉమ్మడి మార్కెట్, పన్నుల విధానాలు, ఆర్థిక సంఘాల సిఫారసుల వంటి ఆర్థికాంశాలతో పాటు స్థానిక సంస్థల స్వతంత్ర ప్రతిపత్తిపై దృష్టి కేంద్రీకరించడం విశేషం. ◆

ఆహార భద్రతే మా లక్ష్యం అంటున్న పాలకులు ఆహారేతర అవసరాలకూ, సెజ్‌ల పేరిట బహుళజాతి కంపెనీలకూ పంట భూములను అప్పజెప్పుతున్నారని అంటున్నారు వి. హనుమంతరావు

ఆహార భద్రతంటే...

రైతుకు విత్తనాలు కూడా సరఫరా చేయలేని ప్రభుత్వం వచ్చే నాలుగేళ్లలో రు. 25 వేల కోట్లతో మొత్తం వ్యవసాయ రంగాన్నే ఉద్ధరించి నాలుగు శాతం అభివృద్ధిని సాధిస్తుందట. ఒకరకంగా ఆ నాలుగు శాతం అభివృద్ధి సాధ్యమే. ఎలా? చిన్న, సన్నకారు రైతులను కార్పొరేట్ రంగం అనే రోడ్‌రోలర్‌కు బలిచేసి ఆహారధాన్యేతర వ్యవసాయ ఉత్పత్తిని పెంచితే, సాధ్యమే. మన్మోహన్ భరోసా వెనుక ఉన్న అసలు రహస్యం ఇదే. కార్పొరేట్‌రంగం ఆహారేతర ఉత్పత్తితో ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గుతుంది. అంటే ఆహార భద్రత పేరుతో దిగుమతులు పెరుగుతాయి. ఆహారధాన్యాల ఎగుమతి చేసే బహుళజాతి సంస్థల రొట్టె నేతిలో పడుతుంది. 1991లో ప్రపంచబ్యాంకు సూచించిన విధానం ఇదే. ఇప్పుడు ప్రధాని బహిరంగంగా ఆ విధానాన్ని అధికారికంగా ప్రకటించారు.

స్వతంత్రం వచ్చిన తర్వాత 1970 వరకు దేశం ఆహారధాన్యాల దిగుమతుల మీద ఆధారపడుతూ వచ్చింది. పరిమిత స్వయం పోషకత్వం సాధించిన దేశం ఇవాళ మళ్లీ దిగుమతి చేసుకొంటే తప్ప ఆహారభద్రత చేకూరని పరిస్థితికి పాలకులు దేశాన్ని దిగజార్చారు. గత సంవత్సరం ఫిబ్రవరి నుంచి అయిదు వేల కోట్ల రూపాయల ఖర్చుతో 55 లక్షల టన్నుల గోధుమలు దిగుమతి చేసుకోన్నాం. గత ప్రభుత్వ హయాంలో ఆహార ధాన్యాల నిల్వలను ఆరు కోట్ల టన్నుల మేరకు (అప్పటి విలువ రు. 37,800 కోట్లు) నిల్వలు మేట వేసి పోగా ఒక పక్క ప్రతి నలుగురిలో ఒక్కరు పూటకు తిండి ఠికానా లేని పరిస్థితిలో ఉంటే, రైతుకిచ్చే కనీస ధరకన్నా తక్కువ రేటుకు రు. 14,135 కోట్లు సబ్సిడీ ఇచ్చి మరీ ఎగుమతి చేసింది. ఎగుమతి చేసిన తర్వాత కూడా ఇంకా అవసరాన్ని మించి నిల్వలు ఉంటే 180 లక్షలటన్నుల గోధుమలను సబ్సిడీ ఇచ్చి మరీ దేశంలోని బడావ్యాపారులకు అమ్మేసింది. మరో విశేషం, ఇదే కాలంలో గోదాముల నుంచి 147 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు (రు. 8,800కోట్లు) మాయమై పోయాయి. అవి ఎవరి జేబుల్లోకి పోయాయో వేరే చెప్పాల్సిన పనిలేదు.

తగ్గిన ధాన్యసేకరణ

ఇలా నిల్వలన్ని హుష్‌కాకీ అయిపోయిన తర్వాత మళ్లీ ఆహార భద్రతకు ముప్పు ఏర్పడింది. అలాంటపుడు ఆహారధాన్యాలను ప్రొక్యూర్ చేయాలి కదా. కాని బడావ్యాపారస్తుల కొమ్ముకాసే బిజెపి ప్రభుత్వం 2002లో 260 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను సేకరించగా, అది 2003లో 156, 2004లో 69, 2005లో 40 లక్షల టన్నులకు, 2005 ఏప్రిల్ నాటికి ఉండాల్సిన కనీస నిల్వల కన్నా ఒక లక్ష టన్నులు తక్కువగా మాత్రమే సేకరించింది. ఇదీ అపుడు బిజెపి, ఇపుడు కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆహారభద్రతను అమలు పరచిన తీరు. ప్రభుత్వం ఎందుకిలా చేసింది? ఆహారధాన్యాల సేకరణను తగ్గించాలనే నిర్ణయం తీసుకున్నదట. అలా తగ్గించే ఉద్దేశ్యంలోనే కనీస మద్దతు ధర పెరుగుదలను అదుపులో ఉంచాలనే ఉద్దేశంతోనే చేసిందట. అలాంటి దురుద్దేశం ఎందుకు కలిగిందట? మరి ఎక్కువగా గోధుమ, బియ్యం పండించకుండా రైతులను ఆహారేతర పంటలవైపు మళ్లించడానికట. వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలో ప్రైవేట్ వ్యాపారస్తుల వాటా తగ్గిపోతుంది కాబట్టి, ప్రైవేట్ పెట్టుబడులను ఆహారధాన్యాల మార్కెటింగ్ వ్యవస్థలో పెంచటం ప్రభుత్వ ఉద్దేశమట. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ ఎకనమిక్ సర్వే నుంచి ఉటంకించిన విషయాలే. అంటే ఆహార ధాన్యాల సేకరణలో ఫుడ్ కార్పొరేషన్ పాత్రను తగ్గించి ప్రైవేట్ వ్యాపారాన్ని ప్రోత్సహించటమే.

ఫుడ్ కార్పొరేషన్ రద్దు

ఫుడ్ కార్పొరేషన్‌ను రద్దు చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం తల పెట్టింది. మార్కెట్లో వ్యాపారస్తులు నిల్వలు దాచి ధరలు పెంచేసినపుడు, ప్రభుత్వం తన నిల్వల నుంచి ఆహార ధాన్యాలను విడుదల చేసి ధరలు అదుపులో ఉంచడానికి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. ఆలోచన పూర్తిగా సమర్థనీయం కాని లంచగొండి అధికారుల, అధికారంలో ఉన్న రాజకీయ నాయకుల ధన దాహంతో కార్పొరేషన్ భ్రష్టు పట్టింది. అలాగని కాడి పూర్తిగా కిందపారేసి ఆహార ధాన్యాల వ్యాపారాన్ని ప్రైవేట్ రంగానికి వదిలేస్తే సామాన్యుడి గతి ఏమిటి? సామాన్యుడు చేసే ఖర్చులో 50 నుంచి 60 శాతం ఖర్చు తిండి గింజల మీదనే. అలాంటపుడు వాటి ధర అనూహ్యంగా పెరిగితే, పేదరికం మరింత పెరుగుతుంది. తెలుసు కాని ఆహార ధాన్యాల బహుళజాతి సంస్థలు మొదటి నుంచీ ఈ ఫుడ్ కార్పొరేషన్‌ను రద్దు చేయించటానికి విశ్వప్రయత్నాలు చేస్తూ వచ్చాయి. దేశంలో ఆహార భద్రత కొరవడితే వారి తిండిగింజల వ్యాపారం, లాభాలు దినదిన ప్రవర్ధమానమవుతాయి. ఇందుకు మనకు రుణాలిచ్చే ప్రపంచ బ్యాంకు తోడ్పాటు ఉంది. వ్యాపారాన్ని వ్యాపారస్తులకే వదలిపెట్టి ప్రభుత్వం ఆ వ్యాపకం నుంచి నిష్క్రమించాలని, రైతులు ఆహారేతర వ్యాపార పంటలు పండించాలని, దేశంలో కార్పొరేట్ రంగాన్ని వ్యవసాయ రంగంలో ప్రవేశించడాన్ని ప్రోత్సహించే కాంట్రాక్టు వ్యవసాయానికి మద్దతు ఇవ్వాలని ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒత్తిడి తీసుకుని రావటమే ఆ సంస్థ లక్ష్యం. అలా చేస్తే, దేశం మళ్లా తిండి గింజలకోసం దిగుమతుల మీద ఆధారపడాల్సి వస్తుంది. ఈ సంస్థలు దేశంలో ప్రవేశించి వ్యవసాయరంగాన్ని భ్రష్టుపట్టిస్తాయి. అందుకనే ఫుడ్ కార్పొరేషన్ రానురాను రంగం నుంచి నిష్క్రమించేలా ప్రభుత్వం పావులు కదుపుతోంది.

ఫుడ్ కార్పొరేషన్ పడుకొంటే, చవక ధరల దుకాణాలు గ్రామాల నుంచి అదృశ్యమవుతాయి. అవి అదృశ్యమైతే ప్రైవేట్ వ్యాపారస్తుల పంట పండుతుంది. చవక దుకాణాలకు ప్రతినెలా సరఫరా చేయడానికి, పనికి ఆహార పథకం కోసం, ఇతర సంక్షేమ కార్యక్రమాల కోసం, బడి పిల్లల మధ్యాహ్న భోజన పథకం కోసం కనీసం సుమారు 180 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు అవసరం కాగా 2006-07లో 162 లక్షల టన్నుల సేకరణే లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఈ సేకరణ ఎంత తగ్గిపోయిందంటే 2006-07 (ఏప్రిల్ – మే)లో ఫుడ్ కార్పొరేషన్ కన్నా, ప్రైవేట్ వ్యాపారస్తుల వద్దనే ఎక్కువ నిల్వలున్నాయి. ఫుడ్ కార్పొరేషన్ ఏర్పాటైన తర్వాత ఇలాంటి పరిస్థితి ఏ సంవత్సరంలోనూ ఎదుర్కొలేదు. ఫుడ్‌కార్పొరేషన్ సేకరణ తక్కువ కావటంతో చవక దుకాణాలకు సరఫరా చేయాల్సిన దానికన్నా కొన్ని టన్నులు తక్కువ పడ్డాయి. ప్రభుత్వం సేకరణను ఇలా నీరు కార్చటాన్ని గమనించిన అధికారగణం మరింత ధైర్యం తెచ్చుకొని, మరింత బరితెగించి రాష్ట్రాలకు గోధుమ కోటా సరఫరా తగ్గించాలనీ గోధుమల బదులు ముతక ధాన్యాలు సరఫరా చేయవచ్చుననీ, పనికి ఆహారపు పథకంలో పాక్షికంగా ఇచ్చే తిండిగింజలు పూర్తిగా రద్దుచేయాలనీ, కరువు ప్రాంతాలకు సరఫరా చేసే తిండిగింజల పరిమాణాన్ని తగ్గించాలనీ, ధరలు పెంచాలనీ ఆర్థిక విషయాల మంత్రిమండలి ఉపసంఘానికి పంపిన ఒకనోటీసు సూచించింది.

బహుళజాతి సంస్థలు, కార్పొరేట్లు

సేకరణ నేలచూపు చూస్తున్న ధోరణిని గమనించిన బహుళజాతి సంస్థలు లొట్టలు వేస్తున్నాయి. ఏప్పుడో ఏప్రిల్ – మే 2005 నెలల్లోనే అమెరికా, ఆస్ట్రేలియా బహుళజాతి సంస్థలు భారతదేశం తప్పక తిండి గింజలను దిగుమతి చేసుకోబోతుందని అంచనాలు ప్రకటించాయి. ఆస్ట్రేలియా అయితే మన దేశంలో గోదాముల్లో పెట్టుబడులు పెట్టడం కూడా ప్రారంభించింది. దేశంలో ఆహార పదార్థాల వ్యాపారంలో అడుగిడిన రిలయన్స్ లాంటి సంస్థలు మార్కెట్లో ప్రవేశించి, ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధర కన్నా కాస్త ఎక్కువ ధర చెల్లించి సేకరణ ప్రారంభించాయి. ఇదివరలో అయితే, వ్యాపారస్తులు పంట కోతకు రాకముందే, వారి ఏజంట్లను గ్రామాలకు పంపి, అప్పులిచ్చి, ముందస్తుగానే నిర్ణయించిన ధరకు సేకరణ చేసేవారు. ఇప్పుడు వారికి కార్పొరేట్ సంస్థలు, బహుళజాతి సంస్థలు తోడయ్యాయి. దాని వల్లవారు, అలాగే ఎక్కువ భూ వసతి గల పెద్ద రైతులు లాభపడేవారు. ప్రభుత్వం ఇలా ఎగుమతులకు ఎగబడటం గమనించిన అంతర్జాతీయ వ్యాపారులు ప్రభుత్వం కొనదలచిన మొత్తం కన్నా తక్కువ స్థాయిలో పంపటం, ధర పెంచటం ప్రారంభించాయి. అంతే కాదు, దిగుమతులు చేసుకొనేటప్పుడు వాటి పైన కొన్ని నాణ్యతా పరిమితులు విధిస్తుంది. చెత్తా చెదారం, మట్టి గెడ్డలు, రోగం, రొష్టు పురుగుమందుల ప్రభావం లాంటి షరతులన్నిటిని ప్రభుత్వం దిగుమతి చేసేవారి ఒత్తిడి మేరకూ తగ్గిస్తూ వచ్చింది. ఇదివరలో మెక్సికో నుంచి దిగుమతి చేసుకున్న తిండిగింజలతో పాటు 'కాంగ్రెస్ గ్రాస్' అనే కలుపు వస్తే, కోట్ల రూపాయల ఖర్చు చేసి దానిని వదిలించుకున్నాం. ఇప్పుడు ఆస్ట్రేలియా గోధుమతో పాటు 12 రకాల కలుపు మొక్కలు వచ్చాయి. వీటిని వదలించుకోవడానికి మరెన్ని కోట్లు ఖర్చు చేయాలి? అవి ప్రజల ఆరోగ్యానికి ఎటువంటి హాని చేస్తాయి?

కెనడా నుంచి వచ్చే గోధుమ ధర ఏప్రిల్ – జూన్ 2005లో టన్నుకు 191 డాలర్లుంటే జులై – సెప్టెంబర్ 2006 నాటికి 215 డాలర్లకు పెరిగింది. ధరలు పెరగడానికి ఉత్పత్తి తగ్గటం, డిమాండ్‌కు ధీటుగా సప్లయి లేకపోవటం కారణమని పాలకులు అంటున్నారు. కాని పైన చెప్పినట్లు దిగుమతి చేసుకొంటున్న ఆహార ధాన్యాల ధరల పెరుగుదల అసలు కారణం. పైనే చెప్పినట్లు కార్పొరేట్ సంస్థలు పంటను కొనేసి గోదాముల్లో నిల్వ చేయటం మరో కారణం. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి తిండి గింజల రవాణాపై ఉన్న ఆంక్షలను తొలగించటం కూడా ధరల పెరుగుదలకు కారణమైంది.

చవక దుకాణాలకు ఆహార ధాన్యాలను సరఫరా చేసే ఫుడ్ కార్పొరేషన్‌ను మూసేస్తున్నారు. కనీస మద్దతు ధరను మెల్లగా ఉపసంహరించి కార్పొరేట్, బహుళజాతి సంస్థలు మార్కెట్‌ను కబళించడానికి ద్వారాలు తెరిచారు. గోదాముల వ్యవస్థ ప్రైవేటీకరణ ప్రారంభమైంది. కార్పొరేట్ బహుళజాతి సంస్థలు రైతుల వద్ద నుంచి నేరుగా కొనుక్కునే అవకాశం కల్పించారు. 'ఆహార భద్రత మా లక్ష్యం' అని అంటూనే లక్షణంగా పండే పంట భూములను పూలు, పండ్ల తోటలకు మళ్లించటం, సెజ్‌లకు కేటాయించటం జరుగుతుంటే తిండి గింజల పంట తగ్గించే కార్యక్రమం జోరుగా సాగుతుంది. ఈ చర్యల ఫలితంగా ఇప్పటికే సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకి కూరుకుపోతోంది.

రాష్ట్రంలో

రాష్ట్ర వ్యవసాయశాఖ కూడా కేంద్రప్రభుత్వ బాటలోనే నడుస్తుంది. రెండు లక్షల ఎకరాలకే పరిమితమైన డ్రిప్–స్ప్రింక్లర్ నీటిసాగు ఇప్పుడు ఆరున్నర లక్షల ఎకరాలకు పెరిగిందని వ్యవసాయమంత్రి గొప్పగా చెప్పుకొన్నారు. ప్రస్తుతం ఇచ్చే 50 శాతం సబ్సిడిని 60 నుంచి 70 శాతం వరకు పెంచామని కూడా చెప్పుకున్నారు. ఈ నీటిసాగు కింద పండే పండ్లు, కాసేపువ్వులకు విదేశీ మార్కెట్‌లో గిరాకీఉంది. ఈ పంటలను ధనవంతులైన రైతులే సేద్యంచేస్తారు. ఆ ఉత్పత్తులను పెద్ద కంపెనీలు కొంటాయి. కాగా ఈ నీటి సాగు ఎవరిని ఉద్ధరించదలచు కొన్నదో వేరేచెప్పాల్సిన పనిలేదు. పప్పుల పంటల ఉత్పత్తి 1960 దశకం నుంచి స్తంభించిపోయిందని మంత్రే అంగీకరిస్తున్నారు. తమ భూమిలో పండేధాన్యంలో మంచి గింజలను ఎంచుకొని రైతులు వాటినే విత్తనాలుగా వినియోగించి పంట పండించుకునే కార్యక్రమం వందల సంవత్సరాలుగా సాగుతూవచ్చింది. అలాంటి వ్యవసాయాన్ని మార్కెట్‌లో విత్తనాలు కొను క్కోవాల్సిన పరిస్థితిని ప్రభుత్వం కల్పించింది. అంతేకాదు, మామూలుగా విత్తనాలను రెండు మూడు పంటలవరకు వాడతారు రైతులు. కాని ఇప్పుడు ఒకే ఒక పంటకు మాత్రమే పనికి వచ్చే విత్తనాలు విదేశాల నుంచి దిగుమతి అవుతున్నాయి. వాటినే వాడాలని కేంద్రం చట్టం కూడా రూపొందించింది. బిటి విత్తనాల కథాకమామీషు అందరికి తెలిసిందే. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ అందించే విత్తనాలు ఒక పంటకు కూడా సరిపోవు. పోనీ, కావాల్సినన్ని విత్తనాలయినా లభ్యమవుతున్నాయా అంటే అదీలేదు. ఉదాహరణకు 2006-07 రబీలో మొత్తం 17.47 లక్షల క్వింటాళ్ల విత్తనాలు కావాల్సి ఉండగా వివిధ విత్తనా సంస్థలు 8.65 లక్షల క్వింటాళ్ల విత్తనాలు మాత్రమే సరఫరా చేయగలిగారు. రైతును ఇలా ప్రైవేట్ విత్తన వ్యాపారస్తుని ఫలహారంగా అందిచ్చే ప్రభుత్వాన్ని ఏమనాలి? 30 వేల కోట్ల ప్రణాళికలో కేవలం 2.28 శాతాన్ని మాత్రమే వ్యవసాయరంగానికి కేటాయించిన రాష్ట్రప్రభుత్వం వ్యవసాయాన్ని, రైతాంగాన్ని ఉద్ధరిస్తానని ప్రకటన చేస్తుంటే ఎలా నమ్మాలి? ◆

ప్రభుత్వం ఎన్ని ప్రాజెక్ట్‌లను కట్టినా, నిర్వహణకు ఎన్ని ప్రణాళికలు రూపొందించినా రైతు ప్రమేయం లేకుండా అవేవీ విజయవంతం కావు అంటున్నారు చెరుకూరి వీరయ్య

నీటి పారుదల పథకాలు - వివాదాలు

దక్షిణ భారతదేశంలో గోదావరి, కృష్ణా, కావేరి, పెన్నారు ముఖ్య నదులు. 1850 కి పూర్వం, కావేరి నదిపై క్రీ.శ. 2వ శతాబ్దంలో కరికాల చోళుడు నిర్మించిన 'గ్రాండ్ ఆనకట్ట పథకం' తప్ప, తక్కిన నదులపై భారీ నీటిపారుదల పథకాలేమీ లేనందున ఆ నీరంతా వృథాగా సముద్రంలో కలసిపోతుండేది. అప్పటికి పల్లవులు, చోళులు, తూర్పు చాళుక్యులు, విజయనగర రాజులు అధిక సంఖ్యలో నిర్మించిన చెరువులు, చిన్న మళ్లింపు పథకాల వల్ల భారీ స్థాయిలో సాగునీటి అభివృద్ధి సాధ్యం కాలేదు. మొట్టమొదటి భారీ నీటిపారుదల పథకమైన 'గోదావరి డెల్టా కాలువల వ్యవస్థ' నిర్మాణం పూర్వపు మద్రాస్ రాష్ట్రంలో ఈస్టిండియా కంపెనీచే 1847లో మొదలై 1877 నాటికి పూర్తి అయ్యింది. అలాగే, 1852-1928 మధ్య కృష్ణా డెల్టా కాలువల వ్యవస్థ, కర్నూలు - కడప కాలువ నిర్మాణం పూర్తయ్యాయి. 1918-30 మధ్య టాటా కంపెనీవారు మహారాష్ట్రలో భీమా నదిపై టాటా హైడల్‌వర్క్స్ ద్వారా విద్యుదుత్పాదనను చేపట్టి, కృష్ణా జలాలను పశ్చిమ దిశగా మళ్లించి, వృథాగా అరేబియా సముద్రం పాలు చేశారు. హైదరాబాద్ రాష్ట్రంలో గోదావరికి ఉపనదియైన మంజీరా నదిపై నిజాంసాగర్ ప్రాజెక్ట్ 1931లో పూర్తయ్యింది. అప్పట్లో ఈ నదులలో నీరెక్కువ, వినియోగం తక్కువగావటం వల్ల రాష్ట్రాల మధ్య వివాదాలకు ఆస్కారమే లేకపోయింది. తుంగభద్రానదీ జలాల విషయంలో మైసూర్- మద్రాస్ రాష్ట్రాల మధ్య చిన్న, చిన్న వివాదాలు తలెత్తినా అవి 1892, 1933లలో జరిగిన పరస్పర ఒడంబడికల ద్వారా సామరస్య పూర్వకంగానే పరిష్కారమయ్యాయి. అప్పటివరకు రాష్ట్రాల మధ్య నదీజల వివాదాలను పరిష్కరించే సర్వోన్నతాధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉండేది. జలవివాదాలు, న్యాయవిచక్షణతోగాక, పాలనాపరంగా పరిష్కరించేవారు.

1937లో అమలులోకి వచ్చిన భారత ప్రభుత్వ చట్టం 1935 ప్రకారం నదీజలాల అంశం ప్రత్యేకంగా రాష్ట్రాల జాబితాలో చేర్చారు. అంతర్రాష్ట్ర నదీ జలాల విభజనకు సంబంధించి ఉత్పన్నమయ్యే వివాదాల పరిష్కారానికి చట్టంలో కొన్ని ప్రత్యేకమైన ఏర్పాట్లు పొందుపరిచారు. రాజ్యాంగంలోని 262(1) అధికరణం ప్రకారం సంక్రమించిన అధికారంతో అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టం, 1956 (ఇంటర్ స్టేట్ వాటర్ డిస్ప్యూట్స్ యాక్ట్, 1956) ను పార్లమెంట్ రూపొందించింది. నదీ జలాల పంపిణీకి సంబంధించి, రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాల పరిష్కారానికి ట్రిబ్యునల్ ఏర్పాటువంటి నిర్దిష్టమైన నిబంధనలు ఆ చట్టంలో పొందుపరిచారు. అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టం, 1956లోని 2,3 సెక్షన్ల ప్రకారం, నీటి పంపిణీ, వినియోగం, నియంత్రణలకు సంబంధించి రాష్ట్రాల మధ్య ఏదైనా ఒప్పందం జరిగి ఉంటే, దానిని ఆ రాష్ట్రాలు అమలుచేయాలి. లేదా ఏదైనా మధ్యవర్తిత్వ తీర్పులు గానీ, న్యాయపరమైన ఆదేశాలు గానీ ఉంటే, వాటిని గౌరవించాలి. అంతర్రాష్ట్ర నదికి సంబంధించి నీటి కేటాయింపులపై పార్లమెంట్ ఏదైనా శాసనం చేసి ఉంటే, దానికి సంబంధిత రాష్ట్రాలు నిబద్ధమై ఉండాలి. అంతర్రాష్ట్ర జలాల విభజనకు సంబంధించి, రాష్ట్రాల మధ్య ఎట్టి ఒప్పందం గానీ, మధ్యవర్తిత్వ తీర్పు గానీ, న్యాయాదేశాలు గానీ పార్లమెంట్ చేసిన శాసనం గానీ లేనప్పుడు, సంబంధిత రాష్ట్రాల అభ్యర్థనపై కేంద్ర ప్రభుత్వం జల వివాదాల పరిష్కారానికి న్యాయ నిపుణులతో ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తుంది. ఆ ట్రిబ్యునల్ అన్ని పక్షాల వాదనలను విని జల వివాదాలను క్షుణ్ణంగా పరిశీలించి, న్యాయయమై తీర్పునిస్తుంది. అలా ట్రిబ్యునల్ ఇచ్చే తీర్పు అత్యున్నత న్యాయస్థాన మిచ్చే తీర్పుతో సమానంగా పరిగణించి, అన్ని రాష్ట్రాలు ఆ తీర్పును విధిగా పాటించాలి. వివిధ రాష్ట్రాల మధ్య నీటి విభజనపై ట్రిబ్యునల్ ఇచ్చే తీర్పు పై విచారణ జరిపే అధికారం సుప్రీం కోర్టుకు కూడా ఉండదు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై నియమనిబంధనల తీరు ఇలా ఉంటే, వాస్తవంగా జరుగుతున్నది దీనికి విరుద్ధంగా ఉంది. ట్రిబ్యునల్ తీర్పు తాము ఆశించిన విధంగా తమ కనుకూలంగా లేకపోతే, కొన్ని రాష్ట్రాలు ఆందోళనకు దిగుతున్నాయి. ఇటీవల కావేరీ నదీ జలాల విభజనపై ట్రిబ్యునల్ తీర్పు వెలువడగానే, కర్నాటక రాష్ట్రంలో చెలరేగిన అల్లర్లే దీనికి ఉదాహరణ. గత కొన్ని సంవత్సరాలలో ఎన్నో అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలు ఏదో ఒక మిషతో సుప్రీంకోర్టు ముందుకు వచ్చాయి. మధ్యంతర నీటి కేటాయింపుకు సంబంధించిన రాష్ట్ర అభ్యర్థనను విచారించే హక్కు ట్రిబ్యునల్‌కే లేదనీ (కావేరి), ట్రిబ్యునల్ ఆదేశాలు అమలుగావడం లేదనీ (కావేరి), పర్యావరణం, పునరావాసానికి సంబంధించిన ఆదేశాలు ఉల్లంఘిస్తున్నారనీ (నర్మద), గతంలో రాష్ట్రాల

మధ్య నీటికి సంబంధించి జరిగిన అన్ని ఒప్పందాలను, భాగ స్వామియైన రాష్ట్రం ఏకపక్షంగా శాసన సభామోదంతో రద్దు చేసిందనీ (పంజాబ్) ఇలా ఏదో ఒక సాకుతో కొన్ని రాష్ట్రాలు సుప్రీంకోర్టు నాశ్రయించాయి. కాని, అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టం 1956 చరిత్రలో తొలిసారి ట్రిబ్యునల్ రాష్ట్రాల మధ్య కేటాయించిన కావేరీ నదీ జలాలపై కర్నాటక రాష్ట్రం చట్టంలోని ఆదేశాలకు విరుద్ధంగా సుప్రీం కోర్టు ముందు స్పెషల్ లీవు పిటిషన్ దాఖలు చేసింది. ఈ విధంగా ట్రిబ్యునల్ ఇచ్చే తీర్పును రాష్ట్రాలు కచ్చితంగా అమలు చేయకపోవడం వలన జలవివాదాలు మళ్లీ మొదటికొస్తున్నాయి. ట్రిబ్యునల్ తీర్పులను రాష్ట్రాలచే అమలు చేయించే విషయంలో కేంద్రప్రభుత్వం ఎట్టి చర్యలను తీసుకోక, మిన్నకుండిపోతోంది. ఈ నేపథ్యంలో మన రాష్ట్రానికి సంబంధించిన జల వివాదాలను ట్రిబ్యునల్ ఇచ్చిన కొన్ని తీర్పులను పరిశీలిద్దాం.

1. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పు (1976)

ఎ) మిగులుజలాల వినియోగం

ఎగువ రాష్ట్రాల కంటె సహజంగా ఎక్కువ నష్టానికి గురయ్యేది చిట్టచివరనున్న ఆంధ్రప్రదేశ్, 75 శాతం సంవత్సరాలలో మిగులు జలాలను ఎలాంటి హక్కును కోరకుండా వినియోగించుకోవచ్చునని ట్రిబ్యునల్ తమ తీర్పులో పేర్కొంది. అంతే తప్ప, మిగులు జలాల వినియోగం కోసం కొత్త ప్రాజెక్టులు కట్టగూడదని గానీ, చిన్న తరహా ప్రాజెక్టులే కట్టాలని గానీ ట్రిబ్యునల్ ఎక్కడా చెప్పలేదు. ఎలాంటి 'హక్కును కోరకుండా' అన్న నిబంధనకు, నదిలో మిగులు జలాలు ఉంటే ఉపయోగించుకోవాలి. లేని సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌కు దాని వినియోగ'హక్కుండదు' అని అర్థం. మిగిలు జలాలను వినియోగించుకోవాలంటే, నది పైనా, పరిసరా ల్లోనూ కొత్త జలాశయాలను నిర్మించుకొని, నీటిని నిల్వజేసుకోవాలి. కాల్వలను తవ్వుకొని ఆ నీటిని పంట భూమికి ఉపయోగించుకోవాలి. కొత్త జలాశయాలను నిర్మించకుండా, కాలువలను తవ్వకుండా, మిగులు జలాలను ఉపయోగించుకోలేమన్న విషయం ఎగువ రాష్ట్రాలకు తెలుసు. అయినా మిగులు జలాలపై ఆధారపడి ఆంధ్రప్రదేశ్ నిర్మించే తెలుగు గంగ, గాలేరు–నగరి, హంద్రీ–నీవా, వెలిగొండ, నెట్టెంపాడు, కల్వకుర్తి, శ్రీశైలం ఎడమగట్టు కాలువ మొదలగు ప్రాజెక్టులను ఆపివేయించమని, లేనట్లయితే, తాము నష్టపోవాల్సి వస్తుందనీ మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలు సుప్రీం కోర్టు నాశ్రయించాయి. దీనిపై 2000 ఏప్రిల్‌లో సుప్రీం కోర్టు తీర్పు చెబుతూ కేంద్ర ప్రభుత్వం భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టులకు అనుమతులను మంజూరు చేసే ముందు ఎగువ రాష్ట్రాలు వెలిబుచ్చిన భయాందోళనలను దృష్టిలో ఉంచుకోవాలని పేర్కంది. దీని ఫలితంగా కేంద్ర ప్రభుత్వం మిగులుజలాల వినియోగంకొరకు ఆంధ్రప్రదేశ్ చేపట్టిన ప్రాజెక్టులన్నింటికీ అనుమతులను ఆపివేసింది. ప్రణాళికా సంఘం సైతం ఈ ప్రాజెక్టులకు అవసరమైన పెట్టుబడి అనుమతులను ఇవ్వలేదు. దీనివల్ల, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రపంచబ్యాంకు మొదలగు ఆర్థిక సంస్థల నుంచి రుణం పొందే అవకాశం లేక, ప్రాజెక్టుల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులతో చేపట్టవలసి వచ్చింది.

బి) ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంపు

బచావత్ ట్రిబ్యునల్ ఎగువ కృష్ణా ప్రాజెక్ట్ కోసం కర్నాటకకు 160 శతకోటి ఘనపుటడుగుల (టిఎంసి) నీటిని కేటాయించింది. దీనికి డ్యాం ఎత్తు సుమారు +517 మీటర్లుంటే సరిపోతుంది. కాని, కర్నాటక ప్రభుత్వం +524.256 మీటర్ల వరకు డ్యాం ఎత్తును పెంచి, అదనపు నీటితో విద్యుదుత్పాదన చేసుకొని దిగువకు వదలిపెట్టాలని ప్రతిపాదించింది. దీనిపై, ఆంధ్రప్రదేశ్ డ్యాం ఎత్తును పెంచడంవల్ల దిగువకు నీరురావటం సుమారు మూడునెలలు ఆలస్యమై, నాగార్జున సాగర్, కృష్ణా డెల్టాలకు ఖరీఫ్ పంట ఆలస్యమై, రబీ పంట లేకుండా పోతుందని సుప్రీంకోర్టులో వాదించింది. దీనిపై సుప్రీంకోర్టు, ముఖ్యమంత్రుల కమిటీ సిఫారసు చేసిన +519.6 మీటర్లకే డ్యాం ఎత్తును పరిమితం చేయాలని తీర్పు చెప్పింది. ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం, ఆల్మట్టి జలాశయం, కింద సాగునీటి వినియోగానికి అవకాశం లేకపోయినప్పటికీ కర్నాటక సాగునీటి కాలువల నిర్మాణాన్ని కొనసాగిస్తోంది.

ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్నాటకలు ట్రిబ్యునల్ తీర్పుకు విరుద్ధంగా కృష్ణ, తుంగభద్ర నదులపై ఎన్నో బ్యారేజీలను ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తున్నాయి. మహారాష్ట్ర కొయినా నదిపై ట్రిబ్యునల్ అనుతించిన విద్యుత్పథకం మూడు దశలతోపాటు నాల్గవదశను కూడా పూర్తిచేసి, అనుమతించిన 67.5 టిఎంసిల కంటె అధిక పరిమాణంలో నీటిని అరేబియా సముద్రానికి మళ్లిస్తోంది. అనధికారికంగా తాము ఎన్నో ప్రాజెక్టలను నిర్మించుకొంటూ, దిగువనున్న ఆంధ్రప్రదేశ్ మిగులు జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టలను నిర్మిస్తోందనీ, దానివల్ల భవిష్యత్తులో తమకెంతో నష్టం కలుగుతుందనీ వితండంగా వాదిస్తున్నాయి. ఎగువ రాష్ట్రాలు ట్రిబ్యునల్ తీర్పుకు విరుద్ధంగా కొత్త ప్రాజెక్టలను నిర్మించటం వల్ల, దిగువ రాష్ట్రానికి కేటాయించిన నీరందకుండా పోతుంది. కాని, దిగువ రాష్ట్రం ట్రిబ్యునల్ తీర్పు కనుగుణంగా మిగులు జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టలను నిర్మిస్తే, ఎగువనున్న రాష్ట్రాలకు నష్టం సంభవిస్తుందన్న ఆ రాష్ట్రాల వాదన ఎంతో వింతగా ఉంది.

2. గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పు (1980)

గోదావరి నదీ జల సంబంధమైన హక్కుగల మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ (ఛత్తీస్‌గడ్), ఒరిస్సా, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అభ్యర్ధనపై గోదావరీ జల వివాదాల పరిష్కారానికి 1969 ఏప్రిల్ 10న కేంద్ర ప్రభుత్వం జస్టిస్ ఆర్.ఎస్. బచావత్ నేతృత్వంలో ట్రిబ్యునల్ నియమించింది. కృష్ణా ట్రిబ్యునల్, గోదావరి ట్రిబ్యునల్ రెండింటికీ జస్టిస్ బచావత్ అధ్యక్షుడుగా ఉండేవారు. ఆ కారణం వల్ల, తొలుత కృష్ణా ట్రిబ్యునల్ నివేదికను ప్రభుత్వానికి అందజేసిన తర్వాత తనే గోదావరి ట్రిబ్యునల్ కార్యకలాపాలను చేపట్టాలన్ననిర్ణయం తీసుకున్నారు. అందుకు అన్ని రాష్ట్రాలూ అంగీకరించాయి. ఈలోగా గోదావరి జలాల వినియోగంపై హక్కులు గల రాష్ట్రాల మధ్య కొన్ని ద్వైపాక్షిక, త్రైపాక్షిక, బహుపాక్షిక ఒప్పందాలు కుదిరాయి. 1975 సెప్టెంబర్ నుండి 1979 జులై మధ్య కాలంలో జరిగిన ఈ ఒప్పందాలను వేర్వేరు తేదీలలో ఆ రాష్ట్రాలు ట్రిబ్యునల్ ముందు దాఖలు పరచి, ఆ ఒప్పందాల మేరకు తమకు గోదావరి నీటిని కేటాయించాలని ట్రిబ్యునల్‌ని కోరాయి. ఆ

రాష్ట్రాల అభ్యర్థనలను మన్నించిన ట్రిబ్యునల్ ఆ ఒప్పందాల నన్నిటినీ తమ తుది తీర్పులో భాగంగా ప్రకటించింది. ఆ ఒప్పందాలలోని కొన్ని ముఖ్యాంశాలను పరిశీలిద్దాం.

ఎ) పోలవరం ప్రాజెక్ట్

1980, ఏప్రిల్ 2న ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ (ఛత్తీస్‌గడ్), ఒరిస్సాల మధ్య జరిగిన త్రైపాక్షిక ఒప్పందం ప్రకారం గోదావరి పై పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి అంగీకారం కుదిరింది. దీనిపై ట్రిబ్యునల్ తమ తుది తీర్పులో ఈ విధమైన ఆదేశాలను జారీ చేసింది.

- దీని ప్రకారం, పూర్తి జలాశయం మట్టం / అత్యధిక నీటి మట్టం +150 అడుగులతో పోలవరం డ్యాంకు కేంద్ర జల సంస్థ (సిడబ్ల్యుసి) సాధ్యమైనంత త్వరలో అనుమతిని మంజూరు చేయాలి.
- ఆచరణయోగ్యత మేరకు రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందాన్ని దృష్టిలో ఉంచుకొని, పోలవరం డ్యాం రూపకల్పనను, జలాశయ కార్యాచరణ అనుసూచిని కేంద్ర జల సంస్థకే వదిలిపెట్టాలి.
- కేంద్ర జల సంస్థ ఆదేశాల ప్రకారం, పోలవరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన అన్ని రక్షణ చర్యలను ఆంధ్రప్రదేశ్ పాటించాలి.
- ఒరిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో +150 అడుగుల మట్టానికి పైనున్న భూములకు, కట్టడాలకు ఇతర ఆస్తులకు పోలవరం డ్యాం నిర్మాణం వల్ల సంభవించే ముంపు నుండి సంరక్షించటానికి అవసరమైన తూములతో పోతగట్లను (ఎంబ్యాంక్‌మెంట్స్) ఆంధ్రప్రదేశ్ ఖాతాలో నిర్మించి, నిర్వహించాలి. లేదా, ఆ రాష్ట్రాలు కోరిన పక్షంలో, ముంపు భూమికి ఆంధ్రప్రదేశ్ నష్టపరిహారం చెల్లించాలి. నిర్వాసితుల పునరావాస కార్యక్రమాలకు అయ్యే వ్యయాన్ని ఆంధ్రప్రదేశ్ భరించాలి.

ఈ అంశాలతో కూడిన ఒప్పందాలపై మూడు రాష్ట్రాల ప్రతినిధులు సంతకంచేసి, దీనిని ట్రిబ్యునల్ తీర్పులో భాగంగా చేర్చటానికి అంగీకరించి, ఇప్పుడు ఆ తీర్పుకు కట్టుబడి ఉండడానికి ఛత్తీస్‌గడ్, ఒరిస్సా నిరాకరిస్తున్నాయి. కేంద్ర జల సంస్థ రూపకల్పన ప్రకారం పోలవరం డ్యాంను నిర్మించాలని ఒప్పందంలో స్పష్టంగా ఉంటే, దానిని కాదని ఆంధ్రప్రదేశ్ తమ సొంత రూప రచన ప్రకారం డ్యాంల నిర్మాణాన్ని ప్రారంభించింది. సుప్రీంకోర్టు తప్పును ఎత్తి చూపటం వల్ల, నిర్మాణాన్ని ఆపివేసింది. దీనివల్ల ఎంతో కాలం, ధనం వృథా అవుతోంది. 1980లో పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986లో అటవీ సంరక్షణ చట్టం అమలులోకి వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కేంద్ర పర్యావరణ, అటవీమంత్రిత్వ శాఖ నుండి పర్యావరణ అనుమతిని సాంఘిక సంక్షేమ శాఖ నుండి సహాయ పునరావాస అనుమతిని పొందకుండా ఏ ప్రాజెక్ట్‌నూ ప్రారంభించకూడదు. ఇప్పటికైనా కేంద్ర జలసంస్థ నుండి డ్యాంల రూపరచనను, ఇతర మంత్రిత్వశాఖల నుండి అవసరమైన అన్ని అనుమతులను పొందిన తర్వాతనే పోలవరం డ్యాం నిర్మాణాన్ని పునః ప్రారంభించటం ఎంతో అవసరం.

బి) ఇంచంపల్లి ప్రాజెక్ట్

ప్రాణహిత, ఇంద్రావతి నదులు గోదావరితో కలసిన తర్వాత దిగువన ఇంచంపల్లి డ్యాంలను నిర్మించటానికి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య 1978, ఆగస్ట్ 7న ఒప్పందం జరిగి, ఆ ఒప్పందం ట్రిబ్యునల్ తీర్పులో భాగంగా చేర్చారు. ఇది ముఖ్యంగా విద్యుదుత్పాదక పథకం. ఇంచంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణ వ్యయంలో 78.10 శాతాన్ని ఆంధ్రప్రదేశ్, 10.50 శాతాన్ని మహారాష్ట్ర, 11.40 శాతాన్ని మధ్యప్రదేశ్ భరించాలి. కాని, విద్యుదుత్పాదనలో ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వాటాలు వరుసగా 27 శాతం, 38 శాతం, 35 శాతం. ఈ ప్రాజెక్ట్ నుండి ఆంధ్రప్రదేశ్‌కి లభించే నీటి పరిమాణం 85 టిఎంసిలు మాత్రమే. నదిలో విద్యుదుత్పాదన తర్వాత దిగువకు వచ్చే నీటిని ఆంధ్రప్రదేశ్ వాడుకోవాలంటే, మరొక భారీ డ్యాంను నిర్మించుకోక తప్పదు. ఈ జలాశయం కింద, ఆంధ్రప్రదేశ్‌లో కంటె ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర మధ్యప్రదేశ్‌లోనే ఎక్కువ భూభాగం ముంపుకు గురవటం వల్ల, ముందు ఒప్పందం పై సంతకం చేసినా, ఆ రాష్ట్రాలు ఇంచంపల్లి డ్యాం నిర్మాణంపై ఏటువంటి ఉత్సాహం చూపించడం లేదు. ఇంచంపల్లి పూర్తి జలాశయ మట్టాన్ని +112 మీటర్ల నుండి +97 మీటర్లకు తగ్గించడటం ద్వారా, ముంపు విస్తీర్ణాన్ని గణనీయంగా తగ్గంచాలన్న ప్రతిపాదన ఆలోచనలో ఉంది. ఈ ప్రతిపాదనపై త్వరలో నిర్ణయం తీసుకొని, ఇంచంపల్లి ప్రాజెక్ట్‌ను నిర్మించినప్పుడే గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవడమే గాక, దిగువన నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్ట్ కూడా ఆశించిన ఫలితాలను సాధించగలుగుతుంది.

సి) బాబ్లీ బ్యారేజి నిర్మాణం

1975 అక్టోబర్ 6న గోదావరి, దాని ఉపనదులపై నిర్మించాల్సిన కొన్ని ప్రాజెక్ట్‌లకు అనుమతులు, నీటి వినియోగానికి సంబంధించి, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల మధ్య హైదరాబాద్‌లో చర్చలు జరిగిన మీదట, ఒక ఒప్పందం జరిగింది. దాని ప్రకారం గోదావరి నదిపై 262 వ కిలోమీటర్ వద్దనున్న పైథాన్ డ్యాం (గైక్వాడ్ ప్రాజెక్ట్), పూర్ణ ఉపనదిపై సిద్ధేశ్వరం డ్యాం, మంజీర ఉపనదిపై నిజాంసాగర్ డ్యాం వీటికి దిగువ శ్రీరాంసాగర్ డ్యాం వరకు గతంలో మంజురైన పరిమాణం కంటే అదనంగా 60 టిఎంసిల నీటిని కొత్తగా నిర్మిస్తున్న ప్రాజెక్ట్‌ల కోసం మహారాష్ట్ర వినియోగించుకోవచ్చునని రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. 1975 నుండి ఇప్పటివరకు మహారాష్ట్ర తమకు అనుమతించిన 60 టిఎంసిల నీటి వినియోగానికి సరిపడా ప్రాజెక్ట్‌లను నిర్మించినట్లు తెలుస్తోంది. మరల ఇప్పుడు బాబ్లీ బ్యారేజీతోపాటు 11 బ్యారేజీలను కూడా, శ్రీరాంసాగర్ డ్యాం ఎగువన నిర్మిస్తోంది. ఈ బ్యారేజీల నిల్వ సామర్థ్యం మొత్తం 10 టిఎంసిల కంటె ఎక్కువ లేనట్లు కనిపించినా, వాస్తవంగా వీటినుంచి 100 టిఎంసిల కంటే ఎక్కువ నీటిని ఉపయోగించుకునే వీలుంటుంది. ఈ ప్రాజెక్ట్‌ల నిర్మాణాన్ని గురించి మహారాష్ట్ర మర్యాదకైనా మన రాష్ట్రానికి ఎట్టి సమాచారం అందజేయలేదు. కేంద్ర ప్రభుత్వ అనుమతులను పొందక, ఏకపక్షంగా ఈ ప్రాజెక్ట్‌ల నిర్మాణాన్ని కొనసాగిస్తోంది. శ్రీరాంసాగర్ డ్యాంకు ఎగువన నదీ ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల ఇప్పటికే శ్రీరాంసాగర్ జలాశయంలో 40 టిఎంసిల నీటి కొరత ఉన్నట్లు అభిజ్ఞుల అంచనా. నదిలో ఎగువన మహారాష్ట్ర, ట్రిబ్యునల్ తీర్పుకు విరుద్ధంగా ఇలా ప్రాజెక్ట్‌లను నిర్మిస్తూ ఉంటే శ్రీరాంసాగర్ జలాశయానికి చేరే నీటి

పరిమాణం మరింత తక్కువై దానికింద ఆయకట్టుకు నష్టం వాటిల్లుతోంది. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య కేంద్ర జలవనరుల మంత్రుల సమక్షంలో 2005 ఏప్రిల్ 4న జరిగిన చర్చల్లో, బాబ్లీప్రాజెక్ట్‌పై ఆంధ్రప్రదేశ్ తో సామరస్య పూర్వకమైన ఒప్పందం కుదిరేవరకు నిర్మాణాన్ని నిలిపివేయటానికి మహారాష్ట్ర అంగీకరించి, ఇచ్చిన మాటపై నిలబడకుండా ప్రాజెక్ట్ నిర్మాణాన్ని కొనసాగిస్తోంది. ఆంధ్రప్రదేశ్ నిర్మించిన శ్రీరాంసాగర్ జలాశయ విస్తరణ పరిధిలో మహారాష్ట్ర బాబ్లీ ప్రాజెక్ట్ నిర్మిస్తోంది. ఇది సాంకేతికంగా ఆమోదయోగ్యమైన విధానం కాదు. ఇటువంటి పరిస్థితులు పునరావృతమై, రాష్ట్రాల మధ్య కొత్త సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే, కేంద్రం దీనిపై తక్షణ చర్యలను చేపట్టాలి. ఈ సమస్యను సాంకేతికంగా ఉన్నత స్థాయిలో పరిశీలించి, తగు నిర్ణయం తీసుకొని, దానిని పార్లమెంట్‌చే ఆమోదింపజేయాలి. లేనట్లయితే, ఒక ప్రాజెక్ట్ జలాశయ పరిధిలో భవిష్యత్తులో కొత్త ప్రాజెక్ట్‌ల నిర్మాణం జరిగే అవకాశముంటుంది. కాబట్టి, ఈ సమస్యకు వెంటనే పరిష్కారం అవసరం.

ప్రాంతీయ వివాదాలు

మన రాష్ట్రంలో నీటి కేటాయింపు, పంపిణీ విషయంలో ప్రాంతీయ వివాదాలు తలెత్తుతున్నాయి. పులిచింతల ప్రాజెక్ట్ కేవలం కృష్ణా డెల్టాకే ఉపయోగకరమనే వాదనతో తెలంగాణ, రాయలసీమ నాయకులు గతంలో దానిని ప్రతిఘటించారు. పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారా రాయలసీమకు కృష్ణా జలాల తరలింపును కోస్తా, తెలంగాణ నాయకులు ప్రతిఘటిస్తున్నారు. తెలంగాణ ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి ప్రభుత్వం అత్యధిక నిధులు కేటాయిస్తోందని, కోస్తా, రాయలసీమ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలా ప్రాంతీయ విభేదాలకు, రాజకీయాలు కూడా తోడు గావటం వల్ల సమస్యలు మరింత జటిలమవుతున్నాయి. ఒకే రాష్ట్రంలో ఒకే జిల్లాలో కాలువ కింది ఉన్న ఎగువ భుముల రైతులు, దిగువ రైతుల మధ్య నీటి పంపిణీలో ఘర్షణలు చెలరేగుతున్నాయి. సామరస్యపూర్వకంగా ఈ సమస్యలను పరిష్కరించవలసి ఉంది. నానాటికీ జనాభా పెరుగుదల, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, నీటి అవసరాలు పెరగటం వల్ల, జలవివాదాలు సహజంగానే ఎక్కువవుతున్నాయి. సక్రమ మైన కార్యాచరణ తో ఈవివాదాలను పరిష్కరించటం అసాధ్యమేమీకాదు.

ప్రస్తుత కర్తవ్యం

1. అంతర్రాష్ట్ర నదులకు సంబంధించి రాజ్యాంగం ప్రసాదించిన అధికారాలను కేంద్రం సమర్థవంతంగా వినియోగించుకొని, రాష్ట్రాల మధ్య ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. అవసరమైతే అంతర్రాష్ట్రాల నదులను రాష్ట్రాల జాబితానుంచి తప్పించి కేంద్ర జాబితాలో చేర్చడానికి చర్యలను చేపట్టాలి.
2. రాష్ట్ర ప్రభుత్వం ఒక సమగ్ర జల విధానాన్ని రూపొందించి, దాని ప్రకారం పారదర్శకంగా ప్రాజెక్ట్‌ల నిర్మాణం, నీటి పంపిణీ, నియంత్రణ మొదలగు చర్యలను సమర్థవంతంగా చేపట్టినప్పుడు, చాల సమస్యలు వాటంతటవే పరిష్కారమైపోతాయి.
3. కార్యాచరణ ప్రణాళిక అమలు, భూతల, భూగర్భ జలాల సంయుక్త వినియోగం, పంటపొలాల నుండి వాగులకు చేరే సాగునీరు పునర్వినియోగం, సూక్ష్మసేద్య విధానాలు, 'శ్రీ' వరి సాగు విధానం, వర్షజల సద్వినియోగం మొదలగు ఏవైన సాగునీటి నిర్వహణ విధానాలను చేపట్టి, గణనీయ పరిమాణంలో సాగునీటిని ఆదా చేసుకుని సాగునీటి వినియోగ దక్షతను, వ్యవసాయోత్పాద కతను రెండింతలు పెంచుకోవచ్చును. ఈ మేలైన నిర్వహణ విధానాలు సక్రమంగా అమలు కావాలంటే, ప్రస్తుతం నిస్సారంగా, నిరుప యోగంగా పడియున్న సాగునీటి వినియోగదారుల సంస్థల పటిష్టీకరణ జరగాలి. సాగునీటి నిర్వహణలో రైతులకు నిర్ణయాత్మక మైన భాగస్వామ్యాన్ని కల్పించాలన్న చిత్తశుద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి ఉండాలి. అట్టి చిత్తశుద్ధి, దృఢ సంకల్పం రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోవడం వల్లనే డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, ప్రాజెక్ట్ కమిటీలకు ఎన్నికలు కూడా జరుపకుండా తాత్సారం చేస్తోంది. ప్రభుత్వం ఎన్ని ప్రాజెక్ట్‌లను కట్టినా, నిర్వహణకు ఎన్ని ప్రణాళికలను రూపొందించినా, వినియోగదారుడైన రైతు ప్రమేయం లేకుండా అవి విజయవంతం కాజాలవన్న వాస్తవాన్ని ప్రభుత్వం గ్రహించాలి.

ఈ సూచనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పాటించినప్పుడు నీటి పారుదల పథకాలకు సంబంధించిన ఎన్నో సమస్యలు పరిష్కారమై, వ్యవసాయం నష్టాల ఊబిలో నుంచి బయటపడి ముందుకు సాగగలదు. ◆

జనాభా ప్రాతిపదికన అయినా, పంటల సాగుభూమి నిష్పత్తి ప్రకారం చూసినా నీళ్ల విషయంలో రాయలసీమకు జరిగిన సామాజిక న్యాయమెంత అని ప్రశ్నిస్తున్నారు కె. రామిరెడ్డి

కృష్ణా జలాలపై సీమ హక్కులు

'గల గల గోదారి కదలిపోతుంటేను,
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను,
బంగారు పంటలే పండుతాయి,
మురిపాల ముత్యాలు దొరులుతాయి,'

అంటూ ఎంతో ఆనందంగా పరవశించి పాడుకొంటున్న మనం, తెలుగువాళ్లం, ఈ ఆనందాన్ని నిష్పక్షపాతంగా అందరూ కలిసి పంచుకొంటున్నామా అని విశ్లేషించుకోవడం ఈనాడు అవసరమయింది.

ఆంధ్రప్రదేశ్‌లో లభ్యమవుతున్న మొత్తం ఉపరితల జలాలు, భూగర్భ జలాల వివరాలు ఇలా ఉన్నాయి.

మన రాష్ట్రానికి లభించే సాగునీళ్లు (టిఎంసిలు)	
నది	**75 శాతం ఆధారిత నీరు ప్రకారం**
గోదావరి	1480
కృష్ణ	811
పెన్నా	99
ఇతర చిన్న చిన్న నదులు	356
మొత్తం నదీ జలాలు	2746
భూగర్భ జలాలు	1140
వెరసి మొత్తం	**3886**

రాయలసీమ ప్రాంతంలో భూగర్భ జలాల లభ్యత అంతంత మాత్రంగా, పరిమితంగా ఉంది. వర్షపాతం తక్కువ గనుక సీమ జిల్లాలలో భూగర్భ జలాలు అధికంగా వినియోగించుకొన్న కొద్దీ తరగడమే కాని పెరిగే అవకాశం ఏ మాత్రం లేదు. పెన్నానది నీరు దాదాపు పూర్తిగా నెల్లూరు జిల్లా ఉపయోగానికే కేటాయించబడింది. కనుక ఈ ప్రాంతం కరువుల బారి నుంచి బయటపడేందుకు ఉన్న ఒకే ఒక్క నమ్మకమైన మార్గం కృష్ణా జలాలను వీలున్నంత మేరకు రాయలసీమకు మళ్లించి అందించడం మాత్రమే.

భారతదేశం మొత్తం మీద చూస్తే పంటలు పండిస్తున్న వ్యవసాయ భూముల్లో యాభై శాతం వరకు సాగునీటి సదుపాయం కలిగి ఉన్నాయి. కాని రాయలసీమలో మాత్రం ఇటువంటి సాగునీటి సౌకర్యం గల సేద్యపు భూములు ఇరవై ఎనిమిది శాతంకు లోబడే ఉన్నాయి. దీనిని బట్టి చూస్తే సీమప్రాంతం గతంలో ఎంతగా నిర్లక్ష్యానికి గురైందో, ఇప్పుడూ అవుతూ ఉందో స్పష్టం అవుతుంది. వివరాలు రాయలసీమ వెనుక బాటుతనాన్ని ఎత్తి చూపుతున్నాయి.

పట్టిక 1 లో గణాంకాల ప్రకారం చూస్తే ఆంధ్రప్రదేశ్ లో ఒకవైపు పంట భూముల విస్తీర్ణం ప్రాతిపదికన చూసినా, మరోవైపు జనాభాప్రాతిపదికన చూసినా మనకు లభ్యమవుతున్న నదీజలాలు ప్రాంతాలవారీగా న్యాయబద్ధంగా ఇంతవరకు పంపిణీ జరగడం లేదన్నది తేటతెల్లమవుతుంది. అందులోను అతి దారుణమైన అన్యాయం రాయల సీమ ప్రజలకు జరుగుతూ ఉందన్న సత్యం కూడా బయటపడుతుంది.

ఏ ప్రాంతంలో అయితే వర్షపాతం ఎక్కువగా ఉందో, భూగర్భ జలాలు కూడా పుష్కలంగా లభిస్తున్నాయో, ఆ ప్రాంతం వాళ్లే మన నదీ జలాలను అధికశాతం ఉపయోగించుకొంటున్నారు. ఎక్కడ అయితే వర్షాలు నమ్మకంగా కురియడం లేదో, భూగర్భ జలాలు నానాటికీ అడుగంటిపోయి పాతాళానికి చేరుకొంటున్నాయో ఆ ప్రాంతం వాళ్లు మాత్రం అరకొరగా అందుతున్న సాగునీటి సదుపాయాలతోనే సర్దుకోవలసి వస్తోంది. అధికశాతం నదీ జలాలు చేజిక్కించుకొన్న వాళ్లు ఏటా రెండు పంటలను మూడు పంటలను సాగునీటి సదుపాయంతో పండించుకొంటూ సంపన్నులవుతూ ఉంటే, ఒక పంటకు కూడా ఏ సంవత్సరంలోగాని సరిగా నీరు అందని ప్రాంతస్తులు మాత్రం కరువుల బారిన పడి బాకీలపాలై కూలీలుగా మారుతున్నారు. లేదా ఆత్మహత్యలు చేసుకొంటున్నారు.

భూగర్భ జలాలు అధికంగా ఉన్న డెల్టాప్రాంతం సోదరులు కాస్త ఉదారత్వం చూపి ఒక పంటను నదీ జలాలతోనూ, మరొక పంటను భూగర్భజలాలతోనూ పండించుకోవలసిన అవసరం ఉంది. రబీలో ఆరు తడిపంటలు వేసుకొని నీటిని ఆదా చేయవలసిన అవసరం కూడా ఉంది.

మన రాష్ట్రంలో మనకున్న పరిమితమైన నదీజలాల సంపదను న్యాయబద్ధంగా జనాభా ప్రాతిపదికపైన, పంట భూముల విస్తీర్ణం ప్రాతిపదిక మీద, వెనుకబాటుతనం ప్రాతిపదికపైన ఆధారపడి మూడు ప్రాంతాల వారికి మళ్లీ పునఃసమీక్ష చేసి పంపిణీ చేయవలసిన బాధ్యత ఇప్పుడు ప్రభుత్వంపైన ఉంది. మాకు చిరకాలంగా లభ్యమై మేము వాడుకొంటున్న నదీ జలాలపైన మాకు పూర్తి హక్కు ఉంది, వాటిని మేము మరెవ్వరికీ దక్కనివ్వం అన్న కొద్దిమంది నాయకుల వితండవాదం సరైనది కాదు. ఆమోదయోగ్యంకాదు.

మన రాష్ట్రం వాడుకొంటున్న నదీ జలాలలో ఎక్కువ భాగం మనకు

పట్టిక 1

అంశం	కోస్తా ఆంధ్ర	తెలంగాణ	రాయలసీమ
1ఎ) ప్రస్తుతం ఉన్న, ఇప్పుడు ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్ట్‌లు, పథకాల వల్ల సాగునీరు అందే భూములు (లక్షల హెక్టార్లలో)	33.8	25.7	8.5
బి) మొత్తం పంట భూములలో సాగునీరు అందే భూముల శాతం	94.0	53.9	28.4
2ఎ) మొత్తం పంట భూములు (లక్షల హెక్టార్లలో)	35.94	47.70	29.86
బి) పంట భూముల విస్తీర్ణం ప్రాతిపదికన వాటాలు పంచితే రాష్ట్రానికి లభ్యమయ్యే 2746 టిఎంసిల నదీ జలాలలో అందవలసిన న్యాయ మైన వాటా (టిఎంసిలు)	870.0	1153.0	723.0
సి) జనాభా ప్రాతిపదికన ప్రతి 1,000 మందికి లభ్యమవుతున్న నదీ జలాలు (మిలియన్ ఘన అడుగులు)	67.0	48.0	25.0
డి) పంట భూముల్లో ప్రతి 1,000 ఎకరాలకు ఉపయోగించుకొంటున్న నదీజలాలు (మిలియన్ ఘన అడుగులు)	174.0	78.0	34.0

పైనున్న ఇతర రాష్ట్రాల భూభాగం నుంచి వచ్చే నీరేనన్న సత్యం వీళ్లు గ్రహించాలి. దిగువనున్న ప్రాంతాల వాళ్ల అవసరాలను పైన ఉన్న రాష్ట్రాల ప్రజలు ఖాతరు చేయకుండా, మా మా ప్రాంతాలలో, నదులలో పారుతున్న నీటిని మా ఇష్టం వచ్చినట్లు ఆపుకొని, మేము వాడుకొంటాం అని గనుక అంటే మన రాష్ట్ర గతి ఏమవుతుందో వితండవాదులు ఒకసారి ఆలోచించాలి.

మనకు పైన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రాల వాళ్లు మన యెడల ఉదారంగా, జాతీయ దృక్పథంతో ఆలోచించి వ్యవహరించాలి అని గొడవచేస్తున్న మన నాయకులు మన రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల ప్రజల యెడల తాము కూడా ఉదారంగా వ్యవహరించడం నేర్చుకోవడం అవసరం. నీతులు వల్లించడం తెలివి ఉన్నవాళ్లు అందరూ చేయగలరు. ఆచరించి చూపేందుకు నిజాయితీ కావాలి.

మన రాష్ట్రంలో లభ్యమవుతున్న 2,746 టిఎంసి ల నదీ జలాలలో జనాభా నిష్పత్తి ప్రాతిపదికన చూస్తే రాయలసీమకు 549 టిఎంసి ల నీరు కేటాయించాలి. రాష్ట్రం మొత్తంలో ఉన్న పంట భూముల విస్తీర్ణంలో రాయలసీమ పంట భూముల నిష్పత్తి ప్రకారం చూసినా 723 టిఎంసి ల నీరు కేటాయించాలి. కాని సీమలో ప్రస్తుతం ఉన్న, ప్రతిపాదన దశలో ఉన్న చిన్న, పెద్ద ప్రాజెక్ట్‌లు అన్నింటి ద్వారా సీమకు అందే నదీజలాలు 257 టిఎంసిలు దాటడం లేదు.

అనేకానేక చారిత్రక, రాజకీయ కారణాల వల్ల నదీజలాల కేటాయింపుల్లో గతంలో రాయలసీమకు జరిగిన తీవ్రమైన అన్యాయాన్ని ఇప్పుడు సరిదిద్ది న్యాయబద్ధంగా అందవలసిన నీటిని అందేలా చర్యలు తీసుకోవడం ప్రస్తుత ప్రభుత్వ ముఖ్య కర్తవ్యం. తరతరాలు సామాజికంగా అణగదొక్కబడిన, వెనుకబడిన వర్గాల వారికి గతంలోని అన్యాయాలు సరిదిద్ది, సామాజికన్యాయం అందించడానికి ఇప్పుడు రిజర్వేషన్లు కల్పించారు. అదే కొలమానంతో రాష్ట్రంలో నీటి సదుపాయం లేక వెనుకబడిన ప్రాంతాలకు ఇప్పుడు ప్రాధాన్యతనిచ్చి అధికంగా నదీ జలాలను కేటాయించవలసిన అవసరం ఉంది. డెల్టా ప్రాంతాలకు ఇస్తున్న అధికశాతం నీటిని తగ్గించవలసి ఉంది.

నదీ జలాల కేటాయింపు విషయంలో 1956 నుంచి మన రాష్ట్రంలోని మూడు ప్రాంతాల నాయకుల మధ్య కొన్ని తాత్కాలిక ఒప్పందాలు జరిగాయి. ఆ ఒప్పందాల ప్రాతిపదికన ప్రభుత్వ ఉత్తర్వులు కూడా కొన్ని జారీ చేయబడ్డాయి. కాని అవేవీ దైవనిర్దేశాలయిన శాశ్వత ఉత్తర్వులు కావు. పరిమితమైన మన నదీజలాల కోసం మూడు ప్రాంతాల మధ్య ముమ్ముందు జలయుద్ధాలు జరుగకుండా, శాస్త్రీయ పద్ధతిలో విశ్లేషించి, పునఃసమీక్ష చేసి మూడు ప్రాంతాలకు సత్వరం న్యాయం చేయడం మంచిది.

అనేక దేశాలు, జాతుల మధ్య ఉన్న తారతమ్యాలను తగ్గించేందుకు గతంలో చేసుకున్న ఎన్నో అంతర్జాతీయ ఒప్పందాలే ఈనాడు పునః సమీక్షకు లోనవుతున్నాయి. కనుక మన రాష్ట్రంలోని నదీ జలాల విషయంలో గతంలో చేసుకొన్న తాత్కాలిక అఖిలపక్ష ఒప్పందాలు మార్చడానికి వీలు లేదని ఎవరైనా రాజకీయ లబ్ధి కోసం పిడివాదం చేస్తే దానిని ప్రభుత్వం పెద్దగా ఖాతరు చేసి పట్టించుకోనవసరం లేదు. అంగబలం, అర్థబలం ఉన్న సంపన్న ప్రాంతాల నాయకుల్లో కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వం పైన అనేక విధాలుగా ఒత్తిళ్లు పెంచుతూ ఉంటారు. సమస్యలు సృష్టిస్తారు. కాని, ఇలాంటి అవరోధాలు అధిగమించి వెనుకబడిన రాయలసీమకు, తెలంగాణకు న్యాయం జరిగేలా చూడడం సమర్థవంతమైన ప్రభుత్వ నైతిక బాధ్యత.

సీమకు చేజారిన అనేక అవకాశాలు

అనాదిగా వరుస కరువు కాటకాలతో సతమతమవుతున్న రాయలసీమ ప్రజల సాగునీటి అవసరాలు తీర్చేందుకు గాను, కృష్ణా నదీ జలాలను ఈ ప్రాంతానికి తరలించడం ఒక్కటే తరుణోపాయం అన్న విధాన రచనను 1890–1900 ప్రాంతంలోనే బ్రిటిష్ ఇంజనీర్ సర్ మెకెంజీ నిర్ధారించారు. కృష్ణ, తుంగభద్ర, పెన్నా నదుల అను సంధానంతో దాదాపు 36 లక్షల ఎకరాల సీమ భూమికి సాగునీరు అందించే బృహత్ పథకాలకు ఆయన రూపకల్పన కూడా చేశాడు. కాని, తర్వాత వచ్చిన మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాల వల్ల బ్రిటిష్

ప్రభుత్వం దృష్టి యుద్ధ సన్నద్ధత వైపు మళ్లడంతో ఈ ప్రాజెక్ట్‌లు ఏవీ అమలుకు నోచుకోలేక పోయాయి. సర్ కాటన్ రూపొందించిన కర్నూలు – కడప కాలువ మాత్రం 1890లో నిర్మించారు.

1944లో అప్పటి ఉమ్మడి మద్రాస్ రాష్ట్రానికి, నైజాం ప్రభుత్వానికి మధ్య జరిగిన ఒప్పందం వల్ల బళ్లారి జిల్లాలోని మల్లేశ్వరం వద్ద తుంగభద్ర ఆనకట్ట నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. కాని, రాయలసీమకు ప్రయోజనం చేకూర్చే మెకెంజీ పథకానికి పూర్తి విరుద్ధంగా ఈ తుంగభద్ర ప్రాజెక్ట్ మరుగుజ్జు రూపంలో డిజైన్ చేశారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రోద్యమం వల్ల తెలుగువాళ్ల పట్ల ఆగ్రహంతో ఉన్న అప్పటి మద్రాస్ ప్రభుత్వ నేతలు, తమ ప్రజల బాగోగుల పట్ల ఏమాత్రం శ్రద్ధలేని అప్పటి నైజాం ప్రభుత్వ నేతలు ఆనాడు ఆమోదించి ముద్రవేసిన ఈ ప్రాజెక్ట్ రాయలసీమ ప్రయోజనాలను బాగా దెబ్బతీస్తూ 1956లో పూర్తయ్యింది. సాగునీటి విషయంలో రాయలసీమకు జరిగిన పెద్ద అన్యాయాలలో ఇది మొదటిది.

తుంగభద్ర పైన ప్రాజెక్ట్‌ను ఈ విధంగా కుదించడం వల్ల మిగిలిపోయి కృష్ణకు చేరి ఆదా అయ్యే నీళ్లు ముందు ముందు కృష్ణా డెల్టా ప్రాంతానికి ఉపయోగపడుతాయన్న ఉద్దేశ్యంతో తెలివైన కోస్తా నాయకులు ఈ మరుగుజ్జు ప్రాజెక్ట్ ప్రతిపాదనకు అప్పుడు అడ్డంకులు లేవదీయలేదు. రాయలసీమ నాయకుల అవగాహనా లోపం, నిర్లక్ష్య స్వభావం కూడా ఈ నష్టానికి దోహదం చేశాయి.

1951లో అప్పటి ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా–పెన్నార్ ప్రాజెక్ట్‌ను ఒకదాన్ని రూపొందించి, దానికి కేంద్రం నుంచి ప్లానింగ్ కమిషన్ అనుమతిని కూడా సంపాదించింది. కర్నూలు జిల్లాలో 2.5 లక్షల ఎకరాలు, కడప జిల్లాలో అప్పుడున్న కె.సి. కెనాల్ ఆయకట్టుకు అదనంగా మరో 4 లక్షల ఎకరాలు, చిత్తూరు జిల్లాలో 70 వేల ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 7 లక్షల ఎకరాలు సాగులోనికి తెచ్చే విధంగా ఈ ప్రాజెక్ట్‌ను అప్పుడు రూపొందించారు. అప్పటి తమిళ నాయకులు తమ స్వార్థం కూడా కొంతవరకు చూపిస్తూ తమిళ ప్రాంతాలలో సుమారు 10 లక్షల ఎకరాలకు నీరందించే సౌకర్యాన్ని కూడా ఈ ప్రాజెక్ట్‌లో అంతర్భాగంగా చేశారు. ఈ ప్రాజెక్ట్ వల్ల రాయలసీమ ప్రాంతానికి మరింత ఎక్కువగా మేలు చేకూరే విధంగా దీనిలో మార్పులు చేసి నిర్మాణం చేబట్టాలని ఆంధ్ర నాయకులు ఆనాడు మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి ఉండవచ్చు. సాధించిఉండవచ్చు కూడా. కాని, ఈ ప్రాజెక్ట్ అమలయితే కృష్ణా జలాలు సర్కారు జిల్లాల సరిహద్దులు చేరక ముందే దాదాపు 400 టిఎంసి లకు పైగా పక్కకు మళ్లుతాయని గ్రహించిన కోస్తానాయకులు, రాయలసీమ ప్రజలను రెచ్చగొట్టి ఆనాడు తమిళ ప్రజలపైన విద్వేషం తలకెక్కించారు. తమిళులకు మన కృష్ణా నది నీరు తరలిపోతున్నదన్న మిషతో ఈ ప్రాజెక్ట్‌ను వ్యతిరేకించేలా పురికోల్పారు.

ఆనాడు కడప కోటిరెడ్డి, పప్పూరి రామాచార్యులు, ఓ. పుల్లారెడ్డి వంటి అనుభవజ్ఞుల సలహాలను పెడచెవినబెట్టి ఈ ప్రాజెక్ట్‌ను అడ్డుకొన్నారు. దాని స్థానంలో రాయలసీమ కు చుక్కనీరు కూడా అందివ్వని నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కోసం సమైక్య ఆంధ్రాభిమానంతో సర్కార్ ప్రాంతీయులతో కలిసి పోరాటం చేశారు. సీమప్రజల ఆవేశం, అమాయకత్వం, స్వయంకృతాపరాధాల వల్ల ఇది రాయలసీమకు జరిగిన రెండవ పెద్ద అన్యాయం.

నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి 1954లో అప్పటి తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందం మూలంగా రాయలసీమకు మేలుచేసే అనేక ఇతర నీటిపారుదల పథకాలకు కృష్ణానదిలోని నికర జలాలు లభ్యమయ్యే సదుపాయం పూర్తిగా మృగ్యమైపోయింది. గోరుచుట్టు పైన రోకలిపోటులాగా అదే సంవత్సరం తుంగభద్ర ప్రాజెక్ట్ నుంచి లభ్యమయ్యే నీరు, విద్యుచ్ఛక్తి విషయంలో ఎనభై శాతం విద్యుచ్ఛక్తిని, ఇరవై శాతం సాగునీటిని మనవాటాగా తీసుకొని, కర్నాటక రాష్ట్రానికి ఎనభై శాతం జలాలను, ఇరవై శాతం విద్యుచ్ఛక్తిని ఇవ్వడానికి మనరాష్ట్రం అంగీకారం కుదుర్చుకోవడం వల్ల రాయలసీమకు అందవలసిన తుంగభద్ర నీళ్లను కూడా మనం చాలవరకు పోగొట్టుకున్నాం.

ఆఖరుకు నడమంత్రపుసిరిగా 1953లో రాయలసీమకు దక్కిన రాష్ట్ర రాజధాని కూడా మూడేళ్ల ముచ్చటగా ముగిసిపోయి 1956లో హైదరాబాద్‌కు తరలిపోయింది. దీనివల్ల సీమప్రాంతానికి తరలివచ్చి ఉండే లక్షలాది కోట్లరూపాయల పెట్టుబడులు కూడా ఈ ప్రాంతం కోల్పోయింది. రాయలసీమ నాయకుల ముఠాతగాదాలను, పదవీ వ్యామోహాన్ని, ముఖస్తుతి ప్రీతివంటి బలహీనతను ఆలోచనాపరులు, ముందుచూపు ఉన్నవారు అయిన దక్షిణ కోస్తా నాయకులు పూర్తిగా ఉపయోగించుకొని లాభపడ్డారనడంలో ఎటువంటి సందేహం లేదు.

ఇన్ని విధాలుగా నష్టపోయిన రాయలసీమ వాసులు ఈనాడు తమ కనీస సాగునీటి, తాగునీటి అవసరాల కోసం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కొంతమేరకు కృష్ణానదిలోని వరదనీటిని తరలించుకొని వాడుకొంటాం అంటే అటు కృష్ణాడెల్టా నాయకులు, ఇటు సాగర్ ఆయకట్టు నాయకులు కొందరు అర్థం లేని అభ్యంతరాలు లేవనెత్తుతూ రాద్ధాంతాలు సృష్టిస్తున్నారు. కృష్ణా జలాల పైన సీమ ప్రజలకు అసలు హక్కే లేదన్న రీతిలో వితండవాదాలు చేస్తూ వీళ్లు ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తూ ఉండడం చాలా దురదృష్టకరమైన విషయం. ◆

వచ్చే సంచికలో...

- ఫోకస్ - అరవై సంవత్సరాల స్వాతంత్ర్యం
- బాక్సైట్ తవ్వకాలు - ఆదివాసుల జీవన విధ్వంసం - జి. రమేష్
- చారిత్రక సాక్షిగా తెలుగు కథ - బి.వి.ఎన్. స్వామి
- ఏకధృవ ప్రపంచాన్ని మరుగుపరిచే బహుళధృవ ప్రపంచ ధోరణులు - మిత్ర
- చేనేతల ఆకలి మరణాలను నివారించలేమా? - బండారు జ్వాలా నరసింహం
- పోటీపడుతున్న అభివృద్ధి నిరోధోక విషసంస్కృతులు - సత్యనారాయణ

నిర్ణయాధికారం ఎవరి చేతుల్లో ఉంటే విధాన నిర్ణయాలు వారికి అనుకూలంగా ఉంటాయనీ, జలవివాదాల చరిత్ర పొడుగునా మనకిది కనిపిస్తుందనీ అంటున్నారు నాగోబా

నీళ్లు ఎవరివి ? బీళ్లు ఎవరివి ?

2004లో వై.ఎస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక తమ ప్రభుత్వప్రాధాన్యత నీటిపారుదల రంగమే అని ప్రకటించుకుంది. జలయజ్ఞంగా నామకరణం చేసి ప్రాజెక్టు పనులను ప్రారంభించింది. రాష్ట్రంలోని అన్నిప్రాంతాల ప్రాజెక్టులను ప్రాధాన్యతలను బట్టి మూడు రకాలుగా వర్గీకరించుకుంది. రెండేండ్లలో పూర్తయ్యేవి, ఐదేండ్లలో పూర్తయ్యేవి, భారీ ప్రాజెక్టులుగా వర్గీకరించి టెండర్లు పిలిచి పనులు చేపట్టింది. వీటిలో తెలంగాణ ప్రాజెక్టులకు పెద్దపీట వేసి, మొత్తం నిధుల్లో 50 శాతానికి పైగా నిధులు కెటాయిస్తున్నామని గణాంకాలు ప్రజలకు విడుదల చేస్తున్నారు. అయితే జలయజ్ఞం ప్రారంభం అయిన కాడ్నించీ వివాదాలు తలెత్తుతున్నాయి. ఈ వివాదాలన్నీ తెలంగాణ ప్రాజెక్టుల విషయంలోనే ఎందుకు వస్తున్నాయనేది ఇవ్వాళ చర్చనీయాంశం. జలయజ్ఞంలో ప్రతిపాదించిన ప్రాజెక్ట్‌లు ఇపుడు కొత్తగా రూపొందించిన ప్రాజెక్టుల్లో కొన్ని తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కల్గించేవిగా ఉన్నాయి. జలయజ్ఞం ప్రారంభం నుండి వివాదాలలో ఇరుక్కొన్న ప్రాజెక్ట్‌లు పోలవరం, పులిచింతల, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంపు మొదలైనవి. ఇటీవలే వివాదాస్పదమైన ప్రాజెక్ట్‌లు రెండున్నాయి. మొదటిది బాబ్లీ ప్రాజెక్ట్. ఇది మహారాష్ట్ర నిర్మిస్తున్న ప్రాజెక్ట్, రెండోది దుమ్ముగూడెం-నాగార్జున సాగర్ లింక్ కెనాల్ పథకం.

తెలంగాణ ప్రాజెక్టుల పైనే వివాదాలు ఎందుకు ?

'జిస్‌కా లాఠీ ఉస్కే బైంస్' అనేది ఉర్దూలో సామెత (ఎవరి చేతిలో కర్ర ఉంటే వారిదే బర్రె). అంటే నిర్ణయాధికారం ఎవరి చేతుల్లో ఉంటే విధాన నిర్ణయాలు వారికి అనుకూలంగా వెలువడతాయి. ప్రపంచ వ్యాప్తంగా జలవివాదాలను గనుక పరిశీలిస్తే బలమున్న రాజ్యం, బలహీన రాజ్యాల జలసంపదను కొల్లగొట్టిన సందర్భాలు కనిపిస్తాయి. ఈజిప్టు అందుకు ఉదాహరణ. నైలునదీ పరీవాహక ప్రాంతంలో ఈజిప్టు చివరి దేశం. ఎగువన ఇథియోపియా, సోమాలియా లాంటి చిన్న దేశాలు నిత్యం కరువు కాటకాలతో, ఆకలి చావులతో సతమతమవుతున్న దేశాలున్నాయి. నైలునదికి 80 శాతం నీరందించే ఇథియోపియా నైలునదీ జలాలను వాడుకోలేని నిస్సహాయ స్థితిలో ఉంది. బలమైన రాజ్యం ఈజిప్టు నైలునదీ జలాలను సంపూర్ణంగా అనుభవిస్తూ సుసంపన్నమైన దేశాల్లో ఒకటైంది. ఇథియోపియా లాంటి పేద దేశాలు ఏమీచేయలేని దీనస్థితిలో ఉన్నాయి. మనదేశంలో చూస్తే రాది-బియాస్ ట్రిబ్యునల్ అవార్డులోని సట్లెజ్ యమునా లింకు కాలువపై పంజాబ్ ప్రదర్శిస్తున్న ఆధిపత్యధోరణి ఫలితంగా కాలువ నిర్మాణం కావడంలేదు. కాలువ పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినా పంజాబ్ కొత్త చట్టం చేసి పక్కన పెట్టింది. హర్యానా నోరుమెదపలేని స్థితిలోకి నెట్టివేయబడింది. మన రాష్ట్రంలో చూస్తే కృష్ణా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల విస్తీర్ణం తెలంగాణలో 69, 78 శాతం ఉంటే కోస్తాలో 31, 21 శాతంగా ఉంది. కృష్ణ, గోదావరి జలాల వినియోగాన్ని చూస్తే అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. పైన చెప్పిన ఉదాహరణలు అన్నింటిలోనూ మనకు కన్పిస్తున్న సామాన్య అంశం ఏమిటంటే బలహీనులనీ అణిచివేసి బలవంతులు సంపదను అనుభవించడం.

1956లో హైదరాబాద్, ఆంధ్రరాష్ట్రాల విలీనం అనంతరం తెలంగాణ కోస్తాకు వలసగా మారిపోయింది. అప్పటివరకు తెలంగాణకు ఉన్న నిర్ణయాధికారం నామమాత్రం అయ్యింది. నిధులు, నీళ్ళు, నియామకాల మీద నియంత్రణను కోల్పోయింది. రాష్ట్ర పాలనా యంత్రాంగంలో తెలంగాణకున్న భాగస్వామ్యం నామమాత్రమైన కారణంగా తెలంగాణకు అనుకూలంగా నిర్ణయాలు జరగవు. ఒకవేళ జరిగినా అమలుకు నోచుకోవు. అమలు అయినా తూతూ మంత్రంగా అమలవుతాయి. జీవో 610 ఇందుకు సజీవ ఉదాహరణ. నీటిపారుదల రంగానికి వస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ తెలంగాణకు గొడ్డలి పెట్టయ్యింది. దశాబ్దాలుగా తెలంగాణ అపార జలసంపద దోపిడీకి గురి అయ్యింది. తెలంగాణ ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి లోనయినాయి. కుట్రలకు బలి అయినాయి. తెలంగాణ ఉద్యమం తీసుకొచ్చిన చైతన్యం వల్లనే ఇవ్వాళ తెలంగాణ ప్రజలు సమైక్యరాష్ట్రంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని అర్థం చేసుకోగలుగుతున్నారు. తెలంగాణ జలవనరుల దోపిడీని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం రూపొందిస్తున్న పథకాల లోగుట్టును విశ్లేషించుకుంటున్నారు. వాటిని ప్రతిఘటించడానికి సమాయత్తమవుతున్నారు. అందుకే ఇవ్వాళ పోలవరం, పులిచింతల, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, దుమ్ముగూడెం-నాగార్జునసాగర్ లింకు కాలువ మొదలైన ప్రాజెక్టుల వెనుక ఎవరి ప్రయోజనాలు ఉన్నాయో విశ్లేషిస్తున్నారు. మహారాష్ట్ర శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువన బాబ్లీ నిర్మిస్తుంటే ప్రతిఘటిస్తున్నారు. ఇన్నాళ్లూ మొద్దు నిద్రబోయిన ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. అంతేకాదు బాబ్లీని వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తున్న సమైక్యవాద పార్టీ

తెలుగుదేశంను. 'బాబ్లీ సరే! దిగువన పోలవరం, పోతిరెడ్డిపాడుల సంగతి ఏమిటి? వాటిపట్ల మీ వైఖరేమిటని' ప్రశ్నిస్తున్నారు. చివరికి చెప్పేదేమి టంటే రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల్లో వివాదాలన్నింటికి మూలం నీటిదోపిడి రాజకీయాలె. తెలంగాణ వనరులని దోచుకుంటున్న వలసాధిపత్యమే ఈవివాదాలకు కారణమవుతోంది. నీటిదోపిడి రాజకీయాలు, వలసాధిపత్యానికి తాజా ఉదాహరణ దుమ్ముగూడెం – నాగార్జునసాగర్ లింకుకాలువ పథకం. అనేక వివాదాలకు కేంద్రబిందువైన పోతిరెడ్డిపాడు, పోలవరం, పులిచింతల ప్రాజెక్టులపై ఇదివరకే విస్తారమైన చర్చజరిగింది. పోలవరంపై జరిగిన చర్చ అంతా పుస్తకరూపంలో కూడా వెలువడింది. అందుకని తాజాగా ముందుకు వచ్చిన దుమ్ముగూడెం – నాగార్జునసాగర్ లింక్‌కాలువ బాబ్లీపై మాత్రమే ఈవ్యాసంలో దృష్టిసారిస్తున్నాను.

దుమ్ముగూడెం – నాగార్జునసాగర్ లింకు కాలువ

ఈ లింకుకాలువ అకస్మాత్తుగా ఊడిపడిందేమి కాదు. 2005-06 బడ్జెట్ ప్రసంగంలో ఈ ప్రాజెక్ట్ మనకు కనిపిస్తుంది. అందులో 150 నుంచి 200 టిఎంసి ల నీటిని గోదావరి నుంచి కృష్ణకు తరలించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం చెబుతున్నదేమింటంటే, కర్నాటక ఆల్మట్టి; నారాయణ్‌పూర్ డ్యాంలను నిర్మించిన తర్వాత కృష్ణా బేసిన్‌లోకి నీరు రావడానికి జూలై చివరి వారందాకా అగవలసి వస్తోంది. దీంతో వ్యవసాయ పనులు ప్రారంభం కావడం అలస్యమవుతోంది. కృష్ణా బేసిన్‌లో ఏర్పడిన నీటి కొరతను అధిగమించడానికి, నాగార్జునసాగర్ అయకట్టు, కృష్ణా డెల్టాలకు జూన్ మొదటి వారానికల్లా నీరందించడానికి గోదావరి నుండి నీళ్లని కృష్ణాకు తరలించే ఈ లింకు పథకాన్ని రూపొందించారు. ఈ కాలువ ద్వారా 165 టిఎంసి ల వరద నీటిని దుమ్ముగూడెం వద్ద గోదావరి నుండి నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్‌కు తరలిస్తారు. ప్రాజెక్ట్ ఖర్చు సుమారు 8,900 కోట్లు. అవసరమయ్యే విద్యుత్తు 1400 మెగావాట్లు. ఈ కాలువ కింద ఒక్క ఎకరం కూడా కొత్తగా సాగులోకి రాదు. నాగార్జునసాగర్ ఆయకట్టు స్థిరీకరణ మాత్రమే జరుగుతుంది.

ఇది బయటకి చెబుతున్న కారణం. ఈ లింకు పథకం వెనుక అసలు లక్ష్యాలు, రహస్య ఎజెండా ఏమిటో తెలంగాణ ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారు.

పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా శ్రీశైలం నుండి రోజుకు 55 వేల క్యూసెక్కుల నీటిని 30 రోజులు తీసుకుపోతే సాగర్ రిజర్వాయర్ లో ఏర్పడే కృత్రిమ కొరతను, బలవంతపు కొరతను తీర్చడానికి ప్రభుత్వం రెండు పథకాలను ఎంచుకున్నది. 1. పోలవరం 2. దుమ్ముగూడెం లింకు కాలువ. పోలవరంపై కుదిరిన ఒప్పందం ప్రకారం పోలవరం నుండి 80 టిఎంసిలు కృష్ణా బ్యారేజీకి తరలిస్తారు. దుమ్ముగూడెం లింకు ద్వారా 165 టిఎంసిలు తరలిస్తారు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా గోదావరి నుండి కృష్ణా నదికి 245 టిఎంసిల నీటిని తరలిస్తారు. అంతమేరకు పోతిరెడ్డిపాడు నుండి శ్రీశైలం నీటిని రాయలసీమకు మళ్లించుకోవచ్చు. గోదావరి మళ్లింపు పథకాలని ఆశచూపి కోస్తావాసుల నోళ్లు మూయించ గలిగింది ప్రభుత్వం. అయితే గోదావరి మీద ఆధారపడిన ఉత్తరతెలంగాణ జిల్లాల మాటేమిటి? కృష్ణా మీద ఆధారపడిన నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల సంగతేమిటి? నిజానికి జలయజ్ఞం లక్ష్యమే కృష్ణా నీటిని రాయలసీమకు, గోదావరి నీటిని కోస్తాకు తరలించడం.

ఉత్తర తెలంగాణ జిల్లాలకు ప్రధాన నీటివనరు గోదావరినది. శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు అప్పర్‌మానేరు, శనిగరం తదితర భారీ, మధ్యతరహా సాగు నీటి ప్రాజెక్టుల్లో ఇప్పటికే నీటికొరత ఎదుర్కొంటున్నాయి. గోదావరి బేసిన్‌లో ఇంకా 50 లక్షల ఎకరాలకు సాగునీరు అందవలసిన అవసరం ఉంది. ఈ ప్రాజెక్టుల్లో నీటి కొరతను తీర్చడానికి, కొత్తగా ఆయకట్టుకు సాగునీరు అందించడానికి, ప్రజల మంచినీటి అవసరాలను తీర్చడానికి గోదావరినదే ప్రధాన వనరు. గోదావరి బేసిన్ అవసరాలు తీరకుండానే కృష్ణా బేసిన్ అవసరాలకు నీటిని తరలించడం అన్యాయం. అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధం. కనుక బేసిన్ అవసరాలు కనీసం 60 శాతం అయినా తీరి అప్పటికి ఇంకా మిగులు నీరుంటె కృష్ణా బేసిన్‌కు తరలిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. ప్రాణహిత – చేవెళ్ల పథకం సహా గోదావరి నది, దాని ఉపనదులపై ప్రతిపాదించిన అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసిన తర్వాతనే ఈ లింకు పథకాన్ని చేపట్టాలన్నది తెలంగాణ ప్రజల డిమండ్.

ఇక ప్రాజెక్టు ఎందుకో ప్రభుత్వం వివరణను పరిశీలిద్దాం. ఆల్మట్టి, నారాయణ్‌పూర్ డ్యాంల కారణంగా జూన్, జూలై నెలల్లో సాగర్‌కు నీళ్లు రావడంలేదు. అందువలన సాగర్ ఆయకట్టుకు సకాలంలో నీరందక వ్యవసాయ పనులు ఆలస్యం అవుతున్నాయి. జూన్, జూలై నెలల్లో నీటి కొరతను తీర్చడానికి ఈ ప్రాజెక్టు రూపకల్పన జరిగింది. ఈ ప్రాజెక్టు నుంచి తరలించుకుపోయేది గోదావరి వరదనీరే. గోదావరిలో వరదనీరు పారేది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో. జూన్, జూలై నెలల్లో గోదావరిలో పారేవి నికరజలాలే కాని వరదజలాలు కావు. అంటె గోదావరిలో నికర జలాలనే వరద జలాలుగా చెప్పి తరలించడం అన్నమాట. పోతిరెడ్డిపాడు తూము కూడా చాలా కింద పెట్టి వరదజలాలనే తరలిస్తానంటున్నది. ప్రభుత్వవాదన నమ్మశక్యంగా లేదు. ఈ లింకు పథకంలో కూడా వరదజలాల పేరుతో నికరజలాలనే తరలించే ప్రమాదం స్పష్టంగా కన్పిస్తోంది. దారి పొడుగునా ఆన్‌లైన్ రిజర్వాయర్లు ప్రతిపాదించకుండా ఈ వరద నీటిని నిల్వ ఉంచడం ఎట్లా సాధ్యమో అర్థంకాదు. ఆన్‌లైన్ రిజర్వాయర్లు లేకుండా వరద నీటిపై ఆధారపడిన ప్రాజెక్టులు ఎక్కడా ఉండే అవకాశం లేదు. దుమ్ముగూడెం లింకు కాలువ అట్లా తయారవుతున్న పథకమే.

కృష్ణా ట్రిబ్యునల్ పేర్కొన్నట్లు కృష్ణానదికి మరే ఇతర నదుల నుంచైనా నీటిని తరలించినపుడు ఆ నీటిలో కూడా ఎగువ రాష్ట్రాలు కర్ణాటక, మహారాష్ట్రలు వాటాను కోరవచ్చు. ఈ ప్రమాదాన్ని ప్రభుత్వం పట్టించుకున్నట్లు లేదు. బచావత్ ట్రిబ్యునల్ క్లాజ్ 14బి ప్రకారం కృష్ణా నదికి ఇతర బేసిన్ల నుంచి తరలించే నీటిలో వాటా కోరే హక్కుంది. ఇప్పుడు ఈ లింకుకాలువ ద్వారా 165 టిఎంసిలు తరలిస్తే ఈ నీటిలోనూ తమకు వాటా కావాలని డిమండ్ చేసే ప్రమాదం ఉంది. కొత్త ట్రిబ్యునల్ ఇప్పటికే పని ప్రారంభించింది. వాదనలు ప్రారంభమయినాయి. కాబట్టి 165 టిఎంసిల గోదావరి నీటిలో వాటాకోసం ట్రిబ్యునల్‌ని ఆశ్రయిస్తారు. ఈ అంశంపై ప్రభుత్వానికి స్పష్టత ఉన్నదీ లేనిదీ అంతుబట్టదు. చేతులు

కాలినంక ఆకులు పట్టుకోవడంకన్న రాబోయే ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టడం విజ్ఞత అనిపించుకుంటుంది. కృష్ణా బేసిన్‌పై ఆధారపడిన నల్లగొండ, మహబూబ్‌నగర్ ప్రజలకు, రైతులకు గొడ్డలిపెట్టు కావద్దు. అట్లాగే గోదావరిపై ఆధారపడిన ఉత్తర తెలంగాణ గత్తరపాలు కావద్దు. రెండువైపులా పదునున్న కత్తిలాంటిదే ఈ లింకు ప్రాజెక్టు అని తెలంగాణ ఇంజనీర్లు వ్యాఖ్యానిస్తున్నారు.

బాబ్లీ ప్రాజెక్ట్

బాబ్లీ ప్రాజెక్ట్‌ను మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరి నదిపై శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఎగువన, నాందేడ్ జిల్లా ధర్మాబాద్ తాలుకాలో బాసరకు ఎగువన 20 కిలోమీటర్ల దూరంలో నిర్మిస్తోంది. ప్రాజెక్ట్ నిల్వసామర్థ్యం 2.75 టిఎంసిలు. ప్రాజెక్ట్ స్థలం వద్ద గోదావరి నది ఎత్తు 1070 అడుగులు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నిల్వ ఎత్తు 1091 అడుగులు. అంటే బాబ్లీ నిర్మాణం శ్రీరాంసాగర్ జలాశయంలోనే సాగుతున్నదన్నదని స్పష్టమయ్యింది. ఇది శ్రీరాంసాగర్ లోకి రావల్సిన నీటిని అడ్డుకుంటుంది. 1975లో మహారాష్ట్రతో కుదిరిన ఒప్పందం ప్రకారం 1091 అడుగుల వద్ద జలాశయం విస్తీర్ణంలో మహారాష్ట్ర తమ భూభాగంలోగాని, నదిలో గాని ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదు. అయితే బాబ్లీ 1070 అడుగుల వద్దనే నిర్మాణం అవుతున్నందున శ్రీరాంసాగర్ జలాశయం విస్తీర్ణాన్ని అడ్డుకున్నట్లయ్యింది. ఇది 1975 ఒప్పందానికి విరుద్ధం. ఇక ఎంత నిల్వ సామర్థ్యాన్ని అడ్డుకుంటుందంటే 0.60 టిఎంసిలే. 0.60 టిఎంసిల నష్టానికే ఇంత గగ్గోలు ఎందుకని? శ్రీరాంసాగర్ వాస్తవంగా ఎట్లా నష్టపోనున్నది, శ్రీరాంసాగర్ ఆయకట్టు నిజంగానే ఎండిపోనున్నదా? ఈ ప్రశ్నలను విశ్లేషించుకోవాలి.

బాబ్లీ వలన వాస్తవ నష్టం ఎంత?

శ్రీరాంసాగర్ నీటి నిల్వ 1091 అడుగులకు చేరగానే బాబ్లీ గేట్లు మూసివేసి పూర్తిస్థాయి నిల్వఎత్తు 1109 అడుగుల వరకు నీటిని నింపుతారు. ఆ నీటిని వాడుకునే క్రమంలో బాబ్లీ జలాశయం ఎత్తు 1091 అడుగులు (లేదా శ్రీరాంసాగర్‌లో నిల్వ ఎత్తు ఎత్తుంటే అంతకు) చేరగానే బాబ్లీ గేట్లు ఎత్తేస్తారు. అప్పుడు శ్రీరాంసాగర్ నుండి బాబ్లీలోకి నీరు ప్రవహించే రెండు జలాశయాలు ఒకటవుతాయి. అప్పుడు మహారాష్ట్ర వాడుకునేది శ్రీరాంసాగర్ నీళ్లే గాని బాబ్లీ నీళ్లు కావు. ఈ క్రమంలో శ్రీరాంసాగర్ నీటి నిల్వ 1070 అడుగులు చేరేదాకా ఎన్ని నీళ్లయినా మహారాష్ట్ర దొంగిలించవచ్చు. ఈ నీరు 20,30, 40.... అత్యధికంగా 70 టిఎంసిలు కావచ్చు. ఈ పరిమాణం మహారాష్ట్ర వినియోగించుకుంటున్న దాన్ని బట్టి, శ్రీరాంసాగర్‌లో నీటి నిల్వను బట్టి ఉంటుంది. ఈ వెసులుబాటు ఉంది కనుకనే మహారాష్ట్ర వ్యూహాత్మకంగా శ్రీరాంసాగర్ జలాశయంలోనే బాబ్లీని నిర్మిస్తున్నది. కాగితం మీద లెక్కలు వేస్తే బాబ్లీ వల్ల నష్టం 0.60 టిఎంసిలే అయినా వాస్తవ నష్టం ఎంతో ఎక్కువ ఉంటుందన్నది ఇంజనీర్ల విశ్లేషణ. ఈ అంశం ప్రభుత్వం దృష్టికి చాలా ఆలస్యంగా రావడంతో జరగవల్సిన నష్టం జరిగిపోతోంది. వివాదం ముదిరింది. ఆంధ్ర ఇంజనీర్లతో నిండిపోయిన అంతర్రాష్ట్ర జల విభాగం అలసత్వంతోని, నిర్లక్ష్యంతోని వ్యవహరించినందువల్ల బాబ్లీ తెలంగాణ ప్రజల మెడకు ఉరితాడై చుట్టుకుంది. పోలవరం అనుమతుల కోసం ప్రభుత్వం చూపుతున్న చొరవలో శతాంశం కూడా బాబ్లీని ఆపడంలో చూపలేదు. ఇక్కడనే ప్రభుత్వం పక్షపాతం బయటపడుతోంది.

బాబ్లీ వలన శ్రీరాంసాగర్ ఎండిపోనున్నదా?

శ్రీరాంసాగర్ ప్రస్తుత పరిస్థితి ఏమిటంటే, 196 టిఎంసిలతో స్టేజి 1, స్టేజి 2 వరద కాలువలకు నీరందించాలి. అయితే ఇటీవలి అధ్యయనం వలన తెల్సిందేమిటంటే శ్రీరాంసాగర్ వద్ద నీటి లభ్యత 153 టిఎంసిలకు పడిపోయింది. అంటే 43 టిఎంసిల కొరత ఇప్పటికే ఏర్పడి ఉంది. ఇసుక మేటల కారణంగా జలాశయం నిల్వ సామర్థ్యం 112 టీఎంసిల నుండి 90 టిఎంసిలకు పడిపోయింది. జలాశయంలో నీటి కొరతకు ప్రధాన కారణం గోదావరి, మంజీరా నదులపై మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు గోదావరి ట్రిబ్యునల్ అవార్డును ఉల్లంఘించి ప్రాజెక్టలను చేపట్టడమే. మహారాష్ట్ర బాబ్లీకి ఎగువన మరో 11 బ్యారేజీలను నిర్మిస్తోంది. వాటి నిల్వ సామర్థ్యం 10 టిఎంసిలు ఉండవచ్చు. అయితే వాస్తవ వినియోగం 20 నుండి 25 టిఎంసిలు ఉండవచ్చు. బాబ్లీ సహా ఈ ప్రాజెక్టలన్నీ పూర్తయితే శ్రీరాంసాగర్ వద్ద 80-90 టిఎంసిల లభ్యత కూడా దుర్లభం. ఈ నీటితో మొదటి దశ అవసరాలు కూడా తీరవు. ఇక రెండో దశను మర్చిపోవలసిందే. శ్రీరాంసాగర్ జలాశయం శిఖం నుండి నీటిని పొందే అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాలు నిరర్థకం కానున్నాయి.

ఇప్పుడు బాబ్లీ వివాదం ముదిరింది. బాబ్లీ సమస్య రాజకీయ పార్టీలకు ముఖ్యంగా టిడిపికి ఒక వరంలాగా చేతికి అందింది. తెలంగాణలో కోల్పోయిన జనాదరణను, పట్టును తిరిగి పొందడానికి బాబ్లీని ఒక ఆయుధంగా వాడుకుంటున్నది. బాబ్లీపై ఇంత గగ్గోలు పెడుతున్న తెలుగుదేశం పోతిరెడ్డిపాడు, పోలవరం ప్రాజెక్టుల ద్వారా ఇంతకంటే ఎక్కువ పరిమాణంలో జలదోపిడే జరుగుతుంటే మిన్నకుం టుంది. పొరుగు రాష్ట్రం జలచౌర్యాన్ని ప్రతిఘటిస్తున్నవారికి ఇంటి దొంగలు కన్పించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బాబ్లీ వల్ల శ్రీరాంసాగర్ అన్యాయం అయిపోతున్నది నిజమే, కాని దిగువన అంతకంటే ఎక్కువ నీరు కృష్ణా, గోదావరుల నుండి తరలిపోతోంది. దిగువన జరుగుతున్న భారీ నీటి దోపిడీని ప్రశ్నించే సాహసం చెయ్యని వాళ్లు ఇవ్వాళ బాబ్లీని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. బాబ్లీ ఆగిపోయినంతనే నీటి దోపిడీ ఆగిపోయినట్లు కాదు. బాబ్లీతోపాటు పోతిరెడ్డిపాడు ఆగాలి. పులిచింతల ఆగాలి.

బాబ్లీకి పరిష్కారం లేదా?

బాబ్లీని ఆపాలని ఉద్యమిస్తున్న వాళ్లు బాబ్లీకి ప్రజాస్వామిక పరిష్కారాన్ని సూచించలేక పోతున్నారు. మహారాష్ట్రతో ఘర్షణ వైఖరినే ప్రభుత్వం అవలంబిస్తోంది. అయితే బాబ్లీకి ప్రజాస్వామిక పరిష్కారాలు ఇంకా మూసుకుపోలేదు. బాబ్లీ ప్రాజెక్ట్ ఉన్న ధర్మాబాద్ తాలుక కరువు పీడిత ప్రాంతమే. తరతరాలుగా గోదావరి తీరాన బతుకుతున్న ప్రజలు తాగునీటికి కటకటలాడుతున్నారు. ఒప్పందం ప్రకారం గోదావరి నది శ్రీరాంసాగర్ జలాశయంలో భాగమయ్యింది గనుక ఆ నీళ్లమీద ధర్మాబాద్

వివాదాస్పద జి.ఓ.లతో, హామీలతో, అవినీతితో, అనుమతులు లేని ప్రాజెక్ట్‌లతో జనాన్ని మభ్యపెడుతూ, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతూ ప్రభుత్వం పబ్బంగడుపుతోందని అంటున్నారు ఆర్. విద్యాసాగర రావు

జలయజ్ఞమా? జలజగడమా?

వివిధ దేశాల మధ్య, రాష్ట్రాల మధ్య జలవివాదాలు ఉండటం సహజమే. అయితే మన రాష్ట్రంలో నెలకొన్న జలవివాదాలు వివిధ ప్రాంతాల మధ్య. మన రాష్ట్రానికి సంబంధించినంతమటుకు పొరుగు రాష్ట్రాలతో మనకున్న వివాదాల్లో చెప్పుకోదగ్గవి కృష్ణానదిపై కర్ణాటక నిర్మిస్తున్న ఆల్మట్టి, తుంగభద్రపై కడుతున్న స్వర్ణ, గోదావరినది పై నిర్మిస్తున్న బాబ్లీప్రాజెక్ట్‌లు. ఆల్మట్టి వివాదాన్ని సుప్రీంకోర్టు పరిష్కరించింది. 'స్వర్ణ' 'బాబ్లీ' ప్రాజెక్ట్‌ల వివాదాలు సుప్రీంకోర్టు ప్రాంగణంలో ఉన్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక కృష్ణానదిపై కడుతున్న అనేక అక్రమ కట్టడాల విషయంలో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ సాగించి తీర్పు చెప్పవలసి ఉంది. పొరుగున ఉన్న ఛత్తీస్‌గడ్, ఒరిస్సా రాష్ట్రాలు అభ్యంతరం వెలిబుచ్చి కోర్టులకు తీసుకెళ్లిన మరో వివాదం 'పోలవరం' ప్రాజెక్ట్‌కు సంబంధించినది. ఆ ప్రాజెక్ట్ పైన తెలంగాణ, కోస్తా ప్రాంత ప్రజలు, ప్రజాసంఘాలు తీవ్ర వ్యతిరేకతను తెలియజేసి రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కేంద్ర సాధికారిక కమిటీకి ఫిర్యాదులు చేయడం కూడా జరిగింది. మనరాష్ట్రంలోని మూడు ప్రాంతాలు తెలంగాణ, కోస్తా, రాయలసీమ ఏ ప్రాజెక్ట్ విషయంలో కూడా ఏకాభిప్రాయం కలిగి లేవు.

పులిచింతల ప్రాజెక్ట్‌ను తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలు కలిసికట్టుగా వ్యతిరేకిస్తే పోతిరెడ్డిపాడు విషయంలో తెలంగాణ, కోస్తా ప్రాంతాలు ఉమ్మడిగా తమ పోరాటాన్ని కొనసాగించేందుకు సిద్ధమయ్యాయి.

చాలా ఏళ్లుగా రెండుప్రాంతాల మధ్య చిచ్చు రగులుస్తు అపరిష్కృతంగా ఉన్న వివాదం 'రాజోలిబండ' దువ్వితే, వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన జలయజ్ఞంలో తలపెట్టిన అనేక ప్రాజెక్ట్‌లు వివిధ ప్రాంతాల మధ్య వైషమ్యాలను నింపుతూ రేపుతూవివాదాస్పమయ్యాయి.

రాజోలిబండ

తుంగభద్ర నదిపైన నిర్మించిన రెండు పథకాలు, ఒకటి రాజోలిబండ మరొకటి సుంకేసుల ఆనకట్ట (కె.సి. కాలువ). రెండు కూడా విశేషమైన ప్రాధాన్యత కలిగినవే. అలనాటి మద్రాస్, హైదరాబాద్ ప్రభుత్వాలు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం రెంటికీ సమానమైన

తాలుకా ప్రజలకు హక్కులేకుండా పోయింది. అక్కడి నుండి ఎగువన మరో 40 కిలోమీటర్ల దూరం దాకా గోదావరి నీళ్లని ముట్టడానికి వీల్లేని పరిస్థితి. ఈ పరిస్థితికి కారణం 1975 నాటి ఒప్పందంలో లోపమే కారణంగా కనిపిస్తుంది.

సాధారణంగా ఏదేని జలాశయంలో ముంపుకు గురి అయిన ఎగువ రాష్ట్రాలకు ఆ జలాశయం నుంచి నీటిని ఎత్తిపోసుకోవడానికి అనుమతించడం ఒక రివాజు. ఈ సంప్రదాయం దేశవ్యాప్తంగా ఉన్నదే. మన రాష్ట్రంలోనే గోదావరి నదిపై ఇచ్చంపల్లి జలాశయం నుండి మహారాష్ట్ర నాలుగు టిఎంసిలు, మధ్యప్రదేశ్ (ఇప్పుడు ఛత్తీస్‌గడ్) మూడు టిఎంసిలు ఎత్తిపోసుకోవడానికి 1978 నాటి ఒప్పందం అనుమతిస్తున్నది. అట్లానే పోలవరం జలాశయం నుంచి ఒరిస్సా రాష్ట్రం 5 టిఎంసిల నీటిని ఎత్తిపోసుకోవడానికి 1978 నాటి ఒప్పందం అనుమతించింది. ఇలాంటి అనుమతే శ్రీరాంసాగర్ జలాశయంలో ఉండి ఉంటే ఇవాళ బాబ్లీ సమస్య ఉత్పన్నం అయిఉండేది కాదు. ఇది ఒప్పందంలోని లోపం. ఈ లోపం కారణంగా ధర్మాబాద్ తాలుకా కరువు పీడిత ప్రాంతంగా బతుకీడ్చింది. పాతికేండ్ల అనంతరం ఆ లోపం బాబ్లీ రూపంలో ముందుకు వచ్చి రెండు ప్రాంతాల ప్రజల మధ్య భావోద్వేగాలను రెచ్చగొడ్తున్నది.

బాబ్లీని నిర్మిస్తున్నది ప్రధానంగా తాగునీటిని అందించడానికేనని మహారాష్ట్ర చెబుతోంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన దాని ప్రకారం వారికి తాగునీటి అవసరాల కోసం 1.09 టిఎంసిలు మాత్రమే కావాలి. 1.09 టీఎంసిల నీటిని శ్రీరాంసాగర్ జలాశయం నుంచి ఎత్తిపోసుకోవడానికి మన అంగీకారాన్ని తెలియజేస్తూ వెంటనే బాబ్లీ పనులని నిలిపివేయాలని కోరడం ఈ సమస్యకు ప్రజాస్వామిక పరిష్కారాన్ని అందిస్తుందని తెలంగాణ మేధావులు భావిస్తున్నారు. రెండు రాష్ట్రాల ఇంజనీర్లతో ఏర్పాటైన కమిటి ఈ అంశాన్ని పర్యవేక్షిస్తుంది. 1.09 టిఎంసిల నీటిని శ్రీరాంసాగర్ జలాశయం నుంచి ఎత్తిపోసుకోవడానికి అనుమతించడం వలన మూడు ప్రయోజనాలున్నాయి

1. సమస్యకు శాంతియుత, ప్రజాస్వామిక పరిష్కారం లభిస్తుంది.
2. కరువు పీడిత ధర్మాబాద్ ప్రజల పట్ల సంఘీభావం, ఆర్తిని ప్రకటించిన వాళ్లం అవుతాం. తెలంగాణ ప్రజల ఉదార, ప్రజాస్వామిక స్వభావం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది.
3. భవిష్యత్తులో ప్రాణహితపై, పెన్‌గంగపై మనం చేపట్టే ప్రాజెక్ట్‌ల పట్ల మహారాష్ట్ర సానుకూలంగా ఉండే అవకాశాన్ని మెరుగుపర్చుకుంటాం. ◆

ప్రతిపత్తి, నీటి కేటాయింపులు ఉండి ఉండాలి. దురదృష్టవశాత్తు ఇది జరగలేదు. బచావత్ ట్రిబ్యునల్ 'రాజోలిబండ పథకం' (ఆర్.డి.ఎస్)కు 17.1 టిఎంసి లు, కె.సి. కాలువకు 39.9 టిఎంసిల నీటిని కేటాయించింది. అయితే గత పదిహేడు సంవత్సరాలుగా రాజోలిబండ పథకానికి సగం నీళ్లు కూడా రావడం లేదు. కె.సి. కాలువకు వాటాకు మించి ఒకటిన్నర, రెండు రెట్లు నీళ్లు అందుతున్నాయి. రాజోలిబండకు కేటాయించిన 17.1 టిఎంసి లలో 1.2 టిఎంసిల నీరు కర్ణాటకకు, మిగతాది మహబూబ్‌నగర్ జిల్లాకు. ఆర్‌డిఎస్‌కు నీరు అందకపోవడానికి ప్రధానమైన కారణం 'రాజోలిబండ' ఆనకట్టలో నిర్మాణ సమయం నుంచే అక్రమంగా కొనసాగుతున్న మూడు తూముల నుంచి నీరు దిగువన ఉన్న సుంకేసులకు చేరుతూ ఉండటం. ఈ తూములు మూస్తే తప్ప నీరు పక్కనున్న మహబూబ్‌నగర్ చేరదు. తూములు మూసేయడానికి కె.సి. కాలువ నీటిని అనుభవిస్తున్న కర్నూలు రైతాంగం ఒప్పుకోరు. తూములు మూసే ప్రయత్నాన్ని కె.సి. కాలువ రైతులు అనేక మార్లు భగ్నం చేసారు. ఇటీవల అధికారులు కంటి తుడుపు చర్యగా తూములు మూసేసి పక్కనున్న 'స్లూస్'ని పెద్దవి చేసి తెరచి ఉంచారు. అంటే వివాదం కొనసాగుతూనే ఉంది. ఈ సమస్య మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లా రైతాంగంకు సంబంధించినది, చివరకు అది తెలంగాణ రాయలసీమ మధ్య చిచ్చురేపిన వివాదంగా కొనసాగుతోంది.

పులిచింతల

కృష్ణానదిపైన నాగార్జునసాగర్‌కు దిగువన కడుతున్న టెర్మినల్ రిజర్వాయర్ 'పులిచింతల'. సాగర్‌కు దిగువన ప్రధాన కృష్ణానది, ఉపనదులు హాలియా, మూసీ, పాలేరు, మున్నేరు, పిడుగురాళ్ల వాగు, ఇంకా చిన్నచిన్న వాగులు నీటిని కృష్ణా బ్యారేజికందిస్తున్నాయి. జలయజ్ఞం లో తొలుత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ప్రాజెక్ట్ ఇది. 45 టిఎంసిల సామర్థ్యంతో తలపెట్టిన ఈ ప్రాజెక్ట్‌కు కేంద్ర జలసంఘం 1996లోనే ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ కడితే లబ్ధిపొందేది కృష్ణాడెల్టా రైతాంగం. మొదటి పంటకు సకాలానికి నీరందడమే కాకుండా, రెండో పంటకు, మూడో పంటకు (జలాశయంలో లభించే నీరును బట్టి) నీరందే అవకాశముంటుంది. ఈప్రాజెక్ట్ మూలంగా నష్టపోయేది నల్లగొండ, గుంటూరుజిల్లా ప్రజలు. ఈ ప్రాజెక్ట్ మూలంగా సాగర్ ఆయకట్టు పరిధిలోని ప్రైవేట్, ప్రభుత్వ భూములు మొత్తం 30వేల ఎకరాలు ముంపుకు గురవుతాయని, 12 గ్రామాలలోని పదిహేను వేల ఐదువందల మంది నిరాశ్రయులవుతారని ప్రభుత్వం ఇచ్చిన సమాచారం. ఈ ప్రాజెక్ట్ లక్షలాది టన్నుల సున్నపురాయి నిక్షేపాలను ముంపుకు గురిచేస్తుంది. సిమెంట్ పరిశ్రమపై ఆధారపడ్డ యువకులు ఎందరో ఉపాధి కోల్పోతారు. హడావిడిగా ప్రభుత్వం ఈ పథకాన్ని చెపట్టే సమయానికి పర్యావరణ అటవీశాఖ అనుమతులులేవు. 'పులిచింతల' ఆనకట్టకు బదులుగా హాలియా, మూసి, పిడుగురాళ్ల, పాలేరు, మున్నేరు లు కృష్ణానదిలో కలిసేచోట అయిదు చిన్నచిన్న బ్యారేజీలు కట్టవచ్చన్న నిపుణుల సలహాలు ప్రభుత్వం పట్టించుకోక తన నియంతృత్వ పోకడలు కొనసాగిస్తూ మొండిగా ప్రాజెక్ట్‌ను కొనసాగించడం ఈ వివాదానికి మూలకారణం. ఈ వివాదం ప్రధానంగా తెలంగాణ కోస్తాజిల్లా మధ్య కొనసాగుతోంది.

పోలవరం

పదహారు వేల రెండు వందల కోట్ల రూపాయల ఖర్చుతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం మొదలెట్టిన భారీ ప్రాజెక్ట్ పోలవరం. దీన్ని వ్యతిరేకిస్తున్నది రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతం. ప్రాజెక్ట్ మూలంగా నిర్వాసితులయ్యే ఖమ్మం, ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు, ముఖ్యంగా గిరిజనులు, కోస్తా జిల్లాల్లోని కొన్ని రైతు, స్వచ్ఛంద సేవా సంఘాలు - పొరుగున ఉన్న ఛత్తీస్‌గడ్, ఒరిస్సా రాష్ట్రాలు.

ఎలాంటి అనుమతి (కేంద్ర జలసంఘం, పర్యావరణ, అటవీశాఖ, గిరిజన మంత్రిత్వశాఖ, ప్రణాళికా సంఘం మొదలైనవి) లేకుండా, ఎందరు వారిస్తున్నా వినకుండా 'తాను బట్టిన కుందేలుకు మూడేకాళ్లు' అన్న రీతిలో ప్రాజెక్ట్‌ను మొదలుపెట్టి, అనేక చిక్కుల్లోపడి శ్లేష్మంలో ఈగ లాగ కొట్టమిట్టాడుతూ చివరకు 'దేవుడా నీదే భారమన్నట్టు' సుప్రీం కోర్టు వైపు దీనంగా చూస్తూ మీనమేషాలు లెక్కబెడుతోంది ప్రభుత్వం. ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం ఈ ప్రాజెక్ట్ కట్టితే 7 లక్షల 20 వేల ఎకరాలు సాగులోకి వస్తాయి. (23 లక్షల 21 వేల ఎకరాలని వేరే ఓ జి.ఓ.లో పేర్కొంటూ, అందుకు అనుగుణంగా కాల్వల సైజులు పెంచి తవ్వటం వేరే సంగతి). ఈ ప్రాజెక్ట్ రాదేమోనన్న అనుమానంతో గత ప్రభుత్వం 'తాటిపూడి', 'పుష్కరం' ఎత్తిపోతల పథకాలను పోలవరం ఆయకట్టులో చేపట్టింది. అవి పూర్తవుతే ఇంకా సాగుకు మిగిలేది చాల కొద్ది భూమి మాత్రమే. కనుక ఈ ప్రాజెక్ట్ అవసరం లేదని, కట్టుకోవాలనుకుంటే ముంపులేని ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని మేధావులు ఎందరో విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. 276 గ్రామాలను (400కు పెరుగుతుందని తాజా అంచనా), లక్షలాది గిరిజనులను, 637 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని, అనేక హెక్టార్ల్ అడవిని ముంపుకు గురిచేయటమే కాకుండా దేశంలోని ఏ ఇతర ప్రాజెక్ట్‌లో కూడా లేని ముంపుకు గురయ్యే భూమి, లబ్ధిపొందే ఆయకట్టు నిష్పత్తిని (21.89 శాతం) కలిగి ఉండి కేవలం 'అహం' సమస్యతో కొనసాగిస్తున్న ఈ ప్రాజెక్ట్ రాష్ట్రంలోని ప్రాంతాల మధ్యే కాకుండా అంతర్రాష్ట్ర వివాదాలకు మూలకారణమైంది.

పోతిరెడ్డిపాడు

నిజానికిది ప్రాజెక్ట్ కాదు. ప్రాజెక్ట్‌లకు నీరందించే గేట్ మాత్రమే. ప్రస్తుతం ఈ గేటు సామర్థ్యం 11 వేల క్యూసెక్కులు. గేటు తెరిస్తే రోజుకు ఒక టిఎంసి నీరు వెళుతుంది. కృష్ణా నదిపైన నిర్మించిన శ్రీశైలం డ్యాం ఎగువన తీరప్రాంతాన కట్టిన ఈ హెడ్ రేగ్యులేటర్‌ని భారీగా నాలుగింతల సైజును పెంచుతూ ఉన్న రెగ్యులేటర్‌కు అదనంగా 44 వేల క్యూసెక్కులకు పెంచడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం.

వివాదమేమంటే, ఈ ప్రాజెక్ట్‌కు ఆమోదం తెలిపిన ప్రభుత్వం కృష్ణా జలాలను 30 రోజుల్లో రోజుకు 4 టిఎంసిల చొప్పున 120 టిఎంసిల నీటిని ఈ నీటిపై ఆధారపడ్డ తెలుగుగంగ, శ్రీశైలం కుడి కాలువ, గాలేరునగరి, మద్రాస్‌కు తాగు నీరు వ్యవస్థలకు అందిస్తామని జి.ఓ.170 విడుదల చేసింది. అంతకుముందే వ్యూహాత్మకంగా జి.ఓ.107ని విడుదల చేసి శ్రీశైలం రిజర్వాయర్‌లోని కనీస నీటి మట్టాన్ని 834 నుంచి 854 అడుగులకు పెంచింది. 854 అడుగుల స్థాయి



గుంటూరు శేషేంద్ర శర్మ

ప్రముఖ సాహితీవేత్త గుంటూరు శేషేంద్ర శర్మ (79) మే 30 రాత్రి మరణించారు. ఆయన 1927లో నెల్లూరు జిల్లా తోటపల్లి గూడురు గ్రామంలో జన్మించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డిప్యూటి మునిసిపల్ కమిషనర్‌గా పనిచేశారు. 'నాదేశం–నా ప్రజలు', 'శేషజ్యోత్స్న', 'రక్తరేఖ', 'గొరిల్లా', 'ఆధునిక మహాభారతం', 'జనవంశం', 'రుతుఘోష', 'మండేసూర్యుడు', 'స్వర్ణహంస', 'రామాయణ రహస్యాలు' వంటి రచనలు చేశారు. 'కవిసేన మేనిఫెస్టో' ఆయన సుప్రసిద్ధ రచన. ఆయన సాహిత్య కృషికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 1994లో తెలుగు విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసింది. కవిత్వం, సాహిత్య విమర్శ ఇతర వచన రచనలన్నీ కలిపి 40కి పైగా పుస్తకాలు వచ్చాయి.

ధన్‌రాజ్‌గిరీ సాహచర్యంతో రాణివాసానికి వెళ్లి సాహిత్య సామ్రాట్‌గా మారినట్లు కనిపించినా, ఆయన చివరి దాకా ఎస్టాబ్లిష్‌మెంట్‌కు దూరంగానే ఉన్నారు. ఉద్యోగం తొలిరోజుల్లో శ్రీకాకుళం జిల్లా ఉద్యోగ సంఘాన్ని ఐ.వి. సాంబశివరావుతో కలిసి నిర్మాణం చేసి కమ్యూనిస్టుగా ముద్రపడి ప్రభుత్వం కన్నెర్రకు గురయ్యారు. ఎమర్జెన్సీ (1975–77) లో వెంగళరావు ప్రభుత్వం ఆయనను నిర్బంధ పదవీవిరమణకు గురిచేసింది. 1955 ఆంధ్రా ఉపఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీవైపు నిలబడిన శ్రీశ్రీ దాదాపు మతిస్థిమితం కోల్పోయినప్పుడు ఆయనకు అండగా కవిత రాసి ఓటమి తాత్కాలికమే అని ప్రోత్సహించిన కవి శేషేంద్ర. ఇంక 1991 నుంచి గల్ఫ్ యుద్ధాన్ని ఖండిస్తూ అమెరికా సామ్రాజ్యవాదాన్ని స్థిరంగా వ్యతిరేకించిన శేషేంద్ర 'నీతులు చెప్పే అమెరికా – ఇదీ నీ చరిత్ర' అని వ్యాస సంపుటి వెలువరించారు. ఆయన మరణానికి 'వీక్షణం' తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తోంది. ◆

ఉంటే తప్ప పోతిరెడ్డి రెగ్యులేటర్ నుంచి కృష్ణనీరు రాయలసీమ ప్రాజెక్టలకు ప్రవహించదు. ఇలా 30 రోజుల్లో కృష్ణ జలాలను పక్కనున్న పెన్నా బేసిన్లోకి తరలిస్తే ఈ నీటిపై ఆధారపడ్డ నాగార్జునసాగర్, కృష్ణా డెల్టా పరిస్థితి ఏమిటని గగ్గోలు పెడితే, ప్రభుత్వం 'అబ్బే మీ నీళ్లు మేం తీసుకుపోం. మా నికరజలాలు మాకే, మేం తరలించేది సముద్రంలోకి వృథాగా వెళ్లే వరదజలాలు' అని బుకాయిస్తోంది. వరద జలాలు తీసుకెళ్లాలంటే పోతిరెడ్డి తూము 841 అడుగుల స్థాయి నుంచెందుకు, పైన పూర్తిజలస్థాయి 885 అడుగులకు కాస్త దిగువన అంటే 880 లేక 875 అడుగుల స్థాయిన స్పిల్ వే (మత్తడి లాంటిది) ఏర్పాటు చేసుకోవచ్చు గదా అంటే సాధ్యపడదని మొండిగా వాదిస్తోంది. మరోమాటలో చెప్పాలంటే 'వరదజాలల' పేరుతో 'నికరజలాలను' ముమ్మాటికీ రాయలసీమ ప్రాజెక్టలకు తరలించే ఉద్దేశ్యంతో ఈ ప్రాజెక్ట్ ఆగమేఘాల పైన జి.ఓలు ఇచ్చి రాత్రింబవళ్లు పని చేసి రెండేళ్ల లోపు పూర్తి చేయాలని ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వం, ఇంతటి దుర్బుద్ధితో సాగుతున్న ఈ ప్రాజెక్ట్ తెలంగాణ, కోస్తా రైతాంగ ప్రజల గుండెలను మండిస్తుందనడంలో ఆశ్చర్యమేముంది, అందుకే ఈ వివాదం.

దుమ్ముగూడెం – నాగార్జునసాగర్ టెయిల్ పాండ్

ఇది మరో దుర్మార్గమైన ప్రాజెక్ట్. సవివరమైన అధ్యయనం జరపకుండా అంటే డీటేయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డిపిఆర్) తయారు కాకుండానే ఆగమేఘాలపైన టెండర్లు పిలిచి పని ప్రారంభించడానికి పూనుకుంది ఈ ప్రభుత్వం. గోదావరిలోని 165 టిఎంసిల నీటిని కృష్ణా బేసిన్‌కి తరలించే ఉద్దేశ్యం ఈ ప్రాజెక్ట్‌ది. అంటే పోతిరెడ్డిపాడు ద్వారా జరిగే నష్టాన్ని పూడ్చడానికి జరిపే ప్రయత్నమిది. గోదావరిలోని నీటిని తరలిస్తే ఆ నీటిపై ఆధారపడ్డ ఉత్తర తెలంగాణ జిల్లాల్లోకి అంటే ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ రైతాంగానికి ఆగ్రహం వస్తుందని మళ్లీ ఇక్కడకూడా 'పోతిరెడ్డి' మాదిరిగానే 'వరద జలాల' నాటకమాడుతూ నికరజలాలను తస్కరించడానికి వేసిన కుటిల ప్రణాళిక ఇది. తెలంగాణలో గోదావరి నదిపై ఏనాడో ప్రారంభించిన శ్రీరాంసాగర్ పనులు పూర్తికాలేదు. వరద కాలువ ఎల్లంపల్లి దేవాదుల పనులు నత్తనడక నడుస్తున్నాయి. ఇచ్చంపల్లి మొదలేకాలేదు. ఈ నేపథ్యం లో ఏవో కొంపలంటుకుంటున్నట్టుగా ఈ ప్రాజెక్టలు ప్రారంభించడం కేవలం 'స్వార్థం' తోనే అన్న విషయం తేటతెల్లమవ్వడమే. ఈ వివాదానికి కారణం, ఈ ప్రాజెక్టను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నవారు సాగర్ ఎడమ, కుడికాలువ ఆయకట్టుదారులు, గ్రావిటీ మార్గంగా వచ్చే కృష్ణా జలాలను వదులుకుని భారీ ఎత్తిపోతల మార్గంగా అందచేసే గోదావరి జలాలను వాడుకోవడానికి మేమేం వెర్రి వెంగళప్పలమా అని తెలంగాణ, కోస్తా రైతాంగం ప్రశ్నిస్తుంటే ప్రభుత్వం కిమ్మనకుండా ఉంది. నిజానికి డెల్టా రైతాంగం కూడా, తమ అసంతృప్తిని వెలిబుచ్చవలసింది. కాని వాళ్లకు 'పులిచింతల', 'పోలవరం' తాయిలం చూపి వాళ్ల నోరు మూయించ గలగడంలో సఫలీకృతమైంది ప్రభుత్వం.

ముక్తాయింపు

తాజాగా జి.ఓ 34 విడుదల చేస్తూ మరో వివాదానికి తెరలేపింది ఈ ప్రభుత్వం. ఇలా రోజుకో వివాదాస్పదమైన జి.ఓ ఇస్తూ, ప్రాజెక్టలు కడతామని హామీలు కురిపిస్తూ, అనుమతులు లేకుండా ప్రాజెక్టలు కాంట్రాక్టులకిస్తూ, భారీగా అవినీతిని ప్రోత్సహిస్తూ, తమకు కావలసిన పనిని అంటే రాయలసీమ ప్రాజెక్టలను కట్టుకుంటూపోతూ, ఇతర ప్రాంతాల ప్రజలను మభ్యపెడుతూ కాలంగడుపుతూ ఉన్న ఈ ప్రభుత్వాన్ని 'జలయజ్ఞం ప్రభుత్వం' అందామా 'జగడాలప్రభుత్వం' అందామా? ◆

రాష్ట్ర నీటివనరులకు సంబంధించిన వివాదాల మూలాలను చారిత్రకంగా చర్చించి తక్షణ ప్రత్యామ్నాయాన్ని సూచిస్తున్నారు **కె. బాలగోపాల్**

జల రాజకీయాలు ప్రాంతీయ అసమానతలు

నీటి హక్కుల విషయంలో రాష్ట్రంలో అసమానత ఇవ్వాళ పుట్టింది కాదు. మొదటి నుండీ ఉంది. పులిచింతల, పోలవరం ప్రాజెక్టులు కట్టేస్తే అది స్థిరపడిపోతుంది. ఇప్పుడు ఆందోళన ఎక్కువ జరగడానికి కారణం ఏమిటంటే వై.ఎస్. రాజశేఖర రెడ్డి జలయజ్ఞం పేరిట ఉన్న నీటినే కాక ఊహించిన దాన్ని కూడ శాశ్వతంగా పంచేస్తున్నాడు. అతని పాలన అయిపోయే నాటికి ఇంక నీటి గురించి కొట్లాడుకోవడమే తప్ప మాట్లాడుకునేదేమీ ఉండదు. నీటి హక్కులు హేతుబద్ధంగా నిర్ధారించి ప్రాజెక్టులు కట్టేబదులు ప్రాజెక్టులు కట్టేసి వాటికి కేటాయించిన నీటి ప్రాతిపదికన హక్కులు నిర్ణయిస్తున్నాడు. దురదృష్టవశాత్తు తెలంగాణ, రాయలసీమల మధ్య విద్వేష వాతావరణం ఉండడం వల్ల దీనిని గురించి హేతుబద్ధమైన చర్చ జరిగే పరిస్థితి లేదు. ఆ విద్వేషాన్ని రాజశేఖరరెడ్డి పనిగట్టుకొని పెంచుతుండగా అది ఒక ఫాసిస్ట్ ఎత్తుగడ అని చూడలేని జనం అతను కోరుకున్నట్టే రెండుగాచీలి పరస్పరం ద్వేషించు కొంటున్నారు. ప్రజల మధ్య ఎన్ని చీలికలుంటే, ఆ చీలికలు ఎంత ద్వేషపూరితంగా ఉంటే, నాయకులు అంత భద్రంగా ఉంటారనేది ఫాక్షనిస్ట్ రాజకీయాల ప్రాథమిక సూత్రం. రాజశేఖర రెడ్డి దానిని సమర్థంగా అమలు చేసి అడుగడుగు ఎదిగాడు. అతను పైకిపోయేకొద్దీ రాష్ట్ర రాజకీయాలకు నష్టం అని తెలిసినవాళ్లం గుర్తించాం గానీ, రాష్ట్రంలో సాగునీటి హక్కులు దానికి బలవుతాయని ఊహించలేదు. నీటి హక్కులతో రాజశేఖరరెడ్డి ఆటలాడుకొంటుండగా కోస్తా జిల్లాల వాళ్లు మాకు దక్కేది దక్కేసిందని హాయిగా ఉన్నారు. తెలంగాణ వాళ్లు రాయలసీమను ద్వేషించడంలో సంతృప్తి చెందుతున్నారు. రాయలసీమ వాళ్లు రాజశేఖరరెడ్డి మీద ఈగవాలకుండ జాగ్రత్త పడుతున్నారు. ఇదే నిజం కాకపోతే, కరువు ప్రాంతాల ప్రాజెక్టలయిన ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు, శ్రీశైలం ఎడమ గట్టు కాలవకు, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి, తెలుగు గంగకు, గాలేరు-నగరికి, హంద్రీ-నీవాకు, వెలుగొండకు ఇవ్వాళే కాదు ఎప్పటికీ నికర జలాలు అడగబోమని రెండవ కృష్ణా ట్రిబ్యునల్‌కు రాజశేఖరరెడ్డి ప్రభుత్వం హామీ ఇచ్చి హాయిగా వెనక్కి వచ్చి ఉండేది కాదు. తెలంగాణ, రాయలసీమల మధ్య ఏకొంచెం సదవగాహన ఉన్నా ఈ పని చేసిన తరువాత రాజశేఖర రెడ్డి ప్రభుత్వానికి కంటిమీద కునుకు ఉండేది కాదు. ప్రత్యేక రాష్ట్రం సాధించి నీటి హక్కులు నెలకొల్పుకుంటాం అని తెలంగాణ వాళ్లు ఊరుకున్నారు. రాజశేఖరరెడ్డి దొడ్డిదారిన నీళ్లు తెస్తున్నాడు, అనవసరంగా మాట్లాడి దానిని పాడు చేయొద్దని రాయలసీమ వాళ్లు ఉరుకున్నారు.

ముగింపును ఉపోద్ఘాతంగా చెప్పడంలో ఉద్దేశ్యం ఏమిటని అడుగుతారేమో. ఈ ముగింపు వెలుగులోనే నీటి హక్కుల చరిత్రను చూడకతప్పదు కాబట్టి ఈ ఉపోద్ఘాతం అవసరం.

నీటి వనరుల మీద హక్కును ఏ విధంగా పంచడం న్యాయం అనే విషయంలో భారతదేశంలో ఒక విధానంగానీ, ప్రమాణం గానీ ఏదీ లేదు. ఎవరి నీటి వనరుల మీద వారికే మొదటి హక్కు ఉంటుంది అనేది చాల మందికి ఆకర్షణీయంగా తోచే ప్రమాణం. దాని ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే దోపిడీదారు. కృష్ణా, గోదావరి నదుల జలాలలో మన వాటాగా మనం పొందిన దానిలో చెప్పుకోదగ్గ మొత్తం ఇతర రాష్ట్రాలకు (ఈ అర్థంలో) చెందినది. కృష్ణా నదీ జలాలలో మన వాటా అయిన 800 టిఎంసిలలో దాదాపు 200 టిఎంసిలు కర్నాటకకు చెందినవి. గోదావరి మాటకొస్తే, మన రాష్ట్ర వాటా అయిన 1480 టిఎంసిలలో పెద్ద ఎత్తున ఛత్తీస్‌గడ్‌కూ, విదర్భకూ చెందినది. మన వాటా గురించి ఒప్పందం జరిగినప్పుడు ఛత్తీస్‌గడ్ అనే రాష్ట్రం లేదు. అది మధ్యప్రదేశ్‌లో భాగంగా ఉండేది. విదర్భ ఆనాడూ ఈనాడూ తన ప్రయోజనాలు తాను కాపాడుకునే అధికారం ఉన్న ప్రాంతం కాదు. ఈ రెండు ప్రాంతాలకూ ఆనాడు అటువంటి అధికారం ఉండి ఉంటే గోదావరి నదీ జలాలలో మనకింత వాటా దక్కేది కాదు. ప్రాంతాలవారీగా తెలుగువాళ్లం 'ఇవి మానీళ్లు' అంటే 'మానీళ్లు' అని కొట్లాడుకునేటప్పుడు అందులో చెప్పుకోదగ్గ మొత్తం మనెవ్వరిదీ కాదని గుర్తుంచుకుంటే ఆవేశాలు కొంచెం తగ్గుతాయేమో.

అయితే ఎవరి నీటి వనరుల మీద వారికే మొదటి హక్కు అనేది పైకి తోచినంత న్యాయమైన ప్రమాణం కాదు. వర్షపాతం తక్కువ ఉండి ఏ నదీ లేని ప్రాంతాలు ఉంటాయి. వారికి అందుబాట్లో ఉన్న నీటి వనరుల మీద మాత్రమే వారికి హక్కు ఉంటుందంటే వారెట్లా బతకాలి?

జీవించే హక్కు అందరికీ ఉంటుందనీ అందరికీ సమానంగా ఉంటుందనీ ఒప్పుకునేటట్లయితే నీరు ఒక అనివార్యమైన జీవిత అవసరం కాబట్టి నీటి మీద అందరికీ సమాన హక్కు ఉంటుందని అనవలసి ఉంటుంది. అంటే నీటి వనరులు ఎక్కువ ఉన్న ప్రాంతం నుండి తక్కువ ఉన్న ప్రాంతానికి నీటిని తరలించవలసి ఉంటుంది.

నీటికి మూలం వర్షం. అది మూడు రూపాలలో నిలువ ఉంటుంది. నేలలో తేమ, భూగర్భజలాలు, ఉపరితల జలాలు. ఉపరితల జలాలు ప్రకృతిసిద్ధమైన కుంటలలో, వాగులలో, నదులలోనే కాక, కృత్రిమంగా నిర్మించిన చెరువులు, డ్యాంలలోను అందు బాట్లో ఉంటాయి. వర్షపాతం తక్కువ ఉన్న ప్రాంతాలలో నేలలో తేమ తక్కువ నిలుస్తుంది. భూగర్భ జలమట్టం లోతున ఉంటుంది. తగు చర్యలు తీసుకుంటే వీటిని కొంత మెరుగుపరచ వచ్చును గానీ దానికి సహజ పరిమితులు ఉంటాయి. అందువల్ల ఉపరితల నీటి వనరులను పెంపొందించడం, అందుకోసం ఇతర ప్రాంతాల నీటి వనరులను తరలించడం అవసరం. నదీ జలాల ప్రాజెక్ట్‌లు దీనికొక సాధనం. వాటినుండి నేరుగా కాలవల ద్వారా నీళ్లు సరఫరా చేయొచ్చు, చెరువులు నిర్మించి వాటిని నింపవచ్చు. నదీజలాల ప్రాజెక్ట్‌లను అసమాన నీటి వనరులున్న ప్రాంతాల మధ్య సాధ్యమైన మేరకు సమానత్వాన్ని తీసుకొచ్చే సాధనాలుగా చూడడం ఉచితంగా ఉంటుంది.

కానీ నిజానికి నీటి హక్కుల పంపిణీకి ఇవేవీ ప్రమాణాలుగా లేవు. చారిత్రకంగా జరిగింది జరిగిపోగా ఆపైన రాజకీయ ప్రాబల్యం నిర్ణయాత్మకంగా ఉంది. కృష్ణా, గోదావరి నదులకు సంబంధించి, 19వ శతాబ్దం మధ్య భాగంలో బ్రిటిష్ వాళ్లు బెజవాడ దగ్గర, రాజమండ్రి దగ్గర కట్టిన మళ్లింపు పథకాలు మొదటి ప్రాజెక్ట్‌లు. అప్పట్లో సాగునీటి కంటే కూడ వరదల నియంత్రణ, కాలవల ద్వారా రవాణా ఈ ప్రాజెక్ట్‌ల ప్రధాన లక్ష్యాలు. ఆ తరువాత తుంగభద్ర నది మీద సుంకేసుల వద్ద ఆనకట్టకట్టి కె.సి.కెనాల్ తవ్వారు. ఇది కడప, కర్నూలు జిల్లాలకు నీళ్లిస్తుంది. 1958లో దానికి ఎగువన రాజోలిబండ మళ్లింపు పథకం నిర్మించారు. ఇది మహబూబ్‌నగర్‌కు నీళ్లిస్తుంది. హోస్పేట్ దగ్గర కట్టిన టి.బి. డ్యాం కర్నాటకకు నీళ్లిస్తూ మన రాష్ట్రంలో అనంతపురం, కర్నూలు జిల్లాలకు ఎగువ కాలువ, దిగువ కాలువల ద్వారా నీళ్లిస్తుంది. ఆ తరువాత నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కట్టి ప్రధానంగా గుంటూరు, నల్గొండ జిల్లాలకు, కొంత ఖమ్మం, కృష్ణా, ప్రకాశం జిల్లాలకూ నీళ్లిచ్చారు.

అప్పటిదాకా కృష్ణా, గోదావరి నదుల వినియోగానికి సంబంధించి వివిధ పరీవాహక ప్రాంతాల మధ్య ఒప్పందంగానీ ట్రిబ్యునల్ ఆదేశం గానీ లేదు. నాగార్జునసాగర్ నిర్మాణాన్ని చేపట్టేటప్పటికి అప్పటి మైసూరు, మహారాష్ట్ర ప్రభుత్వాలు కృష్ణా జలాల మీద ఆంధ్రప్రదేశ్ తన అర్హతకు మించిన హక్కులు నెలకొల్పుకుంటూ ఉందని సహేతుకమైన అభ్యంతరాలు లేవదీస్తున్నప్పటికీ పట్టించుకోకుండ ఆ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసేసుకున్నాం. ఈ ఘనకార్యం సాధించినందుకే ఆంధ్రులకు కె.ఎల్. రావు ఆరాధ్యుడయ్యారు.

రాష్ట్రంలోపల ప్రాంతీయ జల రాజకీయాలకు కూడ నాగార్జునసాగర్ నాంది పలికింది. మద్రాస్ రాష్ట్రం నుండి తెలుగు మాట్లాడే ప్రాంతాలను వేరు చేసి ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయాలని కోస్తాజిల్లాలవాళ్లు ప్రతిపాదించినప్పుడు రాయలసీమవాళ్లు తటపటాయించారు. రాయలసీమ ప్రయోజనాలు ఆంధ్రుల పెత్తనం కంటే తమిళుల పెత్తనంలో మెరుగుగా ఉంటాయేమోనన్న సందేహం వారిలో ఉండింది. వారిని ఒప్పించడానికి 1937లో సర్కార్, రాయలసీమ పెద్దల మధ్య జరిగిన శ్రీబాగ్ ఒప్పందంలో కృష్ణా జలాల వినియోగంలో రాయలసీమ ప్రయోజనాలకు మొదటి ప్రాధాన్యం ఉంటుందని హామీ ఇవ్వడం జరిగింది. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. ఆ తరువాత తెలంగాణను కలుపుకొని విశాలాంధ్ర ఏర్పాటు చేయాలని ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల వారు కోరుకున్నప్పుడు ఇంకా గట్టి ప్రతిఘటనే ఎదురయ్యింది. తెలంగాణ నాయకులను ఒప్పించడానికి 1956లో చేసుకున్న పెద్ద మనుషుల ఒప్పందంలో తెలంగాణలో నీటి పారుదలకు సంబంధించిన నిర్ణయాలన్నీ తెలంగాణ ప్రాంతీయ మండలే నిర్ణయిస్తుందని ఆంధ్ర, రాయలసీమ నాయకులు హామీ ఇచ్చారు. ఈ రెండు హామీలకూ సమన్వయం ఎట్లాకుదురుతుందని పెద్దలంతా భావించారో తెలీదుగానీ మొట్టమొదట కట్టిన నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ రెండిటికీ విరుద్ధంగా సాగింది. అది రాయలసీమకు చుక్కనీరివ్వదు. తెలంగాణ విషయానికొస్తే అంతకు ముందు నిజాం ప్రభుత్వం అదే ప్రాంతంలో నందికొండ ప్రాజెక్ట్ ప్రతిపాదించి ఉండింది. దాని కింద తెలంగాణ ప్రాంతంలో 7 లక్షల ఎకరాలకు, కృష్ణా జిల్లాలో 2 లక్షల ఎకరాలకు నీళ్లు అందేవి. దానిని చేపట్టకుండ నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌లో ఎడమ కాలువకు సగం నీళ్లు, కుడికాలువకు సగం నీళ్లు కేటాయించారు. అయితే కుడికాలువ మొత్తం గుంటూరు, ప్రకాశం జిల్లాలకు పోతుండగా ఎడమకాలువ వాటాలో నాలుగవ వంతు మళ్లీ కృష్ణా జిల్లాకు కేటాయించబడింది.

అక్కడితో కృష్ణా నదీజలాలు ఆంధ్రప్రదేశ్ తీసుకోగలిగిన దానికంటే చాలా ఎక్కువ తీసేసుకొన్నట్టయింది. ఆ ఫిర్యాదే మైసూరు, మహారాష్ట్రలు చేయగా కేంద్ర ప్రభుత్వం అంతర్రాష్ట్ర నదీ జలాల చట్టం కింద బచావత్ ట్రిబ్యునల్‌ను నియమించింది. బచావత్ ట్రిబ్యునల్ ముందుకు మన పాలకులు పోయి తెలంగాణలోనూ రాయలసీమలోనూ ఉన్న కరువును ఏకరవు పెట్టి ఇంకా నీళ్లిమ్మని అడిగారు. అయితే కృష్ణా నదిలోని నీరొచ్చి చేరేది అధికంగా కర్నాటకలోని పడమటి కనుమల ప్రాంతంలో. మనం అప్పటికే వాడుకుంటున్న నీళ్లలో దాదాపు 200 టిఎంసిలు (ఏ ప్రాంతపు నీటి వనరులు ఆ ప్రాంతానికే చెందుతాయన్న సిద్ధాంతం ప్రాతిపదికన) 'వాళ్లవే'. అంతేకాక కర్నాటకలోనూ కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో పడమటి కనుమలను దాటికిందికి వస్తే కరువు దండిగానే ఉంది. కాబట్టి ఇంక ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వడం కష్టం అని భావించిన బచావత్ ట్రిబ్యునల్ ఒకే ఒక్క ప్రాజెక్ట్‌కు నీటి కేటాయింపు చేసింది. అది మహబూబ్‌నగర్‌లోని జూరాల. 1970లో ప్రకటించిన బచావత్ అవార్డు 17.5 టిఎంసిల నీటి కేటాయింపుతో ఆమోదించిన ఈ ప్రాజెక్ట్ చాలా ఆలస్యంగా కట్టడమే కాక ఇప్పటికీ పూర్తి సామర్థ్యంతో నిర్మించలేదంటే ప్రాంతీయ వివక్షకు మహబూబ్‌నగర్ ఎంతగా బలయిందో అర్థం అవుతుంది. జూరాలను పూర్తిసామర్థ్యంతో నిర్మించినట్టయితే కర్నాటక భూములు మునుగుతాయని దానిని వాయిదా వేయడం జరుగుతున్నది. నీళ్లు వచ్చేది మహబూబ్‌నగర్‌కు కాక వేరే జిల్లాకయి ఉంటే ఆ ముంపుకు నష్టపరిహారం

తగుమాత్రం చెల్లించి కర్నాటకను ఒప్పించేవారు కాదా? ఒక్క జూరాల విషయంలోనే కాదు అన్ని రకాలుగానూ కృష్ణా జలాల వాడకంలో ప్రాంతీయ వివక్ష వల్ల ఏ రాయలసీమ జిల్లా కంటే కూడ ఎక్కువ నష్టపోయింది మహబూబ్‌నగర్. కృష్ణా నది పరీవాహక ప్రాంతం మహబూబ్‌నగర్‌లో ఎక్కువ ఉంది కాబట్టి ఆ నది నీటిలో ఎక్కువ వాటా ఆ జిల్లాకు రావాలన్న వాదన సమంజసమైనదని నేనుఅనుకోవడం లేదు. 'ఎవరి నీటి వనరులు వారివే' అనే వాదన పట్ల నా అభ్యంతరం మొదట్లోనే చెప్పాను. అయితే వర్షాభావప్రాంతం కాబట్టి మహబూబ్‌నగర్‌కు ఎట్లాగూ కృష్ణా నదీ జలాలు తగుమాత్రం దక్కవలసి ఉంటుంది. ఆ ప్రాతిపదికన కూడ మహబూబ్‌నగర్‌కు అందరికంటే అధికంగా అన్యాయం జరిగింది. అనంతపురం కూడ ఆ తరువాతే వస్తుంది.

పాత ప్రాజెక్టుల ఆధునీకరణలో ఈ విషయం స్పష్టంగా కనిపిస్తుంది. కృష్ణా డెల్టా వర్క్సును పూర్తిస్థాయిలో ఆధునీకరించారు. మళ్లింపు పథకంగా ఉన్న దాని కట్ట ఎత్తు పెంచి రిజర్వాయర్ తయారు చేశారు. ఆ తరువాత కె.సి. కెనాల్‌ను కూడా సమగ్రంగా బాగు చేసారు. ఎత్తయిన కట్ట కట్టి కాలవలకు నీటి భరోసా ఇవ్వడమే కాక, శ్రీశైలం నుండి ఏ చట్టపరమైన అనుమతీ లేకుండ 10 టిఎంసిలు ఎస్కేప్ చానెల్ ద్వారా కె.సి. కెనాల్‌కు ఇవ్వసాగారు. హోస్పెట్‌లోని తుంగభద్ర డ్యాంలో పూడిక పెరగడం వల్ల తగినంత నీళ్లు రావడం లేదనీ అందువల్ల కె.సి. కెనాల్ వాటా ఈ విధంగా తీసుకోవలసి వచ్చిందనీ ఈ చర్యను సమర్థించుకున్నారు. బాగానే ఉంది. కానీ ఆ పూడిక వల్ల అనంతపురం జిల్లాకు నీళ్లిచ్చే ఏకైక కాలవ అయిన తుంగభద్ర ఎగువ కాలవలో కూడ ప్రవాహం తక్కువగా ఉంటున్నది. దానికి ఒక సమాంతర కాలవ తవ్వి ఆ లోటును భర్తీ చేయాలన్న ప్రతిపాదన చాలాకాలంగా ఉంది. అది కర్నాటకకూ అవసరమే కాబట్టి వారు దానికి సమ్మతిస్తున్నారు. అయినా అది మాత్రం జరగదు. ఇక రాజోలిబండ కాడికొస్తే దాని ఆనకట్ట శిథిలావస్థ చేరుకొని చాలాకాలం అయింది. దాని ఆధునీకరణ ఇప్పటి దాకా చేపట్టకపోవడమే కాక, ఎక్కడెక్కడివో ఉన్నవీ లేనివీ అయ్యేవీ కానివీ అన్ని ప్రాజెక్టులనూ ఏకరవు పెట్టిన 'జలయజ్ఞం'లో దాని ఊసేలేదు.

బచావత్ అవార్డ్ నీటి హక్కుల నిర్ధారణ చేసిన తరువాత హక్కులు లేని నీటి గురించి తెలంగాణ, రాయలసీమల కొట్లాట మొదలయింది. అది ఇప్పటికీ కొనసాగుతోంది. బచావత్ అవార్డు కృష్ణా నదిలో 2060 టిఎంసిల నీటిపై హక్కులు నిర్ధారించింది. అది నాలుగింట మూడేళ్లు నదిలో సగటున అందుబాట్లో ఉండే నీరని అంచనా. దీనిని నికర జలం అంటారు. ఆపైన ఏవైనా నీళ్లు ఏ సంవత్సరమయినా ఉంటే (మిగులు జలాలు) ఆంధ్రప్రదేశ్ వాడుకోవచ్చును గానీ ఆ వాడకం ఆంధ్రప్రదేశ్‌కు హక్కులివ్వదని బచావత్ అవార్డ్ అనింది. ఈ మిగులు జలాలపైన దక్షిణ తెలంగాణకు నాలుగు, రాయలసీమకు మూడు, ప్రకాశం జిల్లాకు ఒకటి మొత్తం ఎనిమిది ప్రాజెక్టులకు హామీలు ఇచ్చి పదేపదే పునాది రాళ్లు వేసి 'జలయజ్ఞం' మొదలయిన తరువాత వేల కోట్లు కుమ్మరించి కట్టేస్తున్నారు మన పాలకులు. నిజంగా ఈ కరువు ప్రాంతాలకు న్యాయం చేసే ఉద్దేశ్యం ఉండి ఉంటే కృష్ణా డెల్టాకు రెండు పంటలకు బదులు ఒక పంటకే నీటిని పరిమితం చేసి సాగర్‌కు ఎగువ నుండి కృష్ణా డెల్టాకు పోయే 80 టిఎంసిల నికర జలాన్ని పైననే ఆపి ఉండవచ్చు. దానిని తెలంగాణ, రాయలసీమ జిల్లాల్లో అత్యవసరమైన రెండు ప్రాజెక్టులకు (కల్వకుర్తి, హంద్రీ-నీవా) చెరి 40 టిఎంసిల చొప్పున కేటాయించి ఉండవచ్చు. లేదా వాటికీ ప్రకాశం జిల్లా వెలుగొండ ప్రాజెక్టుకూ తలా 25 టిఎంసిల చొప్పున కేటాయించి ఉండవచ్చు. తీవ్ర దుర్భిక్షం ఎదుర్కొంటున్న ప్రాంతాల కోసం ఈ మాత్రం కూడ చేయలేక పోవడం మన రాష్ట్ర రాజకీయాలలోని ప్రాంతీయ ఆధిపత్యానికొక తార్కాణం.

రాష్ట్రావతరణ తరువాత నికర జలాల హక్కులు నాగార్జున సాగర్ ద్వారాను, జూరాలకు బచావత్ అవార్డ్ ఇచ్చిన ఆమోదం ద్వారాను తెలంగాణకే కొంత దక్కగా ఆ తరువాత మిగులు జలాల రాజకీయంలో రాయలసీమదే కొంత మేరకు పైచేయి అయింది. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్ట్ ఈ మధ్య చేపట్టే దాకా తెలంగాణకు మిగులు జలాలు ఇవ్వలేదు. కడప జిల్లాకు మిగులు జలాలిచ్చే తెలుగు గంగ ఇరవై ఏళ్లనాడే మొదలయింది. (అదికూడ ఇప్పుడిప్పుడే పూర్తవుతున్నదనుకోండి). గాలేరు-నగరి పనులిప్పుడే వేగంగా పూర్తి అవుతున్నాయి. దానికి నీటి భద్రత కల్పించడం కోసం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచడమూ జరిగింది.

'రాయలసీమ' అంటున్నాం గానీ మిగులు జలాల రాజకీయాల వల్ల ప్రయోజనం పొందుతున్నదంతా పెన్న, కుందు నదుల పరీవాహక ప్రాంతమైన కర్నూలు జిల్లా పడమటి భాగం, కడప జిల్లా తూర్పు భాగం. తెలుగు గంగ, గాలేరు నగరీ నీళ్లిచ్చేది ఈ ప్రాంతానికే, అంతకు ముందు నుండి కె.సి.కెనాల్ వల్ల నీటి మీద, నికరమైన హక్కు ఉన్నదీ ఈ ప్రాంతానికే. పెన్న నది మీద మైలవరం ప్రాజెక్ట్ నీళ్లిచ్చేదీ ఈ ప్రాంతానికే. కేంద్ర జల సంఘం ద్వారా అనుమతి పొందిన శ్రీశైలం కుడిగట్టు కాలువ నీళ్లిచ్చేదీ ఈ ప్రాంతానికే. రాయలసీమలో ఇతర ప్రాంతాలకు 'రాయలసీమ' పేరుమీద జరిగిన సాగునీటి అభివృద్ధి వల్ల దక్కింది శూన్యం.

బచావత్ అవార్డ్‌లో ఒక్క జూరాల మాత్రమే కొత్తగా మంజీరయిన ప్రాజెక్ట్‌కాగా, కృష్ణాడెల్టాను, కె.సి.కెనాల్ ఆయకట్టునూ ఆధునీకరించామనీ మొత్తం 48 టిఎంసిల నీటిని ఆదా చేసామనీ చెప్పి కేంద్ర జల సంఘం నుండి మూడు ప్రాంతాలకూ మూడు ప్రాజెక్టులు మంజూరు చేయించుకుంది రాష్ట్ర ప్రభుత్వం. కోస్తా కోసం 9 టిఎంసిలతో పులిచింతల, రాయలసీమలో (పైన చెప్పిన) కర్నూలు-కడప సరిహద్దు ప్రాంతానికి 19 టిఎంసిలతో శ్రీశైలం కుడి గట్టు కాలవ (ఎస్ఆర్‌బిసి), తెలంగాణలో మహబూబ్‌నగర్‌కు 20 టిఎంసిలతో భీమా ఆమోదం పొందాయి. ఎస్ఆర్‌బిసి అన్నిటికంటే ముందు మొదలై దాదాపు పూర్తయి పోయింది. పులిచింతల అనేక అభ్యంతరాల మధ్య ఆలస్యంగా మొదలయి శరవేగంగా పూర్తవుతున్నది. భీమా మాత్రం ఇప్పుడిప్పుడే మొదలవు తున్నది. పైగా అది ఎత్తిపోతల పథకం కాబట్టి దాని గతి ఏమవుతుందో చెప్పడం కష్టం.

పులిచింతలకు 9 టిఎంసిల నికరజలం కేటాయింపు అప్పుడెప్పుడో జరిగిపోయింది గానీ తరువాత దాని పట్ల తెలంగాణ నుండి వ్యతిరేకత బలంగా వ్యక్తం అయింది. అది కేవలం డెల్టా స్థిరీకరణ ప్రాజెక్ట్. దాని కోసం 9 టిఎంసిల నికర జలం కేటాయించి బహుశా ఇంకొక 30 టిఎంసిల దాకా మిగులు జలం వాడుకోవడం ఎంతవరకు సబబు?

తెలుగుదేశం పాలనలోనే నిర్మించడం మొదలుపెట్టిన ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్ట్‌కు సాగర్ నుండే ఆ 9 టిఎంసిలు కేటాయించినట్టయితే మునుగోడు, నారాయణపురం మండలాల ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు నికర జలాలు ఇయ్యవచ్చును కదా? అది ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం అవుతుంది కదా? అయితే ఏమైనా సరి పులిచింతల ప్రాజెక్ట్ కట్టి తీరవలసిందేనని కోస్తా జిల్లాల వాళ్లు పట్టుబట్టి సాధించుకున్నారు.

ఇక ప్రస్తుత వివాదాల విషయాని కొస్తే 2000లో బచావత్ అవార్డ్ గడువు ముగియగానే ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాలపైన విపరీతంగా ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాలపైన విపరీతంగా ప్రాజెక్ట్‌లు చేపడుతున్న దన్న కర్నాటక ఫిర్యాదు మేరకు కేంద్రప్రభుత్వం రెండవ కృష్ణా జలాల ట్రిబ్యునల్ వేసింది. దక్షిణ తెలంగాణ, రాయలసీమ జిల్లాలలో ఆంధ్రప్రభుత్వం చేపడుతున్న అన్ని ప్రాజెక్ట్‌లను వెంటనే ఆపాలని కర్నాటక ట్రిబ్యునల్ నుండి మధ్యంతర ఆదేశం కోరింది. దానికి జవాబుగా మన ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌లకు నీళ్ల హక్కు కోరబోమనీ నీళ్లు ఉన్నప్పుడు వాడుకోవడం మాత్రమే జరుగుతుందనీ హామీ ఇవ్వడంతో ట్రిబ్యునల్ కర్నాటక అర్జీని కొట్టివేసింది. దీనిని మన 'విజయం'గా పత్రికలు వర్ణించాయి గానీ దీని అర్థం ఏమిటంటే రెండవ కృష్ణా ట్రిబ్యునల్ అవార్డ్ అమలులో ఉన్నంతకాలం, కృష్ణా నదీ జలాల పైన కడుతున్న 8 ప్రాజెక్ట్‌లకూ ఒక హక్కుగా నీళ్లు తీసుకోలేమని. కరువు ప్రాంతాలైన దక్షిణ తెలంగాణ, రాయలసీమలకూ ప్రకాశం జిల్లా మార్కాపురం డివిజన్‌కూ ఇంతకంటే ద్రోహం వేరే ఉండదు.

ట్రిబ్యునల్‌కు ఆ హామీ ఒక పక్క ఇస్తూ మరో పక్క గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించాలని వైఎస్ ప్రభుత్వం భావిస్తున్నట్టు స్పష్టంగా ఉంది. ఇందులోని తప్పొప్పులను అట్లా ఉంచి, దానిని కనీసం న్యాయంగా వివరించే ప్రయత్నం సహితం వైఎస్ చేయదు. గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు తరలించి దక్షిణ తెలంగాణ, రాయలసీమల కోసం కడుతున్న మిగులు జలాల ప్రాజెక్ట్‌లకు నీటి హక్కు కల్పిస్తాం అని అనడు. 'కృష్ణా నది మిగులు జలాలు రాయలసీమకే. తెలంగాణకు గోదావరి జలాలే' అంటాడు. గోదావరి జలాలు కృష్ణా బేసిన్‌కు తరలించి ఆంధ్రప్రాంతానికి పంపించి, కృష్ణా జలాలన్నీ రాయలసీమకు తీసుకుపోతాడు అని తెలంగాణ వాసులకు అనుమానం వచ్చే పరిస్థితి కల్పిస్తాడు. వారికి ఆ అనుమానం వచ్చినందుకు నొచ్చుకోడు. అనుమానంరావడం, తెలంగాణ వాసులు రాయలసీమ పట్ల ద్వేషం మరింత పెంచుకోవడం, అతనికి కావాలి. అప్పుడే రాయలసీమ వాసులు తమకు వైఎస్ తప్ప దిక్కులేదని భావిస్తారు. హేతుబద్ధమైన సపోర్ట్ కూడ సపోర్టేనని రాజకీయాల గురించి ప్రజాస్వామికంగా ఆలోచించే వాళ్లు భావిస్తారు. భయంతో, అభద్రతతో వచ్చే సపోర్టే భద్రమైనదని ఫాక్షనిస్ట్ బుద్ధి భావిస్తుంది.

పోతే, 200 టిఎంసిల గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించి కృష్ణా బేసిన్‌లోని నికరజలాల లోటును భర్తీచేయాలని వైఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం చాలారకాలుగా అవాంఛనీయమైనది. గోదావరి నదిలో మన రాష్ట్రం వాటా అయిన 1480 టిఎంసిలలో ఇంకా 680 టిఎంసి మిగిలిఉన్నాయని అంచనా. పోలవరం ద్వారా అందులో 80 టిఎంసిలు కృష్ణా బేసిన్‌కు, విద్యుదుత్పత్తికీ పశ్చిమ గోదావరి కృష్ణా జిల్లాలలో వ్యవసాయ భూములకూ, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలలో పరిశ్రమల అవసరాలకు 245 టిఎంసిలు తీసుకుంటున్నారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతానికి ఇంకా ఇంత నీళ్లెందుకు కేటాయించాలన్న ప్రశ్నకు ఏజవాబు చెప్పకుండా కాలువలు తవ్వుకుంటూ పోతున్నారు. దుమ్ముగూడెం ద్వారా ఇంకొక 100 టిఎంసిలు కృష్ణా బేసిన్‌కు తరలిస్తున్నారు. అంటే 680లో 245 కోస్తా జిల్లాలకు, జలవిద్యుత్ ఉత్పత్తికి, పోగా 200 కృష్ణా బేసిన్‌కు తరలిస్తే పరీవాహక ప్రాంతమైన ఆరు ఉత్తర తెలంగాణ జిల్లాల అవసరాలకు 235 టిఎంసిలు మిగులుతాయి. ఇది ఆ ఆరు జిల్లాల అవసరాలకు సరిపోదు. పోనీ ఆనీళ్లేమైనా గ్రావిటీ ద్వారా తీసుకునేదా అంటే కాదు. ఇంద్రావతి సంగమ స్థలం తరువాత గోదావరి ప్రవాహ మట్టం 80-90 మీటర్లు ఉండగా ఆ నీరు అందియ్యవలసిన వరంగల్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల మెట్ట భూములు 300 నుండి 500 మీటర్లు ఎత్తున ఉన్నాయి. అంటే ఏ రకంగా ఆ నీళ్లు తీసుకున్నా గణనీయంగా ఎత్తిపోతల ప్రాజెక్టులు కట్టవలసి ఉంటుంది. ఎత్తిపోతల పథకాల నిర్మాణానికయ్యే ఖర్చే కాక, వాటి నిర్వహణకు నిత్యం కరెంట్ ఖర్చవుతుంది. ఎత్తిపోతల ద్వారా తీసుకున్న నీటిని తాత్కాలికంగా నిలువ ఉంచడానికి చాలా చెరువులు కట్టే ఆలోచన కూడా ఉన్నట్టుంది. ఇది ఖర్చుతోసహా చాలా సమస్యలతో కూడుకున్న విషయం. గోదావరి బేసిన్‌లో నీటి పారుదల పైన ప్రభుత్వం పెట్టదలచుకున్న ఖర్చు మొదట పరీవాహక ప్రాంత అవసరాల మీద పెట్టక కోస్తా జిల్లాల అవసరాలకు, కృష్ణా బేసిన్‌కు తరలింపుకు పెడితే ఆ తరువాత నిధులు లేవని చేతులెత్తేస్తే ఉత్తర తెలంగాణా గతేమిటన్న సందేహం సహజంగా వస్తుంది.

మరొక తీవ్రమైన అభ్యంతరం కూడా ఉంది. గోదావరి బేసిన్ నుండి కృష్ణా బేసిన్‌కు తరలించే నీరు కృష్ణా జలాలో భాగం అవుతుంది కాబట్టి ఆ 200 టిఎంసిలలో కర్నాటకకూ, మహారాష్ట్రకూ వాటా ఇయ్యవలసి ఉంటుంది ఈ విషయం బచావత్ అవార్డు స్పష్టం చేసింది. అంటే తరలించిన 200 టిఎంసిలలో 90 టిఎంసిల దాకా వారికి ఇచ్చేయవలసి ఉంటుంది. 110 మాత్రం మనకు మిగులుతాయి. పైగా ఆ 90 టిఎంసిలను ఆ రాష్ట్రాలు ఎగువన ఆపేసుకుంటాయి కాబట్టి సాధారణ సంవత్సరాలలో కాకున్నా వర్షాభావ సంవత్సరాలలో మన రాష్ట్రంలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులలో మొదటివైన భీమా, జూరాల, రాజోలిబండ, తుంగభద్ర ఎగువ కాలువ, దిగువ కాలువలకు దెబ్బతగిలే ప్రమాదం ఉంది. అంటే బేసిన్ తరలింపు తెలంగాణ, రాయలసీమల మేలు కోసం అని చెప్పుకుంటున్నప్పటికీ తెలంగాణ, రాయలసీమలకు చాలా నష్టం కలిగే ప్రమాదం ఉంది.

మరి ప్రత్యామ్నాయం లేదా అంటే ఉంది. కృష్ణా డెల్టా కెటాయింపులు 80 టిఎంసిలు తగ్గించి సాగర్ కు ఎగువన నిలుపుకొని, నికర జలాల గుర్తింపుకు నాలుగింట మూడు సంవత్సరాలలో లభ్యతను కాక అయిదింట మూడు సంవత్సరాలలో లభ్యతను ప్రమాణంగా పెట్టుకుటే కోస్తా జిల్లాల ప్రాజెక్టులకు నీటి కెటాయింపు, నీటి భరోసా తగ్గినప్పటికీ అదే తగ్గిన నీటిభరోసాతో మొదట్లో పేర్కొన్న 8 ప్రాజెక్టులు కట్టుకోవచ్చు. కానీ కోస్తాంధ్ర వాసులు దీనికి అంగీకరిస్తారా? వారినెవరైనా అంగీకరింప జేయగలరా? ◆

పాలకుల మతాల ప్రాతిపదికన చారిత్రక యుగ విభజన చేయడం మతతత్వ చరిత్ర రచనా దృక్పథంలోని ప్రధాన లక్షణం అంటున్నారు ఎస్. మహబూబ్ బాషా

జాతీయతత్వం ఒళ్లో మతతత్వం కొమర్రాజు రచనల పరిశీలన

(గత సంచిక తరువాయి)

III

పాలకుల మతాల ప్రాతిపదికన చారిత్రకయుగ విభజన చేయడ మన్నది మతతత్వ చరిత్ర రచనా దృక్పథంలోని ప్రధాన లక్షణం. జేమ్స్‌మిల్ తన హిస్టరీ ఆఫ్ బ్రిటిష్ ఇండియా ద్వారా ఈ దృక్పథానికి బీజం వేశాడన్న విషయాన్ని ముందే తెలుసుకున్నాం. ఈ మతతత్వ విభజనలోని హేతువును ప్రశ్నించకుండానే దాన్ని యథాతథంగా ఆమోదించారు. కొమర్రాజు వారు. అందుకే 'హిందూదేశ చరిత్రయంతయు మూడు మహాయుగములుగా విభజించవచ్చును' అనీ, ''హిందూరాజులు ప్రభుత్వము చేసిన కాలము'' ''హిందూమహాయుగము'' అనీ, ''మహమ్మదీయులు ప్రభుత్వము చేసిన కాలము'' ''మహమ్మదీయ మహాయుగము'' అనీ, ''ఇంగ్లీష్‌వారి ప్రస్తుత ప్రభుత్వకాలము'' ''బ్రిటిష్ మహాయుగము'' అనీ అన్నారు. (హి.మ. పు. 10-11) ఈ విభజన ద్వారా జేమ్స్‌మిల్ హిస్టరీ తవ్విన మతతత్వ అగాధంలో కొమర్రాజువారు పడిపోయారన్నది సుస్పష్టం. పాలకుల మతప్రాతిపదికన చేసిన యుగవిభజనను బట్టే ఆయన పుస్తకాల్లోని విషయ స్వభావాన్ని మనం ముందుగానే పసిగట్టవచ్చు. కానీ మహమ్మదీయ మహాయుగము నకు రాసిన పీఠికలో ఈ యుగ విభజనలోని సారస్యాన్ని ప్రశ్నిస్తున్నట్లు కన్పించినా అది అందులోని హేతువును ప్రశ్నించడానికి మాత్రం కాదు.

అది యావత్ 'హిందూదేశము' 'మహమ్మదీయుల' పాలుకాకుండా ఉండాలన్న తన హిందూ తాపత్రయంలో భాగంగా వచ్చిన కించిత్ విచక్షణే/ఉబలాటమే గాని మరేమీ కాదు! అందుకే ''మహమ్మదీయ మహాయుగము'' మనగా మహమ్మదీయుల చరిత్ర మాత్రమని యర్థముగాదు. ఇది కాలసూచకమైన యొక గురుతు. ఈ కాలమునందు హిందూ దేశమందు హిందూ రాజ్యములనేకములు ప్రబలెను. ముసల్మాన్ రాజ్యమునకు ప్రబల ప్రతిస్పర్థలయిన ఈ రాజుల యశోగానము చేసినగాని ఈ కాలపు చరిత్ర పూర్తిగా వర్ణించితిమని చెప్పుట తప్పు'' (మ.మ.'పీఠిక'పు.xx) అన్నారు.

ప్రాచీనకాలమునుండీ 'భారతదేశము' ఒక 'దేశంగా', ఒక 'జాతి'గా ఉంటూ వస్తోందని చెప్పడం, మతాధారంగా ఒక 'జాతి'నీ, దేశాన్ని ఊహించడం మతతత్వ దృక్పథంలోని ఒక ప్రధానలక్షణం. కొమర్రాజు వారి దృష్టిలో భారతదేశం మొదటినుండీ ఒక్క దేశంగానే ఉంటూ వచ్చింది. ఎందుకంటే ''ఇందెన్ని మతములును, ఎన్ని భాషలును గలిగినను ఇందుండువారిలో విశేష జనులు హిందువులు''. అంతేకాక ''పుట్టుకవలన గలుగు వర్ణభేదమును బాటించు హిందువులలో నందరకును నాలుగు వేదములును, కల్పసూత్రములును, స్మృతులును ప్రమాణ గ్రంథములు, హిందువులందరును నిట్టి సామాన్య లక్షణము లుండుట వలన ఈ దేశము మొదటి నుండియు నొక్కదేశము గానే యెంచబడుచు వచ్చెను'' (హి.మ.పు.10) అంటే శుభ్రంగా జాతీయతకు మతం రంగు పులిమారన్నమాట!

పాలకుల మతాల ఆధారంగా వారి రాజ్య స్వభావాన్ని నిర్ణయించి 'హిందూ రాజ్యాలు' అనీ, 'ముస్లిం రాజ్యాలు' అనీ, ఆయా రాజులను 'హిందూ రాజుల'నీ, 'ముస్లిం రాజుల'నీ పిలవడం మతతత్వ దృక్పథం వల్ల అనివార్యంగా జరుగుతుంది. కొమర్రాజు వారి పుస్తకాల్లో ఈ భావజాలం విశృంఖలంగా ఉంది.

ఆధునిక కాలంలోని భావజాలమైన జాతీయవాదాన్ని భారత ప్రాచీన గతానికాపాదించి అప్పటి 'హిందూ రాజు'ల్లో దాన్ని నిరూపించ బూనడం జాతీయవాద చరిత్రల, మతతత్వ చరిత్రల లక్షణం. అందుకే కొమర్రాజు వారి దృష్టిలో అలెగ్జాండరు నెదిరించిన పురుషోత్తముడు, శల్యూకస్‌నోడించిన చంద్రగుప్తుడు ''స్వదేశాభిమానమును'', ''స్వాతంత్ర్యాభిరుచియు'' కలవారయ్యారు. ''నవ్యదేశీయుడును'', ''హూణుడు''ను అయిన అలెగ్జాండరుకు సహకరించినవారు ''స్వదేశాభిమానశూన్యు''లని తూలనాడబద్దారు. తన ''హిందూదేశము[ను] జయించుటకై గొప్ప సైన్యముతో'' వచ్చిన అలెగ్జాండరును 'హిందూ రాజు'లందరూ ఎదిరించకపోవడం ఆయనకు చాలా బాధ కల్గించింది. పైపెచ్చు కొందరు 'హిందూ రాజులు' అలెగ్జాండరుకు సహాయం చెయ్యడం ఆయనలోని 'హిందూ జాతీయవాది' కి అస్సలు మింగుడు పడలేదు. అందుకే ''వారైకమత్యము లేక, యొకరితోనొకరు పోరాడుచు బరస్పర మత్సరగ్రస్తులై పరదేశీయుడగు నలెగ్జాండరు నెదిరింపక యనేకులతనికి సహాయులై తమకు దాము విషముపోసికొనిరి. ఇట్లు స్వదేశాభిమాన శూన్యులై కొందరు నృపులు పరరాజునకు దోడైనందున నతనికి విజయమే సంప్రాప్తమయ్యె''నని దుఃఖించారు. (హి.మ. పు. 90-91) మౌర్య చంద్రగుప్తుడిని పరిచయం చేస్తూ ''... పరదేశీయులగు

గ్రీకువారిని వెడలగొట్టి దేశముయొక్క దైన్యమును దొలిగింపవలెనని యప్పటి కొందరు దేశాభిమానులకు దోచెను. అట్టివారిలో విశేష ఖ్యాతి చెందినవాడు చంద్రగుప్తుడు'' అనీ, "అతని యందు శౌర్యము, స్వాభిమానము, స్వదేశాభిమానము అను సద్గుణములు నెలకొని యుండెను" (హి.మ. పు. 92) అనీ చంద్రగుప్తుడిలోకి ఆధునిక జాతీయ దృక్పథాన్ని చొప్పించారు. శల్యూకస్‌ను చంద్రగుప్తుడు ఓడించడాన్ని తెల్పుతూ "ఇటులీ దేశపు స్వాతంత్ర్యంబునపహరింప వచ్చిన గ్రీకురాజు, హిందూదేశపు సత్పుత్రుడగు చంద్రగుప్తునిచే బరాజితుడయి, శరణుజొచ్చి.... బతుకుజీవుడాయని వచ్చిన మార్గమున దిరిగి వెళ్లెను... ఇట్లు మనదేశము సాధింపవచ్చిన యన్యదేశీయుల వెడలగొట్టి వారి దేశమునే స్వాధీనపరచుకొనిన చంద్రగుప్తుని కొనియాడదగును" (హి.మ. పు. 93) అని చంద్రగుప్తుడ్ని దేశ స్వాతంత్ర్యాన్ని రక్షించిన 'హిందూ' శూరుడిగా చిత్రీకరించారు.

అలాగే గౌతమీపుత్రశాతకర్ణి "పరరాజు" అయిన సహపానున్ని ఓడించి "దేశమును బారతంత్ర్యమునుండి తొలగించి, స్వరాజ్యమును స్వధర్మమును" నిలిపాడన్నారు (హి.మ. పు. 118). రెండవ స్కందగుప్తుడు శ్వేతహూణులవణచివేసెనన్న విషయాన్ని ఊగిపోయి వర్ణించారు.

"ఉసుళ్లమందలవలె వచ్చెడి శ్వేత హూణుల దాను రాజ్యమునకు వచ్చిన యొక సంవత్సరములోనే మాళవములో నోడించి, వారినీ దేశమునుండి పారదోలి యవనదేశమునందును దన పరాక్రమము గనబరచెను. పరరాజుల నోడించి, దేశమునకు స్వాతంత్ర్యమునొసగి యాతడు తన తల్లి యొద్దకి వెళ్లి – 'వందేమాతరమ్మ' ని నమస్కారము చేసెను. అప్పుడా శూరమాతకు గల్గిన యానందమును నెవ్వరైనను వర్ణింపగలరా?''(హి.మ. పు. 125) అని అత్యంత తమకంతో ప్రశ్నించారు. ఎక్కడి వందేమాతరం, ఎక్కడి స్కందగుప్తుడు, కొమర్రాజు వారు ఎంతటి బలమైన జాతీయవాది?

ఈ విధంగా 'హిందూ మహాయుగము'లో హైందవ వీరులందరూ 'హిందూదేశ' 'స్వాతంత్ర్యాన్ని' 'పరదేశీయుల' నుండి కాపాడారు! అంతేకాక వారిలో అనేకులు శత్రుమూకలను పారద్రోలి హిందూశౌర్యాన్ని నిరూపించారు.

'మహమ్మదీయ మహాయుగం' లో మతతత్వ భావజాలం తారాస్థాయినందింది. ఈ కాలంలోని చరిత్ర అంతా 'హిందువు'లకూ, 'మహమ్మదీయు'లకూ మధ్య జరిగిన ఎడతెగని యుద్ధాల చరిత్రే అన్నారు. 'మహమ్మదీయులు' 'హిందూదేశ స్వాతంత్ర్యాన్ని హరించినవారు'గా చిత్రీకరించారు. అరబ్బులు, తురుష్కులు, మొఘలులు మొదలైన వారి జాతి అస్తిత్వాలను కొన్నిచోట్ల గుర్తిస్తూనే వారందరినీ 'మహమ్మదీయ'లని వారి మత గుర్తింపును మాత్రమే నొక్కి చెప్పారు. ఇస్లాం పట్ల, 'ముస్లిం'ల పట్ల అత్యంత అసహనంతో కూడిన పదజాలా న్నుపయోగిస్తూ తన 'హిందూ' పక్షపాతాన్ని నిరూపించుకున్నారు. కొమర్రాజు వారిలోని మతతత్వ భావజాలం 'మహమ్మదీయ మహాయుగం' పుస్తకానికి రాసిన సుదీర్ఘమైన 'పీఠిక'లో గజ్జెకట్టి కరాళ నృత్యం చేసింది. 'మహమ్మదీయ మహాయుగము'లో 'హిందూ రాజ్యములనేకములు ప్రబలె'ననీ, "ముసల్మాన్ రాజ్యమునకు బ్రబల ప్రతిస్పర్ధులయిన ఈ [హిందూ] రాజుల యశోగానము చేసిన గాని ఈ కాలపు చరిత్ర పూర్తిగా వర్ణించితిమని చెప్పుట తప్పు'' అనీ, ''వైభవాదిక ములలో [ముసల్మానుల] ఢిల్లీరాజ్యమును గూడ మించినట్టి [హిందూ] విజయనగర సామ్రాజ్యము గురించి ఇప్పటి చరిత్ర గ్రంథములలో బదిపంక్తులు [మాత్రమే] వ్రాయుదురు" అనీ, "ఇది మిక్కిలియన్యాయము" అనీ వాపోయారు. అందుకే "నేనట్లు చేయనొల్లక హిందూ రాజుల పౌరుషాదులను మహమ్మదీయుల పౌరుషాదులతో బాటు వర్ణించినాడను" అన్నారు (మ.మ.'పీఠిక', పు.xx). పుస్తకమంతా 'మనము (అజ్), 'వారు' (దే) అనే విభజన స్పష్టంగా కన్పిస్తుంది.

"ఆ కాలములోని హిందువులేమి చేసిరి?" అని ప్రశ్నించుకొని "హిందువులు ముసల్మానులకు సామాన్యముగా వశులు కారైరి. వారు తురుష్కులను పూర్తిగా సార్వభౌమత్వమనుభవింపనీయలేదు. ఒకానొకప్పు డోడిపోయినను మరల బ్రోత్సాహము తెచ్చుకొని తమ స్వాతంత్ర్య మును సంపాదించుచుండిరి...' అంటూ "మహమ్మదీయ దిగ్విజయమసం పూర్ణమైనది" అనీ, ''వారి విజయమల్పకాల వర్తియైనది" అనీ, "హిందువులు ముసల్మానుల యొద్దనుండి తమ దేశమును మరల సంపాదించిరి" అనీ చెప్పిన డబ్ల్యు.డబ్ల్యు. హంటర్‌ను ఉల్లేఖిస్తూ సాంత్వన చెందారు. (మ.మ.'పీఠిక', పు.xx-xxi)

పూర్వ చరిత్రకారులు కేవలం 'మహమ్మదీయ దిగ్విజయములను' మాత్రమే వ్రాసినారు కాబట్టి తాను ''హిందువులకు గలిగిన జయములను", వారి "కీర్తి ప్రదములగు పరాజయము"లను వర్ణించానని చెప్పారు. ఆయన మాటల్లో :

''ఈకాలపు కథాభాగము వ్రాయునపుడిదివరకు జరిత్రలు వ్రాసినవారు మహమ్మదీయుల దిగ్విజయములను, హిందువుల పరాజయములను మాత్రమే వర్ణించిరి. హిందువులకు గలిగిన జయములను వారోడిపోయిన యుద్ధములలో జూపిన యద్వితీయ శౌర్యసాహస స్వదేశాభిమానములును, వారి పరాజయములకు గల మోసము మొదలయిన కారణములను జక్కగ వర్ణించినవారు కారు. స్థానేశ్వరములో పృథ్వీరాయలకు బరాభవము గలగెనందురేకాని యందుకు గారణములయిన గృహభేద మిత్రద్రోహముల జెప్పరైరి. ఫతేపూర్ సిక్రీలో బాబర్ సంగరాణాను ఓడించెనని వ్రాయుదురే గాని, యందు బాబర్ చేసిన మోసమును, ఒక రాజపుత్రుడు చేసిన దేశ ద్రోహమును వర్ణింపరు! తుదకు హిందువుల కీర్తిప్రదములగు పరాజయ ములు గూడ జక్కగ వివరించినవారు కారు" (మ.మ.'పీఠిక', పు.xxii) అని వాపోయారు.

ఇంతటితో ఆగకుండా "హిందువుల పరాజయములభిమన్యుని పరాజయములవంటిది" అనీ "ఇదివరకు హిందూదేశ చరిత్ర వ్రాసిన వారందరును అభిమన్యుడు చచ్చె"నని మాత్రమే అన్నారనీ, "అతని పౌరుషము వర్ణింప" లేదనీ, కాబట్టి తాను ఆ 'హిందూ' పౌరుషమును 'సవిస్తరముగా' వర్ణించినాననీ, 'ఇదియ వారికిని నాకునుగల భేదము' అన్నారు (మ.మ.'పీఠిక', పు.xxii). అంటే 'మోసమునకు లోనై పరాజితు' లయిన జాతీయవీరులయిన హిందూవీరుల శౌర్యగానం మీద అధిక శ్రద్ధ చూపెట్టారు.

'ముసల్మానుల యుత్పత్తి : వారీ దేశమునకు వచ్చుట'ను గూర్చి రాస్తూ 'మహమ్మదీయుల'ను విధ్వంసకారులుగా, 'హిందూదేశము యొక్క స్వాతంత్ర్యమును హరించి'న వారిగా చిత్రీకరిస్తూ అత్యంత జుగుప్సావహమైన పదజాలాన్ని ఉపయోగించి తన విద్వేషాన్ని వెళ్లగక్కారు. అందుకే "....పైని వర్ణించినట్లు మహమ్మదీయులు లోకము నంతయు గాల్చుచుండగా దానిని గురించి మన [హిందూ] దేశస్థులకు

సమాచారమే తెలియదు..... ఈ మిడతలదండు తమ దేశము మీదికి వచ్చునని వారికి బూర్వమే తెలిసిన తమ రక్షణకు దగిన యేర్పాటులు చేసికొనుటకు వీలుండును. కాని నేడందులకు జింతపడినందున లాభమేమి? ముసల్మానులు దీన్‌దీన్ అను రణధ్వనులతో మన గుమ్మములోనికి వచ్చువరకు వారి సంగతియే మనమెరుగము. అందుచే మనము వారిని వెడలగొట్టలేక మన స్వాతంత్ర్యమును బోగొట్టుకొంటిమి" (మ.మ. పు. 5–6) అని ఆవేదన చెందారు. 'గోరీ వంశము'ను గూర్చి రాస్తూ "హిందూ దేశము యొక్క స్వాతంత్ర్యమును హరించి తురుష్క రాజ్యమును స్థాపించినవారీ వంశము వారు" (మ.మ. పు. 15) అన్నారు.

భారతదేశానికి 'ముస్లిం'ల రాకతో 'పారతంత్ర్య ప్రారంభము' జరిగిందని భావించడం మతతత్వ దృక్పథం వల్ల జరుగుతుంది. దీని పర్యవసానమే 'వెయ్యేళ్ల విదేశీ దాష్టీకం' అనే క్షుద్ర భావన. కొమర్రాజు రచనల్లో ఈ భావజాలం పుష్కలంగా ఉంది. 'పారతంత్ర్య ప్రారంభము' అనే ఉపశీర్షిక కింద "స్థానేశ్వర యుద్ధముతో హిందూ దేశము యొక్క స్వాతంత్ర్యము పోయి యప్పటినుండి యీ దేశము పరరాజుల స్వాధీనమై పారతంత్ర్యమను సంకెలలచే బంధింపఁబడెను" (మ.మ.పు. 25) అన్నారు. ఈ ముస్లిం దురాక్రమణదారుల నుండి హిందూ దేశ విముక్తికై 'హిందూరాజులు' అయిన ఓరుగంటి వారూ, విజయనగర రాజులూ, రాజపుత్రులూ, మరాఠాలూ కృషి చేశారన్నారు. 'ముస్లిం'లతో పోరాడిన వారు కాబట్టి పై వారంతా 'స్వదేశాభిమానులును', 'స్వదేశభక్తులును' అయ్యారు; 'ముస్లిం' రాజుల పక్షాన చేరినవారందరూ 'దేశద్రోహు' లయ్యారు. ఇందులో భాగంగానే కాకతీయ ప్రతాపరుద్రుడు, శ్రీకృష్ణదేవరాయులు, శివాజీ, ఛత్రసాల్, రాణా సంగా, రాణా ప్రతాప్ మొదలైన వారందరూ జాతీయ వీరులయ్యారు. అందుకే వీరిని గూర్చి రాస్తున్నప్పుడు కొమర్రాజు వారు అత్యంత ఉత్సాహంతో ఉద్రూతలూగి వర్ణించి వారందర్నీ స్వాతంత్ర్య పోరాటకారులన్నారు.

కాకతీయ ప్రతాపరుద్రుడిని గూర్చి రాస్తూ, "కీ.శ. 1303లో ఢిల్లీశ్వరుని సేనానాయకుడగు మాలిక్ కాఫర్ అను తురుష్కుడు ఓరుగంటిపై దండెత్తి వచ్చెను. అప్పుడా మ్లేచ్ఛుడు సంపూర్ణపరాభూతుడై వచ్చిన మార్గమున దిరిగి వెళ్లవలసిన వాడాయెను. కాని 1309వ సంవత్సరంలో దిరిగి గొప్ప సైన్యమును గూర్చుకొని యా తురకవాడు ఓరుగంటి కోటను ముట్టడించెను. కోటలోని వారనేక దినముల వరకు బోరాడిరి. కాని దేశద్రోహియైన కటకరాజు తురుష్కులకు సాహాయ్యము చేసినందువలనను, మాతృద్రోహులగు కోటలోని కొందరు నాయకులు ధనాశచేత దురుష్కులకు ననుకూలురైనందువలనను ... ప్రతాపరుద్రుడు ఢిల్లీశ్వరునకు గప్పము కట్టునట్లు సంధి చేసుకొనవలసిన వాడాయెను. తరువాత హిందూ రాజులందరొక్కటై పరదేశీయులను మన [హిందూ] దేశము నుండి వెడలగొట్టదలంచిరి. ప్రతాపరుద్రుడు దేవగిరి రాజుతో మైత్రి చేసికొని తురకలతో బోరు ప్రారంభించెను.... తరువాత ప్రతాపరుద్రుని కుమారుడగు కృష్ణుడనువాడు ఓరుగంటిలో గొన్ని దినములు రాజ్యము చేసి కొందరు హిందూరాజులను గల్పుకొని తురుష్కులను వెడలగొట్టెను..." (మ.మ.పు. 181–182) అన్నారు.

మొఘల్ చక్రవర్తి ఔరంగజేబుతో పోరాడిన బుందేలరాజు ఛత్రసాల్ గురించి రాస్తూ, "ఆ కాలములోని పశ్చిమ హిందూదేశమందలి మహారాష్ట్రుల చరిత్రకును, మధ్య హిందూదేశమందలి బందేలుల చరిత్రకును గొంత సామ్యము కలదు. ఇద్దరును స్వదేశ స్వాతంత్ర్యమునకై పడరాని యిడుములు పడుచుండిరి. ....రామాయణ మహాభారతాది కథలను విన్నందున నితనికి (ఛత్రసాల్) స్వదేశ స్వమతాభిమానములు గలిగెను. తండ్రిపోయిన తరువాత నితడు తన దేశమునకు గల పారతంత్ర్యమును బోగొట్టుటకుఁ గృతసంకల్పుఁడై సైన్యసన్నాహము చేయదొడగెను. ఆ కాలమునందే మహారాష్ట్ర దేశమును బారతంత్ర్యము నుండి విడిపించుటకు శ్రీ శివాజీ చే జేయబడుచున్న ప్రయత్నములను విని యా మహామహుని దర్శింపఁగోరెను. స్వదేశోద్ధారణమునకై యవతరించిన యీ యద్వితీయ పురుషులిద్దరును భీమానదియొడ్డున గలిసికొనిరి. ఛత్రసాలుని యుత్సాహమును, స్వదేశప్రీతియుఁ జూచి శివాజి మిక్కిలి సంతసించి తన మధుర వాక్కుతో స్వాతంత్ర్య ప్రీతియు యవనసంహార నిశ్చయమును ముమ్మాటికి మరవవలదని బోధించి తన కత్తి యతనికి బహుమతిగా నొసగి స్వదేశోద్యమమునకు నాతని బురికొల్పెను. ఆ కాలమందలి వాషింగ్టన్, విల్లియం ఆఫ్ ఆరెంజు లనదగు నీ స్వదేశభక్తుల సమాగమ ప్రసంగమును భూషణకవి మిగుల రసవంతముగా వర్ణించియున్నాఁడు" (మ.మ.పు. 118–119) అన్నారు.

రాజపుత్రరాజ్యాలు ఏర్పడిన తరువాత "హిందూ రాజ్యములును, హిందూధర్మంబును, హిందూ విజ్ఞాన శాస్త్రంబులును నభివృద్ధి జెంది, మరల దలచూపదొడంగె" (హి.మ.పు. 157) నన్న అభిప్రాయం కలవారగుటచే రాజపుత్రుల ప్రస్తావన వచ్చినప్పుడల్లా కట్టలు తెగిన హిందూత్సాహంతో ప్రసంగిచారు కొమర్రాజువారు. అందుకే 'మహమ్మదీయ మహాయుగము' లోని ఐదవ ప్రకరణానికి 'రాజపుత్రుల శౌర్యాగ్ని' అని శీర్షికనుంచారు. "గౌరవము చేతను, పౌరుషము చేతను, కులము యొక్క ఘనత చేతను రాజపుత్ర రాజ్యములన్నిటికిని నాయక రత్నంబునాదగు" 'ఉదేపూర్ సిసోదియా వంశము'ను గూర్చి ఉపోద్ఘాత మిస్తూ చరిత్రకారుడికి ఉండకూడని శృతిమించిన ఆరాధనా భావాన్ని ప్రదర్శించారు. ఆయన మాటల్లోనే – "అనన్యసామాన్య క్షాత్రతేజంబుతో వెలుంగునట్టి కథానకంబుల తోడను, పౌరుష ప్రధానంబులగు అద్వితీయ వీరచరిత్రంబులతోడను, స్వదేశ స్వమత స్వగౌరములను రక్షించుకొనుటకై పూలచెండ్లవలె దమ శిర: ప్రకరంబుల రణక్షేత్రమున నర్పించిన వీరవరనామ సహస్రంబుతోడను, శరణనిన దీర్ఘ దుర్మార్గ శత్రునినైన రక్షించెడి యౌదార్య ప్రసంగ ములతొడను, వేయి సంవత్సరముల కాలము వరకు సందులేకుండ నిండియున్న యీ మేవాడ్ దేశపు చరిత్ర పూర్తిగా వ్రాయుటకు వేయి పుటలయినను చాలునని తోపదు. అందుకు మేమాచరితమంతయు నేబది, యరువది పుటలలో ముగింపు [sic] యత్నించుట యొక సాహసంబె...." (మ.మ.పు. 185) అంటూ ఊగిపోయి కడువిశేషణ భూషణములతో మేవాడ్ రాజపుత్రుల పట్ల తన ఆరాధనా భావాన్ని వ్యక్త పరిచారు.

ఖుమాన్ (క్రీ.శ. 836) గూర్చి రాస్తూ "మహమ్మదీయులను పరాభవించుటచే మిక్కిలి విఖ్యాతుడయ్యెను" (మ.మ.పు. 187) అన్నారు. సమరసింహుడి (క్రీ.శ. 1150–1193) గూర్చి రాస్తూ "తుదకీ వీరుడునూ ఈతని పెద్దకుమారుడగు కళ్యాణరాయడును మాతృదేశము యొక్క రక్షణార్థమై పృధ్వీరాయనికి దోడుపోయి క్రీ.శ. 1193లో స్థానేశ్వర యుద్ధ మందు గాలధర్మమునొందిరి" (మ.మ.పు. 188) అన్నారు. అల్లా ఉద్దీన్ ఖిల్జీ చిత్తోడ్‌గడము మీదికి దండెత్తి వచ్చినప్పుడు "అసంఖ్య రాజపుత్రులు తమ దేహముల స్వదేశ రక్షణార్థమై యర్పించిరి" (మ.మ.పు. 191)

అన్నారు. చిత్తోడ్‌గఢ్‌ను జయించిన అల్లాఉద్దీన్‌ను "మానవరూప మహారాక్షసు"డన్నారు (పు. 191) హమీర్‌దేవుడి (క్రీ.శ. 1313–1365) గూర్చి రాస్తూ అతడిలో 'హిందూ జాతీయ వాది'ని చూపించారు. అతనితో పోరాడిన ఇంకోరాజపుత్రరాజు 'బనవీరుడు' పట్టుపడగా "హమీరు వానిని బంధవిముక్తుని జేసి వానికి గొంత జాగీరొసగి 'నీకు నాకుగల బంధుత్వమ టుంచినను, నేను నీవు ఒక్క మతముగలవారము, జాతిగలవారము. ఈ జాత్యభిమానమును, మతాభిమానమును మరవకుము. నీవు మహమ్మదీయులతో గలిసి యపకీర్తివడయకుము' అని బోధించెను" అన్నారు (మ.మ.పు.194). అంటే హిందువు – హిందువు బంధువురా అన్న ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని హమీరుడు బనవీరుడికి నూరిపోశాడన్న మాట. హమీరు తురుష్కులను ఎదిరించడం చూసి "హిందూ రాజుల కందరికిని అమితానందము కలిగి వారాతనికి సాహాయ్యమునకు వచ్చిరి" అనీ "తురుష్కరాజ్యమునడుగంట త్రొక్కదలచిన హిందువులందరికిని ప్రాణములు వచ్చెను" అనీ, "మహమ్మదీయరాజులకు ప్రబల ప్రతిస్పర్ధియై నందున హమీరుడననందర క్షత్రియ రాజులకు నొక దివ్యపురుషుడు"గా తోచాడనీ అన్నారు (పు.194).

'సంగారాణా (1509–1530)' ని గూర్చి రాస్తూ "మేవాడ్ రాజ్యపు సీమ మిక్కిలి పెద్దదియై యిక గొన్ని దినములకు సంగరాణా చక్రవర్తియై మరల హిందూ రాజ్యముదయించు చిహ్నములు గానబడుచుండెను. కాని యా చిన్నెలు విఫలంబులయ్యె. ఆ కాలమున దార్తరీ దేశమునుండి బాబరనువాడు హిందూదేశమునకు వచ్చెను..." (మ.మ.పు. 199) అని వాపోయారు. బాబరు చేతిలో సంగారాణా ఓటమిని గూర్చి రాస్తూ "ఫత్తెపూర్ సిక్రీ యనుచోట సంగరాణాను బాబర్ ఓడించెనని [మాత్రమే] చరిత్రకారులు రాయుదురేగాని యా పరాభవమున గల కారణమును చెప్పరు. ఆ యుద్ధమునందును సంగరాణాకు జయము కలుగవలసినదే" అంటూ "సిసోదియను తురవజాతీయ రాయసీన్ ప్రాంతపు రాజు సంగరాణా యొద్ద నుండి బాబరు వద్దకు రాయబారిగా" పంపబడ్డాడనీ, "కాని యా మ్లేచ్ఛుడితనికేమియో యాశలు చూపి చీలదీసెను" అనీ, "ఈ దేశద్రోహి సంగరాణకు నావలి సమాచారమేమయు జెప్పక, యిచ్చటి గుట్టంతయు దురుష్కులకు జెప్పి, బాబరు తమ మీదికపప్పుడే రాదని కొంతవరకు నశ్రద్ధతో రాజపుత్రులున్న సమయమున, బాబరు వారిపైకి వచ్చునట్లు చేసెను" అనీ, "నుభయసైన్యములకు బోరు ఘోరముకాగా నీ దేశఘ్నుడగు మహాపాపి బహింగముగా మ్లేచ్ఛ సైన్యములతో గలిసి రాజపుత్రులతో బోరెను. ఇట్లు యుద్ధ సమయమందు మోసమును, ద్రోహమును కలిగినందున రాజపుత్రులకు బరాభవము కలిగె; మహమ్మదీయులకు రాజ్యము వచ్చెను. అనగా నీ యుద్ధమందును హిందువులే తమ రాజ్యమును తాము గెలిచి పరరాజులకప్పగించిరి. ఈ యుద్ధములో ననేక క్షత్రియులు వెనుదీయక ఘోరముగ బోరాడి రణశయ్యపై శాశ్వత నిద్రజెందిరి... ఈ [హిందూ] క్షత్రియ వీరాగ్రేసరుల పవిత్రనామములు మనకందరికిని [హిందువులకు] సంస్మరణీయములు!" (మ.మ.పు. 200) అని ఎంతో దీనంగా విలపించారు. రాణా ప్రతాప్ గూర్చి రాస్తూ ఎటు చూచినా ప్రతికూలతలు తప్ప మరేమియూ కానరాక పోయినప్పటికీ అతని మనస్సులో "మ్లేచ్ఛ [ముసల్మాన్] విషయ కద్వేషమును, స్వదేశవిషయక భక్తియు, స్వవంశ విషయ కాభిమానమును దినదినము నధికాధికముగ బ్రజ్వలింపదొడగెను'' (మ.మ.పు. 208–209) అన్నారు. అంతేకాక ఫ్యూడల్ కవియవతారమెత్తి "ఎన్ని కష్టములనైనను, ఎన్ని విపత్తులనైనను ధైర్యముతో నెదిరించి భీతిజెందక, పర్వతమువలె స్థిరముగను, సముద్రునివలె గంభీరముగను వెలుగుచున్న ప్రతాపుని కీర్తి ఆరావలి పర్వతములలోని ప్రతి గుహయు, ప్రతి నదియు, ప్రతి స్థలమును గీర్తించి ప్రతిధ్వని చేయసాగె"ననీ (మ.మ.పు. 209), "ప్రతాపుని చరిత్రమంతయు జూడగా లోకములో నేటివరకు బుట్టిన శూరాగ్రేసరులలో నీతడొక్కడని చెప్పుటకు సందేహముండ"దనీ, "దక్షిణ హిందూ దేశ చరిత్రలో నీతనితో బోల్పదగినవారు కృష్ణరాయుడు, శివాజీ"లనీ (మ.మ.పు. 214) వీరపూజ చేశారు.

రాజపుత్రులపట్ల శృతిమించిన ఆరాధనాభావముండడం చేతనూ, మూసల్మానులతో ఘోరంగా పోరిన 'హిందూ జాతీయవీరులు' అయి ఉండడం వల్లనూ వారు (రాజపుత్రులు) 'విదేశీ' మూలాలు కల్గిన వారన్న స్పృహ ఉండి కూడా వారికి 'స్వదేశీయులు'గా అంగీకరించారు. అందుకే "వీరు [రాజపుత్రులు] మొదట పరదేశీయులగు శకవంశమువారయినను కొంతకాలముపోగా నీ దేశపువారిలో గలిసి యిచ్చటివారమేయనుకొని తాము హిందూదేశము వారిలోని క్షత్రియులమని చెప్పదొడగిరి..." (హి.మ.పు. 149) అని వారిని సాధికారత చేకూర్చారు. 'పరదేశీయు' లయినను స్వంతం చేసుకోగలిగారు! అంటే తన హిందూ జాతీయవాద భావనకు తోడ్పడుతుండడంతో వారిని 'స్వదేశీయులు' చేసేశారు. అలాగే 'శక, పహ్లవ, యువన, బ్యాక్ట్రియన్, కుశనులను పరదేశీయులు' అనే శీర్షికన 'కనిష్క మహారాజు' ను గూర్చి రాస్తూ, అతను వివిధ రంగాలలో సాధించిన విజయాల కారణంగా అతన్ని 'స్వదేశీయుడు'గానే అంగీకరించి సహానుభూతితో చిత్రించారు (హి.మ.పు. 120–123).

'మహమ్మదీయ మహాయుగము' లోని ఆరవ ప్రకరణమైన 'విజయనగర సామ్రాజ్యము'లో కొమర్రాజు లోని హిందూ జాతీయతత్వమూ, మతతత్వమూ, మితిమీరిన ప్రాంతీయాభిమానమూ కలగలసిపోయి విశ్వరూపమెత్తాయి. 'విజయనగర సామ్రాజ్యము'న కిచ్చిన ఉపోద్ఘాతము భయంకర మతతత్వ దుర్గంధభూయిష్టమై అత్యంత జుగుప్సావహంగా ఉంది. అది – "ఉత్తర హిందూదేశము నుండి మహాప్రవాహముతో వెడలి దక్షిణహిందూదేశమందలి హిందూ మతమును హిందూరాజ్యములను రూపుమాపుటకు సిద్ధముగానున్న మహమ్మదీయులనబడు మహానదిని రెండువందల యేబది సంవత్సరముల వరకు నడ్డగించి హిందూమతమును హిందువుల ప్రాభవమును రక్షించిన విజయనగర సామ్రాజ్యమును వేయినోళ్ల గొనియాడినను తనివి తీరదు. దక్షిణములోని హిందూ రాజ్యములన్నియు నడుగంటినందున హిందూ మతమునకును తదుద్ధరణ మునకును నాధారమేమియు లేకపోయెను. దక్షిణ హిందూ దేశమునకట్టి విపన్నావస్థ ప్రాప్తించినపుడు దాని నుద్ధరించుటకు నవతరించిన రాజ్యమే విజయనగర సామ్రాజ్యము. ఈ ప్రభుత్వమప్పుడుదయించి యుండని యెడల బదునాల్గవ శతాబ్దమునందేయనగా నేటికి నైదువందల సంవత్సరములకు బూర్వమే దక్షిణ దేశమంతయు బూర్తిగా దురుష్కులపాలై, హిందూమత మంతయునడుగంటి, నేటివరకు మనమందరమును మహమ్మదీయులమై యుందుమనుట యతిశయోక్తి కానేరాదు" (మ.మ.పు. 234) అని క్షుద్ర ఊహలు కూడా చేశారు. విచక్షణారహితంగా రెచ్చగొట్టే పదప్రయోగం ద్వారా తనలో గూడుకట్టు కున్న మతతత్వ విషాన్ని విశృంఖలంగా వెలిబుచ్చారు. ◆

(మిగతా వచ్చే సంచికలో)

నందిగ్రామ్ నేపథ్యంలో కమ్యూనిస్టు ఉద్యమం గురించి చర్చిస్తూ విప్లవానికి సిద్ధాంత అన్వయం, నిష్కళంకమైన ఆచరణ అవసరమని అంటున్నారు **నెల్లూరి కృష్ణమూర్తి**

కమ్యూనిస్టు ఉద్యమం - నందిగ్రామ్

"నందిగ్రామ్ విషాదం" దేశంలో వామపక్ష ఉద్యమానికి, ప్రత్యేకించి కమ్యూనిస్టు ఉద్యమానికి ఎంతో నష్టం కలిగించింది. ఆ పరిణామంతో యాభై సంవత్సరాలుగా భారతదేశంలో విప్లవ విజయాన్ని ఆకాంక్షించే ఒక వృద్ధ హృదయపు ఆత్మఘోష ఈ వ్యాసం. ఎలాంటి మొహమాటం లేకుండా నిష్కర్షగా ఈ సమస్యతో సుడి తిరుగుతున్న ఆలోచనలను పాఠకులతో పంచుకునే ప్రయత్నం మాత్రమే. ఏ విధానాల మీద గాని తీర్పు చెప్పాలనే ఆతృతలేదు. అంతటి అర్హతను స్వయంగా ఆపాదించుకోవడమూ లేదు.

అత్యవసర పరిస్థితి అనంతరం మాత్రమే, పార్లమెంటరీ రాజకీయాలను కూడ ఆమోదించిన వామపక్షాల మధ్య ఐక్యకార్యాచరణ సాధ్యపడింది. సి.పి.ఐ., సి.పి.ఐ. (ఎం)లు కలసి కలహాల మధ్యనైనా కాపురం చేస్తున్నాయి. నందిగ్రామ్ ఈ పరిస్థితి విచ్ఛిన్నతపుటంచులకు తీసుకొచ్చింది. వామపక్ష ఫ్రంట్‌లో కొనసాగుతూనే, మంత్రివర్గం నుండి రాజీనామా చేయాలనే వరకు, మినీ వామపక్ష ఫ్రంట్ ఆలోచించింది. అనుభవజ్ఞుడు జ్యోతిబసు ఈ పరిస్థితిని నివారించగలిగారు. కాని ఏర్పడిన గాయాలు మానాయా?

నందిగ్రామ్ వామపక్ష వాదులందరినీ హతాశులను చేసింది. స్వంత పత్రికలలో పార్టీ నాయకులు చేసుకునే సమర్థనలు తప్ప, మరే పత్రికా బెంగాల్ ఉదంతంలో బెంగాల్ ప్రభుత్వాన్ని సమర్థించలేకుండా ఉంది.

భూములు కోల్పోయిన వారు సాగించే ఉద్యమం నందిగ్రామ్‌కే పరిమితం కాదు. పశ్చిమ బెంగాల్‌లో మాత్రమే సాగడంలేదు. భూసేకరణను ప్రతిఘటించే వారిపై నందిగ్రామ్‌లో మాత్రమే కాల్పులూ, మరణాలూ జరగలేదు. 1990 ప్రారంభ దశకంలో సిమెంట్ ఫ్యాక్టరీల ప్రైవేటీకరణను వ్యతిరేకించిన కార్మికులపై ఆనాటి ములాయంసింగ్ ప్రభుత్వం కాల్పులు జరిపింది. కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ప్రజల సొమ్మును, ఆస్తులను విందు భోజనంగా మార్చుకోవాలనే శక్తులకూ, తమకున్న దుర్భరమైన బతుకునైనా కాపాడుకోవాలనే కష్టజీవులకూ జరిగిన మొదటి పోరాటంగా దానిని నేను భావిస్తున్నాను. ఆ కోవలో నందిగ్రామ్ చిట్టచివరిది కావాలని ఆశించడం సహజం. ఆ ఆశను నిజం చేయడం భారత వామపక్షం, ప్రత్యేకించి భారత కమ్యూనిస్టు ఉద్యమం మీద ఉందని సూటిగా చెప్పదలచుకున్నాను.

భారత కమ్యూనిస్టు ఉద్యమం 1921లో ఆవిర్భవించింది. తెలంగాణ సాయుధ పోరాట సమయం వరకు భారత కమ్యూనిస్టు ఉద్యమం విప్లవం సాధించే మార్గం ఏమిటని ఆలోచించలేదు.

అలాంటి ఆలోచన ఆ తరువాత వచ్చింది. కాని ఉద్యమాన్ని నాయకులు మూడు దారులు పట్టించారు. మూడు కార్యక్రమాలు – వాటిననుసరించి మూడు తరహాల ఎత్తుగడలను రూపొందించి విప్లవాభిమానుల ముందు ఉంచారు. ఆ అభిమానులు ఎవరికి నచ్చిన మార్గాన్ని వాళ్లు తొక్కారు. ఆయా పార్టీలు నడవమన్నట్లు నడిచారు. వివిధ స్థాయిలలో త్యాగాలు చేశారు.

ఇది నలభై సంవత్సరాల మాట. ఆలోచనలు లేక నలభై మూడు సంవత్సరాలు విప్లవం లేదు. ఆలోచనలు ఏర్పడి, వాటి ప్రాతిపదికగా విడివడి నలభై ఏళ్లు గడిచింది. విప్లవం కనుచూపు భవిష్యత్‌లో ఎక్కడా కనిపించడం లేదు. ఏ విభాగానికి ఆ విభాగం ఉనికిని కాపాడుకుంది. ఎవరి అర్థంలో వారు విస్తరించినట్లు భావిస్తున్నారు. తప్పెవరిదో తూకం వేయడం లేదు. నాకు నమ్రత ఉంది, కాని హక్కును వదులుకొనేది నమ్రత కాదు. దాస్యం, భయం.

హక్కుగానే ప్రశ్నిస్తున్నాను. మీరు వాగ్దానం చేసింది మీ ఉనికిని కాపాడుకోవడం కాదు. విప్లవం జయప్రదం చేస్తామని. రూపొందించిన కార్యక్రమాలు అందుకు మార్గమన్నారు. విప్లవం ఎండమావిగా మారింది. ఎందువల్ల?

'విప్లవ సాధనకు' అన్న వాగ్దానం నెరవేర్చలేక పోయేందుకు కారణాలేమిటో ప్రజలకు చెప్పే బాధ్యత కమ్యూనిస్టులకు లేదా?

నందిగ్రామ్ కమ్యూనిస్టు సానుభూతి పరులను హతాశులను చేసింది. అనేక ఘటనల గొలుసులో నందిగ్రామ్ ఒక లింక్. ఇతర లింక్‌ల సందర్భంలో రాని కోపం, నిరాశ. నిస్పృహ ఈ ఘటనలో ఎందుకు వచ్చాయి? వామపక్ష ప్రభుత్వం, ఇతర ప్రభుత్వాల కన్నా భిన్నమైందని భావించినవారు ఇలాంటి పరిస్థితికి లోనైనారు. తమ అంచనాను వంచించిన ప్రభుత్వం పై తమ క్రోధం వ్యక్తం చేశారు. వామపక్ష మేధావులందరి నుండి బెంగాల్ ప్రభుత్వం వేరుపడి, ఒంటరిపాలైంది.

నందిగ్రామ్ విషయంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం క్షమించలేని తప్పు చేసింది. విచక్షణ కోల్పోయింది. అంతమాత్రాన విమర్శకులు విచక్షణ కోల్పోవడం సమర్థనీయమా?

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఫాసిస్ట్ ప్రభుత్వంగా, నందిగ్రామ్‌లో చేపట్టిన విధానం ఫాసిస్ట్ విధానంగా కొందరు పేర్కొన్నారు. ఇది రాజకీయ విమర్శేనా? రాజకీయ పరిభాషలో ఫాసిజం అంటే ఒక అర్థం ఉంది. అది తలెత్తేందుకు ఒక భూమిక ఉంది. మార్క్సిస్ట్ పార్టీ మీద ఒక రాయి విసిరే అవకాశం దొరికిందని, సిద్ధాంతరహిత ఆవేశాలకు పోతే ఎలా? మార్క్సిస్ట్ పార్టీ రాజకీయ విధానంలో విభేదించే హక్కు ఎవరికైనా ఉంటుంది. విమర్శించే హక్కూ ఉంటుంది. కాని భారత కమ్యూనిస్టు

ఉద్యమంలో సైద్ధాంతిక ఐక్యతలేదు. ఆ ఉద్యమం నుండి చీలిన ఒక పేలిక మార్క్సిస్ట్ పార్టీ. ఒక పేలికను ఫాసిస్ట్‌గా వర్ణిస్తే, రేపు ఈ పద ప్రయోగం చేసేవారు అభిమానించే పేలికనూ ప్రజలు ఫాసిస్ట్‌లుగానే భావించే ప్రమాదం లేదా? కాబట్టి కమ్యూనిస్టు ఉద్యమం మొత్తంగా ఫాసిస్ట్ ఉద్యమంగా భారత ప్రజలు భావించే అవకాశం లేదా? కమ్యూనిజానికి – ఫాసిజానికి పోలికలున్నాయని సామ్రాజ్యవాదం చేసిన ప్రచారం నిజమనుకుంటున్నారా?

మరొక చివర నుండి 'నందిగ్రామ్' ఉదంతం మార్క్సిస్ట్ పార్టీ 'స్టాలినిస్ట్' పద్ధతుల మూలంగా జరిగిందని మరి కొందరు పేర్కొంటున్నారు. ప్రపంచాన్ని కబళించాలనే ఫాసిస్ట్ శక్తులను ఓడించి, సోషలిస్ట్ ప్రపంచం రూపొందేందుకు సారథ్యం వహించిన మార్క్సిస్ట్ మహోన్నత శ్రేణులలో స్టాలిన్ ఒకరు. ఆయనను ఒక రాక్షసుడిగా చిత్రించారు సామ్రాజ్యవాదులు.

సామ్రాజ్యవాదుల రెండు లేబిళ్లు బెంగాల్ ప్రభుత్వానికి అంటగట్టారు. నష్టపోయేది మార్క్సిస్ట్ పార్టీ ఒకటేకాదు. కమ్యూనిస్టు భావమే నష్టపోతుంది. కమ్యూనిస్టులే స్వంతకళ్లను పొడుచుకోదలచారా?

2

నాలాగే అనేక మంది విప్లవాన్ని ఆకాంక్షించే వారుగూడ ఆవేదన పడుతున్నారు. ఊపిరాడని అలాంటి మానసిక స్థితికి ఊరటనిచ్చే విధంగా, పూర్వాపరాలను ఆలోచింపజేసేవిగా తోచిన మూడు వ్యాసాలు నాకంటపడ్డాయి.

ఇవి మూడు రాసింది ఒకే వ్యక్తి – ప్రభాత్ పట్నాయక్. ఈనాటి ప్రపంచ ఆర్థిక రంగాన్ని కమ్యూనిస్టు సిద్ధాంతపు గీటురాయితో విశ్లేషించే అతి కొద్దిమంది ప్రపంచ ఆర్థిక శాస్త్రవేత్తలలో ఆయన ఒకరు. ఆయన కేవలం అర్థశాస్త్రవేత్త మాత్రమే కాదు. రాజకీయ అర్థశాస్త్రవేత్త. మార్క్సిస్ట్ పార్టీకి గల మేధోసంపదలో ఆయన ఒకరు. అచ్యుతానందన్ ప్రభుత్వం ఏర్పర్చిన రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ అధ్యక్షుడు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు పూర్తి అయి, ఏడవ సారి వామపక్ష సంఘటన అధికారానికి వచ్చిన సమయంలోనూ ఆయన ఒక వ్యాసం రాశారు.

ఆ వ్యాసంలో ఇలా అన్నారు – వ్యవసాయ కార్మికులకు, రైతాంగానికి జ్ఞాపకాలు దీర్ఘకాలికంగా ఉంటాయి. వారే వామపక్షానికి గట్టిపునాది. వారు వామపక్షానికి నమ్మకంగా కొనసాగుతున్నారు. అదనంగా పట్టణ మధ్యతరగతి నుండి వామపక్షానికి పునాది లభించింది. ఈ రెండు మద్దత్తు పునాదుల మధ్య కొంత ఉద్రిక్తత ఉంది. వామపక్షాలు దీనిని ఎదుర్కోవాలి.

నయా సరళీకరణ కాలంలో మధ్య తరగతి, ఇతర వర్గాల కన్నా మంచి స్థితిని అందుకుంది. తన కోర్కెలను తీర్చాలని అది గట్టిగా కోరుతుంది. వాటిని తీరిస్తే రైతాంగం, పెట్టీ బూర్జువా, గ్రామీణ పేదలకు నష్టకరం అవుతుంది. షాపింగ్ మాల్స్ రావాలనే దాని డిమాండ్ చిన్న వ్యాపారులను నాశనం చేయవచ్చు. కార్లు పెరుగుతున్నాయి కనుక రోడ్లు, బైపాస్‌లు కావాలని డిమాండ్ చేయవచ్చు. అవి తీర్చాలంటే వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకోవాలి. హౌసింగ్ కాంప్లెక్స్‌లు, వినోదపార్కులు అనే దాని డిమాండ్ తీర్చాలంటే రైతాంగాన్ని భూముల నుండి తొలగించవలసి రావచ్చు. జనసాంద్రత ఎక్కువగా ఉండే పశ్చిమ బెంగాల్‌లో భూమికి బదులు భూమి ఇవ్వడం అసాధ్యం. డబ్బు పరిహారం నిజమైన ప్రత్యామ్నాయం కాదు.

ఆ వైరుధ్యం పొంచి ఉంది – అని హెచ్చరించారు.

మధ్య తరగతి, వామపక్ష మద్దత్తు దారులైన పునాది వర్గాలకు ఏర్పడే ఈ వైరుధ్యాన్ని నయా సరళీకరణ విధానం రూపొందించింది అని చెప్పారు. (లెఫ్ట్ ఇన్ గవర్నమెంట్ – ప్రభాత్ పట్నాయక్ – ఫ్రంట్‌లైన్ జూన్ 2, 2006 స్వేచ్ఛానుసరణ)

ఆధునిక మధ్యతరగతి యువత హైటెక్నాజీ ఉద్యోగాలకు ఎగబడతారు. అలాంటి పారిశ్రామికీకరణ వారి వాంఛ. అలాంటి పరిశ్రమలు కొందరికి ఉపాధి కల్పించినా, సాంప్రదాయక ఉపాధి అవకాశాలను నాశనంచేస్తాయి. ఆ విధంగా నికరంగా ఉపాధి అవకాశాలు తగ్గుతాయని ఆయనే మరొక సందర్భంలో రాశారు.

ఈ నయా సరళీకరణ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలపై బలవంతంగా రుద్దుతోంది. సంక్షోభంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక స్థితిని అవకాశంగా తీసుకొని, ఈ విధానాలను రుద్దుతోంది. ఇందుకు ఆయన కొన్ని ఉదాహరణలను సహితం ఇచ్చారు. (పీపుల్స్ డెమోక్రసీ – మార్చ్ 18, 2007)

ఈ కేంద్ర ప్రభుత్వం వైఖరిని కాదని ప్రతిఘటించి కొంత మేరకైనా ప్రజానుకూల విధానాలను అనుసరించేందుకు కొద్దిపాటి వెసులుబాటు ('స్లాక్') ఉంది. దానిని ఉపయోగించుకొని ప్రజానుకూల విధానాలను అమలు చేసే అవకాశం ఉందని వివరించారు.

ఆ వెసులుబాటును ఉపయోగించుకొని కేరళ ప్రభుత్వం ఈ సంవత్సర కాలంలో చేపట్టిన కొన్ని విజయవంతమైన కార్యక్రమాలను ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు దేశంలో కొనసాగుతున్న పరిపాలనా వ్యవస్థలో, పార్లమెంటరీ విధానంలో విశ్వాసం ఉన్న వారికి కేరళ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు సంతోషాన్నిస్తాయి.

ఆ కార్యక్రమాలు గొప్పవని కాదు. ప్రజల ఈతి బాధలన్నీ తీరుస్తాయనీ కాదు. ప్రపంచ పెట్టుబడిదారీ విధానంలో మమేకమై, భారత పెట్టుబడిదారీ వర్గం భారతదేశంపై కొన్ని ఆర్థిక విధానాలను రుద్దుతోంది. దాదాపు బూర్జువా పార్టీలన్నీ వివిధ కారణాల మూలంగా, తరతమ స్థాయిలలో ఈ విధానాలనే అనుసరిస్తున్నాయి. (వీటిని వివరించిన వ్యాసం మే 27, 2007 పీపుల్స్ డెమోక్రసీలో)

ఆ పూర్వరంగంలో ఒక రాష్ట్ర ప్రభుత్వమైనా, కొన్ని రంగాలకే పరిమితమై అయినా ప్రత్యామ్నాయ విధానాలను చేపట్టడం, వాటిని విజయవంతంగా సాగించడం హర్షణీయం. చేపట్టిన కార్యక్రమాలు విధానపరమైనవి కావడం మరింత హర్షణీయం.

❖ దేశమంతటా ఆహార ధాన్యాల ఉత్పత్తి, జనాభా పెరుగుదలకు కూడ తక్కువగా సాగుతోంది. అలాంటి సమయంలో వరి ఉత్పత్తిని పెంచేందుకు తీసుకున్న చర్య, ఆ రాష్ట్రంలో ఈ సంవత్సరం 30 శాతం అదనపు ఉత్పత్తిని సాధించగలదని అంచనా.

❖ రుణ భారంతో కృంగిపోతున్న రైతాంగానికి స్వతంత్ర భారతంలో ఏ ప్రభుత్వమూ గతంలో సమకూర్చని రీతిలో రుణ విముక్తి చర్యలు చేపట్టడం.

❖ పన్నుల విధానంలో లేదా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెటరీ విధానాలలో బాధ్యతతో వ్యవహరించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం ఒత్తిడి తెచ్చి చట్టాలు చేయించింది. లోటును కట్టడి చేయడం అందులో కీలకమైన

లక్ష్యం. రాబడి పెంచుకొని లోటు తగ్గించుకోవచ్చు. ప్రభుత్వ వ్యయం తగ్గించుకొని లోటును తగ్గించవచ్చు. దాదాపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వ్యయం తగ్గిస్తున్నాయి. అప్పులు, వడ్డీ చెల్లింపులు, ఉద్యోగాల జీతాలు, పరిపాలనా వ్యయం తగ్గించడం అసాధ్యం. మిగిలింది సంక్షేమ వ్యయం. అదీ కోత పడుతుంది.

ఇందుకు భిన్నంగా కేరళ ప్రభుత్వం వనరులు పెంచుకొని, సంక్షేమ రంగానికి కేటాయింపులు పెంచింది.

❖ విద్యారంగంలో ప్రైవేటీకరణ పేట్రేగి పోతోంది. దానిని నివారించి, అదుపు చేసేందుకు విద్యాబిల్లు తేవడం భిన్నమైన చర్యే.

❖ అనంతంగా సాగుతున్న భూకబ్జాల మధ్య, మున్నార్‌లో ఏనాడో సాగిన అక్రమ ఆక్రమణలను తొలగించడం సాహసమే.

❖ "మా షరతులతో, మా పెట్టుబడి" అనేది ఈనాడు, దేశ – విదేశీ పెట్టుబడిదారుల నినాదం. కారణం ఏదైనా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఒకదానితో ఒకటిపోటీపడి, పెట్టుబడిముందు సలాములు కొడుతున్నాయి.

ఇందుకు భిన్నంగా వ్యవహరించడంతో కేరళ ప్రభుత్వం స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్‌లో రాష్ట్రానికి లాభదాయకమైన షరతులను సాధించింది.

ఈ విజయాలు వాటంతటవి గొప్పవికావు. ఈ విషయం ప్రభాత్ పట్నాయక్ ఆమోదిస్తున్నారు. ఈ విధానాల నుంచి ఈ ప్రభుత్వాన్ని వెనుకకు మళ్లించాలనే శక్తులు ఉన్నాయనీ ఆయన హెచ్చరించారు.

కాని రాజకీయంగా వాటికి ప్రాధాన్యత ఉంది.

సాంప్రదాయం నుండి ఎంత కొద్ది రూపంలోనైనా దూరం కావచ్చని ఈ విషయం స్పష్టం చేస్తుంది. కాని వర్గ రాజకీయాలు అనే అర్థంలో రాజకీయాలు పరిపాలనా విధానంపై ఆధిపత్యం సాధించినప్పుడే ఈ ప్రత్యామ్నాయ విధానాలు చేపట్టడం సాధ్యపడుతుంది – అంటూ (పీపుల్స్ డెమొక్రసీ, మే 27, 2007) సంచికలో తన వ్యాసానికి ముక్తాయింపు ఇచ్చారు. (కింది గీతలు నావి)

'ఫ్రంట్‌లైన్' వ్యాసంలో, పై వ్యాసంలో ప్రభాత్ పట్నాయక్ సామ్రాజ్యవాద వ్యతిరేక ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ అర్థశాస్త్రజ్ఞుడుగా ఎంత పరిమితులలో నైనా (వీటిని తరువాత పేర్కొంటాం) వర్గ రాజకీయాలకు అంటిపెట్టుకొని ఉన్న మార్క్సిస్ట్‌గా కనిపిస్తారు.

ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో (మే 26, 2007) రాసిన వ్యాసంలో ఆయన ఈ స్వభావం మరింత స్పష్టంగా, కొన్ని భాగాలలో స్పష్టమౌతుంది.

పారిశ్రామికీకరణలో వ్యవసాయ రంగంలో అదనపు శ్రమశక్తిగా మిగిలే భూమి కోల్పోయినవారిని, పరిశ్రమ పూర్తిగా ఇముడ్చుకోలేదు. కాని బ్రిటన్‌లో అలా జరిగిందనేది సాంప్రదాయ వాదన. ఆ వాదన నిజం కాదు. వ్యవసాయంలో అదనపు శ్రమజీవులు 'కొత్త ప్రపంచం' (అమెరికా)కు వలసపోయి, అక్కడి ఆదిమజాతులను నాశనం చేసి, వారి భూములు ఆక్రమించుకొనడం ద్వారా ఉపాధి పొందగలిగారు. అంతే తప్ప బ్రిటన్‌లో జరిగిన పారిశ్రామికీకరణ కాదు.

పారిశ్రామికీకరణ, వ్యవసాయంలోని అదనపు శ్రమజీవులను ఇముడ్చుకున్నది సోవియట్ పారిశ్రామికీకరణలోనే. ఏ పరిశ్రమలు, ఏ స్థాయి సాంకేతికతతో నెలకొల్పాలనే ప్రణాళికాయుత సోషలిస్ట్ విధానమే అందుకు కారణం. ప్రభాత్ పట్నాయక్ సోషలిజమే సమస్యకు పరిష్కార మని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు.

ఆయన రచనలో కొట్టొచ్చినట్లు ఒక పరిమితి కనిపిస్తుంది. ఈ పాపాలకు, ఇబ్బందులకు నయా సరళీకరణ విధానమే కారణమంటారు ఆయన. ఇది నిజమే. కాని నయా సరళీకరణ విధానాన్ని భారతదేశంలోని అనుమతించిందెవరు? భారతదేశంలోని పాలకవర్గాలు. స్వాతంత్ర్యా నంతరం పాలకపక్షాలు అనుసరించిన అభివృద్ధి మార్గం. అది సంక్షోభ భరితం. ప్రజల జీవనాడులను క్రుంగదీస్తుంది. అందువల్ల ఈ అభివృద్ధి మార్గానికి – ప్రజలకు ఘర్షణ ఏర్పడుతుంది. ఈ ఘర్షణే ఈ పాలక వర్గాలను అధికార స్థానాల నుండి తొలగించేందుకు జనతా ప్రజాస్వామిక విప్లవం అవసరం.

ఇదీ ప్రభాత్ పట్నాయక్ రాజకీయంగా సమర్థించే మార్క్సిస్ట్ పార్టీ 1964 కార్యక్రమం చెప్పిన సారం. విదేశీ పెట్టుబడికి, స్వదేశీ గుత్తాధిపత్యానికి, ఫ్యూడల్ భూస్వామిక విధానానికి వ్యతిరేకంగా ఈ విప్లవం వస్తుందని చెప్పారు.

అయితే ప్రజా విప్లవం సాధ్యపడేంతవరకు, ఆయా రాష్ట్రాలలో ప్రభుత్వం ఏర్పర్చే అవకాశం ఏర్పడితే ఆ అవకాశాలను వినియోగించు కోవాలని అదే కార్యక్రమం పేర్కొంది. అలాంటి ప్రభుత్వం మౌలిక మార్పులకు దోహదపడకపోయినా, ప్రజలకు కొంత ఉపశమనం కలిగించి, ఐక్య ఫ్రంట్‌లు ఏర్పడేందుకు దోహదపడుతుందని 112వ పేరా పేర్కొంది.

కాని ఈ వివరణ సరిపోదని పార్టీయే భావించింది. 1967 ఎన్నికల తరువాత "నూతన పరిస్థితులు – నూతన కర్తవ్యాలు" అనే తీర్మానం చేసింది. పార్టీ కార్యక్రమంలో చెప్పిన 112వ పేరాకు వివరణ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఉపశమనమిచ్చే యంత్రాలుగా గాక, "ప్రజల చేతిలో పోరాటసాధనాలు"గా పని చేయాలని ఆదేశించింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ దానిని అమలు జరిపి ప్రజాదరణ పొందింది. కేరళ అందుకు పూనుకోలేదని 8వ పార్టీ కాంగ్రెస్ నిర్మాణ రిపోర్ట్ ప్రత్యేకంగా పేర్కొన్నది గూడ.

రాష్ట్ర ప్రభుత్వం "పోరాట సాధనం" అయితే పాలక వర్గాలు క్షమించవు. దమనకాండకు పూనుకుంటాయి. బెంగాల్ అనుభవం ఇది.

కాని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం భూములు పంచింది. అధికార వికేంద్రీకరణకు పూనుకుంది. కుటీర, చిన్న పరిశ్రమలను ప్రోత్సహిం చింది. అందువల్ల 35 సంవత్సరాలు అధికారంలో ఉందని మార్క్సిస్ట్ పార్టీ నాయకులు చెప్తుంటారు. గతి తార్కిక ఆలోచనా ధోరణిని ఔపోసన పట్టిన వారుగదా వారు. ఒక్క ప్రశ్న ఎందుకు వేసుకోరూ?

కేరళలో 1957–59 కాలంలోనే ఐక్య కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం భూములు పంచింది. తలదాచుకునే గూడును స్థిరపరచింది. చర్చి, మసీద్, నాయర్ సర్వీస్ సొసైటీ వంటి వారి చేతుల్లో ఉన్న విద్యారంగానికి విముక్తి కలిగించింది. అయినా అక్కడి అధికారానికి మ్యూజికల్ ఛైర్స్ గేమ్‌లో పాల్గొనడం తప్ప, పశ్చిమ బెంగాల్‌లో లాగా ఏకధాటిగా పాలించలేకుండా ఉంది.

భూముల పంపకం వంటి బూర్జువా వర్గం సహితం సూత్రప్రాయం గా వల్లించే సంస్కరణలను అమలు జరపడం వల్ల కాక, "రాష్ట్ర ప్రభుత్వం ప్రజల చేతి పోరాట సాధనం" కావాలనే సిద్ధాంతం, దాని ఆచరణ బెంగాల్ ప్రభుత్వ దీర్ఘకాలిక మనుగడ, కొనసాగింపులకు కారణం కాదా?

తాజా పరచబడిన కార్యక్రమంలో తిరిగి 112ను అలాగే పొందు పరచారు మరొక పేరాలో. 1967 తరువాత రూపొందిన ఆలోచనను కొడిగట్టించారు. అంతేగాదు ఈ దేశంలో ఆర్థిక రాజకీయ విధానాలను శాసించేది కేంద్రం. ప్రజానుకూలంగా ఈ విధానాలను మార్చేందుకు

అవకాశం లేకున్నా కేంద్రంలో గూడ అధికారంలో చేరే విషయం సూత్రప్రాయంగా అంగీకరించి, పచ్చజెండా మాత్రం కేంద్ర కమిటీ చేతిలో ఉంచుకున్నారు.

ఇందుకు అనువుగా విప్లవానంతరం అనుసరించే విధానాలనూ, "తాజా"పరచారు.

1. భూస్వాముల నుండి స్వాధీనం చేసుకొని, ఉచితంగా పేదలకు పంచే భూమికి నష్టపరిహారం ఇస్తారు. 1964లో "నష్టపరిహారం లేకుండా భూస్వాముల భూములను స్వాధీనం చేసుకొని పేదలకు ఉచితంగా పంచాలి" అని ఉంది.

2. విదేశీ పెట్టుబడులను జాతీయం చేస్తామంది 1964 కార్యక్రమం. విదేశీ పెట్టుబడులను క్రమబద్ధీకరిస్తాం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరమైనచోట్ల విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తామని తాజాగా హామీ. విదేశీ పెట్టుబడిని ఎదిరించకుండా దానితో వియ్య మందాలి (ఎన్‌గేజ్) అని మరింత తాజా తీర్మానం.

విదేశీ పెట్టుబడి లేదా కార్పొరేట్ పెట్టుబడితో ఏర్పడే గొప్ప (గ్రాండ్) పరిశ్రమలు ఉపాధిని నికరంగా నష్టపరుస్తాయని ప్రభాత్ పట్నాయక్ రాశారని ముందే పేర్కొన్నాం.

సలీం కంపెనీని ఆహ్వానించి కెమికల్ హబ్ ఏర్పర్చడం పార్టీ కార్యక్రమానికి అనుగుణ్యంగానే, కేంద్ర కమిటీ అనుమతితోనే చేపట్టామని ఆ రాష్ట్ర మంత్రుల వివరణ.

3. స్వదేశీ గుత్తాధిపత్యాన్ని క్రమబద్ధీకరిస్తామని "తాజా" వాగ్దానం. వాటిని జాతీయం చేస్తామని నాటి కార్యక్రమం. గుత్తాధిపత్యాన్ని అదుపు చేసేందుకు జాతీయకరణ ఒక్కటే మార్గం కాదని ఈనాటి మాట.

ఈ "తాజా" వాగ్దానాలు విప్లవానంతరం అనుసరించే విధానాలు. విప్లవానికి ముందు ఉపశమనం మాత్రమే ఇవ్వగల కేంద్ర ప్రభుత్వంలో చేరడం.అలా చేరేందుకు ద్వారాలు తెరచి, పాలకవర్గాలకు గూడ ఆమోదయోగ్యం కావడానికి చేసిన తీవ్ర ప్రయత్నం "తాజా" కార్యక్రమం.

ప్రభాత్ పట్నాయక్ ఒక ఆర్థిక శాస్త్రవేత్తగా సరళీకరణ విధాన ఫలితాలను, చరిత్రను విశదం చేస్తున్నారు.

కాని రాజకీయ ఆర్థికశాస్త్రవేత్తగా "దెబ్బ కొట్టేందుకు సిద్ధమే, గాయపరచకూడదు" అనే దురదృష్ట వైఖరిని చేపడుతున్నారు.

వర్గ రాజకీయాలు ఆధిపత్యం వహిస్తే ప్రత్యామ్నాయ విధానాలు సాధ్యమని చెప్తున్నారు. నయా సరళీకృత విధానాలను కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల నెత్తిన రుద్దుతోంది. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తోంది. 1970, 80 లోలాగ తిరిగి కేంద్ర, రాష్ట్ర సంబంధాలు అనే సమస్య ఆధారంగా రాష్ట్రాల స్థాయిలో పనిచేసే రాజకీయ పార్టీలను (నయా సరళీకరణ ఆర్థిక విధానాలను, దాని అమలు కోసం కుంచింప బడుతున్న రాష్ట్రాల అధికారాల పునరుద్ధరణ కోసం, ప్రజాసంక్షేమానికి అంకితమయ్యేందుకు) సమీకరించి పోరాడాలని ఆయన ప్రబోధిస్తున్నారు. అందుకు సమస్యలను లేవనెత్తి చూపారు. (పీపుల్స్ డెమోక్రసీ – మార్చ్ 18, 2007)

1970, 80లలో ఆనాడు కేంద్రంలో గుత్తాధిపత్యం వహిస్తుండిన కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వాలను సమాయత్తం చేయడంలో కీలక పాత్ర వహించింది మార్క్సిస్ట్ పార్టీ. ("వామపక్షాలు" పూనుకున్నట్లు ఆయన రాశారు. ఆ సమయంలో సి.పి.ఐ కాంగ్రెస్‌తో పొత్తుకలిపి ఉంది. ఇక మిగిలిన "లెఫ్ట్" సి.పి.ఐ.(ఎం)).

ఈనాడు మార్క్సిస్ట్ పార్టీ ఆ పాత్ర వహించగలదా? తాతా గారికి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కారు ఫ్యాక్టరీ కోసం తొమ్మిది స్థలాలు చూపించింది. ఆయన సింగూర్ అయితేనే ఫ్యాక్టరీ అన్నారు. ఆయనను తృప్తిపరచి, మరొక రాష్ట్రానికి పోతామనే తాతా బెదిరింపును నిజం కాకుండా చేసేందుకు, రైతాంగం పై ధ్వజమెత్తింది.

"మరొక రాష్ట్రానికి పోకుండా" అంటే రాష్ట్రాల మధ్య పోటీ ఆటలో భాగస్వామి కావడమే. పోటీలో ఉండేవారు ఐక్యతకు తోడ్పడగలరా?

ప్రాంతీయ పార్టీలు ఆనాటి కేంద్ర ప్రభుత్వ కేంద్రీకృత విధానాలను ప్రతిఘటించేందుకు తలెత్తాయి. కేంద్రం – రాష్ట్ర సంబంధాలు కీలకమైన రాజకీయ అంశంగా ముందుకు వచ్చింది.

ఇది 1967 నాటి అవగాహన

"2.70 ప్రాంతీయ పార్టీలు రాజకీయంగా తమ స్థానాలను మార్చుకుంటున్నాయి. మతతత్వం పట్ల వారు నికరంగా లేరు. వారిలో అత్యధికులు లౌకికవాదులే. కాని ఆయా రాష్ట్రాలలో వారివారి ప్రయోజనాలను కాపాడుకునేందుకు జాతీయ స్థాయిలో ఒక పాత్ర నిర్వహించాలని ఆశతో ఉన్నారు. యునైటెడ్ ఫ్రంట్‌లో ఉన్నవారు అనేకులు కేవలం అవకాశవాదంతో బి.జె.పి. నాయకత్వానికి మారారు.

2.71 ఇలా మారుతున్న ప్రాంతీయ పార్టీల పాత్ర దృష్ట్యా, ఆ పార్టీల పట్ల విభిన్న వైఖరిని అనుసరిస్తుంది సి.పి.ఐ. (ఎం). బి.జె.పి.తో చేతులు కలిపిన వారిని గట్టిగా వ్యతిరేకిస్తుంది. మతతత్వంతో ఘర్షణ పడేందుకు సిద్ధపడేవారితో పార్టీ సహకరిస్తుంది. ప్రాంతీయ దురహం కారాన్ని ఏ రూపంలో ఉన్నా పార్టీ ప్రతిఘటిస్తుంది. మతతత్వ వ్యతిరేక, ప్రజానుకూలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలతో కలసి ఐక్య పోరాటాలకు పూనుకుంటుంది. ఎప్పటికప్పుడు ఎన్నికల అవగాహనను కుదుర్చు కుంటుంది. (17వ కాంగ్రెస్ చిత్తు రాజకీయ తీర్మానం)"

ఇది ఈనాటి వైఖరి.

భారత రాజకీయాకాశంలో 1977 తరువాత అనేక మార్పులు వచ్చాయి. 1980లతో ప్రారంభమైన నూతన ఆర్థిక విధానాలు, 1991 నాటికి ప్రపంచ పెట్టుబడిదారీ విధానంతో మమేకమై, వారితో కలిసి లాభాలు సంపాదించుకునే క్రమంగా మొగ్గతొడిగింది. లాభాల కోసం విదేశాల్లో పెట్టుబడులు, స్థానిక పెట్టుబడుల కోసం విదేశీ వాణిజ్య రుణాలు, స్టాక్ మార్కెట్ ద్వారా విదేశీ పెట్టుబడిని ఆహ్వానించడం, పెత్తనం లేకుండా వీరికి–వారు పెట్టుబడి సమకూర్చి లాభాలు కొల్లగొట్టడం వంటి అనేక ఆర్థిక మార్పులు వచ్చాయి. ఈ మార్పులను కాంగ్రెస్ – బి.జె.పి. లనే రాజకీయ ప్రతినిధుల ద్వారా పాలకవర్గాలు అన్ని ఆమోదించాయి. తమ ప్రయోజనాల కోసం మొత్తం వ్యవసాయ రంగాన్ని, ప్రత్యేకించి ప్రజల ఆహారభద్రతను విదేశీ ప్రయోజనాలకు బలిపెడుతున్నాయి. ప్రభాత్ పట్నాయక్ వంటి మేధావులు రాజ్యాంగాలు ప్రైవేట్ పెట్టుబడికి, ప్రాథమిక పెట్టుబడిని సమకూర్చే యంత్రాలుగా రూపొందాయని పేర్కొంటున్నారు. ఈ విధానాలను రాష్ట్రప్రభుత్వంపై బలవంతంగా రుద్దుతున్నారు. అందుకు రాజ్యాంగ బద్ధమైన సంస్థ 11,12 ఫైనాన్స్ కమిషన్లను ఎలా ఉపయోగించుకున్నారో, ప్రభాత్ పట్నాయక్ తన, మార్చ్ 18, 2007 వ్యాసంలో వివరించారు.

ఇటువంటి విపత్కర స్థితిలో కాంగ్రెస్–బి.జె.పి.లు రెండూ ఆమోదిం చిన విధానాలను వ్యతిరేకించే వేదిక అవసరం. అప్పుడే ప్రాంతీయ పార్టీలు ఒక నిబద్ధతకు కట్టుబడగలవు. అలాంటిది లేనప్పుడు, రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో మైత్రి వారి రాజకీయ ఎత్తుగడ అవుతుంది.

అలాంటి వేదిక కోసం చొరవ చూపాల్సింది వామపక్షం. మూడు రాష్ట్రాలలో అధికార గణానికి నాయకత్వం వహిస్తున్న మార్క్సిస్ట్ పార్టీ, ఆ పార్టీ రాజకీయ పార్టీగా బి.జె.పితో సాగించాల్సిన పోరాటాన్ని, మతతత్వానికి వ్యతిరేకంగా సాగే సైద్ధాంతిక పోరాటంగా మార్చివేసింది. ఈ గందరగోళంలో ఆర్థిక విధానాలను విస్మరించి, కేంద్రంలో రాజకీయంగా జట్టుకట్టే ఎత్తుగడ అనుసరించింది. ఆ పార్టీ అనుసరించే జట్టు ఎత్తుగడలు ఆమోదిస్తేనే, ప్రాంతీయ పార్టీలతో స్నేహం అంటోంది.

ఈనాటి ఈ వైఖరి ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలకు గల అవకాశాలను ఎలా వినియోగించుకోగలదు? వామపక్షాలు మినహా ఈ పని ఎవరు చేయగలరు? ప్రభాత్ పట్నాయక్ ఈ విషయం లోతుగా వివరించరు సరిగదా నందిగ్రామ్ విషాదానికి నయా సరళీకృత విధానం తెచ్చిపెట్టే గొప్ప పరిశ్రమల ఫలితంగా వర్ణించి, ఆ విధానాలను వ్యతిరేకించనందుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని తప్పు పట్టవచ్చు అంటారు 'నందిగ్రామ్ తరువాత' అనే ఇ.పి.డబ్ల్యు, మే 26, 2007 వ్యాసంలో. ఇక్కడే ఆయన మరొక తిరకాసు పెట్టారు.

"ఇదివరలో ప్రతిఘటించినట్లుగా" అంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి తప్పుచేసినట్లు ఒక ముసుగు కప్పుతున్నారు. ఇది నిజం కాదు. అందుకు అనేక ఉదాహరణలను పేర్కొనవచ్చు. ఇప్పటికే ఈ వ్యాసం సుదీర్ఘమైంది. కేవలం మార్క్సిస్ట్ పార్టీని ఎండగట్టేందుకే రాసినట్లు భావించబడే ప్రమాదముంది. అందుకే రెండు ఉదాహరణలు పేర్కొంటాను.

1. ఆర్థికాధికార కేంద్రీకరణలో భాగం 'వాట్' పద్ధతి. కాంగ్రెస్ ఆర్థిక మంత్రిగా ప్రారంభంలో రోశయ్య గారు అది రాష్ట్రాలకు నష్టకరమని పేర్కొన్నారు. మద్రాస్‌లో ఏ ప్రభుత్వం మారినా ఈ మధ్యవరకు 'వాట్'లో చేరలేదు.

'వాట్' అమలు చేసేందుకు ఏర్పాటైన మంత్రుల సంఘం అధ్యక్షుడు పశ్చిమ బెంగాల్ ఆర్థికశాఖా మంత్రి.

'సెజ్'ల ఏర్పాటుకు కేంద్రం 2005లో చట్టం చేసింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 2003లోనే చట్టం చేసింది.

ఆ ప్రభుత్వం అనుసరించే పారిశ్రామికీకరణ విధానాన్ని బలపరుస్తూ లెనిన్ సిద్ధాంతానికి సందర్భశుద్ధి లేకుండా చేసి, ఆ లెనినిస్ట్ ఎత్తుగడలను అనుసరిస్తున్నట్లు 'పీపుల్స్ డెమోక్రసీ'లో ఆ రాష్ట్ర మంత్రులు వ్యాసపరంపరలు రాశారు.

మార్క్సిస్ట్‌లు మారిన పరిస్థితులకు అనుగుణ్యంగా ఆలోచనా విధానం మార్చుకోవాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవసాయం నుండి పరిశ్రమకు, గ్రామాల నుండి పట్టణాలకు పయనమే ప్రగతిశీలతగా ఆయన మానవ ప్రస్థానాన్ని అభివర్ణిస్తున్నారు.

(ప్రైవేట్ ఆస్తి హక్కులే నాగరికతకు మూలం అంటూ ఒక చైనా ప్రతినిధి వారి పార్లమెంట్‌లో ప్రసంగించారు. ఆయన చైనా కమ్యూనిస్టు).

కాబట్టి పశ్చిమ బెంగాల్ నయా సరళీకృత విధానాలను వ్యతిరేకించింది, నందిగ్రామ్ విషయంలో పొరపాటు చేసింది అనడం సరియైన వివరణ కాదు. కాల్పులకు విచారం ప్రకటిస్తున్నారు ఆ రాష్ట్ర, కేంద్ర నాయకులు. నందిగ్రామ్ ప్రజలు కాదంటే అక్కడ పరిశ్రమ ఉండదని మాత్రమే హామీ ఇస్తున్నారు. అంతే తప్ప ప్రభాత్ పట్నాయక్ వివరించిన మూలాలను ఆ పార్టీ పరిశీలించడం లేదు.

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ విధానాలకు తాము 1977 తరువాత అనుసరించిన రాజకీయ విధానం, ఆ విధానానికి అనుగుణ్యంగా "తాజా" పరచిన కార్యక్రమం ఎంత వరకు కారణమని ఆ పార్టీ కేంద్ర నాయకత్వం ఆలోచించడం లేదు.

పార్టీ కార్యకర్తలలో అత్యధికులు ఎమర్జన్సీ తరువాత పార్టీలో చేరిన వారు. వారికి అలాంటి అవగాహనకు తావేలేదు.

నందిగ్రామ్ ప్రాజెక్ట్ గురించి మొదట వివరంగా ప్రస్తావించింది అశోక్ మిత్రా. ఆయన వ్యాసం ఇ.పి.డబ్ల్యులో వచ్చింది. దానికి చెప్పిన సమాధానం (అదే పత్రికలో) చదివితే నయా సరళీకరణ విధానాలపట్ల పశ్చిమ బెంగాల్ నాయకత్వం ఎంత మమేకమైందో తెలుస్తుంది.

నందిగ్రామ్ విషాదం బయటపెట్టింది మార్క్సిస్ట్ పార్టీ వైఫల్యాన్ని మాత్రమే కాదు. భారత కమ్యూనిస్టు ఉద్యమ వైఫల్యానికి అది ఒక విషాదకర ఉదాహరణ.

ఉద్యమంలో చీలిక వచ్చిన రోజున 'ఏది నిజం, ఏది కాదు?' అనే సందేహం అనేకులకు ఉండవచ్చు. చీలికను, అందులో ఏదో ఒక భాగాన్ని ఎంచుకోడం వెనుక విప్లవం త్వరగా వస్తుందనే ఆశే అందరినీ ప్రేరేపించిన అంశం.

'వంట రుచి తినడంలో కనిపిస్తుంది.' కమ్యూనిస్టు పార్టీల కార్యక్రమం శక్తి ప్రజలను విప్లవం వైపు నడపడంలో కనపడుతుంది. ఈ మాటలు మార్క్స్, ఏంగెల్స్, లెనిన్‌లు పదే పదే చెప్పారు. ఆ మాటల నుండే భారత కమ్యూనిస్టు ఉద్యమం రూపొందించిన మూడు కార్యక్రమాలూ 35 ఏండ్ల కృషీ విప్లవాన్ని జయప్రదం చేయలేక పోయాయి అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

నాయకత్వాలను గాక, పార్టీ కార్యక్రమాలనే విశ్లేషించాల్సిన తరుణం ఆసన్నమైంది. లేకుంటే 'డిప్రెస్డ్ అండ్ డిప్రైవ్డ్' భారతీయులు తీవ్రంగా నష్టపోతారు. కమ్యూనిస్టు అనే వారు అనుమతించరాని పరిస్థితి అది.

ప్రజలు పోరాడుతున్నారు. ఆ పోరాటాలు విప్లవోద్యమాలుగా ఎందుకు రూపుదాల్చడం లేదు. 1905 తరువాత లెనిన్ వేసుకున్న ప్రశ్న ఇది.

పట్నాయక్ వ్యాసాల గురించి ఇంత సుదీర్ఘ చర్చ ఎందుకని ఎవరైనా ప్రశ్నించవచ్చు. ఆవేదనను ఆయన రాయగలిగారు. తమలో తాము తర్జన భర్జన పడే మేధావులు కమ్యూనిస్టు శ్రేణుల్లో అనేకులు ఉన్నారు. నిస్సహాయులుగా నిలిచిపోతున్నారు.

సోషలిస్టు మేధావులు సోషలిజానికి కట్టుబడి ఉండాలి. ఒక పార్టీకి కాదు. ఇదే 'ఫ్రండ్స్ ఆఫ్ ది పీపుల్స్' వ్యాసంలో మేధావులకు లెనిన్ నిర్ధారించిన కర్తవ్యం.

భారత కమ్యూనిస్టు ఉద్యమం త్యాగాల పుట్ట. ఆ సాంప్రదాయం ఈనాటికీ కొనసాగుతోంది. త్యాగానికి నివాళులు పట్టడం భారతదేశ సంస్కృతి. రాజ్యాన్ని కాలదన్నిన బుద్ధుడు ఆరాధ్యుడు. కొల్లాయి గట్టిన గాంధీజీ ఆరాధ్యుడు. కాని బౌద్ధం, గాంధీయిజం గూడ ఈనాటికీ జ్ఞాపకాలుగా మిగిలాయి.

త్యాగం మాత్రమే విప్లవం తీసుకరాదు. సిద్ధాంత అన్వయం, నిష్కళంకమైన ఆచరణ అందుకు అవసరం.

విప్లవాన్ని మనసారా కోరే వారిలో ఆలోచనను ప్రేరేపించేందుకే ఈ వ్యాసం. తగిన స్పందనకు దోహదపడగలదని వినమ్రతతో ఆశిస్తున్న రచయిత సాహసించి, తన ఆలోచనలను అక్షరీకరించాడు. అందుకు ప్రేరేపించింది పట్నాయక్ వ్యాసాలు. అందుకు ధన్యవాదాలు. ◆

వ్యవసాయం, పలకలు, అటవీ ఫలసాయం ముఖ్య జీవనాధారంగా ఉండే ఒక ప్రకాశం జిల్లా పల్లెలో సంస్కరణల ఫలితంగా విధ్వంసమైన జీవన చిత్రాన్ని చూపిస్తున్నారు పులుగుజ్జు సురేష్

మా ఊరికి దెయ్యం పట్టింది

మాది ఒక కుగ్రామం. ప్రకాశం జిల్లాలోని బేస్తవారపేట మండలంలో ఉంది. అదే చిన్న ఓబినేనిపల్లె గ్రామం. నూతన ఆర్థిక విధనాలు ఎంతో అభివృద్ధిని సాధించాయని, గత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పాటు, ఇప్పుడున్న ముఖ్యమంత్రి డా. వై. ఎస్ రాజశేఖర రెడ్డితో సహా ఈ సంస్కరణలు, విధానాలు, ఇరవై ఏండ్ల ముందే వచ్చి ఉంటే మన రాష్ట్రం ఎంతో అభివృద్ధిని సాధించి ఉండేదని ఢంకా బజాయించి చెబుతున్నారు. వీరి భ్రమలకు వాయిద్యాలు వాయిస్తు కొండతలు చేస్తున్న ఐ.ఎ.ఎస్. అధికారులు, కాంట్రాక్టర్లు చెప్పే మాటలు వింటుంటే వాస్తవాలకు వారి భ్రమలకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. ఆర్థిక సరళీకరణ, నూతన ఆర్థిక విధానాలు సాధించిన అభివృద్ధి ఏపాటో విశ్లేషించుకోవాలని నాకనిపించింది. నేను పుట్టిన గ్రామంలో జరిగిన పరిణామాలను వాస్తవంగా పరిశీలించి సమాజానికి తెలపాలని ఆకాంక్షిస్తున్నాను. సామాజిక శాస్త్రం విద్యార్థిగా, సామాజిక పరిశోధకునిగా గత పదిహేడు సంవత్సరాలలో మా గ్రామంలో చోటు చేసుకున్న పరిణామాలు ఈ విధంగా ఉన్నాయి.

నా వయస్సు ఇరవై తొమ్మిది సంవత్సరాలు. నేను ఎం.ఎ (సోషియాలజి) ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకున్నాను. ఎస్.వి. యూనివర్సిటీలో చేనేత రంగంపైన పి.ఎచ్.డి చేయబోతున్నాను. మా గ్రామంలో రిజిస్టరయిన మొదటి పి.ఎచ్.డి. విద్యార్థిని నేనే. కాబట్టి ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్నాను.

మా పల్లెకు దట్టమైన అడవులు ఉన్నాయి. గ్రామం నుంచి 35 కిలోమీటర్ల దూరం నుండే చిన్న కొండలు, గుట్టలు, వాగులు, చెరువులతో పాటు వెలుగొండ నుండి తిరువతి వరకు వెళ్లే ఏడుకొండలు మా గ్రామం మీదుగా పోతుంది. తునికాకు, సిరిమాను చెట్లు, జామపండ్ల చెట్లు, పశువులకు మేత, ఉసిరి, బోదగడ్డ, వంటచెరుకు, ఇంటి నిర్మాణాలకు అవసరమైన కలప, జింకలు, తోడేళ్లు, దుప్పులు, కొండగొర్రెల్లు, అడవిపందులు, మొదలగు అడవి సంపద విస్తారంగా ఉండేది. కొండల్లో నీరులేనప్పుడు దుప్పులు అడవుల నుండి మా పల్లె పొలిమేరలకు వచ్చేవి. గ్రామంలోని ప్రజలు, పిల్లలు, యువకులు, వృద్ధులు ఒకరేం అందరూ గుంపులు గుంపులుగా వెళ్లేవారు.

మా గ్రామంలోని ప్రతి కుటుంబానికి పశువులు ఉండేవి. పశువుల మేతకొరకు ఊర్లోని వారందరూ తెల్లవారుజామున లేచి కొండకు పోయేవారు. కొండ సమీపాన గల ఒక ప్రదేశంలో కూర్చొని మిగతావారి కొరకు ఎదురు చూసేవారు. గడ్డి కొంత, ఉసిరికాయలు కొన్ని కోసుకుని తిరుగుముఖం పట్టేవారు. ఎవరికైనా దొరకకపోవడం లేదా, తక్కువ బడడం జరిగితే, తలాపిడికెడు ఇచ్చి మోపుకట్టేవారు. ఇటువంటప్పుడ నిపించేది 'ఒకరికోసం అందరం అందరి కోసం ఒకరం' ఎంతటి సహాయంగా ఉండేవారో. మా ఊర్లో అందరికీ పాలిచ్చే బర్రెలుండేవి కావు. పాడివున్న కుటుంబాలు మజ్జిగ చిలికి పాడిలేని వారికి పోసేవారు. ఆ మజ్జిగ చిక్కగా, చల్లగా, రుచిగా ఉండేది. కాని ఇప్పుడు మజ్జిగ చూద్దామంటే కనబడడం లేదు. కానీ థమ్సప్, చీప్‌లిక్కర్ బాగా అందుబాటులో ఉంది.

1995కు పూర్వం మా పల్లెకు జీవనాధారం వ్యవసాయం, పలకలు, అటవీ ఫలసాయం. మా ఊరి చెరువు కింద దాదాపు 1000 ఎకరాలు వరి పండేది. బావుల నిండా నీరుండేది. సజ్జలు, జొన్నలు, రాగి, నువ్వులు మొదలగు ఆహారధాన్యాలతోపాటు గోంగూర, టొమాటో, బెండకాయ, బచ్చలకూర, తోటకూర, మిరపకాయలు బాగా పండేవి. ఏ తోటగట్టుకెళ్లినా మాకు ఆకు కూరలు, కూరగాయలు పండేవి. మా ఊరి చుట్టూ బత్తాయి తోటలున్నాయి. తోటల్లోని మల్లెపూలు కోసి, ఆ తోట గలిగిన వారు దారి వెంట కనబడ్డ వాళ్లందరికీ ముఖ్యంగా ఊరి ఆడబిడ్డలకు, కోడళ్లకు, యువతులకు పిలిచి పిలిచి ప్రేమతో పెట్టేవారు. కులాలు వేరుగా ఉన్నా, నిమ్నకులాలు, అగ్రవర్ణాల వారందరూ అక్కబావ, అత్తమామ, అన్నా తమ్ముడు వరుసలతో పిలుచుకునేవారు. అటువంటి పిలుపులు ఎక్కడున్నా వినబడితే వాళ్ల నోటినిండా చక్కెర పోయాలని పిస్తుంది. పొరుగు ఊరినుండి ఎవరయినా చుట్టం వస్తే చాలు బస్సు ఆగు స్థలం నుండి ఇల్లు చేరేవరకు దారి పొడవునా పలకరింపులే. కనబడ్డ వారందరూ యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటారు. బస్సు దిగినప్పటి నుండి ఇల్లు చేరేవరకు కనీసం రెండు గంటల సమయం పడుతుంది. ఈ పలకరింపులతోటి వారి బాధలన్నీ మరచిపోయేవారు. పండుగలొచ్చినవంటే చాలు ఎక్కడెక్కడి వారంతా ఊరు చేరుకుంటారు. మా ఊరి దళితవాడలోని దళితులు నేడు క్రైస్తవులయ్యారు. క్రిస్మస్ పండుగ వచ్చిందంటే పండుగకు నెల రోజుల నుండే హడావిడి మొదలయ్యేది. బంధువులకు, కోడళ్లకు, ఉద్యోగస్తులందరికి ఉత్తర ప్రత్యుత్తరాలు రాసుకునేవారు. మిలటరీలో ఉండేవారు సయితం పండుగకు ఇల్లు చేరుకునేవారు. ఎవరయినా రాలేని పరిస్థితిలో ఉంటే వారు రావాలని ఊరుఊరంతా ప్రార్థనలు చేసేవారు. ఇంటి దగ్గరున్న వారు క్రీస్తు జననం

డ్రామా వేసేవారు. ఈ డ్రామా ఎన్ని సార్లు వేసినా చూడటానికి వందలాది మంది ప్రజలు వచ్చేవారు. వినోదంతోపాటు, కడుపు ఉబ్బించే నవ్వులు, పాటలు, పద్యాలుపాడేవారు. డ్రామాకు అయ్యే ఖర్చు నలుగురూ పంచుకునేవారు. చెమటోడ్చిన డబ్బును పదిమంది ఆనందం కోసం ఖర్చు చేయడంలో బహుసంతోషపడేవారు. దాదాపు గత 12 సంవత్సరాల నుండి ఈ డ్రామాలు కనిపించడం లేదుకదా ఆఊసే వినబడడం లేదు.

మా ఊరికి దూరంగా ఉండే దళితవాడలోని పిల్లలు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతిగృహాలలో చదువుకునేవారు. శనివారం సాయంత్రం, బేస్తవారపేట, కంభంలలో హాస్టళ్లలో చదివే వారంతా 16 కిలోమీటర్లు నడిచి ఇంటికి వచ్చేవారు. ఆ రోజు రాత్రి బజారులో నీటితో గీతలు గీసి 'చర్'ఆట ఆడేవారు. దీనిని చూడటానికి పెద్దలు, పిల్లలు అందరూ వచ్చేవారు. తెల్లవారు జామున మూడు నాలుగు గంటల వరకు ఆటలాడేవారు. ఈ ఆటలాడేవారికి, చూసేవారికి ఎంతో ఉల్లాసంగా ఉండేది. పొద్దున మళ్లీ దినచర్య ప్రారంభమవుతుంది. మా ఊరికి సమీపంలో ఉన్న కంభం చెరువు కింది వేలాది ఎకరాలు వరి పంట పండేది. మా తల్లిదండ్రులందరూ గుంపులు గంపులుగా తయారయి వరికోతకు పోయేవారు. 20-30 రోజులు కోతలు కోస్తే, ఏడాదికి సరిపడా ధాన్యం ఇంట్లో ఉండేది. ఇతర వ్యవసాయ కూలీలకు పోతే వచ్చిన డబ్బులతో కిరాణం, బట్టలు, పిల్లల చదువులకు ఉపయోగించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు.

ఇంటిపై కప్పులు బోదగడ్డి, చెరుకువాడుతో కప్పడం వలన వర్షపు నీరు ఇంట్లో చేరేది. ఇటువంటి వారికి, ఆ కులంకు సంబంధించిన వారందరూ కొండకు పోయి గడ్డి, వాసాలు (కట్టెలు), గుంజలు, దూలాలు కొట్టి నెత్తివోపులు మోనకొచ్చి అందరి సహాయంతో ఇల్లు పునర్మించేవారు. ఇంటి నిర్మాణం పూర్తయిన తరువాత ఇంటివారు శనగపప్పు, బెల్లం, సేమియా, కొబ్బరి కలిపి పరమాన్నం చేసి ఊరందరికీ పంచేవారు. ఇంటి నిర్మాణంలో పాల్గొన్న వారందరూ కలిసి సహపంక్తి భోజనం చేసేవారు. ఇల్లు కప్పేటప్పుడు శ్రమను మరచిపోవడానికి సామెతలు, కథలతోపాటు, ఇతర కుటుంబాల గురించి మాట్లాడుకుని కడుపార నవ్వుకునే వారు. ఇప్పుడు మా ఊరంతా సిమెంట్ ఇళ్లు నిర్మించాక ఆ ఆనందమే దూరమయ్యింది. వర్షం కురిసినప్పుడు ఒకరినొకరు పరామర్శించుకునేవారు. ఇప్పుడా పరిస్థితి కనబడటం లేదు. ఊర్లో ఎవరికయినా జబ్బు చేసి ఆసుపత్రిలో చేరినట్టు తెలిస్తే చాలు, ఊరు ఊరంతా ఆస్పత్రి దగ్గరే ఉండేవారు. డబ్బులు లేకపోయినా వైద్యులకు దండాలు పెట్టి బతికించమని కోరేవారు. వీటిని గమనించిన డాక్టర్లు తక్కువ ఫీజుతో వైద్యం అందిచేవారు కూడా లేకపోలేదు. ఇప్పుడు ఆసుపత్రికి పోతే ఎవరికి జబ్బు చేస్తే వారే. పక్కవారు కూడా పలకరించే పరిస్థితి మా గ్రామంలో లేదు. ఎందుకంటే డబ్బులడిగితే ఇవ్వాల్సి వస్తుందేమోనని.

మా ఊరి దళితులకు ప్రధాన జీవనాధారం పలకల తయారీ. బండరాళ్లను సమాంతరం చేసి పిల్లలు రాసుకునే పలకాలు తయారు చేస్తారు. పొద్దున్నే లేచి, సద్ది భూజనా పెట్టుకొని బారులు తీరి పలకల కొండకు వెళ్లేవారు. పలకలు చెయ్యడం రాని వాళ్లు కొందరు పలకల గనుల్లో మట్టి ఎత్తి బయట పోస్తుంటే, కొందరు వాలు చూసి పలకల రాయిని బయటికి తీసేవారు. పలకలు చేసేవారికి ఇంటిదగ్గర ఉన్న స్త్రీలు అన్నం వండి, పచ్చిమిరపకాయ, ఎండు మిరపకాయల పచ్చళ్ళు, రాత్రి మిగిలిన అన్నంలో పోసిన గంజి ఉపున్నీళ్లు, మజ్జిగ బువ్వ తీసుకు వచ్చేవారు. కాలుతున్న ఎండనీడను తట్టుకోవడానికి చిన్న పందిరిలు వేసేవారు. ఆ పందిర్ల దగ్గర కూర్చొని, పలకలు చేసే వాళ్లందరూ కలసి తినేవారు. అందరి కూరలు, అందరూ కలిసి తినేవారు. ఎవరికయినా అన్నం లేకపోతే మిగతా వారు పెట్టేవారు. మధ్యాహ్నం రెండు గంటలకు పని అయిపోయేది. ఎర్రని ఎండలో పరుగులు తీస్తూ ఇల్లు చేరేవారు. ఇల్లు చేరిన ఆడపిల్లలు, ముఖ్యంగా యువతీ యువకులు బోరింగుల దగ్గర నుండి రబ్బరు బిందెలు, మట్టి కడవలలో నీళ్లు మోసేవారు. అనంతరం రోళ్ల దగ్గిర వడ్లు, సజ్జలు, వరిగలు, అరికలు దంచేవారు.


వడ్లు దంచేది ఇద్దరయితే వారితో సంభాషించడానికి పదిమంది చేరేవారు. ఇప్పుడు ఆ ఆనందం లేదు. ధాన్యం దంచే రోళ్లు మట్టి రోడ్లలో కలిసిపోయాయి. ఆ జనం కూడా ఇప్పుడు లేరు. అందరికీ పెళ్లిళ్లయి ఊరికొకరు, వెళ్లిపోయారు. పలకల కార్మికులకు శనివారం బట్వాడా ఇస్తారు. ఆదివారం రోజు సెలవు. ఉమ్మడిగా కలసి ఒక జంతువును కొని కుటుంబాల చొప్పున భాగం వేసుకొని కడుపునిండా తినేవారు. మందుబాబులు నాటుసారా తాగి, తప్పెట్లు, కొట్టి, ఈలలేస్తూ డాన్సులేసేవారు. ఊరుఊరంతా ఒకచోటచేరి బావ-మరదళ్లు వరసయిన వారు నీళ్లు చల్లుకోవడం, పసుపు, పొయ్యిదగ్గర మసి పూసుకునేవారు.

ఊర్లో ఏదయినా జంతువును కోస్తే యువకులంతా ఒకటయి వ్యూహం పన్నేవారు. ఎవరికయినా ఇద్దరికి దుప్పటి కప్పి కూర్చోబెట్టి ఊరి మధ్యలో ఉన్న చర్చి దగ్గిర కూర్చోబెట్టేవారు. రెండు గ్రూపులుగా విడిపోయి, బేసిన్‌లు, లుంగీలు తీసికొని ఇళ్ల దగ్గరకు వెళ్లేవారు. ఎవరో బాటసారులు వచ్చారు, రెండు రోజులనుండి అన్నం లేక మన గ్రామం వచ్చారు. వారికి కొంచెం బువ్వపెట్టమని బతిమాలాడేవారు. మాంసం కూర బేసిన్‌లో, అన్నం లుంగీలో కట్టుకుని రాత్రి 10 గంటల సమయంలో యువకులందరూ చర్చి దగ్గర కూర్చుని దుప్పట్లో కలుపుకుని ముద్దలు తిని అరిగేవరకూ 'చర్' (సిరిపట్టే) ఆట ఆడేవారు. ఇది విన్న వారందరూ ముక్కుమీద వేలేసుకుని విస్తుపోతారు.

ఎంతో అందమైన మా పల్లె. నిండు జనాభాతో ఉన్న మా పల్లె ప్రజలందరూ కలిసి తిరుగుతూ కష్టాలను సైతం కలిసి పంచుకునే మా పల్లె పరిస్థితి ఇప్పుడు చాలా దయనీయంగా మారింది.

అవి 1991 తరువాత మా గ్రామంలో వచ్చిన విపరీత పరిణామాలు. ఏమంటే, పచ్చని పొలాలు బీడుబారినయ్, బత్తాయితోటలు 60 శాతంకు పైగా నరికి వేశారు. గత 15 సంవత్సరాలలో ఈ రోజువరకు కూడా మాఊరి చెరువు నిండలేదు. ఎండిపోయింది. ఎండాకాలంలో సైతం బావుల నుండే తోడుకునే నీరు ఇప్పుడులేదు. బావులన్నీ ఎండి పోయినయ్. 500 అడుగుల్లో కూడా బోర్లలో నీరు లేదు. బోర్లువట్టిపోయినయ్. అన్నిటికంటే దళితుల జీవనాధారమైన పలకలపరిశ్రమ యంత్రాల వలన పూర్తిగా పూడిపోయింది. మార్కాపురం, కేంద్రంగా ఉన్న పలకల పరిశ్రమగా రూపాంతరం చెందింది. ప్లాస్టిక్, ఇనుప పలకలు మార్కెట్లోకి రావడం వలన మా పలకలు కొనేవారు కరువయ్యారు. మార్కాపురం పలకల పరిశ్రమ, ఫ్లోరింగ్‌కి, గోడలకు

త్రిపురనేని వెంకటేశ్వరరావు



కవి, రచయిత, మార్క్సిస్ట్ తత్వశాస్త్రవేత్త త్రిపురనేని వెంకటేశ్వరరావు మే 31న హైదరాబాద్‌లో మరణించారు. 1929లో కృష్ణాజిల్లా అంగలూరు గ్రామంలో జన్మించిన వెంకటేశ్వర రావు విద్యార్థి దశ నుంచే ఉద్యమాలతో సంబంధాలు పెట్టుకున్నారు. నాడు పార్టీ మీద నిషేధం విధించినప్పుడు 1951 వరకు అజ్ఞాతవాసంలో ఉన్నారు. 1952 నుంచి 1957 వరకు శ్రీకాకుళం జిల్లా పార్టీ కార్యదర్శిగా పూర్తికాలం పనిచేశారు. 1953లో పెంచిన శిస్తుకు వ్యతిరేకంగా టెక్కలిలో సాగించిన రైతాంగ ఉద్యమ సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు. 1950ల నుంచి భారతీయ తత్వశాస్త్రంపై, కమ్యూనిస్టు సిద్ధాంతంపై నిశిత పరిశీలన సాగిస్తూ అనేక రచనలు చేశారు. ప్రచురితమైన గ్రంథాలలో 'భారత తత్వశాస్త్ర పరిశీలన', 'శంకరాద్వైతం' 'త్రిపురనేని రామాయణం' లతో పాటు వేమన మీద, వీరేశలింగం మీద కొత్త దృష్టిని ప్రసరిస్తూ చేసిన రచనలు ఉన్నాయి. ఆయన మరణానికి 'వీక్షణం' తన ప్రగాఢసంతాపాన్ని తెలియజేస్తోంది. ◆

జవాద్‌రజ్వీ



హైదరాబాద్ రాష్ట్రంలో తొలి కమ్యూనిస్టు లలో ఒకరుగా, 1939లో మఖ్దూమ్ మోహియుద్దీన్, ఆలమ్ ఖుంద్ మీరీ, రాజ్‌బహదూర్‌గౌర్ తదితరు లతో కలిసి కామ్రేడ్స్ అసోసియేషన్ స్థాపించి, అప్పటి నుంచి ఆరు దశాబ్దాలకు పైగా ప్రజా ఉద్యమాలతో కలిసి పనిచేసి ఎస్.ఎం. జవాద్‌రజ్వీ తన 86వ ఏట జూన్ 14న హైదరాబాద్‌లో మరణించారు. ఆల్ హైదరాబాద్ స్టూడెంట్ యూనియన్ ఏర్పాటులోనూ కీలకపాత్ర పోషించారు. పౌరప్రజాస్వామిక హక్కులకై ఉద్యమించారు. 1943లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో అజ్ఞాత జీవితాన్ని గడిపి తర్వాత జైలుశిక్షను అనుభవించారు. ఆధునిక హైదరాబాద్ చరిత్రపై ఉర్దూలో 'రియాసత్ ఎ హైదరాబాద్ మే జద్దే-జద్-ఎ-ఆజాది', ఇంగ్లిష్‌లో 'రోల్ ఆఫ్ యూత్ అండ్ స్టూడెంట్స్ ఇన్ ద హైదరాబాద్ ఫ్రీడమ్ స్ట్రగుల్', 'ది క్రొనాలజీ ఆఫ్ హైదరాబాద్ స్టేట్' అనే పుస్తకాలు రాశారు. రోల్ ఆఫ్ యూత్ పుస్తకం హైదరాబాద్ సంస్థానంలో రాజకీయ చైతన్యం- విద్యార్థి యువజనుల పాత్ర అనే పేరుతో తెలుగులోకి అనువాదం అయింది. ఆయన మృతికి 'వీక్షణం' తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తోంది. ◆

అంటించే రాళ్ల తయారికి రూపాంతరం చెందింది. ఈ పరిశ్రమలోకి యంత్రాలు ప్రవేశించడం వలన చిన్నఓబినేనిపల్లె, రోలుగంపాడు, గోలుపల్లె వంటి పల్లెల్లో పరిశ్రమ దెబ్బతింది.

ఒక వ్యవసాయంలో వచ్చిన మార్పులు రైతులను వ్యవసాయ కూలీలను నిర్వాసితులను చేస్తే, పలకల పరిశ్రమలో వచ్చిన యంత్రాలు పలకల తయారీ చేసే కార్మికులను నిర్వాసితులను చేసింది. క్రమంగా పల్లెల్లో వలసలు పెరిగాయి. పనులు లేక అల్లాడిపోతున్న దళితులకు బత్తాయిలు కోయడానికి కూలీలు కావాలని లారీలు వచ్చాయి. యువతీ యువకులు వందల సంఖ్యలో బత్తాయి కోతలకు పోవడం మొదలు పెట్టారు. రు. 25 నుంచి రు. 40 వరకు కూలీ దొరికేది. 5-10 రూపాయిలకు బత్తాయిలు అమ్ముకునేవారు. మొదట్లో ఇది కాస్త ఊరట కలిగించినా తరువాత మా యువతను పక్కదారి పట్టించింది. తెల్లవారు జామున లారీ ఎక్కితే మళ్లీ ఏ అర్ధరాత్రికో ఊరు చేరేవారు. ఈ పరిస్థితిలో లారీల వెంట తిరగడం వలన యువతీ యువకులు పెడదారి పట్టారు. చివరకు తీవ్రరూపం దాల్చి ఎచ్.ఐ.వి, ఎయిడ్స్‌కు దారి తీసింది. 25-35 ఏళ్లలోపు నిండు ప్రాణాలు రాలిపోతున్నాయి. ఫలితంగా దిక్కులేని స్థితిలో ప్రజలు అల్లాడుతున్నారు. 70 శాతం యువకులకు పెళ్లిళ్లు కావడం లేదు. గత ఆరు ఏళ్లలో ఎనిమిది మంది క్యాన్సర్ వ్యాధితో మరణించారు. లెక్కలేని సంఖ్యలో చాలామందికి కళ్లు పాడైనాయి. కంటి ఆపరేషన్లు పెరిగాయి.

మిషనరీల ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రాథమికోన్నత పాఠశాల మూతపడింది. ప్రైవేట్ పాఠశాలలు గణనీయంగా పెరిగాయి.

దళితవాడకెళితే పడిపోయిన గోడలు, తాళం వేసిన ఇళ్లు దర్శనమిస్తాయి. ప్రతి ఐదు ఇళ్లలో ఒక ఇల్లు తలుపు తెరిచి ఉంటుంది. ఇక్కడ ఉండేది కాటికి కాళ్లు చాచిన వృద్ధులు. యువతరం పొట్ట చేత పట్టుకుని నగరాలకు వలసపోయింది. అక్కడ యంత్రాల మధ్యన సతమతమవుతున్నది. మురికివాడల్లో మురికి జీవితం వారిది. ఇంటి దగ్గిర తమ పిల్లల కోసం ఎదురుచూసే వృద్ధులను ఒకసారయినా చూద్దామంటే పెరిగిన బస్సు ఛార్జీలు రానియ్యడం లేదు. కనీసం ఎలక్షన్లప్పుడు రాజకీయ నాయకులు ఓటరుకు ఛార్జీలు ఇస్తారు. ఇప్పుడొద్దామనుకున్నా కుదరడం లేదు. ఎందుకంటే దళితుల ఓట్లన్నీ ఏరి పారేసారు. షాంపూలు, ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరుగుతోంది. మాయదారి జబ్బులన్నీ మా ఊరిని పీల్చి పిప్పిచేస్తున్నాయి. నా చిన్నతనంలో ప్రభుత్వ వారుణి వాహిని సారాయిని దొంగచాటుగా తాగే వారు కానీ పెరిగిన చీప్ లిక్కర్ సీసాలు ఇంట్లోకి ప్రవేశించాయి.


ఇకపోతే ఈ మధ్యకాలంలో వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణం వేగవంతమయింది. దీని వలన మాకు నీరువస్తుందని ఆశపడ్డాం. కానీ మా దరిద్ర్యాన్ని అదనుగా తీసుకున్న గుంటూరు, వైజాగ్, కడప జిల్లాల వారు మా పొలాలన్నీ ఎకరం కేవలం రు. 15,000 - 25,000 వరకు కొన్నారు. వెలుగొండ ప్రాజెక్ట్ వలన లాభపడేది ఇప్పటి దాకా దారిద్ర్యం లో మగ్గిన స్థానికులు కాదు. సిరి సంపదలతో ఊగిన సంపన్నులు.

ఇప్పుడు చెప్పండి పాలకులారా! మేధావుల్లారా, విధానకర్తల్లారా, ఐ.ఏ.ఎస్. అధికారుల్లారా, ఆర్థిక సంస్కరణలు మా గ్రామానికి తెచ్చిన ప్రమాదం ఎంతో అంచనా వేయగలరా? నాశనమైన మా సహజ వనరుల ను, మానవసంబంధాలను తిరిగి తీసుకురాగలరా? బావిలో కప్పలాగా, ఎ.సి.లో కూర్చునే మీకు లోకమంతా చల్లగా కనిపిస్తుంది. కానీ తల్లి-బిడ్డలకు సంబంధాలు తెగిపోయి తెగిన గాలిపటంలా తిరుగుతున్న పల్లెలు, పేదల జీవితాలను ఒకసారి కళ్లుతెరచి పరిశీలించండి. ◆

ఒక దళారీ పశ్చాత్తాపం రచయిత జాన్ పెర్కిన్స్ తాజా పుస్తకం విడుదల సందర్భంగా ఆమీ గుడ్‌మాన్ జరిపిన ఇంటర్వ్యూ.

కొనసాగిన పశ్చాత్తాపం...

2005లో విడుదలైన 'కన్‌ఫెషన్స్ ఆఫ్ యాన్ ఎకనామిక్ హిట్‌మాన్' పుస్తకం సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. అనేక భాషల్లో లక్షలకొద్ది కాపీలు అమ్ముడైన ఈ పుస్తకం ప్రపంచ బ్యాంకు, అమెరికా కలిసి బడుగుదేశాలపై విసురుతున్న అప్పుల వల వెనుక రహస్యాలను బద్దలు కొట్టింది. ఎకనామిక్ హిట్‌మాన్ అనే ఆర్థిక దళారీలను నియమించి దేశాధినేతలను ప్రలోభపెట్టి, వారిని భారీ అప్పుల ఉచ్చులో ఇరికించే పథకం గురించి జాన్ పెర్కిన్స్ అనే మాజీ ఎకనామిక్ హిట్‌మాన్ తొలిసారిగా వెల్లడించాడు. తెలుగులో 'ఒక దళారీ పశ్చాత్తాపం' పేరిట విడుదలై ఏడాది కాలంలో అయిదు సార్లు పునర్ముద్రణ పొందింది ఈ పుస్తకం. ఇప్పుడు జాన్ పెర్కిన్స్ 'కన్‌ఫెషన్స్ ఆఫ్ యాన్ ఎకనామిక్ హిట్‌మాన్' పుస్తకానికి రెండో భాగం వెలువరించాడు. జూన్ 5, 2007 నాడు 'ది సీక్రెట్ హిస్టరీ ఆఫ్ అమెరికన్ ఎంపైర్' అనే పేరుతో విడుదలైంది పుస్తకం. ఈ సందర్భంగా పుస్తక రచయిత జాన్‌పెర్కిన్స్‌తో ఆమీగుడ్‌మాన్ జరిపిన ఇంటర్వ్యూనుంచి కొన్ని విశేషాలు:



షెవ్‌రాన్ – టెక్సాకో : 1968లో పీస్‌కోర్ పని మీద నేను ఈక్వెడార్‌కు వెళ్లిన సమయంలోనే టెక్సాకో కూడా ఆదేశంలో అడుగుపెట్టింది. ఆ రోజుల్లో ప్రపంచ బ్యాంకు, టెక్సాకో, ఇంకా దానికి వత్తాసుపలికే నేతలంతా చమురుసంపద ఈక్వెడార్‌ను పేదరికం నుంచి బయటకు లాగుతుందని నమ్మించారు. ప్రజలంతా ఈ ప్రచారం నమ్మారు. నేనూ నమ్మాను. కానీ వాస్తవంలో పూర్తివిరుద్ధంగా జరిగింది. చమురు వెలికితీసి టెక్సాకో అయితే లాభపడింది కానీ ఈక్వెడార్ ఇంకా పేదదయ్యింది. ఆమెజాన్ అడవులు నాశనమయ్యాయి.

ఇప్పుడు 30 వేలమంది స్థానిక ఈక్వెడార్ ప్రజలు షెవ్‌రాన్ టెక్సాకోపై 600 కోట్ల డాలర్ల దావావేశారు. ఈక్వెడార్ అడవుల్లో 1800 కోట్ల గ్యాలన్ల విషతుల్యమైన వ్యర్థాలను సదరు కంపెనీ వదిలిందని ఆ దావాలో పేర్కొన్నారు. ఈ కాలుష్యం కారణంగా అనేకులు మృత్యువాత పడ్డారనీ, క్యాన్సర్‌వంటి భయంకర వ్యాధుల బారినపడ్డారనీ వారంటున్నారు.

ఈ కేసు వాదిస్తున్న స్టీవ్ డోంజిగర్ అనే అమెరికన్ న్యాయవాది నాతో ఇలా అన్నాడు : 'తప్పు చేసి దాన్ని సరిదిద్దుకోవడానికి ప్రయత్నించే కంపెనీలు చాలా చూశాను కానీ ఈ కంపెనీ తప్పు చేయలేదు. ఈ విధ్వంసం అంతా దానికి తెలిసే జరిగింది. వాళ్లు ఏం చేస్తున్నారో వారికి పూర్తిగా తెలుసు. డబ్బుల యావలో పడి అనేకమంది ప్రజల ఉసురు తీశారు వాళ్లు'.

కాంగో : ఆఫ్రికా ఖండానిది, కాంగో దేశానిది ఓ బీభత్స, విషాదకథ. కాంగోలో కోల్టన్ అనే ఖనిజం దొరుకుతుంది. మనలో చాలా మందికి కోల్టన్ ఎందుకు ఉపయోగపడుతుందో తెలియదు. మనం ఉపయోగించే ప్రతి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ కంప్యూటర్‌లో కోల్టన్ వాడతారు. కంపెనీలకు చౌక సెల్‌ఫోన్లు తయారు చేయడానికి భారీ మొత్తంలో కోల్టన్ కావాలి. ఆ ఖనిజం కోసం కాంగోలో మిలియన్ల కొద్దీ ప్రజల ప్రాణాలు హరింపబడ్డాయి. మనంవాడే సహజవనరులకు న్యాయమైన ఖరీదు చెల్లించలేదు మనం. వాళ్లందరికీ మనకోసం బానిస బతుకులు ఈడ్చాల్సివస్తోంది .

వియత్నాం, ఇరాక్ యుద్ధంలో అమెరికా ఓటమి : యుద్ధాల్లో ఓటమిని గురించి ఆలోచించేది మన బోటివారే. కొడుకునో, తోబుట్టువునో, సహచరుడినో పోగొట్టుకున్న వాళ్లకు ఈ యుద్ధం ఒక బీభత్సం. కాని బహుళజాతి కార్పొరేషన్లు మాత్రం వియత్నాం యుద్ధంతో భారీగా లాభపడ్డాయి. ఇక ఇరాక్‌లో వాటికి ఎదురే లేదు.

ఇజ్రాయిల్ : విషాదమేమిటంటే హిట్లర్ చేతిలో ఊచకోతకు గురైనందుకు పరిహారంగా యూదుల కోసం ఇజ్రాయిల్ ఏర్పాటు చేశారని ఆ దేశ వాసులు నమ్ముతారు. కానీ అలా ఏర్పాటు చేయదలచుకుంటే చుట్టూ వారి శత్రువులని పేరుపొందిన అరబ్ దేశాల మధ్య ఎందుకు ఏర్పాటు చేశారీ దేశాన్ని? ఇజ్రాయిల్‌లో ఓ బలమైన సైనిక స్థావరం నెలకొల్పి అమెరికా తన ప్రయోజనం నెరవేర్చుకుంటోంది. కానీ మధ్యలో ఇరుక్కున్నది మాత్రం ఇజ్రాయిల్ పౌరులు.

బొలీవియాలో బెక్టెల్ కంపెనీ : ప్రపంచబ్యాంక్ ప్రోద్భలంతో బొలీవియా రాజధాని కొచబంబాలో నీటి సరఫరా ప్రైవేటీకరింపబడింది. బెక్టెల్ చేతికి నీటి సరఫరా రాగానే నీటి ధరలు నాలుగింతలయ్యాయి. ఈ ధరల పెరుగుదలకు నిరసనగా ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేశారు. చివరికి ప్రభుత్వం దిగి వచ్చి బెక్టెల్‌ను తప్పించింది. అయితే తనకు యాభై మిలియన్ డాలర్ల నష్టం వచ్చిందని బొలీవియా ప్రభుత్వంపై యూరోపియన్ న్యాయస్థానంలో దావా వేసింది బెక్టెల్. మొన్న ఇవోమొరాలెస్ బొలీవియా దేశాధ్యక్షుడు అయ్యాక ఆ దావా ఉపసంహ రించుకుంది బెక్టెల్.

ఈక్వెడార్ : ఇటీవలే హెలికాప్టర్ ప్రమాదంలో ఆ దేశ రక్షణశాఖ మంత్రి గ్వాడెలుపె లార్రినా మరణించారు. నేను ఈ మధ్యనే ఈక్వెడార్ వెళ్లివచ్చాను. అక్కడ ప్రజలంతా ఈ సంఘటన గురించే మాట్లాడుకుంటు న్నారు. జైమె రోల్డోస్ హత్య జరగడానికి కొన్నాళ్ల ముందు కూడా ఇలాగే అతని రక్షణశాఖ మంత్రిని హతమార్చారు. ఈ సంఘటన జరిగింది కూడా అమెరికా వైమానిక స్థావరానికి దగ్గరలో. ఈక్వెడార్ ప్రజలు ఇది తమ కొత్తనేత రాఫెల్ కొరియాకు ఓ సంకేతం పంపడం కోసం చేసిన చర్య అనే నమ్ముతున్నారు.

అను : **కొణతం దిలీప్**

ఈ పుస్తకం త్వరలో తెలుగులో విడుదల చేస్తోంది **వీక్షణం** పబ్లికేషన్స్

(... 5వ పేజీ తరువాయి)

యాజమాన్యానికే దక్కుతుంది. తిలా పాపం తలా పిడికెడు అన్నట్లు ఈ పాపంలో హనుమంతరావుగారి భాగస్వామ్యం కూడా ఉంది.

ఇదే వ్యాసంలో ఆయనే రాసిన మాటలు "ఈనాడు పత్రిక సంపాదకీయ విభాగంలో సీనియర్ జర్నలిస్టులుగా మొట్టమొదటి పునాదులు వేసిన ఎబికె, పొత్తూరి, టి.వి.కె, ఈ వ్యాసకర్త (అంటే హనుమంతరావు గారే) లను మొదటి రెండేళ్లలో బయటికి వెళ్లిపోవాల్సిన పరిస్థితిని కల్పించింది ఈనాడు చీఫ్ ఎడిటరే". హనుమంతరావుగారు ఎందుకో మరో ఇద్దరి పేర్లు రాయలేదు. మరిచి పోయారో, వొద్దనుకున్నారో నాకు తెలియదు. ఆ ఇద్దరూ చలసాని ప్రసాదరావు, రాంభట్ల కృష్ణ మూర్తి. వెనకాముందుగా ఎవరెప్పుడు చేరారో నేను చెప్పలేను గాని ఈనాడు విశాఖపట్టణం తరవాత 1975లో హైదరాబాద్‌లో రెండవ ఎడిషన్ ప్రారంభించే నాటికి ఈ ఆరుగురు సీనియర్ జర్నలిస్టులూ ఈనాడు సంపాదకీయ విభాగంలో ఉన్నారు. 1976లో వృత్తి జీవితంలోకి అడుగుపెట్టి ఈనాడు దినపత్రిక నుంచే ఓనమాలు నేర్చుకున్నవాడు ఈ ఆరుగురి దగ్గరా పనిచేసాను. ఈనాటికి నేను వృత్తిలో నిలబడడానికి వారి దగ్గర నేర్చుకున్నదే పునాది. ఈ ఆరుగురికి రుణపడి ఉంటాను. ఇందులో టి.వి.కె., చలసాని, రాంభట్ల ముగ్గురూ మన మధ్యలేరు.

అందులో చలసాని ప్రసాదరావు గారు తుదిశ్వాస వరకు ఈనాడులో కొనసాగారు. రాంభట్ల కృష్ణమూర్తి గారు కూడా దాదాపు అంతే.

ఇక హనుమంతరావు గారు పేర్కొన్నట్టుగా బయటికి వెళ్లిపోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్న నలుగురినీ ఒకేగాటన కట్టడం న్యాయం కాదు.

దేశంలో ఎమర్జెన్సీ ఎత్తేసిన తరువాత ఏర్పడిన స్వేచ్ఛా వాతావరణం దేశ ప్రజలందరితో బాటు ఈనాడు దినపత్రికలో పనిచేస్తున్న జర్నలిస్ట్, నాన్ జర్నలిస్ట్ సిబ్బంది, కార్మికులకు కూడా గొంతు విప్పి న్యాయం కోసం అరిచే ధైర్యాన్నిచ్చింది. 1977 జూన్ 24 అర్ధరాత్రి నుంచి న్యాయమైన వేతనాల కోసం, మానవీయమైన పని పరిస్థితుల కోసం ఈనాడులో కార్మికులు సమ్మె ప్రారంభించారు. సరిగ్గా 24 రోజులపాటు సమ్మె జరిగింది. పత్రిక ప్రచురణ నిలిచిపోయింది. 25వ రోజున విజయవాడ నుంచి కిరాయి పనివారినీ, గూండాల నూ లారీలలో తరలించి అప్పటి ప్రభుత్వాధినేత సహకారంతో సమ్మెను విచ్ఛిన్నం చేసి సమ్మెకారులను సస్పెండ్ చేసి పత్రిక ప్రచురణ తిరిగి ప్రారంభించారు. ఈ సమ్మెకు నాయకత్వం వహించిన వ్యక్తి ఎస్.వి.ఎస్. సుబ్బారాయుడు పత్రికా ప్రపంచం అపారంగా గౌరవించిన వ్యక్తి. మానవ విలువలకు, సంబంధాలకు, హక్కులకు, స్వేచ్ఛకు అమితమైన ప్రాధాన్యతనిచ్చే పూజనీయుడు. న్యూస్ ఎడిటర్ స్థాయిలో ఉండి కూడా ఆయన తన హోదాను తృణప్రాయంగా కాలదన్ని ఆ సమ్మెకు నాయకత్వం వహించారు. ఆనాటి కార్మికుల సమ్మెను వ్యతిరేకించి రామోజీరావు గారు ఒక గొప్ప పురోగామి అని, అభ్యుదయవాది అనీ, కమ్యూనిస్టు భావాలు కలిగిన వాడనీ కీర్తించి సమ్మె చేస్తున్న కార్మికులంతా అరాచకవాదులు, నక్సలైట్లు అని ముద్రవేసి పత్రికా ప్రకటనలు గుప్పించిన పెద్దల పేర్లు నేనిక్కడ రాయదల్చుకోలేదు. ఎందుకంటే వారు జీవించిలేరు కనుక. నేను రాసే విషయంపై వివరణ ఇవ్వలేరు కనుక.

సమ్మె ప్రారంభానికి ముందే పొత్తూరి వెంకటేశ్వర రావు గారు ఆంధ్రప్రభ దినపత్రికలో సంపాదకుడిగా చేరారు. ఈనాడులో చోటుచేసుకున్న దుష్పరిణామాలపట్ల విచలితుడై సమ్మెకు ముందే టి.వి.కృష్ణ ఈనాడుకు రాజీనామా చేసారు. మనమధ్య ఈనాడు లేని టి.వి.కె. మానవతా విలువలను అత్యున్నతంగా గౌరవించిన మరో మహానుభావుడు.

1977 సమ్మెకంటే ముందే విశాఖపట్టణంలో పత్రిక ప్రారంభించిన కొన్నినాళ్లకే విశాఖ ఎడిషన్‌లో ఒక మెరుపు సమ్మె జరిగింది. అయితే యాజమాన్యం దానిని అత్యంత వేగంగా అణచి వేయగలిగింది. అప్పుడు కూడా కొందరు కమ్యూనిస్టు మహానుభావులు రామోజీరావు గారి అనుకూల వైఖరీ, కార్మిక వ్యతిరేకవైఖరీ తీసుకున్నారు. ఆ సమ్మెలో కొందరు యువకులు ఉద్యోగాలు పోగొట్టుకుని రోడ్లపాలైనారు. జర్నలిస్ట్ సంఘాల పాత్రపట్ల, వాటికి నాయకత్వం వహిస్తున్నవారి పట్ల ఇప్పుడు ఇంత ఆందోళన వ్యక్తం చేస్తున్న హనుమంతరావు గారు ఈనాడు సిబ్బంది విశాఖ సమ్మె విషయంలో ఏ వైఖరి అవలంబించారు? దీనికి సమాధానం ఆయనే చెబితే బాగుంటుంది.

ఇక హైదరాబాద్‌లో సమ్మె విషయానికి వస్తే అర్ధరాత్రి దాటాక సిటీ ఎడిషన్ ప్రచురణను నిలిపివేసిన తరువాత నిరవధిక సమ్మె ప్రకటన ప్రపంచానికి తెలిసింది హనుమంతరావుగారి ఇంటి నుంచే.

అప్పట్లో మా సమ్మెకు నాయకత్వం వహించిన పెద్దలు ఎస్.వి.ఎస్. సుబ్బారాయుడు, ఎన్.ఎస్. పరబ్రహ్మమూర్తి తదితరులతో కలిసి నేను కూడా హనుమంతరావుగారి శ్రీనగర్ కాలనీ ఇంటికి తెల్లవారుఝామునే వెళ్లాను. ఆయనే జర్నలిస్ట్ యూనియన్ నాయకులకు ఫోన్ చేసి ఈనాడులో సమ్మె ప్రారంభం అయింది అని ప్రకటించారు.

ఈనాడులో కార్మికోద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలోనే మధ్యలో హనుమంతరావు గారు తన ఉద్యోగానికి రాజీనామా చేసారు. చివరిదాకా కార్మికులతో ఆయన ఎందుకు నిలబడలేదు? ఈ ప్రశ్నకు కూడా సమాధానం ఆయనే చెప్పాలి. అసలు ఆనాడు సమ్మె చేసే పరిస్థితులు ఈనాడులో ఉన్నాయా? సమ్మె విజయవంతమై యాజమాన్యం మెడలు వంచి కోర్కెలు సాధించుకునే వాతావరణం నెలకొనకముందే సమ్మెకు పురిగొల్పి కార్మికులు వీథుల పాలయ్యేందుకు కారకులెవరు? దీనికి కూడా సీనియర్ పాత్రికేయులు హనుమంతరావు గారే వివరణ ఇవ్వాలి.

ఉద్యమం మధ్యలో రాజీనామా చేసిన హనుమంతరావు గారు ఆ వెంటనే డి.ఎన్.ఎఫ్. అనే ఏజన్సీని స్థాపించి నడిపారు. తొలిరోజుల్లో ఆ సంస్థకు ఆశ్రయం కల్పించింది దేశోద్ధారక భవన్ (యూనియన్ కార్యాలయం) లోనే. క్రియాశీల జర్నలిజం నుంచి ఆయన దాదాపుగా ఆనాడే తప్పుకున్నారు. ఆ తరువాత కూడా ఆయనను యూనియన్ వృత్తి పెద్దగా గౌరవాన్నే ఇచ్చింది.

1977 తరువాత ఇప్పటివరకు వృత్తిలో వచ్చిన మార్పులు వాటిని తట్టుకుని జర్నలిస్ట్ ఉద్యమం క్రియాశీలకంగా ముందుకుసాగిన బాటలో ప్రతి అడుగూ ఎపియుడబ్ల్యూజేదే. ఎన్ని జర్నలిస్ట్ వ్యతిరేక, కార్మిక వ్యతిరేక పోకడలను, యాజమాన్యాల కుయుక్తులను, కుతంత్రాలను ఈ యూనియన్ ఎదిరించి పోరాడిందో, ఎన్ని సందర్భాలలో గెలిచిందో, ఎన్ని సందర్భాలలో ఎదురు దెబ్బలు తిని రక్తసిక్తమయిందో ఈనాటికీ ఆ స్ఫూర్తిని కొనసాగించి ఎట్లా ముందుకు నడుస్తున్నదో హనుమంతరావుగారు అంగీకరించినా, అంగీకరించకపోయినా అది చరిత్ర. చరిత్రను విస్మరించలేము కదా!

- సుదీర్ఘ చరిత్ర కలిగిన ఆంధ్రపత్రిక దినపత్రిక మూతపడింది. దానితో ఉపాధి కోల్పోయిన జర్నలిస్ట్, నాన్ జర్నలిస్ట్ సిబ్బందికి పరిహారం అందేందుకు కృషి చేసింది ఎవరు?
- తెలుగు పత్రికా రంగంలోనే ఒక పెద్ద సంచలనంగా దూసుకొచ్చిన ఉదయం దినపత్రిక మూతపడినప్పుడు కార్మికులకు న్యాయం జరగడానికి పోరాటం చేసిందెవరు?
- ఆంధ్రప్రదేశ్ టైమ్స్ ఇంగ్లీషు దినపత్రిక మూతబడితే ఆ పత్రిక సిబ్బంది జరిపిన న్యాయ పోరాటంలో అగ్రభాగాన నిలిచిందెవరు?
- ఇండియన్ ఎక్స్‌ప్రెస్ యాజమాన్యం దాని తెలుగు దినపత్రిక ఆంధ్రప్రభను అమ్మివేస్తే, దానిని కొనుగోలు చేసిన పెద్దమనిషి నుంచి పాత ఉద్యోగులందరికీ రావలసిన బకాయిలు అణా పైసలతో చెల్లించేట్టు వీధి పోరాటాలూ, న్యాయపోరాటాలూ చేసిందెవరు?

ఆంధ్రజ్యోతి దినపత్రిక అప్పటి యాజమాన్యం ఆర్థిక అరాచకత్వం కారణంగా మూతబడితే దానిని తిరిగి తెరిపించడానికి కొన్ని వేలమందికి తిరిగి ఉపాధి దొరికేట్టు చేయడానికి ఎవరి ప్రయత్నం కారణమయింది? ఆంధ్రజ్యోతి తిరిగి తెరవడానికి అవసరమైన అగ్రిమెంట్ మీద ఎవరి సంతకాలున్నాయి? వీటన్నిటిలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్‌ల యూనియన్, దాని నాయకత్వం పాత్రను ఎవరైనా విస్మరించగలరా? భారతదేశంలో మరే రాష్ట్రంలోనూ జరగని ప్రయత్నం ఒకటి ఎపియుడబ్ల్యూజె చేసింది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్ట్‌ల వేతనాలు, పనిపరిస్థితులు, స్థితిగతుల మీద ఒకకమిటీని నియమించి రెండువందల పేజీల నివేదికను బచావత్ వేజ్ బోర్డుకు సమర్పించి, రెగ్యులర్ ఉద్యోగుల మూలవేతనంలో మూడవ వంతు గ్రామీణ విలేఖరులకు చెల్లించాలని సిఫార్సు చేయించింది ఎపియుడబ్ల్యూజె.

దేశంలోనే మొట్టమొదటిసారిగా మండల కేంద్రాల్లో పనిచేసే విలేఖరుల కు అక్రెడిటేషన్ సౌకర్యం కల్పించడం కోసం ప్రభుత్వంతో పోరాడి సాధించింది ఎపియుడబ్ల్యూజె. ఒక కోటి రూపాయల మూలనిధితో ప్రభుత్వం చేత జర్నలిస్టుల సంక్షేమ నిధిని నిర్వహింప జేసినది కూడా ఈ సంఘమే.

ఉదయం విలేఖరి గులామ్ రసూల్‌ను పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ లో హత్య చేస్తే, ఆంధ్రజ్యోతి విలేఖరి చాడ శ్రీధర్‌రెడ్డిని పీపుల్స్‌వార్ నక్సలైట్లు పోలీసు ఇన్‌ఫార్మర్ అని ముద్రవేసి చంపేస్తే, ఆంధ్రప్రభ విలేఖరి యాదగిరిని కల్లు, రాజకీయ మాఫియా నడివీథుల్లో నరికి చంపితే, ఆయావర్గాలకూ, ప్రభుత్వా లకూ ఎదురునిల్చి పోరాడి వారి కుటుంబాలకు న్యాయం జరిగేటట్టు చూసింది ఎపియుడబ్ల్యూజెనే.

ఈ రోజుకూ రాష్ట్రంలోని ఏ మూలనైనా ఏ జర్నలిస్ట్ మీదనైనా ఎవడు చెయ్యేసినా కదులుతున్నది ఎపియుడబ్ల్యూజెనే.

హనుమంతరావుగారు అన్యాయంగా ఒక గుడ్డ కాల్చి మీదవేసిన విధంగా వ్యాఖ్యానించిన "సీనియర్ల" చేతుల్లో ఎపియుడబ్ల్యూజె బందీగా ఉన్నదా?

యాజమాన్యాలు మరిచిపోయిన జర్నలిస్టుల సంక్షేమం కోసం, వృత్తి విలువలను కాపాడటం కోసం, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించుకోవడం కోసం పనిచేస్తోందా అన్నది ఇంతకంటే వివరంగా చెప్పవలసిన అవసరం లేదనుకుంటాను.

పెద్దరికం (సీనియారిటీ) అనేది తమకు తాము ఇచ్చుకుంటే వచ్చేదికాదు. ఇతరులు గుర్తించాలి. అట్లా వచ్చే గుర్తింపును కాపాడుకునే విధంగా పెద్దల వ్యవహారశైలి ఉండాలి. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసి, ఆ సంస్థను నిర్వీర్యం చేయడానికి సకల ప్రయత్నాలూ చేస్తూ సంఘ బహిష్కృతులైన కొందరు వ్యక్తులకు సలహాదారు పాత్ర పోషిస్తున్నందు వల్లనే హనుమంతరావు గారు జర్నలిస్ట్ యూనియన్ నాయకత్వాన్ని ఈవిధంగా నిందించారను కోవాలో ఏమో తెలియదు. విజ్ఞులంతా ఈ విషయాలను గురించి ఆలోచించి అభిప్రాయాలు ఏర్పరచుకోవాలనేది నా విజ్ఞప్తి.

దేవులపల్లి అమర్

ప్రధాన కార్యదర్శి, ఎపియుడబ్ల్యూజె

ప్రత్యేక ఆర్థిక మండలుల గురించి ఎస్. సుధాకర్ వ్యాసంలో రెండు సందర్భాల్లో జోక్యం చేసుకోవాలని అనిపించింది.

1. నందిగ్రామ్‌లో బుద్ధదేవ్ భట్టాచార్య హ్యూమన్ ఫేస్ చూపించే ప్రయత్నం ఏమీ చేయలేదు. జనవరి 7న నందిగ్రామ్ బ్లాకు (సమితి) ప్రజలు వేలాదిమంది మొదటిసారి సోనాచురా దగ్గర తమ ప్రతిఘటనా ప్రదర్శన చేసినప్పుడు వారిపై సామంత సర్కార్ అనే సిపిఐ (ఎం) భూస్వామి తన ఇంట్లో నుంచి కాల్పులు జరిపాడు. ముగ్గురు రైతులు అక్కడికక్కడే నేలకొరిగారు. ఆయన గుండాలు జనంలోంచి స్త్రీలను అపహరించి ఆయన ఇంట్లోకి బలవంతంగా లాక్కెళ్లి చెరిచారు. ఆ బలాత్కారపు చిహ్నాలు ఇప్పటికీ ప్రజాగ్రహానికి గురయి దహనమైన ఆ ఇంట్లో కనిపిస్తాయి. అప్పటి నుంచీ నందిగ్రామ్ ప్రజలు పోలీసులను, సలీం కంపెనీకి భూములు సేకరించే పనికి వచ్చేవారిని రాకుండా అడ్డుకోవడానికి బ్లాకేడు నిర్వహించారు.

ఆ బ్లాకేడును ఛేదించి ఎన్నోమార్లు నందిగ్రామ్‌లో ప్రవేశించడానికి ప్రయత్నించిన హర్మత్‌వాహినీ (సిపిఐ (ఎం) గూండాలు) మార్క్స్ వర్ధంతి అయిన మార్చ్ 14ను భారీ ప్రవేశానికి ఎంచుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో పారామిలిటరీ బలగాలతో ఖెజూరీ ప్రాంతం నుంచి వేలసంఖ్యలో ప్రవేశించి సోనాచురాలో గౌరాంగ పూజలో, నమాజులో ఉన్న స్త్రీలపై, ముస్లింలపై నిర్విచక్షగా కాల్పులు జరిపారు. అవన్నీ ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రచారమయిన నందిగ్రామ్ చరిత్రలో భాగమైనవి. నేను చెప్పదలుచుకున్నదల్లా సిపిఐ (ఎం) అక్కడికి హ్యూమన్ ఫేస్‌తో వచ్చే కుహనా ప్రయత్నం కూడ చేయలేదు. పారామిలిటరీ యూనిఫారా ల్లోనే వచ్చింది. ఖాకీచిప్పలకు బదులు హెల్మెట్లు, బూట్లకు బదులు స్లిప్పర్లు, చెప్పులు వేసుకోవడం వల్ల హర్మత్‌వాహినీని గుర్తించడం తేలికయింది.

అయితే దేశవ్యాప్తంగా నందిగ్రామ్ మారణకాండ విషయంలో బదనామ్ అయ్యాక మాత్రం సిపిఐ (ఎం) 'హ్యూమన్ ఫేస్' పెట్టుకొని సలీం కంపెనీ కోసం అక్కడ భూసేకరణ చేయనని ప్రకటించింది. తెలుగునేల మీది ప్రజాస్వామ్య వాదులు ఈ హ్యూమన్ ఫేస్‌ను చూసే బెంగాల్ లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకొమ్మని కాంగ్రెస్ ప్రభుత్వాలకు సలహాలిస్తున్నారు. వాస్తవానికి అధికారికంగా అటువంటి ప్రకటన ఇప్పటివరకు లేకపోగా హల్దియాలో కెమికల్ హబ్ వచ్చి తీరుతుందని, అందుకోసం నందిగ్రామ్ బ్లాకులో కాకపోతే పొరుగున ఉన్న ఖెజూరీ బ్లాకులో భూములు సేకరిస్తారని ప్రచారం జరుగుతున్నది. ప్రత్యేక ఆర్థిక మండలులకు గానీ, నూతన ఆర్థిక విధానానికి గానీ, అది ప్రతిపాదించే 'పారిశ్రామికీకరణ'కు గానీ సిపిఐ (ఎం) వ్యతిరేకం కాదని స్పష్టమయినప్పుడు ఈ 'హ్యూమన్ ఫేస్' తాత్కాలికమేనని అర్థం చేసుకోవడం కష్టం కాదు.

2. అరుణ్ శౌరీని సన్ ఎట్ సెన్‌తో 1978 ఫిబ్రవరి వరంగల్ ఆర్‌ఎస్‌యు మహాసభలో పోల్చిన అజ్ఞానం నాది, అంతే తప్ప ఆయనను భారత సన్ ఎట్ సేన్ అని ఎన్నడూ ఎవ్వరూ భ్రమపడలేదు. అట్లాగే ఆయనను ప్రగతిశీల ప్రజాస్వామ్యవాది అని కూడ ఎమర్జెన్సీ ఎత్తివేసిన రోజుల్లోనూ ఎవరూ భావించ లేదు. ఆయన ప్రపంచబ్యాంకు ఆర్థికవేత్తగా పనిచేసి ఎమర్జెన్సీలో జయప్రకాశ్ నారాయణ్ జైలునుంచి విడుదలయ్యాక వచ్చి ఆయన వ్యక్తిగత కార్యదర్శిగా చేరాడు. ఆ తర్వాత తార్కుండే నాయకత్వంలోని పియుసిఎల్ అండ్ జిఆర్‌కు కృష్ణకాంత్‌తో పాటు కార్యదర్శి అయ్యాడు. ఆ బాధ్యతతో ఆంధ్రప్రదేశ్‌లో ఎమర్జెన్సీ ఎన్‌కౌంటర్ హత్యలపై తార్కుండే కమిటీ చేసిన నిజ నిర్ధారణలో కన్నబిరాన్‌తో పాటు క్రియాశీలంగా పనిచేసాడు. ఆ సందర్భంలోనే గిరాయిపల్లి ఎన్‌కౌంటర్‌కు ప్రత్యక్ష సాక్షి అయిన వద్దేపల్లి భిక్షపతి సాక్ష్యం సేకరించడానికి చాలసార్లు వరంగల్ వచ్చాడు. వచ్చినప్పుడల్లా మా ఇంట్లో ఉండి తుంగచాప మీద పడుకుంటే ఆయన నేపథ్యం ఏమీ తెలియనీ నేను ఆయనను ప్రజాస్వామ్య వాదిగా భ్రమించి ఆర్‌ఎస్‌యు మహాసభల ప్రారంభోపన్యాసానికి పిలిచి సన్ ఎట్ సేన్‌తో పోల్చాను. అప్పుడే సి.వి. సుబ్బారావు వంటి ఢిల్లీ మిత్రులు ఆయనది ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యమని, ప్రపంచబ్యాంకు ఏజెంట్ అని, ఢిల్లీకి వచ్చి ఆయన నిజరూపం చూడమని చెప్పారు. అన్నట్లే 1985లో ఢిల్లీలో ఆయన నిజరూపం చూసాను. అప్పటికే ఆయన 80లలో పంజాబ్‌లో ప్రారంభమైన మిలిటెంట్ ఉద్యమాన్ని ఒక పంజాబ్ హిందూ బ్రాహ్మణుడిగా తీవ్రంగా వ్యతిరేకిస్తూ రాజీవ్ గాంధీకి దగ్గరయ్యాడు. అయితే 1985లో ఎన్టీఆర్ మళ్లీ అధికారంలోకి రావడానికి, అస్సాంలో అస్సాం గణపరిషత్ అధికారంలోకి రావడానికి చాల కీలకమైన పాత్ర నిర్వహించాడు. బహుశా టిడిపి గానీ, ఎజిపి గానీ కనీసం జాతీయ బూర్జువా ఆకాంక్షలకు కూడ ఎక్కువకాలం ప్రాతినిధ్యం వహించవని, అనతికాలంలోని కేంద్రంలోని దళారీ బూర్జువా వర్గానికి, అందులోనూ ఎన్డీయే నాయకత్వంలోని వర్గానికి అండగా నిలుస్తాయని ఆయన ముందుగానే ఊహించి ఉంటాడు. లేదా ఆ పొత్తు కుదరడంలో చాల ముఖ్యమైన పాత్ర నిర్వహించి ఉంటాడు.

90లో మండల్ కమిషన్‌ను వ్యతిరేకించడం ద్వారా ఏ వివరణ అక్కర్లేకుండానే ఆయన ఏమిటో దేశానికి స్పష్టంగానే తెలిసిపోయింది.

అరుణ్‌శౌరీ హిందుత్వ భావాలు గానీ, ప్రపంచబ్యాంక్ సమర్థనగానీ 1990ల తర్వాత ఏ దాపరికం లేకుండానే బయట పెట్టుకుంటున్నాడు. ఆ తర్వాత తానే వాజ్‌పేయి ప్రభుత్వంలో డిజిన్వెస్ట్‌మెంట్ మంత్రి అయ్యాడు. ప్రజారంగంలోనీ పరిశ్రమల్లో పెట్టిన పెట్టుబడులు వెనక్కి తీసుకొని పబ్లిక్ రంగాన్నంతా ప్రైవేట్‌పరం చేయడానికి ఆయన కంకణం కట్టుకున్నాడు. అయితే టిటి కృష్ణమాచారి మొదలుకొని సుబ్రహ్మణ్యం, చిదంబరం, మురసోలీ మారన్‌ల దాకా కేంద్రంలో ఉన్న కాంగ్రెస్, బిజెపి ఏ పాలనలోనయినా ఆర్థిక, పారిశ్రామిక మంత్రులు ఆర్‌ఎస్‌ఎస్ కానక్కర్లే కుండానే సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసమే ఆ పదవులు నిర్వహించారు.

వరవరరావు

హైదరాబాద్

టోనీ బ్లెయిర్ నుంచి గార్డన్ బ్రౌన్ వరకు

ఈ నెలతో టోనీ బ్లెయిర్ పదేళ్ల బ్రిటన్ పాలన పూర్తవుతుంది. లేబర్ పార్టీని పునరుద్ధరించి, దానికి కొత్త జీవం పోసి, బ్రిటిష్ ఆర్థిక, విదేశీ విధానాలని కొత్త మలుపులు తిప్పిన బ్లెయిర్ గత నాలుగేళ్లుగా ఇరాక్ యుద్ధం మూలాన బ్రిటిష్ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నాడు. అత్యధిక బ్రిటిష్ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా బ్రిటిష్ సైన్యాన్ని ఇరాక్‌కు పంపి, అమెరికాకు అత్యంత విశ్వాస పాత్రుడుగా నిలిచిన టోనీ బ్లెయిర్‌ని కొన్ని పత్రికలు వ్యంగ్యంగా 'అమెరికన్ పూడుల్' అని పిలవనారంభించాయి. యుద్ధ వ్యతిరేక ఉద్యమం బుష్‌ను అడాల్ఫ్ బుష్ అని పిలిచినట్టు గానే, బ్లెయిర్‌ను టోనీ ముస్సోలినీ అని పిలిచింది. ఇరాక్ యుద్ధాన్ని వ్యతిరేకించిన ప్రపంచ ప్రజలందరికీ ఇవ్వాళ బ్లెయిర్ ఒక 'పూడుల్' గానే కనిపిస్తున్నాడు. బ్లెయిర్ స్థానే గార్డన్ బ్రౌన్ ప్రధాన మంత్రి పదవిని చేపట్టబోతున్నాడు. బ్లెయిర్ ప్రభుత్వంలో ఆర్థికశాఖ మంత్రిగా పనిచేసిన బ్రౌన్ మీద ఇప్పటికే ఇరాక్ నుండి వైదొలగాలని ఒత్తిడి పెరుగుతోంది. కాని, స్వయంగా ఇరాక్‌కు వెళ్లి చూడనిదే ఏ నిర్ణయం తీసుకొనేది లేదని అంటున్న బ్రౌన్ ఏమి చేస్తాడో చూడాలి. ◆

మండుతున్న పశ్చిమాసియా

అఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్ తిరిగి విజృంభిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. కాబుల్, దాని పరిసర ప్రాంతాలని మాత్రమే పాలిస్తున్న అఫ్ఘన్ ప్రభుత్వం అటు నాటో సేనలను కానీ, ఇటు తాలిబాన్‌ని కానీ నియంత్రించే పరిస్థితిలో లేదనేది అందరికీ తెలిసిన వాస్తవమే. గ్రామాల్లోని మామూలు ప్రజలను తాలిబన్లని అపోహ పడటం లేదా ముద్రవేసి చంపడం నాటో సేనలకు ఎలాగూ అలవాటై పోయింది. ఈ మధ్య జరిగిన సంఘటనల్లో తాలిబాన్ కూడా నాటో సేనలని పెద్దఎత్తున హతమార్చి తన పెరుగుతున్న బలాన్ని చాటు కుంటోంది. ఇరాక్‌లో మారణహోమం సాగుతూనే ఉంది. ఇటీవలే సమర్రాలోని షియా పవిత్రస్థలం అల్-అస్కారీ మీద జరిగిన దాడి ఫలితంగా బాగ్దాద్‌లో 75 మంది చనిపోవడమే కాక తిరిగి సున్నీ-షియా గొడవలు కొనసాగుతున్నాయి. ఇరాక్‌లో జరుగుతున్న మారణహోమాన్ని అమెరికా ఆపలేదని ఇప్పటికే ప్రపంచ ప్రజలందరికీ అర్థమైపోయింది. అమెరికా రగిలించిన యుద్ధజ్వాలలు, మారణ హోమం నుంచి అఫ్ఘనిస్తాన్, ఇరాక్ ప్రజలకి విముక్తి దొరికేది ఎప్పుడో? ఇవి కాకుండా లెబనాన్‌లో పాలస్తీనా మిలిటెంట్లకి, లెబనాన్ సైనికులకి మధ్య జరిగిన దాడుల మూలంగా చాలామంది పాలస్తీనీలు చనిపోవడమే కాకుండా నిర్వాసితులు కూడా అయ్యారు. ◆

పాలస్తీనీల అంతర్యుద్ధం

గాజా, వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాల్లోఉన్న పాలస్తీనీలను పరిపాలిస్తున్న ఫతా-హమాస్ సంకీర్ణ ప్రభుత్వం, ఇరు వర్గాల మధ్య ఘర్షణలతో, దాదాపు అంతర్యుద్ధ వాతావరణంలో పడిపోయింది. గాజా అంతా హమాస్ అధీనంలో, వెస్ట్ బ్యాంక్ ఫతా అధీనంలో ఉన్నాయి. పాలస్తీనా అధ్యక్షుడు మెహమూద్ అబ్బాస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి ఫతా మాత్రమే ఉన్న ప్రభుత్వాన్ని నెలకొల్పినట్టు ప్రకటించారు. ప్రజాస్వామిక ఎన్నికల్లో గెలిచిన హమాస్ ప్రభుత్వాన్ని గుర్తించ నిరాకరించి, ఆర్థిక సహాయాన్ని నిలిపివేసిన అమెరికా, ఇజ్రాయిల్, యూరోప్ దేశ ప్రభుత్వాలు ఇప్పుడు ఫతా ప్రభుత్వాన్ని గుర్తిస్తున్నామని, ఆర్థిక సహాయాన్ని అందచేస్తామని ప్రకటించాయి. పాలస్తీనా ప్రజల స్వయం నిర్ణయాధికారం మీద, ఆకాంక్షల మీద, వారి దేశంలో శాంతి మీద ఇది పెద్ద దెబ్బ. అసలే ఇజ్రాయిల్ దాడులతో, ఆర్థిక ఇబ్బందులతో, చెక్‌పాయింట్లతో సతమతమవుతున్న గాజా ప్రజలు ఈ కొత్త పరిస్థితులని ఎలా తట్టుకోగలగుతారో తెలియకుండా ఉంది. ◆



ఎడమ నుంచి కుడికి : టోనీ బ్లెయిర్ (బ్రిటన్ ప్రధాని), జువాన్ మాన్యుల్ బర్రసో (యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు), నికొలాస్ సార్కోజీ (ఫ్రాన్స్ అధ్యక్షుడు), పుతిన్ (రష్యా అధ్యక్షుడు), షింజో ఏబ్ (జపాన్ ప్రధాని), ఎంజెలా మెర్కెల్ (జర్మనీ ఛాన్సలర్), రొమానో ప్రొడి (ఇటలీ ప్రధాని), జార్జ్ బుష్ (అమెరికా అధ్యక్షుడు)

'జి-8' మేళా

జూన్ 6-8 మధ్య జర్మనీలోని హీలిగెన్ డామ్‌లో జరిగిన జి-8 సమావేశానికి షరా మామూలుగా ప్రపంచీకరణను వ్యతిరేకిస్తు ప్రజల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. జి-8 దేశాలైన అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, కెనడా, రష్యా జపాన్, ఇటలీల నాయకులందరూ బస చేస్తున్న హోటల్ చుట్టురా 12 కిలోమీటర్ల వరకు ముళ్ల కంచె వేసి వారికి ప్రజల నుంచి రక్షణ కల్పించవలసి రావడం చాలా విచిత్రమైన విషయం. ఆఫ్రికాలోని దారిద్ర్యం, ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఎయిడ్స్, మలేరియా, టీబి వంటి రోగాలు, వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు, గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించేందుకు నియంత్రించవలసిన గ్రీన్‌హౌస్ గ్యాస్‌ల ఒప్పందాలు లాంటి అంశాలపై ఎటువంటి ప్రగతి సాధించకుండానే మరోసారి జి-8 మేళా ముగిసిపోయింది. ◆

అసహజ మరణాల సూచి

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. ఆ సహజ మరణపు వయోపరిమితి దేశ కాల పరిస్థితులను బట్టి, జీవన ప్రమాణాలను బట్టి అరవైల నుంచి తొంభైల దాకా ఉండవచ్చు. కాని మన సమాజంలో సాధారణ ఆయు ప్రమాణం 63 సంవత్సరాలు అయినప్పటికీ ఎంతోమంది పుట్టుకలోనే మరణిస్తున్నారు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ మరణం అనేక రూపాలలో సంభవిస్తోంది. ఆకలి, అనారోగ్యం, మానసిక ఆందోళనలు, సామాజిక అసమానతలు, వరకట్న మరణాలు, నిర్లక్ష్యం, అంటరాని తనం, వ్యవసాయం, చేనేత వంటి రంగాల్లోని సంక్షోభాలు, పారిశ్రామిక అశాంతి, జీవనోపాధి లేమి అసహజ మరణాలకు లెక్కలేనన్ని కారణాలున్నాయి. మన పక్కనె మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే, ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

తేది	ఆత్మహత్యలు			హత్యలు				గుర్తు తెలియని	ఆకలి	ప్రమాదాలు			చికిత్స అందక, అనారోగ్యం	పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
	వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు	ఫ్యాక్షన్	కులం	మతం	తగాదాలు			పనిచేసే స్థలంలో	రహదారి	ఇతరాలు		ఉద్యమ కారులు	ఇతరులు			
26.5.07 నుండి 1.6.07	11	–	8	–	–	–	12	10	–	5	13	24	2	2	–	–	13	34*
2.6.07 నుండి 8.6.07	11	–	11	–	–	–	9	3	–	–	18	38	–	–	–	–	3	15
9.6.07 నుండి 15.6.07	10	–	5	–	–	–	7	7	–	3	9	17	1	–	–	–	7	1
16.6.07 నుండి 23.6.07	13	–	7	–	–	–	8	5	–	1	11	9	–	2	–	–	4	28**
మహబూబ్‌నగర్	6	1	31	–	–	–	5	14	–	4	31	42	9	–	–	–	–	6
మెదక్	11	–	–	–	–	–	–	–	2	–	–	–	3	–	–	–	–	5
కడప	2	–	8	1	–	–	5	–	–	–	13	4	2	–	–	–	–	–
రంగారెడ్డి	2	–	16	–	–	–	7	8	–	–	47	31	4	–	–	–	4	1
మొత్తం	**66**	**1**	**86**	**1**	**–**	**–**	**53**	**47**	**2**	**13**	**142**	**165**	**21**	**4**	**–**	**–**	**31**	**90**

* వడదెబ్బ వలన, **వరదలవలన చనిపోయినవారు.

ఈ శీర్షికకు సహకారం అందిస్తున్న వారు : హైదరాబాద్ – డి. విజయభాస్కర్; మహబూబ్‌నగర్ – రవికుమార్; మెదక్ – కె. రాజు; కడప – ఎన్. ఎస్. ఖలందర్; రంగారెడ్డి – వి. ఫణీంద్ర

గమనిక : మీ అందరి సహకారంతో అన్ని జిల్లాల పూర్తి సమాచారంతో భవిష్యత్తులో ఈ శీర్షికను మరింత సమగ్రంగా అందించే ప్రయత్నం చేస్తాం.


RNI Regn. No. APTEL/2003/11482 Published on 27-06-07 PRINTED BOOK

3 సంవత్సరాల ప్రజా పాలన



తొలి అడుగు విజయవంతం!
మూడేళ్ళ అడుగులు ప్రగతికి అంకితం!!





ఇవన్నీ వినూత్న పథకాలే -
ముఖ్యమంత్రి ఆశయానికి చిహ్నాలే

- **జలయజ్ఞం** - 52 భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల ద్వారా 1 లక్ష కోట్ల రూపాయలతో కోటి ఎకరాలకు సాగునీరు
- **'ఇందిరమ్మ'** - గ్రామాలకు, పట్టణాలకు మౌలిక వసతులు కల్పించి, నిర్ణీత సమయంలో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడం
- **'ఆరోగ్యశ్రీ'** - పేదవారికి ఆరోగ్య బీమా మూడు జిల్లాల్లో ప్రారంభం
- **ఉచిత విద్యుత్** - వ్యవసాయానికి 7 గంటల విద్యుత్ సరఫరా
- **'ఇందిరా క్రాంతి పథం'** - స్వయం సహాయక బృందాలలోని మహిళలకు పావలా వడ్డీకే రుణాలు
- **'ఉపాధి హామీ పథకం'** - గ్రామీణ ప్రాంతాల నిరుపేదలకు ఒక్కొక్కరికి ఏటా కనీసం 100 రోజుల పనిదినాలతో శ్రామిక ఉపాధిని కల్పించడం
- **రాజీవ్ పల్లెబాట, రాజీవ్ నగరబాట, ప్రజాపథం** కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం
- **'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ'** - 2006-2007 సం॥లో రూ.17,529 కోట్ల IT/ITES ఎగుమతులతో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉండటం
- **'రాజీవ్ గృహకల్ప'** - దేశంలోనే మొట్టమొదటిసారిగా పట్టణ నిరుపేదలకు గృహ సౌకర్యం
- **'రాజీవ్ స్వగృహ'** - దేశంలోనే మొట్టమొదటిసారిగా మధ్య తరగతి ప్రజలకు గృహ సౌకర్యం
- **'పేదలకు భూమి పంపిణీ'** - ఎస్.సి., ఎస్.టి., బి.సి.లకు చెందిన 3,14,685 లక్షల మంది నిరుపేదలకు 4,37,019.86 ఎకరాల భూమిని మూడు విడతలుగా పంపిణీ జరిగింది
- **'ఇందిర ప్రభ'** - రూ.500 కోట్లతో ఎస్.సి., ఎస్.టి.,బలహీన వర్గాలకు చెందిన బంజరు భూమి అభివృద్ధి.

పేద గుండెకు అండగా! ప్రగతి సాధనే ధ్యేయంగా!!

R.O.No. 128/Sou/Advt.I/2007-08

Owned, Printed and Published by V. Hanumantha Rao at 301, Mythri Residency, 3-6-394, Road No. 3, Himayat Nagar, Hyderabad - 500 029. Ph : 66843495. Printed at Charita Impressions, Azamabad, Hyderabad. For Nutan Art Printers, Hyderabad. Working Editor : N. Venugopal

VEEKSHANAM
301, Mythri Residency, 3-6-394, Road No. 3, Himayatnagar, Hyd-29.